- సంస్కరణ వాద కవిత్వం
- కాకతీయ మహేతిహాసం - మాలిక్ కాఫర్ నవల
- తెలుగు దళిత అనువాద ఆత్మకథలు - మౌలికాంశాలు
- ఆంధ్ర కర్నాటక సారస్వతములు - పరస్పర ప్రభావము
- నన్నయ భారతం - సామాజిక విలువలు
- వద్దేపల్లి గేయాల్లో కవితా సౌందర్యం
- రఘోజీ వారి పెట్టె
- ప్రజల నాల్కలయందు జీవిస్తున్న సుకవి - జాషువా

# మూసీ

# MUSI

• Samputi : 26 • Sanchika : 12 • Pages : 64 • Rs. 20
• October 2023

UGC Care List
Approved Journal









## దసరా శుభాకాంక్షలు





Scanned with OKEN Scanner



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 26 సంచిక : 12
అక్టోబర్ - 2023
'శోభకృత్' భాద్రపద, ఆశ్వీజ మాసాలు
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ... వ్యాసాలు

సంస్కరణ వాద కవిత్వం ... ఆచార్య వంగరి త్రివేణి 7
కాకతీయ మహేతిహాసం - మాలిక్ కాఫర్ నవల ... డా. జొన్నలగడ్డ భారతి 11
కళకు కన్నీళ్ళే (బందారం కథలు -21) ... డా. నందిని సిధారెడ్డి 15
రఘోజీ వారి పెట్టె ... ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి 19
భారతీయీకరణ15 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార23
ఆంధ్ర కర్నాటక సారస్వతములు - పరస్పర ప్రభావము (గ్రంథాంతరంగం-27)
... ఘట్టమరాజు 27
పద్యమనోహరం- 45 ... గన్నవరం గిరిజామనోహర్ బాబు 32
అనుశాసనిక పర్వం - పరిష్కరణ - పీఠికా రచనలో తుమ్మపూడి వారి దక్షత ...
డా. పి.సి. వెంకటేశ్వర్లు 33
నన్నయ భారతం - సామాజిక విలువలు ... ఆచార్య అయ్యగారి సీతారత్నం 37
వడ్డేపల్లి గేయాల్లో కవితా సౌందర్యం ... మహీపాల్ లక్ష్మిగళ్ళ 41
తెలుగు దళిత అనువాద ఆత్మకథలు - మౌలికాంశాలు ... డా. గిన్నారపు ఆదినారాయణ45
పత్రికా సంపాదకుడుగా బోయి భీమన్న ... డా. కొంకె గౌరీశ్వర రావు 49
బండి 'అర్ధనారి' నవల - ఇష్టంగా మగశరీరం కప్పుకుని తిరుగుతున్న కిన్నెరలు
... బుక్కే ధనక నాయక్ 51
పిలకా గణపతి శాస్త్రి 'అస్తితా వాదము' - సమీక్ష ... పి. రమాదేవి 53
ప్రజల నాల్కల యందు జీవిస్తున్న సుకవి - జాషువా ... డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి 55

## కవితలు

శక్తిరూప! శ్రీ యశస్విని! ... కటకం వేంకటరామ శర్మ - 5; ఉషోదయ కాంతులు ... కొమురవెల్లి అంజయ్య - 6; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; ఆంధ్ర మేఘ సందేశము ... కీ.శే. వెల్లలూరి వేంకటరాఘవ శర్మ - 48; అవమానానికి సన్మానమా! .. తలారి సతీశ్ కుమార్ - 60; నిత్య సత్యాలు ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 60; రైలు మిత్రులు ... డా. ఎన్. గోపి - 62.

## సమీక్షలు

గంగెద్దు కథలు - రచనా విధానం ... డా. తండు కృష్ణ కౌండిన్య 57
అమృత భారతం ... కె.పి. అశోక్ కుమార్ 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12

హైదరాబాద్ అక్టోబర్ : 2023

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# అలవోక - ఎదురీత

జీవిత గమనాన్ని జలంలో ఈదే విధానాన్ని బట్టి ఏర్పడిన పదాలు అలవోక - ఎదురీత. నీటిలో అలలు వెళ్ళే మార్గంలోనే మనం ప్రయాణం చేస్తే అలవోక అని, అలలకు ఎదురుగా వెళ్తే ఎదురీత అని అంటుంటాం. ఈ రెండు పదాలు సాధారణంగా వాడేవే అయినా జీవన విధానాన్ని తెలియజేస్తుంటాయి. నిత్యజీవితంలో ఎన్నో రూపాల్లో సమస్యలు, సంతోషాలు వస్తూనే ఉంటాయి. సంతోషాలైనా, సమస్యలైనా నిర్వహించేవాని శక్తిని బట్టి మాత్రమే అని ఆధ్యాత్మిక శాస్త్రాలు చెప్తుంటాయి. ఎదురీత నుండి అలవోకగా జీవితాన్ని మల్చుకోవడమే మన లక్ష్యంగా మారాలి.

మనిషి సృష్టి శక్తిని నిరంతరం తన శక్తిగా మార్చుకోవాలి. నిజానికి సృష్టిలోని శక్తి అంతా తన లోనూ ఉంటుంది. శరీరంలో పాంచభౌతికమైన శక్తి అందరికీ ఉంటుంది. ఆహారం, జలం, వాయువు మొదలైనవన్నీ ప్రకృతిలో ఉంటాయి, అవే మనలోనూ ఉంటాయి. ఆ శక్తి కూడా మనకు అందుతూనే ఉంటుంది. కానీ వ్యక్తి లోకంతో, దేహంతో, కోరికలతో, వ్యవహారాలతో మమేకం అవుతుంటాడు. దీనివల్ల తనకున్న ఈ ప్రాకృతిక, పాంచభౌతిక శక్తి అంతా వినియోగించుకుంటాడు. మన దగ్గర ఎంత ధనం ఉన్నా, మన అవసరాలు, కోరికల కోసం నిరంతరం వినియోగించుకుంటూ ఉంటే తమ వద్ద ఉన్నది క్రమంగా అయిపోతుంది కదా! అదేవిధంగా ప్రకృతి నుండి వచ్చే శక్తి అంతా మన కోరికలు, అవసరాల కోసం మనం ప్రతిక్షణం వినియోగించుకుంటూనే ఉన్నాము. అందుకే శక్తి హీనులుగా మారుతున్నాం. శక్తి హీనుడే జీవితాన్ని ఎదురీదాల్సి వస్తుంది. శక్తియుతుడు తన జీవితాన్ని అలవోకగా నిర్వహిస్తూ లోకానికి ఆదర్శప్రాయమౌతాడు.

శక్తిని నిరంతరం ధ్యానించి, శక్తియుతునిగా మారడమే మనకున్న ప్రత్యేకమైన పని. ఆ విషయాన్ని గుర్తు చేస్తున్నవే శక్తి నవరాత్రులు కూడా. సూర్యుని శక్తి ఈ భూమికి, మనకు వినియోగ పడుతున్నాయి. సూర్యోదయ సంబంధంగా కనిపించే ఎరుపు బింబమై కళ్ళు తెరిపించేది బాలా త్రిపుర సుందరి. గాయత్రీ దేవిగా పూజింపబడే శక్తి డి.విటమిన్. అన్నపూర్ణ, కిరణ జన్య సంయోగ క్రియ ద్వారా ఏర్పడే శక్తి. ఓజోన్ పొరలోని పాంచభౌతిక శక్తి లలితాదేవి. సూర్యుని తెలుపు కాంతికి సంకేతమైన జ్ఞాన శక్తి సరస్వతీదేవి. సమస్యలను ఎదిరించే ధైర్యాన్ని ఇచ్చి రోగనిరోధక శక్తిని పెంచే రూపం దుర్గాదేవి. కరోనాలాంటి క్రిమి కీటక సంహారం చేసే గొప్ప శక్తి మహిషాసుర మర్దని. అత్యద్భుతమైన సమున్నతమైన శక్తి రాజరాజేశ్వరీదేవి. ఇట్లా శక్తిని నిరంతరం ఆరాధించడమంటే, ఆ శక్తిని నీ శక్తిగా మార్చుకోమని సూచించడమే. ఈ శక్తి కలిగినవాడే సమున్నతుడై మార్గదర్శకుడౌతాడు.

శక్తిని ఈ విధంగా ఉపాసించడమే జీవితం. ప్రకృతి మొత్తంలోనూ ఉన్న శక్తి మన శక్తిగా మారాలంటే ఆ జ్ఞానం మనకు ఏర్పడాలి. అటువంటి జ్ఞానం లేనప్పుడు మన ఆలోచనలే ఆ శక్తి ప్రసారానికి అడ్డంకిగా మారుతుంది. ఆలోచనలన్నీ మన శక్తి వ్యర్థం కావడానికి కారణాలు. బహుముఖ ఆలోచనలు, ఏకముఖంగా మార్చుకునే ప్రయత్నం నిరంతరం చేస్తూనే ఉండాలి. ఆలోచనా ప్రసారమే జల ప్రవాహంగా ఊహిస్తే ... అలవోక జీవితమంటే మన ఆలోచనలన్నింటికీ ఒక రూపం ఏర్పడినట్లే. రూపం ఏర్పడనప్పుడు మాత్రమే ఆ కోరిక తీర్చుకోవడం కోసం తప్పనిసరిగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. దానినే మనం ఎదురీతగా భావిస్తున్నాం. ఈ లోకంలోకి వచ్చిన ప్రతివారు కూడా శక్తియుతులు కావాల్సిందే. జీవితాన్ని ఆనందప్రదం చేసుకోవాల్సిందే. దైవోపాసన అన్నా, ప్రకృతి ఉపాసన అన్నా శక్తిని సముపార్జించుకునే మార్గమే. జీవితం ఎదురీత కాకూడదు, అలవోకగా కొనసాగితేనే ఉన్నతం, ఉత్తమం అవుతుంది. సమాజం ప్రభావితం అవుతుంది.

# శక్తిరూప! శ్రీ యశస్వినీ !!

వేదము నేర్వగా తగిన విద్యను, ధారణ శక్తినిచ్చి, యా
వేదన లేని జీవనము విప్రుడ నా కొడగూర్చుమమ్మ! నీ
పాదము వీడనమ్మ! మృదుపాణివి వాణివి గ్రంథరూప వా
చ్యాదివి! శక్తిరూప! శ్రుతి సంస్తుత వైభవ శ్రీ యశస్వినీ!



ఊహలనైన నీ యునికి నొక్క తెఱంగునఁ గాన లేదు, నా
సాహసమందు నిన్నుఁగని సన్నుతిఁజేసెద దేహదార్ఢ్యమున్,
వాహనమున్ నుతించెద, కృపాణము మ్రొక్కెద రాజునౌట నో
సాహితి! శక్తిరూప! శ్రుతి సంస్తుత వైభవ శ్రీ యశస్వినీ!

కోరగ మిక్కుటంబయిన కోర్కెల చిట్ట, యదెంత పెద్దదో
నేరములెన్నొ జేసితిని నే పిసినారిని నీదు పాదముల్
చేర ననర్హుడన్ కృపను చేరగదీయవె! ధర్మ మార్గ సం
చారిణి! శక్తిరూప! శ్రుతి సంస్తుత వైభవ శ్రీ యశస్వినీ!



పాపమొ పుణ్యమో యెఱుఁగ, పారకు తట్టకు నేను మ్రొక్కెదన్
దీపము పెట్టనోచ కడు దీనుడ నీ గుడి మెట్టుమీద! నా
కాపు సుఖమ్ము గోరెద దగా పని సేయ, నిరంకుశత్వమున్
సైపను! శక్తిరూప! శ్రుతి సంస్తుత వైభవ శ్రీ యశస్వినీ!

సాలుకు, కాడి, నాగలికి, సాగిలి మ్రొక్కెద, మేడి తోకకున్,
మేలగు జోడు కోడెల కమేయ ప్రశంసలు! సేవకుండనై
నేలను నమ్మినాడ, కరుణించవె నా పనులందు నెల్లెడన్,
శైలజ! శక్తిరూప! శ్రుతి సంస్తుత వైభవ శ్రీ యశస్వినీ!



కొలిమియె మాకు దైవమగు కూర్మపు తిత్తులు పూజనీయమౌ
బలువగు సమ్మెటల్ పటక వట్టము మ్రొక్కక పొట్ట నిండదే
కొలుతుము వీని నన్నిటిని కూర్మిగ నీవని, కోరి నీ కృపా
సలిలము! శక్తిరూప! శ్రుతి సంస్తుత వైభవ శ్రీ యశస్వినీ!

కోరిక మీర డప్పులను కొమ్ముల నిన్నుగ తల్తునమ్మ నా
సారెను బట్టు బిడ్డవట సాధ్వి యరుంధతి నీవటమ్మ! తా
త్సారము సేయకమ్మ! మమతామయ శాంభవి! సద్దిగంత వి
స్తారవు! శక్తిరూప! శ్రుతి సంస్తుత వైభవ శ్రీ యశస్వినీ!

**కటకం వేంకటరామ శర్మ**
ఫోన్ : 94404 72321

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2023

# ఉషోదయ కాంతులు



చెరువులో వేసిన వలకు చిక్కడం లేదు
హనుమంతుడి నోటికెలా చిక్కాడో కానీ
జలచరాలు ఎన్నిసార్లు యత్నించినా
కనిపించే రూపం పంటికందదు
రుచి మాట దేవుడెరుగు
చూపుకు మహా సుందరం

చెరువు నుంచి సముద్రం వరకు
గుట్టల్లాంటి బంగ్లాల నుంచి హిమాలయాల వరకు
పంటచేల మీది నుంచి, చెట్ల సందుల్లోంచి
తూర్పు సింధూర దర్శనం
ఎక్కడి నుంచి ఎన్నిసార్లు చేసుకున్నా
తెల్లారుజాములన్నీ తనివి తీరని వింతలే



పొద్దెక్కి సుర్రుమనే వేళ
నిద్ర ముఖానికి నీళ్లు సరిచేవాళ్లు
యాంత్రికత బేరింగ్ లో కందెన లాంటి వాళ్లు
ఉషోదయం ఉగ్గుపాలు తాగలేరు
చెమట పంపింగ్ చేసే చర్మాలకు
ఉదయాస్తమయాల చూపులు కడుపు నింపవు
తమను కాపాడే పని దేవుని సేవలో వాళ్ళు



ఆరోగ్య విటమిన్ అందించే వేళ కోసం
ఎదురుచూపుల బాల్యాలు, వృద్ధాప్యాలకు
తూర్పు సింధూర దర్శనంపై వల్లమాలిన ప్రేమ

ఇంటెదుట పూల మొక్కలు ఎదురుచూస్తున్నాయి
ఎండ పొడ తగిలితే తప్ప బతుకు లేదని
పత్రహరితంతో పండుగ చేసుకోవాలంటే
నెత్తిమీద సుర్రుమనే ఎండలు కాదు
బాల సూర్యుడే వాటి స్నేహితుడు



తూర్పు సింధూర దర్శనం కోసం
మెలకువ మట్టిలో విచ్చుకోని రెండాకుల్లా
ఆచరణ నమస్కారం చేద్దాం
వెలుతురు చెట్టు కింద జీవిద్దాం

**కొమురవెల్లి అంజయ్య**
సిద్ధిపేట, ఫోన్ : 9848005676

# తుకారాం అభంగం

నీ దేహమే నిజదైవ నివాసము
నీ లోనసే నిత్యానంద విహారము

నిన్ను నువ్వు తెలుసుకో ముందు
తెరమాటున దాగుటెందుకు
చక్రములారవి సాధించిన
అపురూపని నువు గనవచ్చును

సుడిగుండములున్నవి ఆరు
మనసు మీద ముసుగు వేయును
హంస జపముతో అవి దాటు
అది చూపును అంతిమ చోటు

తుకా సాధనకు కదిలెను
విఠలుని యదలోన నిలిపెను
హరి హరియని భక్తి కొలిచెను
క్రోధ మదము విరిచి గెలిచెను.




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

# సంస్కరణ వాద కవిత్వం

**ఆచార్య వంగరి త్రివేణి,** తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం. ఫోన్ : 995 1444803

కవిత్వ ధోరణులు తెలుగు సాహిత్య పరిణామశీలతను పెంపొందించాయి. విభిన్నమైన కవితోద్యమాలు వస్తు సంస్కృతిని సుసంపన్నం చేశాయి. అందులోను సంస్కరణవాద కవిత్వం చేసిన కృషి ఆధునిక భావ పరిణామాలను త్వరితగతిన ప్రేరేపించింది.

సంస్కరణ కవిత్వావిర్భావానికి మన దేశంలో ఏర్పడిన సాంఘిక పరిస్థితులే ముఖ్య కారణంగా నిలిచాయి. క్రీ.శ. 19వ శతాబ్దిలోనే కందుకూరి, రఘుపతి వేంకటరత్నం నాయుడు కృషి ఫలితంగా 'ఏకేశ్వరోపాసనము', 'విగ్రహారాధన నిరసనము', 'బాల్యవివాహ ఖండనము', 'వితంతు వివాహ కరణము' మొదలగునవి. సాంఘిక ఉద్యమాలుగా విస్తరిల్లాయి. కన్యాశుల్కం, బాల్యవివాహాలు, వర్ణ వ్యవస్థ మొదలైనవి విమర్శించడానికి మానవోద్యమం బయలుదేరింది. క్రమంగా 'గాంధీయిజము' వైపు మొగ్గు చూపుతూ సర్వోదయ లక్ష్య సాధనకు నడుం కట్టింది ఈ ఉద్యమం. వితంతు వివాహం, హరిజనోద్ధరణ, విశ్వమానవప్రేమ వంటి కొత్త విషయాలు ఈ మానవోద్యమంలో చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంలో గురజాడ, రాయప్రోలు, దేవులపల్లి, జాషువా వంటి వారు అనేక కవితా ఖండికలు రచించారు. 'మానవుడే అన్నింటికి ప్రమాణం' అనే సూత్రంపై మానవతావాదం ఏర్పడింది. వ్యక్తి, జాతి, స్వాతంత్ర్యం కోరుకున్నది. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం సంస్కరణ దృక్పథం బయలుదేరింది.

కన్యక అనే కథ కూడా 'రాజు తలచిందేను ధర్మం, రాజు చెప్పిందెల్ల శాస్త్రం' అని సంచరించే పాలకులకు 'కాసువీసం' కొరకు తమ పిల్లల భావి జీవితాలను శూన్యం చేసే తల్లిదండ్రులకు ఒక కనువిప్పుగా విమర్శకులు భావించారు. కన్యాశుల్కం అనే దురాచారానికి గురజాడ పడిన హృదయ స్పందననే 'పూర్ణమ్మ'. 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ'ను కాసుకులోనై ఆమె తల్లిదండ్రులు ఒక ముసలివానికి ముడివేశారు. 'పూర్ణమ్మ ముఖ కమలం వాడిపోయింది. దుర్గగుడికి వెళ్ళిన ఆమె తిరిగి రాలేదు. ఈ వర్ణన పాఠకుడి భావనాశక్తికి అద్భుతమైన పురాణ వస్తువును తలపిస్తుందంటారు సాహితీకారులు.

**'కన్నుల కాంతులు కలువల చేరెను**
**మేలిమి జేరెను మేనిపసల్**
**హంసల జేరెను నడకల బెడగులు**
**దుర్గను జేరెను పూర్ణమ్మ'** (పూర్ణమ్మ)

పూర్ణమ్మ కవిత మహిళా శక్తికి ఎంతో స్ఫూర్తిని అందిస్తుంది. ఇందులో మానవప్రేమ, భావనాశక్తి, శిల్పదృష్టి ఉన్నతంగా నిలిచింది. పూర్ణమ్మ ప్రఖ్యాతి చెందడానికి గురజాడ ప్రయోగించిన శబ్ద మాధుర్యం అద్భుతమైంది. బాల్య వివాహాల మీద గురజాడ రచించిన కరుణ రసాత్మక కథా కావ్యం ఇది. ఈ ఖండిక పూర్ణమ్మ ఆత్మార్పణకు ముందు తన తల్లిదండ్రులతో అన్నదమ్ముళ్ళతో చేసిన హితబోధ. సమాజంలో అందరికి సమానమైన ఆదరణ కలగాలనే సందేశం ఇందులో ఉంది.

భగవంతుడి పట్ల హేతువాద ధోరణి ఎలా ఉండాలో తెలియజెప్పే కావ్యం, మానవోద్యమానికి అచ్చమైన రచన 'మనిషి'. **'మనిషి చేసిన రాయిరప్పకు / మహిమ కలదని మ్రొక్కుచు / మనుషులను రాయిరప్పల కంటె / హీనముగా చూచెడి వారిని..'** గురజాడ తులనాడాడు. మనిషిలోనున్న దేవుని దర్శించాలని ఈ కవితలో కవి ఉద్బోధ చేశారు. మానవతావాదం అంటే మానవులకు ఇవ్వవలసిన విలువ. జాతి మత భేదములను గురజాడ వ్యతిరేకించారు. "మతం వేరయి" అనే ఖండికలో మనుసులొక్కటై మనుషులుంటే జాతి బంధములనెడు సంకెళ్ళు ఊడిపోతాయని తేట పరిచారు. కులమత భేదాలపై నిరసన వ్యక్తం చేశారు. సామాజిక ఉన్నతిని ఆకాంక్షించారు. **'ఎల్లలోకమొక్క ఇల్లగును / మతములన్నియు మాసిపోవును / జ్ఞానమొక్కటే నిలుచును'** అనేది గురజాడ ప్రబోధం. విశ్వమానవ ప్రేమ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటివి గురజాడ కవిత్వ భావస్థితిని తెలుపుతాయి. 'ముత్యాలసరాలు' గేయం గురజాడ సంఘసంస్కరణ కవిత్వ ప్రక్రియకు చక్కని దృష్టాంతం.

**మంచి చెడ్డలు మనుజులందున**
**యెంచి చూడ రెండె కులములు**
**మంచియన్నది మాలయైతే**
**మాలనే అగుదున్** (ముత్యాలసరాలు)

ఈ కవిత గురజాడ స్వీయాభివ్యక్తిని తెలుపుతుంది. లవణరాజు కలలో పూర్వజన్మలో చండాల కన్యనే మరొక జన్మలో రాజకుమార్తెగా జన్మించినట్లు చెప్పబడింది. వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడం కవి అభిమతం. కర్మబంధంగా కలిగే జన్మలకు మానవులు అల్పబుద్ధితో కులమును అంటగట్టి నీచంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. కులమును బట్టి గాక గుణమును బట్టి గౌరవించాలని కవి ఆశించారు. కులమతాలకు అతీతంగా సామాజిక వ్యవహారం నడవాలని అభిలషించారు. గాంధీజీ హరిజనోద్యమాన్ని ప్రారంభించక పూర్వమే (1911) గురజాడ అస్పృశ్యతా నివారణ కోసం తన కలాన్ని ప్రయోగించారంటే వారిలో సంస్కరణాభిలాష అత్యంత సహజంగా వెలుగొందిందనే భావించాలి.

**పట్టమేలే రాజు అయితే / రాజునేలే దైవముండడో**
**కండ కావర మెక్కి నీవీ / దుండగము తలపెట్టినందుకు**
**ఉండి వూర్కొనునో? / పట్టమేలే రాజువైతే**
**పట్టు నన్నిపుడు** (కన్యక)

అని అగ్నిగుండంలో దూకుతుంది కన్యక. నాటి సామాజిక, సాంస్కృతిక, రాచరిక, సంప్రదాయ దురహంకారాన్ని నిరసిస్తుంది. రాజు అనే ఆధిపత్య ధోరణిని ధిక్కరించి మొదటి కన్యగా కన్యక నిలుస్తుంది. రాజ్య స్వభావం చిత్రితమయ్యే కథా వస్తువు ఖండిక. ఈ సందర్భంలో కన్యక సమాజ కాంక్షతో ప్రబోధ స్వరాన్ని నినదింపజేసింది. గురజాడ కన్యకలో ధిక్కార సంస్కరణ ధోరణిని ప్రవేశపెట్టారు.

**విద్యనేర్చిన వాడు విప్రుడు / వీర్య ముండినవాడు క్షత్రియు**
**డన్న పెద్దల ధర్మ పద్ధతి / మరచి పదవులకై**
**ఆశ చేయక కాసు వీసం / కలిగి ఉంటే చాలుననుకొని**
**వీర్యమెరుగక, విద్య నేర్వక / బుద్ధి మాలినచో**
**కలగవా యిక్కట్లు? మేల్కొని / బుద్ధి బలమును బాహుబలమును**
**పెంచి, దైవము నందు భారం / వుంచి రాజులలో**
**రాజులై మనుదయ్య / పట్టపగలే నట్టి వీధిని**
**పట్టబోరే జారచోరుల / పట్ట దలచితివింక నీవొక**
**పట్టమేలే రాజువట** (కన్యక)

అంటూ కన్యక పట్టణ రాజుపై ధిక్కార స్వరాన్ని ప్రకటిస్తుంది. ఇటు తల్లిదండ్రులకు, చేసుకుంటుంది. నాటి నుండి నేటి వరకు తల్లిదండ్రులలో, సమాజంలో రోషం, పౌరుషం నిలుపుతూనే ఉంది.

రాయప్రోలు సుబ్బారావు కాల్పనిక వాదాన్ని కవితోద్యమంగా నడిపిన ధీశాలి. రాయప్రోలు సంస్కరణాభిలాషకు 'స్నేహలత' కావ్యం ఒక చక్కటి ఉదాహరణ. వరశుల్క నిరసన ఈ కావ్యంలో ప్రబోధింపబడుతుంది. ఇది ఒక విషాదాత్మక కావ్యం. భారతనారి ఆత్మోన్నత్యానికి ప్రతీక. వర శుల్కం వల్ల ఆత్మార్పణం చేసుకున్న స్నేహ లక్ష్యం నెరవేరాలనే తపన ఈ కావ్యంలో ప్రతిఫలిస్తుంది. స్నేహలతా దేవి రగిల్చిన 'పవిత్రాణవహ్ని' దేశాన్ని ఉద్ధరించడానికి స్ఫూర్తిగా నిలవాలని ఈ కావ్యంలో కవి ఆకాంక్షించారు.

**'కన్నియను పెండ్లి యాడునొ, కన్నె తండ్రి**
**యర్పణము జేయు శుల్క దివ్యాప్సరసను**
**పెండ్లియాడునో యకట యా పెండ్లి కొడుకు**
**అడుగడే యొక్కరయిన నీ యార్య సుతుల'** (స్నేహలత)

అని స్నేహలత మూలంగా కవి లోకాన్ని ప్రశ్నించడం గమనించ వచ్చు. రాయప్రోలు కాలం నాటికే వరశుల్కం ఎంతగా లోకంలో పాతుకొని పోయిందో ఈ కావ్యం ద్వారా అర్థమవుతుంది. ఆనాడు ప్రశ్నించే గొంతుకే లేదనేది తెలుస్తుంది.

రాయప్రోలు మానవతావాద కవిత్వంలో ముఖ్యమైన అంశంగా అంటరానితనం నిర్మూలన కోసం ప్రయత్నించారు. ప్రేమ భావనను అత్యంత విశ్వసంయోజన ప్రక్రియగా తెలియజేశారు. ప్రేమ నిష్కల్మష వస్తు తత్త్వం. అమృతత్త్వాన్ని ప్రసాదించే విశ్వభాండం.

**'ప్రేమ వృత్తికి చండాల భేదమేల**
**బ్రాహ్మణాగ్రహారమునందు పగలు రేయి**
**విసరు పవనుండు జడ జాతి వీటియందు**
**తాకలేక వీచెనె పక్ష తంత్ర జడిమ'** (స్నేహలత)

ఇటువంటి కవితా పంక్తులు విశ్వమానవ అభిలాష భావజాలానికి ఉదాహరణలుగా నిలుస్తాయి. అదేవిధంగా సర్వమానవ ప్రేమ భావానికి నిదర్శనంగా నిలుస్తాయి. కాంచన సోయగం తన కళాకాంతులను చీకట్లో సైతం విశ్వవ్యాపితం చేస్తుంది. **'స్నేహ భాండము పగిలి నీలి దీపములారి / మానవులు పశువులుగా మారవలదు'** అని రాయప్రోలు ఉద్బోధించారు. ఒక గొప్ప మానవతావాదం గల సందేశం ఈ క్రింది కవితా పంక్తులలో కూడా తిలకించవచ్చు.

**'కాలే కడుపుకు గరిటెడు గంజి**
**జారే సిగ్గుకు మూరెడు పాత**
**ఎల్లరకందే చల్లని రోజులు**
**వెలసే విధమును వెదకండీ'**

కందుకూరి వీరేశలింగం సామాజిక, సాంస్కృతిక పునరుజ్జీవన కర్త. సంస్కరణోద్యమ దీప్తికి కారకులు. సామాజికంగా, సాంస్కృతికంగా తన రచనల ద్వారా పరివర్తన. తీసుకొచ్చారు. స్త్రీ విద్యకోసం తెలుగునేలలో కృషి చేసిన ప్రప్రథమ సంస్కర్త ఆయన స్త్రీ విద్య వ్యతిరేకించిన వాళ్ళకి వీరేశలింగం పెట్టిన చురకలు ఈ క్రింది పద్య కవితలో ప్రత్యక్షంగా తిలకించవచ్చు.

**'నీరజాక్షి చదువు నేర్చుచో నరమాంస**
**విక్రయం బెట్లంచు వెఱచు నొకడు**
**మానవతి విదుషియైనచో వెట్టి నోములు**
**పట్టుబెట్టంచు బొక్కు నొకడు**
**కమలాక్షి సద్విద్య కఱచుకొనను దేవునిగ**
**నెంచుటెట్లంచు బొగులు నొకడు**
**హంసయాన విద్యావతి యయ్యేనేని**
**ప్రతిమలను గొల్చుటెట్లంచు బరగునొకడు'**

సంస్కరణోద్యమంపై కులాలలోని సంపన్నులు, మధ్య తరగతి ప్రజల భావాల్లో మార్పు కోసం జరిగిన సాంఘికోద్యమం కందుకూరి వీరేశలింగం నడిపారు. భావాల్లో, వస్తువులో సంస్కరణను కవిత్వ రూపంలో కంటే వచన రచనల్లోనే అధికంగా తీసుకొచ్చారు. సంపన్న మధ్య తరగతి వర్గాలలోని సంప్రదాయ కుటుంబాలలో సంస్కరణకు

నడుం కట్టారు. చిన్నప్పటి నుండి సంప్రదాయ విద్య ద్వారా వచ్చిన గణ యతి ప్రాసలతోనే పద్యరచన చేశారు.

సమసమాజ నిర్మాణానికి యువతరాన్ని ప్రబోధిస్తూ మార్చింగ్ సాంగ్ లాంటి మహాప్రస్థాన గీతాన్ని వ్రాస్తూ శ్రీశ్రీ మధ్యలో భావావేశంతో రచనలు చేశారు. విప్లవాత్మక సంస్కరణకు ఉదాహరణ క్రింది కవితా ఖండిక.

**'ఎగిరి ఎగిరి పడుతున్నవి**
**ఎనబై లక్షల మేరువులు**
**తిరిగి తిరిగి తిరిగి సముద్రాల్**
**జలప్రళయ నాట్యం చేస్తున్నవి**
**సలసల కాగే చమురా? కాదిది**
**ఉష్ణ రక్త కాసారం'** (మహాప్రస్థానం)

కాళోజీ నాటి దౌర్జన్య పూరిత నిజాం పాలన నుండి, వలసవాదుల ఆంధ్రపాలన నుండి విముక్తిని కోరుతూ సంస్కరణ దృక్పథాన్ని ఏర్పరిచారు. ప్రతి ఒక్కరి జీవితం ఒడ్డించిన విస్తరి కాదంటాడు కాళోజీ. సమసమాజ స్థాపన ఉండాలంటాడు. కష్టాల కడలిని దాటాలంటాడు. శోధించి సాధించాలంటాడు. పోరాడి గెలవాలంటాడు.

**'ఏదో అడుగు తీసి అడుగేసే దానికి**
**ఏ అడుగెట్లా పడుతుందోనని**
**ప్రతి అడుగూ ఆచి తూచి వేద్దామని**
**కంటకాలు లేకుండా చూచి**
**పూల మీద పాదం మోపుదామని**
**పూల బాటే ఏర్పడ్డాక**
**ప్రయాణం ప్రారంభిద్దామని ఉపేక్ష**
**కంటకాలు లేని బాటే లేదాయెనని**
**ఏడ్పు - ఎల్లప్పుడు**
**మరల మహిమ ప్రాబల్యమెంతదికాదు.**
**ముడుచుకు కూర్చున్న చేతులది ప్రశ్న'** (నా గొడవ)

సి. నారాయణరెడ్డి కవిత్వం సమాజ పరివర్తనకు ఒక ఊతం. ధ్వన్యాత్మకమైన ధోరణిలోనే కవితా ప్రయోజనాన్ని కాంక్షించారు. ప్రతీకల సహ ప్రయోగంతో సాంస్కృతిక భావ విప్లవ పంథాకు అడుగువేశారు. ఓటర్లలో చైతన్యం, సంస్కరణ దృక్పథం పెంపొందింప జేయడం కోసం సి. నారాయణరెడ్డి కవిత్వం ఊతంగా నిలుస్తుందని "కాలం అంచుమీద" అనే కవితలో పేర్కొంటారు.

**అమాయకులు కారు ఓటర్లు**
**అచ్చమైన న్యాయానికి బారామీటర్లు**
**అప్పుడప్పుడు వాళ్ళు అన్నలను మించిన తమ్ముళ్ళు**
**అమ్మలను మించిన కూతుళ్ళు.** (కాలం అంచుమీద)

ఓటర్ల శక్తి ఎటువంటిదో ఈ మాటల్లో కవి చాలా శక్తివంతంగా చెప్పారు. ఓటర్లను బారామీటర్లతో పోల్చడం సంస్కరణ దృక్పథం అవుతుంది. ఓటర్ల చైతన్యవంతమైన తీర్పు రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక పునర్మూల్యాంకనానికి ఏవిధంగా దోహదం చేస్తుందో వివరించారు.

**'కొన్ని కళ్ళు నిత్యం కనేవి హత్యల కలలే**
**చిగురాకులను కొరికేసినట్టు**
**పూలగుత్తులను పిసికేసినట్టు**
**అలలు గోరీలైపోతే ఆ కళ్ళకు పండగ'** (కాలం అంచుమీద)

అయితే విధ్వంసం ఎప్పుడూ చరమాంకం కాదు తరువాత పుట విప్పితే అగుపించేది వికాసమే అంటారు సినారె. కవిత్వాన్ని మొత్తం సంస్కరణ వైపుకు నడిపించడం కవి ప్రతిభకు నిదర్శనం. వికాసం అభ్యుదయాభిలాషను అనుసరిస్తుంది. విద్య, జ్ఞానం, తాత్విక చింతనలో వస్తు మూల్యాంకనం చేయడం కవి ధర్మంగా భావించాడు.

**అన్యాయాన్ని అక్రమాన్ని అసురతత్వాన్ని**
**అంతం చెయ్యడానికి**
**సామాన్య ప్రజానీక హృదయాలలో**
**ఆగ్రహం చైతన్యం**
**అతి పేలవంగా చెలరేగడం**
**విశ్వజనీనమైన భావం** (కాలం అంచుమీద)

కనపర్తి వరలక్ష్మమ్మ జాతీయోద్యమ కవయిత్రి. అదేవిధంగా స్త్రీ సంస్కరణను కోరిన ఉదాత్త మహిళ. సమాజంలో ఒక వర్గంగా వెనకకు నెట్టబడిన వారి చైతన్యాన్ని కాంక్షించారు.

'నాదుమాట' అనే పద్య సంపుటిని రచించిన కనపర్తి వరలక్ష్మమ్మ సంఘం శ్రేయస్సు, ప్రజా శ్రేయస్సు నెంచి, సేవాభావ ప్రాధాన్యాన్ని చాటి చెప్పిన సూక్తులు ఎక్కువగా కనిపిస్తాయి.

**'వ్రతములందు మేలి వ్రతము సేవయె**
**సుమ్మీ దీని బోలు వ్రతము కానమెందు**
**పరుల సేవకంటే పరమ పుణ్యము లేదు**
**నమ్మి వినుడి జనులు నాదుమాట'** (నాదుమాట)

దొంగ సాధువులు, స్వాములు వారిని గూర్చిన మంచి చెడ్డలను విచారించకుండా సేవలకై వెఱిగా పరుగులెత్తే స్త్రీలను చూసి ఆమె జాగ్రత్తలు తెలిపే పద్యాలున్నాయి. స్త్రీలను అబలలుగా చిత్రిస్తున్న సమాజం నుండి మేలుకొలుపును ఆశించారు కవయిత్రి. స్త్రీ తెలివి తేటలకు ప్రాధాన్యం ఇచ్చే అనేక సంఘటనలను కవిత్వంలో ప్రవేశపెట్టారు.

**'పరుగులెత్తనేల పరతత్త్వమని స్త్రీలు**
**పతి సుతాళి వీడి పరుల గొలువ**
**ఎవరి స్వామి వారి యెదలోనె యుండంగ**
**నమ్మి వినుడి జనులు నాదుమాట** (నాదుమాట)

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి కవిత్వం ఒక సంస్కరణ నేపథ్యం. దేశీయమైన వృత్తి చైతన్యాన్ని, భారతీయ శ్రామిక శక్తిని కొనియాడారు. జాతీయ సాంస్కృతిక మానవ వ్యక్తిత్వం పునరుజ్జీవం పొందాలని ఆశించారు.

**ఓ స్రష్టా!**
**మగ్గం మీద కూర్చొని**
**రోజు పోగులు తినే ఆ సాలె**
**నీ కన్నా మిన్న**
**ఎందుకంటే**
**అతడేమో అచేతనాల్ని అతికి**
**చేతనాల మానాన్ని కాపాడుతున్నాడు**
**కానీ నీవు..**
**చేతనాన్ని కలిపే చేవలేక**
**నిర్జీవ ప్రతిమవైపోయావు** (నేతగాడు)

నేతగాడు తన శ్రమశక్తిచేత చేతనం లేని నూలుపోగులతో లోక కళ్యాణాన్ని కాంక్షించాడు. కాని సగటు మనిషి తన కర్తవ్యాన్ని జాతీయభావం వైపు ఐక్యతా సోదర భావం పెంపొందించే లక్ష్యం ఈ కవిత నిర్దేశిస్తుంది. (శ్రమశక్తిని మరిచి కాలయాపన చేస్తూ తమలోని చేతనత్వాన్ని నిర్వీర్యం చేస్తున్నారని కవి వాపోయారు.)

ఆచార్య మసన చెన్నప్ప ఆర్షవిజ్ఞాన ఖని. సంస్కరణ వేత్త. దేశ ప్రగతిని నిరంతరం జాతీయవాది. స్త్రీ పురుషులిద్దరూ విద్యావంతులైతేనే దేశ ప్రగతి సాధ్యమవుతుందంటారు. అలాగే వృత్తి విద్యలు కూడా స్త్రీలు నేర్చుకుంటే వారికి ఆ విద్యలు ఆర్థికంగా ఉపకరిస్తాయని తేటపరుస్తూ కవిత్వం వెలువరించారు.

**'వృత్తి విద్యలందు విజ్ఞానములయందు**
**బాలుడెంతొ అంతె బాలికయును**
**దేశ రక్షణమున ధీ శాలి తనమున**
**బాలుడెంతొ అంతె బాలికయును'** (బృహద్గీత)

మత దురహంకారాన్ని నిరసిస్తూ ఆచార్య మసన చెన్నప్ప 'నేత్రోదయం' కవితా ఖండికను రచించారు. సర్వమత సమానత్వాన్ని ఎల్లవేళలా కోరుకోవడం కవి లక్ష్యం. మనిషితనంలో ఉన్న ఉదారత, సంఘటిత శక్తి ఎంతో గొప్పనైనదని కవి విశ్వసిస్తాడు. మానవ నిత్యకృత్యంగా మంచిని ఆచరించాలనే సంకల్పం కల్గి ఉండాలి అందుకోసమే సర్వమానవ ధ్యేయం రూపుదిద్దుకోవాలని కవి ఈ క్రింది కవితలో పేర్కొన్నారు.

**కూలి నాలి చేసుకొనే / అమాయకుల మీదనా నీ ప్రతాపం**
**కూడూ గుడ్డ నోచుకోని / నిరుపేదల మీదనా నీ కోపం**
**పసికూనల ప్రాణాలతో / నీకు చెలగాటమా?**
**నిండు చూలాలు గర్భంలో / విచ్చుకత్తులా?**
**వాడో వీడో / ఎవడైతేనేం / చచ్చింది మనిషే కదా?**
**గుండాలు నాయకులైతే / గృహ దహనాలకు కొదువేమిటి?**
**రాజకీయం రౌడీమయమైతే / కత్తిపోట్లకు అదుపేమిటి?**
**నాలుగొందలేళ్ళ చరిత్రను / మూసీనదిలో ముంచావు**
**చార్మినార్ బురుజులపైకి / రాబందులనే పిలిచావు.** (నేత్రోదయం)

'మతం ముదిరితే ఉన్మాదం, ఉన్మాదం ముదిరితే శ్మశానం' అందుకే శాంతి వహించాలని ఉద్బోధించారు. సత్యం, ధర్మం సహజీవన కళాకాంతులు విలసిల్లాలని ఆచార్య కొలకలూరి ఇనాక్ తన "నిశ్శబ్ద స్వరం" కవిత్వంలో కుల మత పట్టింపులు లేని సమాజం కావాలని కోరుకున్నారు. దళిత సామూహిక వ్యవస్థ బాగుపడాలని తన కవిత్వంలో ఉద్ఘాటించారు.

**'తమ ఒంటరితనాన్ని / అసహాయతనే స్థిరం చెయ్యడానికి**
**పార్లమెంట్ నుండి / మానవత్వం తెర మూసెయ్యండి**
**న్యాయం కళ్ళను పొడిచెయ్యడం**
**సుదీర్ఘ నిశ్శబ్ద నిర్మానుష్య ప్రదేశాల్లోకి**
**వెలుగును తరిమెయ్యడం**
**ఇవ్వన్నీ చూస్తూ / చెప్పులు కన్నీళ్ళు నిలువ చేసుకోవాలి**
**పేదతనం కూడబెట్టుకోవాలి'** (నిశ్శబ్ద స్వరం)

ఈ విధంగా తెలుగు సాహిత్యం పరిఢవిల్లడానికి సంస్కరణోద్యమ కవిత్వం ఇతోధిక తోడ్పాటును అందించింది. సమిష్టి సాహిత్య సమగ్రాభివృద్ధికి బాటలు వేసింది. విభిన్న వస్తు శిల్పాలను, అభివ్యక్తిని కవిపరంగా వెల్లడించింది. సామాజిక రుగ్మతలను తొలగించి అభ్యుదయ భావజాలాన్ని ప్రేరేపించింది. సాంస్కృతిక మూలాల అన్వేషణలో సంస్కరణ వాదం బలమైన పునాదిని ఏర్పరిచింది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆరుద్ర, 2005, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, తెలుగు అకాడమి, హైదరాబాద్.

2. నాగయ్య, జి.డా., 2004, తెలుగు సాహిత్య సమీక్ష, నవ్య పరిశోధన ప్రచురణలు, తిరుపతి.

3. నారాయణరెడ్డి, సి.డా., 1967, ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు -ప్రయోగములు, హైదరాబాద్.

4. తెలుగు సాహిత్య కోశం - ఆధునిక సాహిత్యం (1851-1950) తెలుగు అకాడమి, హైదరాబాద్.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  UGC Care List Approved Journal
హైదరాబాద్ అక్టోబర్ : 2023

# కాకతీయ మహేతిహాసం – 'మాలిక్ కాఫర్' నవల

**డా. జొన్నలగడ్డ భారతి,** అసోసియేట్ ప్రొఫెసర్, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 8919996936

మహోన్నతమైన మూడువందల సంవత్సరాల కాకతీయ రాజవంశ చరిత్రలోని చివరిపుటను **'కాకతీయ మహేతిహాసం'** అనే ఉపశీర్షికతో 'మాలిక్ కాఫర్' అనే పేరుతో చారిత్రక ప్రామాణ్యం కలిగిన కరుణరసాత్మక నవలగా అందించారు, చారిత్రక నవలా చక్రవర్తిగా ప్రసిద్ధులైన డా. ముదిగొండ శివప్రసాద్ గారు.

తెలుగుజాతిని, నేడు తెలుగువారు నివసిస్తున్న భూభాగాన్ని మొత్తం ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన తెలుగు రాజవంశాలు మూడూ (1. శాతవాహనులు, 2.విష్ణుకుండినులు, 3. కాకతీయులు) తెలంగాణ ప్రాంతానికే చెందినవి కావడం విశేషం. ఒకే సమయంలో తెలుగు నాడు మొత్తం తెలుగురాజుల ఏలుబడిలో ఉండటం కాకతీయులతోనే అంతమైంది. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలన్నీ ఉత్కృష్టదశను అనుభవించిన కాకతీయులపాలన అంతమవటానికి, మహోజ్జ్వల మైన సంస్కృతి అంతరించటానికి గల కారణాలను అన్వేషించే క్రమంలో కాకతీయ చరిత్రను పునర్మూల్యాంకనం చేస్తూ, చారిత్రక వాస్తవాలకు కాల్పనికతను జోడించి, వచన ప్రబంధం అనదగిన నవలను రూపొందించారు రచయిత.

చారిత్రక నవలారచన జాతీయాభిమానాన్ని పెంచేందుకు ఉద్దేశించబడుతుంది. ఆయాకాలాలలో చారిత్రకంగా ప్రభావం చూపిన, మార్పులకు కారణమైన, ఉదాత్తవ్యక్తుల ఆలంబనగా జాతీయభావనను పోషించడం సాధారణంగా కనబడుతుంది. కొన్నిసార్లు ప్రతినాయకుల వంటివారు మార్పులకు కారణమైనపుడు ఈ జాతీయభావన వ్యక్తికాక సామాజిక ఆలంబనగా సాగుతుంది. ఈ నవలలో ఆ విధంగా మాలిక్‌కాఫర్ కాకతీయ సామ్రాజ్యంలో విధ్వంసాన్ని సృష్టించి, రాజకీయ, సామాజిక, సాంస్కృతికమైన పెను మార్పులకు కారణమైన ప్రధానపాత్రేకాని, పాఠకుని వ్యతిరేకతను ఎదుర్కొని పరోక్షంగా పఠితలో జాతీయభావనోద్దీపనకు కారణమవుతున్నాడు.

నిజానికి, ఈ నవలలో కాకతీయ సమాజ స్థితిగతుల మీద పాఠకుని దృష్టి కేంద్రీకరింపబడినంతగా ఏ పాత్ర మీద పాఠకుని దృష్టి నిలువదు. అసలు మాలిక్ కాఫర్ వంటి దుష్టపాత్రకోణంనుంచి నవలారచనకు పూనుకోవడం సాహసోపేతమైన చర్య. అతను మరణించిన తర్వాత కూడా భూతం రూపంలో వ్యక్తులను ఆవహించి తన దుష్కార్యాలు కొనసాగించినట్లు కల్పించడాన్ని గమనిస్తే, విశ్వనాథవారి పురాణవైర గ్రంథమాల నవలల్లోని జయద్రధుని పాత్ర గుర్తుకు రాకమానదు. రాజుల ఆధిపత్య పోరాటాలు సంస్కృతిని, కళలను సాధారణ సామాజిక జీవనాన్ని ఎందుకు ధ్వంసం చేయాలి అని రచయిత నవలలో అక్కడక్కడా ఆవేదనతో ప్రశ్నించడం వెనకాల చరిత్రకారులు ఊహిస్తున్న కార్యకారణ సంబంధాన్ని నిరూపించే






శాసనాలవంటి ఆధారాలు ధ్వంసం చేయబడటం అని ఒప్పుకోక తప్పదు.

చరిత్ర ఎప్పుడూ మొదటి పుట నుండి ప్రారంభం కాదు. మధ్య పుట నుంచే చదువుకోవాల్సి ఉంటుంది అని ప్రముఖ చారిత్రకవేత్త విల్ డ్యురాంట్ అభిప్రాయం. కాకతీయుల చరిత్రలో మధ్యపుటలు విశ్వవిఖ్యాతి పొందిన గణపతిదేవుడు మరియు రుద్రమదేవిలవి కాగా, కాకతీయుల చరిత్రలో చివరి 50 సంవత్సరాలు అనగా క్రీ.శ. 1282 నుండి క్రీ.శ. 1332 వరకు ఈ నవలా కథాకాలం. ఈ కాలంలో కాకతీయ సామ్రాజ్యపాలకుడు రెండవ ప్రతాపరుద్రుడు.

ఢిల్లీ పాలకుడైన అల్లాఉద్దీన్ ఖిల్జీ పంపగా కాకతీయుల సంపదని, కోహినూర్ వజ్రాన్ని కొల్లగొట్టటానికి వచ్చిన బానిస సేనాని మాలిక్ కాఫర్. సబూర్ భాయ్ అనే పేరుగల గుజరాతీ హిందువు ఖిల్జీ సైనికులకి పట్టుబడి, బానిసగా అమ్మబడి, నపుంసకుడిగా మార్చబడి, మతమార్పిడి చేయబడి ఖిల్జీ సైన్యంలో చేర్చబడ్డాడు. మాలిక్ కాఫర్‌గా మారిన ఆ బానిస తన పరాక్రమ దక్షలతో సేనాధిపతిగా ఎదిగాడు. పూర్వాశ్రమంలో హిందువైయుండీ, మహోన్నతస్థితిలో ఉన్న హిందూ సామ్రాజ్యాన్ని, సంస్కృతిని ఎందుకు నాశనం చేశాడు? సంపదకోసం వచ్చి సంస్కృతీ వినాశనానికి ఎందుకు పూనుకున్నాడు? అతని తరువాత వచ్చినవారు కూడా అతనిమార్గంలోనే సంపదతో సరిపెట్టుకోకుండా సంస్కృతిని సమూలంగా నాశనం చేసేందుకు ఎందుకు ప్రయత్నించారు? చరిత్రకారులవద్ద సమాధానం దొరకని ఈ ప్రశ్నలకి నవలారూపంగా సమాధానం అందించే ప్రయత్నం చేశారు ముదిగొండ శివప్రసాద్ గారు. ఇందులో భాగంగా బలవంతంగా నపుంసకుడిగా మార్చబడి, మతమార్పిడిని ఎదుర్కొన్న మాలిక్ కాఫర్ లో అణచివేయబడిన పగ, ప్రతీకారం వంటి నకారాత్మక

భావాలు మానసిక సంతులనాన్ని దెబ్బతీసి క్రూరునిగా మార్చినట్లు చిత్రించారు. విచక్షణ కోల్పోయినవ్యక్తి విద్వేషం మరణంతో కూడా ఆగదని, తన భావాలకు అనుకూలమైన వ్యక్తిని చేరి కొనసాగుతుందని కల్పించి రచయిత చరిత్రకు సమాధానాన్ని సృష్టించారు.

మాలిక్ కాఫర్ ఓరుగల్లు మీద దండయాత్ర చేసినపుడు పాలిస్తున్న కాకతీయరాజు రెండవప్రతాపరుద్రుడి మంత్రి శివదేవయ్య. ఈయన హిందూరాజులందరూ సంఘటితంగా ఢిల్లీ పాలకులనెదుర్కోవడం వలన దక్షిణభారత దేశంలో ముస్లింలు విధ్వంసానికి పాల్పడకుండా అడ్డుకోవచ్చని పాండ్యులు, హొయసలులకి వర్తమానాలు పంపిస్తాడు. దీనిని పెడచెవిన పెట్టిన ఆయా రాజులు కాకతీయుల పతనంతోపాటు తమ రాజ్యాల పతనానికి కారకులయ్యారు. మాలిక్ కాఫర్ దండయాత్ర చేయడానికంటే ముందు, దక్షిణ భారతదేశ రాజకీయ పరిస్థితులను తెలుసుకోవటానికి మారువేషంలో కాకతీయ రాజ్యంలో ప్రవేశిస్తాడు. పటిష్టమైన కాకతీయ గూఢచార, సైనిక వ్యవస్థల సమాచారం సేకరించి ఢిల్లీ చేరతాడు. ఈ లోపల దురాశాపరులైన ఖిల్జీ, అతని భార్య మరొక సేనాధిపతి ఆధ్వర్యంలో కాకతీయులపైకి సైన్యాన్ని పంపుతారు. కానీ, ఈ యుద్ధంలో ఢిల్లీ సైన్యాలు ఓటమి చవి చూస్తాయి. ఈ సంగతి తెలుసుకున్న కాఫర్, అప్రమత్తులై ఉండే కాకతీయులను వెంటనే ఎదుర్కోవడం కంటే, దేవగిరిని హస్తగతం చేసుకుని అటునుండి కాకతీయ రాజ్యంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకుంటాడు. మార్గమధ్యంలో ఉన్న జనపదాలపై దౌర్జన్యం చేస్తూ, సంపదలు కొల్లగొడుతూ, ఓరుగల్లుని ముట్టడిస్తాడు. కాకతీయుల సేనాధిపతి నాగయగన్ననాయకుని నాటకీయంగా బంధించి, ప్రతాపరుద్రుని ప్రియురాలైన మాచల్దేవిని అంతం చేస్తామని వర్తమానం పంపుతాడు. వారి విడుదలకి ప్రతిగా కాకతీయులవద్ద ఉన్న అపరాజిత (కోహినూర్) వజ్రాన్ని కోరతాడు. గత్యంతరం లేని స్థితిలో ప్రతాపరుద్రుడు కోహినూర్ ని కాఫర్ కి సమర్పించుకుంటాడు. ఈ విధంగా కోహినూర్ ని దక్కించుకున్న ఖిల్జీ ముందు యిచ్చిన మాట ప్రకారం కాఫర్ ని సర్వసైన్యాధ్యక్షుడిగా చేసుకుంటాడు.

కొంత కాలానికే ఖిల్జీ హఠాత్తుగా మరణిస్తాడు. రాజ్యాధికారం పొందిన ఖిల్జీ పెద్దకొడుకును హతమార్చి, కాఫర్ సింహాసనాన్ని ఆక్రమించడం, ఖిల్జీ రెండవకొడుకు కాఫర్ ని చంపించి రాజ్యాన్ని దక్కించుకోవడం, ఆ వెంటనే తన సైన్యాధిపతి జరిపిన తిరుగుబాటులో ప్రాణాలు కోల్పోవడం, ఆ సైన్యాధిపతిని ఘియాజుద్దీన్ తుగ్లక్ అనే సేనా నాయకుడు అంతం చేసి, ఢిల్లీ సింహాసనాన్ని అధిరోహించడం వెంటవెంటనే జరిగిపోతాయి. ఈ పరిస్థితులలో కాకతీయులు ఢిల్లీకి కప్పం కట్టడం మానివేస్తారు. దీనిని వంకగా చూపించి, తుగ్లక్ తన కొడుకైన ఉలుఘ్ ఖాన్ ని కాకతీయులపైకి పంపుతాడు. మొదటిసారి ఇతను ప్రతాపరుద్రుని చేతిలో ఓడిపోతాడు. రెండవసారి దండయాత్రకు వచ్చినపుడు, విచక్షణా రహితంగా ప్రజలను ఊచకోతకోసి ప్రతాపరుద్రుడిని బందీగా పట్టుకొంటాడు. బందీ అయిన ప్రతాప రుద్రుడిని ఢిల్లీకి తీసుకువెళ్తుండగా నర్మదానదిలో సాలగ్రామంగా మారిపోయాడని వర్ణించడంద్వారా ప్రతాపరుద్రుడు ఆత్మహత్య చేసుకున్నాడనే విషయాన్ని సూచించారు రచయిత. మరొక బందీ అయిన నాగయగన్నసేనానిని ఢిల్లీకి తీసుకెళ్ళి, మతం మార్చి, మహమూద్ ఇక్బాల్ పేరుతో ఓరుగల్లును అదుపులో ఉంచటానికి పంపిస్తారు. ఓరుగల్లు పేరును సుల్తాన్ పూర్ గా మారుస్తారు. ఈ విధంగా ఢిల్లీ పాలకులు ఏడుసార్లు కాకతీయ సామ్రాజ్యం పైకి దండయాత్ర చేసి ఇక్కడి సంపదలు తరలించుకుపోయారు. ఇందులో మూడు దండయాత్రల కాలంలో మాలిక్ కాఫర్ సజీవుడు. నవలలో సగంలోనే కాఫర్ మరణిస్తాడు. కాఫర్ విద్వేష ఆత్మభూతంగా మారి, వేరేవారిని ఆవహించి విధ్వంసాన్ని కొనసాగించినట్లు కల్పించి, హిందువులను నాశనం చేసిన ముస్లింగా, ముస్లింల పట్ల సైతానుగా కాఫర్ పాత్రచిత్రణను ప్రత్యేకంగా నిర్వహించారు. ఇన్ని దండయాత్రలు ఎదుర్కొన్నా, కాకతీయ సామ్రాజ్యంలో కుల, మత విభేదాలు, అనైక్యత తొలగకపోవటం వలననే కాకతీయ వైభవం అంతరించి పోయిందనే విషయం నవలలో సమర్థంగా నిరూపించబడింది.

చారిత్రక నవలల్లో చరిత్ర బీజం ఉంటే చాలు అంటారు సుప్రసిద్ధ చారిత్రక నవలారచయిత నోరి నరసింహ శాస్త్రి గారు (ఆంధ్రభాషలో చారిత్రక నవలలు – వ్యాసం – సారస్వత వ్యాసములు – 5వ సంపుటం). సమాజంమీద కానీ, దేశం మీద కానీ మంచి లేక చెడు ప్రభావం చూపించిన చారిత్రక విషయాలకు అనుగుణమైన కల్పన జోడిస్తే చారిత్రకనవల/ కావ్యం సృష్టించబడుతుంది. చారిత్రక పరిణామక్రమానికి క్లుప్తీకరణా, సాంద్రీకరణా జరిగిన ఫలితంగా చరిత్ర నాటకీకృతం కావడం, చారిత్రక దశలలోని ప్రజాజీవితంతో పాఠకుడు తాదాత్మ్యం పొందటం, గత చరిత్రకు, వర్తమాన చరిత్రకు కార్యకారణ సంబంధం పాఠకుని అనుభవంలోకి రావటం అనేవి చారిత్రకనవలా రచనలో కనబడే సాధారణ లక్షణాలుగా రా.రా. వివరించారు. (కొల్లాయి గట్టితేనేమి నవల – వ్యాసం – సంవేదన)

హంగేరీ దేశానికి చెందిన మార్క్సిస్ట్ సాహిత్య సిద్ధాంతవేత్త ల్యూకాచ్ పేర్కొన్న 5 చారిత్రక నవలా లక్షణాలకు అన్వర్థమవుతున్న నవల మాలిక్ కాఫర్.

1. చారిత్రక నవల సాంప్రదాయిక రూపం ఇతిహాసం. ఇతిహాసానికి ప్రతినిధులుగా చెప్పబడే కొంతమందిపై సాంఘిక శక్తులు విస్తృతంగా తెచ్చిన మార్పుల ద్వారా సాధారణ జనుల జీవితాల రూపాంతరీకరణ చిత్రిస్తుంది చారిత్రక నవల.

2. ఈ ఇతిహాసంలో పేరుపొందిన చారిత్రక వ్యక్తులు పాత్రధారులుగా వస్తారు. కానీ వారి పాత్ర కేవలం నామమాత్రమే.

3. కథ సామాన్యమైన మధ్యరకం వ్యక్తులతో అల్లబడుతుంది. రెండు విరుద్ధ శక్తుల ఘర్షణలో కథాగమనానికి వీరు వ్యక్తిగతమైన స్పష్టత ఇస్తారు.

4. పతనమవుతున్న సాంఘిక రూపాలకీ, ప్రబలమవుతున్న సాంఘికరూపాలకీ మధ్య జరిగే విషాదాంత పోటీకి నవల వేదిక అవుతుంది. ఓడినరూపాలకి గౌరవం, విజయవంతమైన రూపాలకి సమర్థన లభిస్తాయి.

5. వివిధ పోరాటాలతో సమాజాలని, ఆ సమాజాలలో వ్యక్తులనీ వేరు చేసి చూపించి, సాంప్రదాయిక చారిత్రక నవల తుదిలో మానవ ప్రగతిని ధ్రువీకరిస్తుంది.

జాతీయభావనోద్దీపనాలైన చారిత్రక రచనలు ఇజాలకు, దృక్పథాలకు అతీతమైన లక్ష్యం కలిగిఉన్నట్లే వాటి లక్షణాలను కూడా పరిధులను దాటి గ్రహించాల్సి ఉంటుంది. రచయిత మాలిక్ కాఫర్ నవలను కాకతీయ మహేతిహాసంగా చెప్పటం ద్వారా నవలకున్న సాంప్రదాయిక నేపథ్యాన్ని స్పష్టం చేశారు. ఈ నవలలో ఐతిహాసిక ప్రతినిధిగా చెప్పతగినది హిందూ సంస్కృతి. ఈ సంస్కృతీ ప్రతిరూపాలు శివదేవయ్య, పాల్కురికి, ప్రతాపరుద్రుడు మొదలైన పాత్రలు. మహమ్మదీయ దండయాత్రలవలన హిందూ సంస్కృతి విచ్ఛిన్నమవటం, సంస్కృతికి నిలయమయిన ఆలయాలు, గోళకీ మఠాలు, నాశనం కావడంతోపాటు సంస్కృతీ ప్రతిరూపాలైన వ్యక్తులు అంతం చేయబడటంతో కాకతీయ సమాజంలో, ప్రజా జీవనంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. పెద్ద ఎత్తున బలవంత మత మార్పిళ్ళు జరిగాయి. చేతివృత్తులు, కళలు, అద్భుతమైన శిల్పసంపద నామరూపాలు లేకుండా నాశనం చేయబడ్డాయి. నవలాంతంలో రూపాంతరం చెందిన సాధారణ జనజీవనాన్ని రచయిత ఇలా వివరించారు. **"ఓరుగల్లులోని విలువైన సంపాదనమొత్తం ఢిల్లీ చేరింది. ఏకశిలానగరం పేరును సుల్తాన్ పూర్ గా మార్చారు. కొన్ని నెలల పాటు జనపదాలపై దోపిడీలు అడ్డూ అదుపు లేకుండా సాగుతూనే ఉన్నాయి. ఈ బాధని తట్టుకోలేక ఎందరో త్రిలింగాంధ్రులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వెలమ - రెడ్డి దొరలు మతం మార్చుకుని, షేర్వాణి తొడుక్కుని, చిల్లుల టోపీలు పెట్టుకున్నారు."** (పే.309) రూపాంతరీకరణ జరిగిన సామాన్య జీవనాన్ని వర్ణించటంలో రచయిత ప్రదర్శించిన కల్పనాపటిమ పాఠకుడిని కథాకాలం నాటి ఓరుగల్లు వీధులలో తిరుగాడేటట్టు చేసి గుండెల్ని మండి స్తుందనటం అతిశయోక్తి కాదు.

పేరుపొందిన చారిత్రక వ్యక్తుల పాత్ర నవలలో నామమాత్రంగా ఉండటం మరొక లక్షణంగా ల్యూకాచ్ చెప్పి ఉన్నాడు. కాకతీయ సామ్రాజ్యాధినేత ప్రతాప రుద్రుడు, శివదేవయ్య, ఖిల్జీవంటి ప్రముఖ చారిత్రక వ్యక్తులు ఈ నవలా గమనానికి ప్రధాన కారకులే అయినా పాఠకుని ప్రత్యక్ష అనుభూతికి అందే విధంగా వారి పాత్రలు చిత్రింప



బడలేదు. ప్రతాపరుద్రుని వీరత్వాన్నిగానీ, పాండిత్య వైభవాన్నికానీ, కళాభిజ్ఞతను కానీ, చార చక్షుష్కతని కానీ పాఠకుడు స్వయంగా గ్రహించే సన్నివేశాలేవీ ఈ నవలలో లేవు. ఇవన్నీ పాత్రల సంభాషణల్లో సూచించబడ్డాయి. చరిత్రలో ప్రతాపరుద్రునివంటివారు అనేకమంది ఉండవచ్చు. వారికంటే హిందూ సంస్కృతి ఉన్నతమైంది అనేది రచయిత భావన. అందువలన ఈ పాత్రలన్నీ నామమాత్రంగా మార్చివేయబడ్డాయి.

విరుద్ధ శక్తులైన హిందూ ముస్లిం సంస్కృతులమధ్య జరిగిన సంఘర్షణ నవలలో కీలకం. మొదటగా హిందువైన మాలిక్ కాఫర్ హిందూ సంస్కృతి విచ్ఛిన్నానికి పూనుకోవడానికి కారణమైన సన్నివేశాలను రచయిత కల్పించారు. బలవంతంగా మహమ్మదీయుడిగా మారిన కాఫర్ కి ఢిల్లీ నగరంలో ఆలయప్రవేశం లభించకపోవటం వలన ప్రతీకారేచ్ఛ ప్రబలినట్లుగా కల్పించారు. మతభ్రష్టులు, ధర్మభ్రష్టులు తిరిగి తమ సాంప్రదాయంలోకి మారగలిగే, తమ ధర్మాన్ని పాటించగలిగే అవకాశం ఆనాటి హిందూ సంస్కృతిలో లేకపోవడం, ఎవరికి వారు మతాన్ని సొంత ఆస్తిలా భావించడం వంటి కారణాల వలన సమాజంలో అరాచకత్వం ఏర్పడుతుందని మాలిక్ కాఫర్ పాత్ర చిత్రణ ద్వారా రచయిత హెచ్చరిక చేశారు. మతమార్పిడికారణంగా ప్రబలమైన మహమ్మదీయ సంస్కృతికి, అస్తిత్వాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్న హిందూ సంస్కృతికి మధ్య జరిగిన విషాదకరమైన పోటీకి పతనమైన కాకతీయ సామ్రాజ్యం వేదిక అయింది.

దండయాత్రల ప్రభావాన్ని మహారాజునుండి రాజ్యంలో మారుమూలలో ఉండే కుటుంబాలవరకూ అందరూ ఎదుర్కొన్నారనే విషయాన్ని వర్ణించిన రచయిత ఇవన్నీ తాత్కాలికంగా ప్రగతి నిరోధకాలు కావచ్చుకానీ సంస్కృతీ ఔన్నత్యం తిరిగి సాధింపబడుతుం దని అభిప్రాయపడ్డారు. **"మానవ మహేతిహాసంలో కాకతీయ సామ్రాజ్య అవతరణ, పురోగతి, పతనం ఒక అధ్యాయం. ఐతిహాసిక**

**సముద్రంలో ఒక పెను కెరటం. ఒక అనివార్య ఘట్టం. ఒక అల. తర్వాత మరొక అల. ఆ తర్వాత ఇంకొక అల. కాకతీయ సామ్రాజ్యంతోనే మానవ చరిత్ర, ఆంధ్రచరిత్ర ప్రారంభం కాలేదు. ప్రతాప రుద్రునితోనే ఈ సామ్రాజ్య చరిత్ర ముగియదు"** అంటారు. మహోజ్జ్వలమైన సంస్కృతి కొంత విచ్ఛిన్నమైనా, తిరిగి ఔన్నత్యాన్ని పొందుతుందనే ఆశాభావాన్ని పాఠకునికి కల్పించటానికి, నవలలో ఆసాంతం చిత్రించబడిన విశ్లథమైన సంస్కృతిని చూచి రగిలిపోయిన పాఠకునికి ఊరట కలిగించటానికి రచయిత ప్రయత్నించారనేది స్పష్టం. భారత దేశంలో వైదిక ధర్మం అణచివేయబడటం, తిరిగి ఉవ్వెత్తున ఎగసి దృఢమైన వ్యవస్థని నిర్మించుకోవడం చరిత్రలో అనేక సందర్భాలలో నిరూపితమైంది. జాతి బలహీనబడినపుడు ధర్మచ్యుతి జరగటం, పరధర్మానికి లొంగిపోవటం, పరధర్మావలంబులు బలహీనపడినపుడు తిరిగి స్వధర్మం పునరుద్ధరింపబడటం, ఈ అన్ని సందర్భాలలో ఒక జాతి మీద పడిన మరొక జాతి ప్రభావం కనిపించీ కనిపించక కొనసాగడం చరిత్రలో సాధారణంగా కనపడే విషయం.

నవల ఆరంభానికి, మొదటి సన్నివేశ ఎత్తుగడకి ఒక ప్రత్యేకత ఉంది. మనకి అభిమానపాత్రమైనదానిని కోల్పోయినపుడు దాని గొప్పదనాన్ని సింహావలోకనం చేసుకోవడం, దానిపట్ల వివిధ రూపాలుగా అభిమానాన్ని ప్రకటించేందుకు ప్రయత్నించటం మానవ నైజం. వైదిక సంస్కృతి పట్ల అభిమానాన్ని రచయిత నవలారంభంలోనే ప్రకటించారు. ముస్లింరాజుల పాలనలో ఉన్న ఢిల్లీ నగరంలో జరుగుతున్న బానిసల అమ్మకం మొదటి సన్నివేశం. ఈ సన్నివేశంలో సూర్యుణ్ణి రుద్రుడితో పోల్చిన మంత్రాలు ఎవరో చదువుతున్నారంటూ వేదమంత్రాలను చొప్పించటం జరిగింది. ప్రతాప రుద్రుడి పాత్రసూచన కూడా ఇక్కడ జరిగిందని చెప్పవచ్చు.

ప్రతివ్యక్తికీ తనదైన వ్యక్తిత్వం ఉన్నట్లే ప్రతి జాతి తనదైన వ్యక్తిత్వాన్ని కలిగిఉంటుంది. అదే జాతి సంస్కృతి. ఆ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తే జాతి నాశనమవుతుంది. ఈ నవలలో కాకతీయ సంస్కృతీ విచ్ఛిన్నతకు, తెలుగు జాతి వినాశనానికి దారితీసిన పరిస్థితుల కరుణరసాత్మక వర్ణన పాఠకునిలో సంస్కృతీ పరిరక్షణ గురించిన ఆలోచన రేకెత్తిస్తున్నది. చరిత్రలో అనేకసార్లు హిందూ సంస్కృతిని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం జరగటం, ఈ సంస్కృతికున్న సహజ సంయమన శక్తి జాతి వినాశనాన్ని అడ్డుకోవడం జరుగుతూ వచ్చింది. ఆయా కాలాలలో సంస్కృతి అణచివేయబడటానికి హిందూరాజులమధ్య అనైక్యతే ప్రధానకారణమనేది స్పష్టం. ఈ దేశంలో పుట్టిన వైదిక బౌద్ధమతాలు, బౌద్ధ జైనాలు, శైవ వైష్ణవాలు ఒకదానితో ఒకటి నిత్యం సంఘర్షించటంవలన, కులవివక్షవలన అన్యమత ప్రాబల్యం పెరిగిందనేది చారిత్రక వాస్తవం. కుల, మత వైషమ్యాలను నిరోధించలేని, అంతర్గత కలహాలను పరిష్కరించుకోలేని అవకాశవాద హిందూ రాజులు మహమ్మదీయుల ఆధిక్యతకు, ముస్లిం మత ప్రాబల్యానికి తోవ కల్పించారు.

భౌతికవాదానికి, ఆధ్యాత్మిక జాతీయవాదానికి మధ్య జరిగిన పోరాటంగా ఢిల్లీ పాలకులు-ప్రతాపరుద్రులమధ్య పోరాటాన్ని అభివర్ణించారు రచయిత. అంతే కాకుండా, కాకతీయులది ఆలయ సంస్కృతిగానూ, ఢిల్లీ పాలకులది విలయసంస్కృతిగానూ పేర్కొంటూ ఈ నవలను రెండు సాంస్కృతిక ప్రవాహాలమధ్య జరిగిన పోరుగా చిత్రించారు. కాకతీయుల, సుల్తానుల రాజ్యాలలోని సమాజాలను, సంస్కృతినీ, వాటిమధ్య భేదాలను యాబయ్యేళ్ళ కాలంలో జరిగిన పరిణామాలను ప్రభావవంతంగా కళ్లముందు నిలిపి, పాఠకుని ఆ కాలానికి తీసుకెళ్లిపోతుంది ఈ నవల. పాఠకుడు బానిస సంస్కృతిని, ముస్లిం పాలకుల అధికార ధన వ్యామోహాలను చూసి ఏవగిస్తాడు. వారి అకృత్యాలను చూసి భయవిహ్వలుడవుతాడు. కాకతీయుల కళాపోషణ చూసి మురిసిపోతాడు. కాకతీయ ప్రజలపైన జరిగిన దురాక్రమణకు క్రోధచిత్తుడై రగిలిపోతాడు. కాకతీయ సైనికుడి రూపంలో రాజ్య/సంస్కృతీ రక్షణ చేయాలని ఉత్సాహపడతాడు. ముస్లిం సైన్యాలు జరిపిన విధ్వంసాన్ని చూసి హృదయం పగిలి రోదిస్తాడు. ఈ స్థితిలో ఉన్న పాఠకునికి ఓదార్పుగా కాకతీయరాజ్య పతనానంతర చరిత్రను కొంత వివరించి, విజయనగర సామ్రాజ్య స్థాపనను సూచించి నవల ముగించారు రచయిత.

ఇరవైకి పైగా చారిత్రకనవలలు రాసిన ముదిగొండవారు ఈ నవల ముందుమాటలో **"చారిత్రక నవల చదవడం అంటే వేల సంవత్సరాలనాటి కాలమాన పరిస్థితులలోకి మనం పయనించడమే. ఒక రకంగా మన ఆయుష్షు వేల సంవత్సరాలకు విస్తరించడమే. వేల సంవత్సరాల నుంచి ఈ రోజు దాకా జీవించడమే"** అని పేర్కొని, పాఠకునిలో నిద్రాణమై ఉన్నసాంస్కృతిక చైతన్యాన్ని, వేల సంవత్సరాల సంప్రదాయ మూలాలని తన నవలద్వారా జాగృతం చేశారు. జానపదులకూ, జ్ఞానపథులకూ శాస్త్ర విషయాలని సమంగా అందించిన కాకతీయ కళావైదుష్యాన్ని పునర్నిర్మించుకోవాలనే ప్రేరణను అందించి, మహేతిహాస లక్షణాలకు దర్పణమై నిలిచిన ప్రామాణిక చారిత్రక నవల 'మాలిక్ కాఫర్'.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. సారస్వత వ్యాసములు- 5వ సంపుటం, ఆం.ప్ర.సాహిత్య అకాడమి.

2. సంవేదన (వ్యాస సంకలనం)

3. సాహిత్యచరిత్రలో చర్చనీయాంశాలు – డా. జి. వి. సుబ్రహ్మణ్యం.

4. ఈ మాట – అంతర్జాల పత్రిక

 

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  UGC Care List Approved Journal
హైదరాబాద్ అక్టోబర్ : 2023

బందారం కథలు 21

# కళకు కన్నీళ్ళే?

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148

**"దయగల్ల చెయ్యి నీదవ్వా రత్నవ్వా దయగల మనసు నీదవ్వా రత్నవ్వా కడుపు గాలిన బాదలవ్వా మాయవ్వ నీ బిచ్చమే మాకు బువ్వా రత్నవ్వా"**

రాగం తీసి ఆర్ద్రంగా పాడుతున్నది రామవ్వ. రామవ్వంటే శారద రామవ్వ. అందెలు పట్టిందంటే అదొక సంగీతం. కరమెత్తిందంటే అదొక పాట. బుర్ర సంకనేసిందంటే ఆకట్టుకునే నాదం. పెద్ద పెయ్యి రూపం. పెద్ద ముఖం, ముక్కుమీద గుండ్రటి తెల్లటి నగ చురుకుగా పెదవులు. రామవ్వ పాటలు పాడుతుంది. కథలు చెప్తుతుంది. కాయలు తెంపుతుంది. కమ్మ కోస్తుంది. చాపలల్లుతుంది. వాకిట్లో అరుగు ముందు నిలబడి ఆలపిస్తున్నది. రెండు చేతులు ఈతకమ్మలతో అలవోకగా కదులుతున్నాయి. పాట ఒలుకుతున్నట్టే చాప తయారయితున్నది. సంకన జోలె ఉన్నది. పక్కన యువతి ఉన్నది. ఆమే కమ్మలల్లుతున్నది. గొంతు కలుపుతున్నది. దర్వాజ లోపలికి చూస్తూ పాడినా ఏ అలికిడి వినిపించలేదు.

"అవ్వా, రత్నవ్వా రామి వొచ్చింది. నేను రామిని వొచ్చిన అవ్వా"

"అయితె ఏం జెయ్యాల్నె – మాగనే వొచ్చినవు గని ఏం జెయ్యమంటవే, యాల్ల లేదు పాల్ల లేదు"

ఇంటెనుక నుంచి యాష్టపడుతూ రత్నవ్వ గొంతు వినబడింది.

'పొయికాడ ఉన్నట్టున్నది' అనుకున్నది రామవ్వ. "ఏదో ఆశపడ్తం గద తల్లీ, మా యింటికి ఆశపడకపోతే ఏ యింటికి ఆశపడ్తం. దొరికే ఇంటికే కాల్లు కదుల్తయి. పోరగాండ్లు తల్లీ... పోరగాండ్ల ఆకలికి ఏం జెయ్యాలె తల్లీ....."

"బంగారు చెయ్యి నీదవ్వా రత్నవ్వా. బారైన మనసు నీదవ్వా రత్నవ్వా" పాట తిరిగి అందుకున్నది. 'యేశెదాక ఇది ఇడువది' అనుకోని రత్నవ్వ పొయి దగ్గరినుంచి లేచింది. సరసర వెనుక దర్వాజ దగ్గరికి వొచ్చి 'నీ పాట నీదేనాయె రామీ – వొచ్చి పోయెటోల్లను జూసుకుంటుంటే పొయి కాడ ఎట్ల ఎల్లాలె.. బాయికాడ ఎట్లెల్లాలె. పని జెయ్యకపోతే పొక్కలకెట్ల రావాలె. నాకెట్ల, నీకెట్లు... వొస్తున్న... ఆగు'. రత్నవ్వ తన సణుగుడు తాను సణిగింది గట్టిగానే. మళ్లా రత్నవ్వ పొయ్యి దగ్గరికి వెళ్ళి చాటలో జొన్నరవ్వ పోగలు కక్కుతున్న కుండలో పోసింది. తెడ్డుతో అటూ ఇటూ కలిపి అక్కడ నుంచి లేచింది. చాట పట్టుకొని అర్రలోకి పోయి జొన్నలు పోసుకోని రెండు దర్వాజలు దాటి వచ్చింది. "మా తల్లి..." అన్నది రామవ్వ. 'పటు – జోలె పట్టు'? అన్నది రత్నవ్వ. జోలె తెరచిపడితే జొన్నలు అందులో పోసింది. జోలెలోంచి తీసిన రాతెండి గిన్నెను జరిపి చేత బట్టుకున్నది రామవ్వ. "పోరగాండ్లు ఆకలని ఏడుస్తుండ్రు. గింత సలిదుంటె ఎయ్యి రత్నవ్వా" "సలిదున్నది గని నీకెత్తే మా పోరగాండ్ల కెట్లనే...". "రత్నవ్వకు దయ రాకపోతె ఎవలకొస్తది. పుట్టే ఇంటికే ముందగాల వొస్తరి. రత్నవ్వది బంగారి చెయ్యి. నువ్వు పెడితె అన్ని ఇండ్లల్ల పుడ్తది".

"రామవ్వంటె రమవ్వ. రామవ్వనిపించుకున్నవే. గింజలకు గింజలు కావాలె. సలిది సలిది గావాలె". లోపలకి పోయి చలిబువ్వ తెచ్చి గిన్నెలో వేసింది. 'రాత్రి పటేలు దినలే" అన్నది రత్నవ్వ. "చాన రోజులయింది రాక. అంత మంచిదేనాయె" "ఒగో ఏం జెయ్యాలె



డా. నందిని సిధారెడ్డి

ఊరూరు దిరిగెటోల్లమాయె. ఎల్లదియ్యాలె గదనవ్వ. పెద్దోని పెండ్లి జేసిన. ఇగో.. ఇది ... పెద్దోని పెండ్లము. కోడలుది. అలవాటు గావాలె గద. యెంట తెచ్చిన". రామవ్వ కోడలుని పరిచయం చేసింది. "రామీ, అంతకుముందు పున్నానికి వొచ్చినప్పుడు సంటిపోరన్ని ఏసుకోని వొస్తివి గదనే..."

"వాడు ఆఖరోడు. ...సంటోడు.... మొన్న మొన్ననే పాలు మరిపిచ్చిన. వడెమొ పెద్దోడు. వీని పెండ్లి జేసిన. ఏం జెయ్యాలె బాంచెన్. అందర్ని సాదాలె. నీకెర్కే గద మల్లయ్య కోపం. మా మల్లయ్య కథ దొరికితె జెప్తదు గంగే. బిచ్చానికి పోడు. పనికి పోడు. ... తప్పుతదా రాత. గండెపు సంసారమాయె...."

"ఎప్పటికి మరిశిపోత. ఇప్పుడెందరే నీయకు పిల్లలు" అడిగింది రత్నవ్వ. పడి పడి నవ్వింది రామవ్వ. ముక్కుమీది గుండ్రటి నగ గుండ్రంగా తిప్పింది. "పద్నాలుగుమంది బాంచెన్. తొమ్మిదిమంది మొగపోరగాండ్లు. ఐదుగురు ఆడిపోరగాండ్లు. ఇద్దరాడపిల్లల పెండ్లిల్లు జేసి పంపిచ్చిన".

"వొంట యేమాయెనో ఏమొ. పొంగిందో మాడిందో..." వెళ్ళబోయింది రత్నవ్వ. "అవ్వా... అవ్వా... నీ బాంచెన్ కాళ్లు బొక్త. ఒక్క పాతసీర జూడు... బాంచెన్.

ఇగేమడుగ..." "మంచిగున్నదే నీ కత. ఇసంత రమ్మంటె ఇల్లంత నాదంటవు. సీరలేదు, గీరలేదు... పొయి మీద కుండున్నది... పో...పోయే" లోపలకి వెళ్ళిపోయింది. రామవ్వ వెళ్ళలేకపోయింది. అయిదు నిమిషాలాగి మళ్లా పిలిచింది. మళ్లా పిలిచింది. బతిమిలాడింది. పొంగించింది. పొడిగించింది. కోడలు ముందు నామర్దా కావద్దనుకున్నది. రత్నవ్వ పాత సాధించింది. అంతసేపు చాప అల్లుతూనే ఉన్నది. అమ్మకానికి అడిగితే అల్లిన తర్వాత ఇస్తానన్నది. అల్లుకుంటూ పాడుకుంటూ మరో ఇంటికి వెళ్లింది.

తిరిగి తిరిగి మధ్యాహ్నం వరకు గుడిసె దగ్గరికి చేరింది శారద రామవ్వ. పరిగెత్తుకొచ్చారు పిల్లలు. సలితిండి నలుగురికి సదిరింది. చింతచెట్ల కింద ఆడుకుంటున్న ముగ్గురు పిల్లలు అటువైపు రాలేదు. బసుగురేణి పండ్లు ఏరుకుని తిన్నారు. కొద్దిసేపటికి నలుగురు పెద్ద పిల్లలు ఎం(డ్రికాయలు పట్టుకొచ్చారు. అప్పటికే రామవ్వ జొన్నలు ఇసిరింది. పొయ్యి అంటుపెట్టి కుండలో ఎసరు పెట్టింది. మరోపక్క కట్టెపుల్లలు పోగుచేసి మంట పెట్టి ఎం(డ్రికాయలు కాలుస్తున్నారు పెద్ద పిల్లలు. ఇద్దరు వెళ్ళి చింతచెట్టు ఎక్కి చింతపండు తెంపుకొచ్చారు. అచ్చెగాళ్లు బిచ్చగాళ్లు వచ్చిపొయ్యేవాళ్లకోసం చింతవనం పెంచి కేటాయించారు. దిక్కులేనోళ్లు, దారిలేనోళ్లు ఉండటానికి, బతకటానికి ఏర్పాటు చేసిన చింతలవి. నర్రోని చింతలు. ఏ పెద్దల ముందు చూపోగాని ఎందరో బతకటానికి ఉపయోగ పడుతుంది. సంచార జీవులు ఎవరైనా గుడిసె వేసుకొని ఉండవచ్చు. ఊరి ఆసరాతో ఉన్నన్ని రోజులు ఉండవచ్చు. అట్లా వొచ్చి గుడిసె వేసుకొని ఉంటున్న కుటుంబం ఆ శారదకాండ్రు. శారద మల్లయ్య, శారద రామవ్వ దంపతులు. ఎవరిని అడిగినా తమ ఊరు బందారమనే చెప్పుకుంటారు. వేరే ఊర్లు వెళ్ళినా బందారం పేరు చెప్పుకుంటేనే బువ్వ దొరుకుతుందంటారు.

వంట పూర్తి చేసింది రామవ్వ. కుండెడు గటక. ఎం(డ్రికాయల పులుసు తయారైంది. రామవ్వ తప్ప పిల్లలందరూ తిన్నారు. తమ తిండిలో కొంత తమ కుక్కకు పెట్టారు. తోక ఊపుకుంటూ ఆవురావురుమని తింటున్నది. మూడు మేకలు అప్పటికే ఆకులు మేసి అటూ ఇటు దవడలు ఆడిస్తున్నాయి. రామవ్వ మనసు మనసులో లేదు. పొద్దు వొంగినా మల్లయ్య ఇంకా రాలేదు. 'తినకుండా ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో ఏమో... ఎల్లదియ్యలేక యాష్టతోని మొగన్ని ఏదేదో అన్నది. కష్టమో నష్టమో కల్లాల కాడికి పొమ్మని కటువుగానే అన్నది..' లోపల పేగులు అరుస్తున్నాయి. మల్లయ్య రాలేదని మనసు గోస పడుతున్నది. తిందామనుకున్నది. గిన్నెలో పెట్టుకున్నది. తినలేకపోయింది. నీళ్లు తాగి కల్లాల దిక్కు బయల్దేరింది. 'ఎవరి బాయికాడ ఏ కల్లమయితున్నదా! ఎతుకాలె... పొద్దొంగింది. కనబడు నా అయ్య.... కథల మల్లయ్య...."

చెరువు కట్ట దిగింది. అయిదారు బాయిలు దాటింది. చలికాలమైనా ఎండ కాస్తుంది. దూరం దాకా చూపు సారించింది. ఏమీ కనిపించలేదు. గడ్డిమోపులు ఎత్తుకొస్తున్నవాళ్లు మాట వినిపించేంత చేరువలో లేరు. చెవి దగ్గర చెయ్యి పెట్టి దూరం దాకా విని చూసింది. బుర్ర చప్పుడు లీలగా వినిపించింది. అంతకంటె మెల్లగా అందెల సవ్వడి. ఇంకా లోగొంతుకతో పాట.

శారదగానం వినిపిస్తున్న వైపు సరసర నడిచింది రామవ్వ. కల్లం కనిపించింది. పరుపు బండ మీద పడుగు పెట్టినట్టున్నారు. బంతి తిరుగుతున్నదొక పక్క. అవతలి పక్క వడ్లకుప్ప. రామిరెడ్డి పటేలుది కల్లం. పెద్దోడు బుర్ర మోగిస్తున్నాడు. మల్లయ్య. తన మల్లయ్య తియ్యటి గొంతు ఎండు గడ్డివాసనలో కలిసి ఎండలో తేలి వస్తున్నది.

**"రంగ రంగ రాజనందనా రామన్నా చెయ్యి సల్లనా రామన్న**
**నీ చెయ్యి సల్లగుండా రామన్నా నీ భూమి పంట పండా రామన్న**
**నీ ఇల్లు సల్లగుండా రామన్న గరిసెల్లు నిండుగుండా రామన్న**
**అద్దెదలికినవాల్లు - బుద్దెదలినివాల్లు - -ఇల్లు అలికిన పొలము**
**ఎయ్యారు పుట్లయెనా...."**

వహ్వారె... వహ్వా... "పిల్లలు సల్లగుండాలె పసులు చల్లగుండాలె, ఇల్లు కళ కళ లాడాలె...పటేలా...ఊరు కళకళలాడాలె... నాయనా"

"మల్లయ్యా... ఆపు... ఆపు ఏందెచ్చుకున్నవో పట్టు.... మంచిగ పండాల్నని మొక్కు.... మంచిగ బతుకుతం అందరం. బరకతుండాల్నని దీవించు" రామిరెడ్డి చిన్న రాశిలోంచి చాటతో తోడికెండు చాటలు సంచిలో పోశాడు.

"ఏందే రామవ్వ. గిప్పుడొచ్చినవు. మల్లయ్య జాడకొచ్చినవా.. ఏమన్న అనుకున్నరా ఏంది.....?" ఆ ప్రశ్నకు రామవ్వ కళ్లలో నీళ్లు దిరిగినయి.

"నేనేమంట బాంచెన్. మల్లయ్య నంటనా... అయ్య మల్లయ్య కత నీకు దెల్వదా?"

"నువ్వన్నవా మల్లయ్య" "నేనంటనా... రామవ్వనంటనా... పటేలా... రామి కత నీకెర్కలేదా?"" "సరె సరే మీ కథ ఎర్కే. మీ ఇద్దరి కథలు ఎరికే.."

జోరసంచి మూటలు కట్టి మల్లయ్య, పెద్దకొడుకు ఎత్తుకున్నారు. శారద చేతిలో తీసుకొని, బుర్ర చంకకు తగిలించుకొన్నది రామవ్వ. ముగ్గురు బయల్దేరారు చింతల దిక్కు. పడుగు ఎదురుతున్నరు కూలీలు.

గూన పెంకల ఇల్లు. ముందు చిన్న పందిరి. తాటాకులు గలగలలాగుతున్నాయి. ముందరి పందిరి గుంజలకు రెండు కందిళ్లు, చీకటి నిండుతున్న ఇంట్లో వెలుగులు నింపటానికి తండ్లాడుతున్నాయి. కందిలి వెలుగులో శారద తీగలు సవరించుతూ రాగం సరిచూసు కుంటున్నాడు మల్లయ్య. కొంగు నడుముకు చుట్టుకొని ప్రేక్షకుల్ని

పిలుస్తున్నట్లు నడమ నడుమ బుర్ర శబ్దం చేస్తున్నది రామవ్వ. పందిరి ఎదురుగా వాకిట్లో కొందరు ఆడవాళ్లు కూచున్నారు. సగం కూలిన గోడకు ఆనుకొని దీనంగా ఉన్నది సాయవ్వ. కొడుకులు, కోడండ్లు, మనుమలు కొంచెం దూరంగా చూస్తున్నారు. నర్సయ్య ముత్తరాశికుల పెద్ద. ఊల్లె మంచి పేరెల్లిందు అంటారు. ఎనబైయేండ్లు బతికి మూడురోజులు కింద గతించాడు.

“కందిలి ఎలుగు చాల్తలేదు. పంపులైటయితే మంచిగ కమ్మేది” అన్నాడు బామల్లు. శారద మల్లయ్యకు హంగుల మీద నమ్మకం లేదు. ‘ఆడ రాక పందిరి కురుచ’ అన్నాడట ఎనుకటికి. కతల దమ్ముంటే కమ్ముతది. పాటల బలముంటే పండుతది. ఏం గాదు. కతకు కందిలి సాలు” అన్నాడు శారద మల్లయ్య. శారదను స్తుతించాడు, రామవ్వ వంత అందుకుంటున్నది.

“రాఘవా.... రాగం తియ్యగానే చుట్టుపక్కల ఉన్నవాళ్లంతా వచ్చి కూచున్నారు. ‘ఓ దేవుడా... బాయి సూడకపోతివి. బంధం సూడకపోతివి. బలగం జూడకపోతివి. పానం దీసుకపొయ్యి పాపకారి వైతివి... అయ్యో... ’ లయబద్ధంగా బుర్ర మోగుతూనే ఉన్నది. సన్నగా శారద నాదం చేస్తున్నది. అందెలు గుండెలు మీటుతున్నవి.

“ఎంత జేసిన కూటికి. ఎన్నేండ్లు బతికిన కాటికి. మానవ చెత్తను మట్టిబొమ్మ మంట్లె కలిసెతందుకు” “అయ్యో రామ రామ బాలి. అయ్యయ్యో రామ రామ బాలి” “నా కొడుక సెందురయ్య బాలి నేనెల్లిపోతవున్నా బాలి. పాపకారి దేవుడూ బాలి పాలు పంచుక పోయెనా బాలి. దోసకారి దేవుడూ బాలి తోలుకొని పోతున్నడా. పాపకారి దేవుడు బాలి బలగాన ఎడబాపెనా బాలి కొడుకుల్ల ఎడబాపెనా బాలి కోడండ్ల నెడబాపెనా బాలి నీ బాయి నీకున్నదో నాకొడుక నీ జాగ నీకున్నదీ నా కొడుక నా కొరకు జూడబోకు బాలి నా తొవ్వ జూడబోకు బాలి నాకు తలే బెట్టబోకు కొడుకా గలుమల్లు జూడబోకు బాలి నేనెల్లి పోతున్నరో నీ తల్లి తోడుంటది బాలి నీ చెల్లె నీకుంటదీ బాలి తల్లి నీ దిట్టబోకు బాలి చెల్లెనూ దిట్టబోకు బాలి, నీ తమ్ములను జూసుకోవాలి తమ్ములను కొట్టబోకు బాలి నేనెల్లి పోతున్నరో....”

మల్లయ్య ఆర్తితో పాడుతుంటే సాయవ్వ కండ్లల్లో నీళ్లు దుంకినాయి. వింటున్న వాళ్లు లీనమైపోయారు. మల్లయ్య పాటకు రామవ్వ ఏడుపు తోడయింది. ఆడవాళ్లు కండ్లల్లో నీళ్లు పెట్టుకున్నారు. మల్లయ్య దమ్ము తీసుకున్నాడు. ‘ఓ దేవుడా..’ దీర్ఘంగా రాగం తీశాడు. రామవ్వ అందుకున్నది. బుర్ర ఆగలేదు. గొంతు ఆగలేదు. ‘కొడుకు లెంటా రారురో...బాలి బిడ్డాలెంటా రారురో బాలి ఇల్లిడిసి పోతవుండో/ నాయన/ జాగిడిసి పోత వుండో బాలి నీ నాయన నీకు ఉంటె సెంద్రయ్య నీకెంత దీర ఉండె బాలి నీ భర్త నీకు ఉంటె సాయవ్వ నీకెంత దీము ఉండె బాయికాడెతుకబోకు సాయవ్వ సెలకల్ల తిరుగబోకు సాయవ్వ నేనాడ కానరాను బాలి నా పిడికెడొండబోకు సాయవ్వయ నాకు తలెబెట్టబోకు... బగమంగా....”

ఒకరివెంట ఒకరు పాడుతుంటే ఒకరెనుక ఒకరు కండ్ల నుంచి ధారలు కదుతున్నాయి. కొంగుతో తుడుచుకుంటున్నారు. చుక్కలు రాలుతున్నాయి. తుడుస్తున్నారు. కొడుకులకేదో గుర్తొస్తున్నది. కోడండ్లకేదో యాది కొస్తున్నది. బిడ్డలకెక్కడో కదులుతున్నది. కరుగుతున్నారు, కన్నీరవుతున్నారు.

మల్లయ్య పాట ఆపాడు. రామవ్వ పాట ఆపింది. ఏడిపించటానికి పాటే ఊకుంచటానికి పాటే. రాగంతో పాటే మాటలు. మాటలతోటే ఓదార్పులు. “తిరిగిన జాగలున్నయి. కట్టిన ఇండ్లున్నయి. తొవ్విన బాయిలున్నవియ. అన్నదమ్ములు కూడుండుండ్రి. అక్కసెల్లెండ్లను పండుగలకు తోల్కచ్చుకోండ్రి. ఓ దేవుడా జాగ మీదె, ఇల్లు మీదె. ఓ దేవుడా కుటుంబం సల్లగుండని”

మల్లయ్య శారద కథా శైలిలో దీవించాడు. ఏ కథ చెప్పాలో అడిగాడు. ఏమేమి కథలొస్తాయో అడిగారు కొందరు. మైనావతి, చంద్రావతి, మాందాత, బాలనాగమ్మ, బల్మూరి కొండయ్య, కాటమరాజు, సర్వాయి పాపన్న, రేణికుంట రామిరెడ్డి, వరుసగా జాబితా చదివాడు. బల్మూరి కొండయ్య చెప్పుమన్నారొకరు. ఏది బాగుంటె అది జెప్పుమన్నారొకరు. ఏది బాగొస్తే అది చెప్పుమన్నారు కొందరు.

కొద్దిదూరం నుంచి పెట్రొమాక్సు లైటు వెలుతురు పాతుకూ కనబడింది. ‘సత్యారెడ్డి దుకాణం మూసి ఇంటికి పోతున్నడేమొ’ అన్నట్లుగానే ఆయన దగ్గరయ్యాడు. ముత్తరాశి పెద్ద మనిషి బాలయ్య వెళ్లి లైటు అడిగాడు. శారద మల్లయ్య కథకు లైటు ఇయ్యకపోతే ఎట్ల. తీసుకొమ్మని ఇచ్చాడు. ఆ లైటు వెలుగు ఆ యింటికి కొత్త కళ తెచ్చింది. ఆ కథకులకు కొత్త కళ తెచ్చింది. కందిళ్లు ఉండగానే తేలుకు కుర్చీ మీద లైటు పెట్టారు. కథ పేరు ఆలోచించమని చెప్పి వెనుక గోడ చటుకు వెళ్లాడు మల్లయ్య. దాచి ఉంచిన లొట్టిలోంచి ముంతెడు కల్లు నోట్లో కుమ్మరించాడు. రుమాలుతో తుడుచుకుంటూ వొచ్చాడు. ఒడి తిరిగి తెల్లటి మీసాలు, లైటు వెలుగులో కొత్తగా తెల్లగా మెరుస్తున్నాయి. లైటు వెలుగు రామవ్వ ముక్కు నగమీద పడి చమక్ చమక్ మెరుస్తున్నది.

బల్మూరి కొండయ్య కథ చెప్పటానికి నిర్ణయమైంది. కథ ఊపుతో మొదలు పెట్టాడు. మల్లయ్య రఘుపతిరాయడు, దమ్మవ్వలకు సంతానం లేదు. ఎర్రగొల్ల మల్లయ్య సాదుకం తెచ్చుకున్నారు. బిడ్డొచ్చిన వేళ, గొడ్డొచ్చిన వేళ, కొడుకొచ్చిన వేళ కోడలొచ్చిన వేళ అంటారు. దమ్మవ్వకు సంతానం కలిగింది. కొండయ్య పుట్టుకను వర్ణించి చెప్పుకపోతున్నాడు. జోరుమీద నడుస్తుంది కథ.

“కొండయ్య పుట్టెటప్పుడు కోతులు శిగాలూగె. ఏయ్ నక్కలు నాటకమాడె. ఏదులు ఎల్లబారె. సూర్యుడు చంద్రుడూ మబ్బుల్ల

దాక్కున్నారా...." వహ్వారె వహ్వా. అన్నది రామవ్వ. బుర్ర జోరుగా మోగుతుంది.

"ఆకాశమంతరించింది. భూతల్లి బొబ్బపెట్టింది. బాద్‌షా బల్మురి కొండయ్య" మల్లయ్య దబాయించి ఉద్వేగంతో పాడుతుంటే 'వహ్వారె వారెవహ్వా" మళ్ళా జోష్‌తో పలికింది రామవ్వ.

మానాల రాజ్యానికి కరువొచ్చింది. చెరువెండిపోయింది. కౌలు చేసే కాపులు రాజ్యం విడిచి వ్యవసాయం విడిచిపోవటానికి సిద్ధమవుతారు. రఘుపతిరావు సముదాయించి ధాన్యం కొలిచి వెళ్ళిపోకుండా ఆపుతాడు. గుమాస్తా ధాన్యం గరిసెలు అయిపోతున్నా యని చెబితే ఆపేసి మల్లయ్య సలహా అడుగుతాడు. పొలాల చెరువు మంచినీళ్లు తెచ్చి మాన్యాల చెరువు నింపాలని చెపతాడు. బొయ్యారం తవ్వుతారు. మధ్యలో కట్ట మైసమ్మ అడ్డు చెపుతుంది. మైసమ్మ నీళ్లు తీసుకోనివ్వనంటుంది.

జోరుగా నడిచి కథ ఆగింది. తవ్వుతున్న కాలువ ఆగింది. బీడీ ముట్టించాడు మల్లయ్య. రామవ్వ వెనుక గోడ దగ్గరికి వెళ్ళింది. లొట్టిలొంచి ముంతెడు కల్లు దబదబ నోట్లో పోసింది. ముక్కును గుండ్రంగా తింపుతూ వచ్చింది. "తవ్వుతున్న బొయ్యారానికి ఉ క్కుగుండు అడ్డమొచ్చింది. చిన్నేరు పోయినట్టు, పెద్దేరు పోయినట్టు జమ్మంటు పోయిన నీళ్ల బొయ్యారం ఆగింది. గడ్డపాలరకు దంగలేదు. కింద భూమి మీది భూమి – మద్దెల తొమ్మదూర్ల మనుషులు. కూల్తె కుప్పయతరూ రాయుడా – పానాలు పైకెత్తయా రాయుడా' అని మల్లయ్య పాట సాగుతున్నది. కాల్వ తవ్వుతున్న ఎర్రగొల్ల మల్లయ్య కట్ట ఎక్కినాడు. కట్టమీద మైసమ్మ ఎదురుపడుతుంది. మైసమ్మ కోపంతోని మల్లయను నిలదీస్తుంది.

మైసమ్మ రాగానే రామవ్వ రాగమందుకున్నది. కోపం మందు తున్నది. లోపలి ద్రవం మరింత మండిస్తున్నది. రామవ్వ ఊగిపోతుంది.


## మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**


"అబ్బ నా కొండ మీద కట్టకింద బొయ్యారం తవ్వుతుండు. ఒక్కనాడు వీనికి నా స్వరూపం చూపెట్టాలె అనుకున్నది మైసమ్మ. అడ్డం దిరిగింది.

ఏయ్... ఎవ్వడవు ఎవ్వడవురా... రాయుడా... ఏ వూరు నీ వూరురా... రాయుడా – దొంగవా దొరవా పేరు జెప్పి కట్టెక్కురా... రాయుడా... ఊరు జెప్పి కట్టెక్కురా..."

రామవ్వ గర్జిస్తుంటే మల్లయ్య పౌరుషంతో పాడుతున్నాడు. "నువ్వెవరు నువ్వెవ్వరే... రాయుడా నీ పేరు నువ చెప్పవే రాయుడా"

"నా పేరడిగెటోనివా.. బాలుడా నా ఊరు ఎంచెటోనివా బాలుడా. ఏయ్ – ఊర్లుంటె గడి మైసమ్మ పొలిమేరలుంటే పోలి మైసమ్మ, కట్టపొంటుంటె కట్ట మైసమ్మ, ఆరవెల్లి నాగసాన్నిరా పోరడా.. అడుగేస్తు కాలుతవురా.. ఏయ్..." మైసమ్మ పాత్రలో లీనమై పాడింది రామవ్వ.

రోమాలు నిక్కబొడుచుకొని చూస్తున్నారు ప్రేక్షకులు. ఏ క్షణం ఏమి జరుగుతుందో ఉడుకుతున్న వాతావరణం. గుడిసె, పందిరి, వాకిలి వేడెక్కాయి. పెట్రోమాక్సు లైటు వెలిగి వెలిగి వేడెక్కింది. మధ్య మధ్య భగ్గున మండుతున్నది. ఎవరో వచ్చి దించి గాలి కొట్టారు. కథ సాగుతున్నది. బతిలాడితే మైసమ్మ కరుణించింది. రఘుపతి రాయుని పొగరు అనిచింది. హారం కోరింది మైసమ్మ. నీరటికాండ్లను బతిలాడి నీళ్ళు తీసుకొచ్చాడు. కొండల్రాయుడి తండ్రిని మేనమామలు చంపేశారు. తరువాతి కథ మరుసటిరోజు కోసం ఎదురు చూసింది.

వచ్చినవాళ్లు బొంతలు దులుపుకుంటూ వీధిలోకి నడిచారు. కన్నీళ్లు తుడుచుకుంటూ ఇంటివాళ్లు లోపలికి నడిచారు. ఇరువై రూపాయలు తీసుకొని ఇద్దరు గాయకులు ఒకరెనుక ఒకరు చీకట్లోకి నడిచారు. పాట ఒక దిక్కు, వెలుగు ఒక దిక్కూ, ప్రేక్షకులు మరొక దిక్కూ చీలి పోయారు. కథను మరిచిపోనివాళ్లు ముచ్చట్లు పెట్టుకుంటూ పోతున్నారు.

'మల్లిగాడు బాగ చెప్పిండా? రామి బాగ చెప్పిందా? మగవాళ్లు మల్లయ్య బాగా చెప్పిండంటారు. ఆడవాళ్లు రామవ్వ బాగా చెపిపదంటారు. కథకులిద్దరు చిమ్మం చీకట్లో కట్ట ఎక్కుతంటే కష్టాలు ఎక్కుతున్నట్లే అనిపించింది. ముందు గుడిసె, వెనుక ఊరు, నడుమ చీకటి.

కథలో పాత్రలు తామే. జీవితంలో పాత్రలు తామే. కళలో జీవించి జీవించి బతుకు రాటు దేలింది. బతుకు ఈడ్చిఈడ్చి కళ రాటు దేలింది. కళకు కన్నీళ్లెన్నో సాహసాలన్ని. వాళ్లకు బతుకెంతో కళ అంత. బతుకే కళ. కళే బతుకు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12 (19) హైదరాబాద్ అక్టోబర్ : 2023

# రఘోజీ వారి పెట్టె

ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, ఫోన్ : 98493 07333



"సార్! సార్!! మన డిపార్ట్‌మెంటు ముందున్న మర్రిచెట్టు కింద పోటీ పరీక్షలకు చదువుకొంటున్న ఒక అబ్బాయి మిమ్మల్ని కలవాలంట. రమ్మని ఫోన్ చేసేదా సార్?" అడిగాడు నా దగ్గర పరిశోధన చేస్తున్న మళ్ళా పెంచల ప్రసాద్ నేను ఎస్వీయూ తెలుగు డిపార్ట్‌మెంట్‌లోని నా గదిలో ఉన్నప్పుడు.

"మనం ఆంజనేయస్వామికి పూలు తేవాలి కదా? రేపెప్పుడైనా కలుద్దాములే" అన్నాను పెంచల ప్రసాద్‌తో.

"సార్! ఈ అబ్బాయే సార్" అన్నాడు పెంచల ప్రసాద్. నా గదిలోకొచ్చిన అబ్బాయిని చూపిస్తూ.

"నాతో ఏమైనా పనుందా?" అడిగాను ఆ అబ్బాయిని చూసి.

"సార్! తిరుపతి జిల్లా భజరంగ్‌దళ్ అధ్యక్షుడు విష్ణు ప్రతీక్ మీతో మాట్లాడాలని చాలా రోజులుగా నన్ను అడుగుతున్నాడు. మీరు అనుమతిస్తే ఇప్పుడే ఐదు నిముషాల్లో ఇక్కడికి వచ్చేస్తాడు" అన్నాడు ఆ అబ్బాయి.

"మేము పూలు తేవడానికి వెళ్తున్నాము. అరగంట పట్టొచ్చు. వచ్చాక చెప్తువులే" అన్నాను. అప్పటికే సమయం రాత్రి ఏడున్నర గంటలైంది.

మేము దారిలో టీ తాగి, పూలు కొనుక్కొని, వస్తూ వస్తూ పెంచల ప్రసాద్‌కు షర్టు కొనడానికెళ్ళాం. బాగా ఆలస్యమైంది. ఎనిమిదిన్నర దాటింది. డిపార్ట్‌మెంటు కొచ్చేసరికి వరండాలో ఆ విష్ణు ప్రతీక్‌తో పాటు ఈ అబ్బాయి కూడా నిలబడుకొని వేచి ఉండడాన్ని చూసి కంగుతిన్నాం.

"సారీ! సారీ!! బాగా ఆలస్యం అయింది. గదిలోకెళ్ళి కూర్చొని మాట్లాడుకుందాం" అంటూ నా గది తాళాలు తీసి అందరం కూర్చొన్నాం.

"సార్! నా పేరు సుబ్బారెడ్డిగారి విష్ణు ప్రతీక్" అంటూ అతడ్ని గురించి వివరాలు చెప్పి పరిచయం చేసుకొన్నాడు.

"ఏమి కావాలి మీకు?" అడిగాను

"సార్! మీరు, మీ శిష్యులు రోజూ మర్రి చెట్టు కిందుండే ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తుంటారని చెట్ల కింద చదువుకొనే వాళ్ళ ద్వారా తెలిసింది. ఈ అబ్బాయితో నాకు బాగా పరిచయం ఉంది. అందుకని మీతో మాట్లాడించమని కోరాను. మీరున్నారని తెలిసి వచ్చేశాను. సార్! మేము భజరంగ్‌దళ్ తరపున ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని తిరుపతిలోని ఏదైనా మంచి కూడలిలో పెట్టాలని నిర్ణయించుకొన్నాం. మీరు తిరుపతికి సంబంధించిన అనేక పుస్తకాలను రాశారని కూడా మాకు తెలుసు. తిరుపతికి ఛత్రపతి శివాజీకి ఏమైనా సంబంధాలుంటే చెప్పగలరు. దానిని మేము విగ్రహ ప్రతిష్ఠాపనకు సహాయంగా ఉపయోగించుకొంటాం" అన్నాడు విష్ణు ప్రతీక్.

విష్ణు ప్రతీక్ ఆరు అడుగుల ఆజానుబాహుడు. బలిష్టమైన ఆంజనేయస్వామిలా ఉన్నాడు. పెద్ద గడ్డం పెంచుకొని ఉన్నాడు. నెత్తిన జుట్టు పెంచుకొని కొప్పు ముడి వేశాడు. తెల్లని శరీర ఛాయతో నిగనిగలాడుతున్నాడు. వయసు ఇరవై ఏడు సంవత్సరాలని చెప్పాడు. మాటలు వింటే ఉత్తర భారతదేశపు సాధువులా గౌరవంగా 'జీ' అని చివర చేర్చి మాట్లాడుతున్నాడు. పెద్ద బంగారం కడియం ధరించి ఉన్నాడు. పెండ్లి కాలేదన్నాడు. అతడ్ని చూస్తేనే ఏదో ఆధ్యాత్మిక భావన మనలో కలుగుతుంది. అంతటి వర్చస్సు, తేజస్సు అతనిలో ఉంది.

"ఛత్రపతి శివాజీ! హిందువులందరికీ ఆరాధ్యనీయుడు కదా? మొగలు చక్రవర్తి ఔరంగజేబుతో పోరాడి, బందీగా చిక్కి, ఢిల్లీ నుండి తప్పించుకొని వచ్చాడు. మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించినా, అది హిందూ సామ్రాజ్యంగానే వర్ధిల్లింది. ఛత్రపతి శివాజీ కొడుకు శంభోజీని ఔరంగజేబు బంధించి అతి దారుణంగా ముక్కలు ముక్కలుగా నరికి చంపాడు. అయినా శివాజీ హిందూ మత ఉద్ధరణకు తన సామ్రాజ్యాన్ని తంజావూరు, మధురల వరకు విస్తరించాడు. అక్కడున్న ఢిల్లీ సామంత రాజులను ఓడించి దక్షిణాన హిందువులకు అండగా నిలిచాడు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని పెట్టడానికి మీరు తిరుమల తిరుపతి దేవస్థానం వారిని సంప్రదిస్తే బాగుంటుందేమో?" అన్నాను.

"సార్! ఈ మధ్య తిరుపతికి ఒక కారు వస్తే టోల్‌గేటు దగ్గర ఆపేసి డాష్‌బోర్డు మీదున్న ఛత్రపతి శివాజీ బొమ్మను తొలగించేశారు. దానిని హిందూ సంఘాలన్నీ ఖండించాయి. అలాంటిది

దేవస్థానం వారు శివాజీ విగ్రహాన్ని గురించి పట్టించుకుంటారా?” అన్నాడు విష్ణు ప్రతీక్.

“ఛత్రపతి శివాజీకున్న గడ్డం చూసి సెక్యూరిటీ వాళ్ళు తెలిసో తెలియకో బొమ్మను తొలగించి ఉంటారేమో? అయినా దేవస్థానం వారు అలాంటిదేమీ జరగలేదని వివరణ ఇచ్చారు కదా? అయినా ఆ విషయాన్ని వివాదం చేయడం తగదు. కొన్ని కొన్ని అలా తెలియకుండా జరిగి పోతుంటాయి. వాటిని అంతగా పట్టించుకోవాల్సిన పనిలేదు. ముఖ్యంగా మీలాంటి వాళ్ళు కార్యం మీద కన్ను వేయాలి. తప్పకుండా హిందూ మతోద్ధారకుడైన ఛత్రపతి శివాజీ విగ్రహ స్థాపన పట్ల దేవస్థానం వారు సానుకూలంగా స్పందిస్తారని నేను ఆశిస్తున్నాను. ఆ మాటకొస్తే స్వామి వివేకానంద తిరుమలకు రాలేదు. అయినా హిందూ మతానికి చేసిన సేవను దృష్టిలో ఉంచుకొని ఆయన అద్భుతమైన విగ్రహాన్ని అలిపిరి ముందున్న మెడికల్ కళాశాల ట్రాఫిక్ ఐల్యాండ్‌లో ప్రతిష్ఠించి మంటపాన్ని నిర్మించి, చుట్టూ తోటను కూడా పెంచుతున్నారు కదా? ఛత్రపతి శివాజీ కూడా తిరుపతికి రాలేదు. అందుకెన్నో కారణాలున్నాయి. తంజావూరు యుద్ధాని కెళ్ళేటప్పుడు దారిలో తిరుపతి ప్రాంతం తగలక పోవడమే కారణం. యుద్ధం చేసి తంజావూరు, మధుర ప్రాంతాలను ఆక్రమించుకొని అక్కడ మరాఠా వీరులకు పాలన అప్పగించి మరాఠా సామ్రాజ్యంలో పరిస్థితులు చక్కబరచడానికి వెంటనే వెనక్కి వెళ్ళిపోయాడు. అందువల్ల కూడా స్వామి దర్శనం చేసుకోలేకపోయాడు. ఈ విషయాలను శివాజీ తన మంత్రి, పరివారం దగ్గర చెప్పుకొని బాధపడ్డాడట. కాబట్టి శివాజీ తిరుమలకు రానంత మాత్రాన ఆయన విగ్రహాన్ని తిరుపతిలో పెట్టకూడదన్నదేమీ లేదు. ఆయన హిందూ మత రక్షణకు పాటుపడినదానికోసమన్నా విగ్రహాన్ని దేవస్థానం వాళ్ళే పెట్టొచ్చు” అన్నాను.

“ఏది ఏమైనా ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని మా భజరంగ్‌దళ్ వాళ్ళే ప్రతిష్ఠించాలనుకొంటున్నాం...మరాఠాలకు స్వామికున్న అనుబంధాన్ని గూర్చి అయినా చెప్పండి” అన్నాడు విష్ణు ప్రతీక్.

“మా గురుతుల్యులు గోపీకృష్ణ సార్‌ను కూడా కలిసి మాట్లాడితే గానీ మీకు మరాఠాలను గూర్చి పూర్తి వివరాలను అందివ్వలేను” అన్నాను.

గోపీకృష్ణ సారుకు రాత్రి పదిగంటలైనా సరే ఫోన్ చేశాను. విషయాలడిగాను.

“శ్రీనివాసు! నేను కొండమీదున్నా. బ్రహ్మోత్సవాలు కదా? చూడడానికొచ్చా. రేపు తేరు మీద స్వామి ఊరేగుతాడు. ఆ మరుసటి రోజు చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు సమాప్తమవుతాయి. నీకు వీలుంటే బైక్ మీద కొండకొచ్చేయ్ తీరిగ్గా మాట్లాడుకుందాం” అన్నాడు గోపీకృష్ణ.

సరే! ఎలాగూ బ్రహ్మోత్సవాలలో ఒకరోజు కొండ మీదున్నట్లుంటుంది. అనుకొని నేను, పెంచల ప్రసాద్ నా బైక్‌లో, విష్ణు ప్రతీక్ మరో బైక్‌లో మరుసటి రోజు తెల్లవారుజామున ఐదు గంటలకు కొండకు బయలుదేరాము. గోపీకృష్ణ సారున్న చోటుకెళ్ళి కలిశాము. అప్పటికే ఆయన సిద్ధంగా ఉన్నారు. అందరం కలిసి శ్రీవారి తేరు దగ్గరకెళ్ళాము. బాగా తెల్లవారింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీనివాసుడు రథం పై కొలువుతీరాడు. రథాన్ని రంగురంగుల బట్టల్తో, బొమ్మలతో ఎంతో సుందరంగా అలంకరించారు. రథం పైన బంగారు గొడుగు సూర్యకిరణాలతో సమానంగా కాంతులీనుతోంది. రథానికి ముందు కొబ్బరి పీచుతో పేడిన మోకు ఇరువైపులా రహదారిలో బారులు తీరి ఉంది. రథం ముందు దేవస్థానం అధికారులు, రథం వెనుక వేద పఠనం చేసేవారు, అర్చకులున్నారు. గుమ్మడి కాయ దిష్టి దీసి, స్వామివారికి హారతులిచ్చాక శ్రీవారి రథం గంటలు గణగణ మోగుతూ తిరు వీధుల్లోకి అడుగు పెట్టింది. అందరం హారతులను కింది నుంచే కళ్ళకద్దుకొన్నాక రథం ముందు బయలుదేరాం. భక్తుల గోవిందనామ స్మరణలతో తిరువీధులు దద్దరిల్లిపోతున్నాయి. తేరు ఆగినప్పుడల్లా ఆ విరామ సమయాల్లో మా మాటలు కొనసాగాయి.

“ఫోన్లో నువ్వు మాట్లాడినదంతా అర్థమయింది. మరాఠాలకు తిరుమలకుండే అనుబంధాల గురించి తెలుసుకోవాలనుకుంటున్నారు అవునా?” అన్నాడు గోపీకృష్ణ.

“అవును సార్!” అన్నాను.

“నిజం చెప్పాలంటే ఛత్రపతి శివాజీ కాలం నుండే మరాఠాలు తిరుమలకు రావడం ఎక్కువైంది. స్వామి వారి దర్శనం చేసుకోవాలన్నా, హిందూమతానికి సేవ చేయాలన్నా ప్రాప్తముండాలి. స్వామివారు ఛత్రపతి శివాజీకి దర్శన భాగ్యం కల్పించకపోయినా, దానికన్నా ప్రధానమైన హిందూ ధర్మానికి సేవచేయడానికే శివాజీకి ప్రాప్తం కల్పించాడు. శివాజీ తరచూ తిరుమలేశుని గూర్చి తన పరివారం దగ్గర మాట్లాడేవాడు. స్వామి తగిన తీరిక లభింపజేసినప్పుడు తప్పకుండా దర్శించాలనుకొనేవాడు. భగవంతుని లీలలు విచిత్రమైనవి హిందూధర్మ సేవలో తీరిక లేకుండా చేసినందువల్లే దర్శనం చేసుకొనే తీరిక లభించలేకపోయింది. ఈ విషయం మరాఠా సామ్రాజ్యంలోని ప్రజలకు తెలిసి తమ ప్రభువు శివాజీ పక్షాన తామే తిరుమలకొచ్చి శ్రీవారిని దర్శించుకొని వెళ్ళేవారు” అన్నాడు గోపీకృష్ణ.

నిలిచిన తేరు మేరుపర్వతంలా ముందుకు కదిలింది. మళ్ళీ గోవిందా గోవిందలు ఆకాశాన్నంటాయి. కాసింత ముందుకొచ్చి మళ్ళీ గుడి మహాద్వారం ముందు ఆగింది. స్వామి, ఆయన దేవేరులకు కర్పూర నీరాజనాలను తేరు మీదున్న అర్చక స్వాములిచ్చారు. దేవుళ్ళకు అటు ఇటు నిలబడ్డ అర్చకులు జంతుకేశాలతో చేసిన గుండ్రని వెండి వింజామరలను వీస్తున్నారు.

"సార్! భక్తుల గోవిందలు తగ్గాయి. చెప్పండి సార్!" అన్నాడు పెంచల ప్రసాద్ ఎంతో ఆసక్తితో.

"శివాజీ పరమపదించాక కాలక్రమంలో మరాఠాలకు వేంకటేశ్వర స్వామి మీద భక్తి అధికమైంది. కొండ మీద బ్రహ్మోత్సవాలంటే కొండంతా మరాఠాలమయమైపోతుంది" అన్నాడు గోపీకృష్ణ.

"అది మీరెలా చెప్పగలరు సార్?" అన్నాడు విష్ణు ప్రతీక్.

"ఇక్కడే చూడండి...ఆ తలగుడ్డలు చుట్టుకున్న వారందరూ మరాఠాలే...తెల్లగుడ్డ టోపీలు ధరించిన వారంతా మరాఠీలే... కావాలంటే వెళ్ళి తెలుసుకోండి. నేను ఉద్యోగంలో చేరినప్పటి నుండి హెడ్మాస్టరుగా పదవీ విరమణ చేసేవరకు ఈ కొండ మీదనే నివసించాను. ఇవన్నీ నాకు కరతలామలకం" అన్నాడు గోపీకృష్ణ.

మళ్ళీ వాద్యాలు మోగాయి. గోవిందల ఘోష అధికమైంది. తేరు ముందుకు కదలి దక్షిణ మాడ మీధి మలుపు దగ్గర ఆగిపోయింది. మాట్లాడే వెసలు మళ్ళీ చిక్కింది.

"సార్! సార్!! చెప్పండి సార్!!!" అంటూ ఆత్రంగా అడిగాడు పెంచల ప్రసాద్.

"మరాఠీలు బ్రహ్మోత్సవాలకని కొండకొచ్చి ఇక్కడ నివసించే వారి ఇళ్ళను అద్దెకు తీసుకొని మొదటి రోజు ధ్వజారోహణం నుండి అన్ని సేవలు చూసి రథోత్సవాన్ని తిలకించి తొంభై శాతం మంది తిరిగి మహారాష్ట్రకు బయలుదేరేస్తారు" అన్నాడు గోపీకృష్ణ.

"చివరిరోజు శ్రీవారి పుష్కరిణిలో జరిగే చక్రస్నానం తిలకించరా?" అన్నాను.

రథం కదలడం, ఆగడం జరుగుతోంది మా మాటల్లాగే.

"ఎందుకో మరాఠాలకు బ్రహ్మోత్సవాలలో రథోత్సవం ఎంతో ప్రధానమైంది. రథోత్సవమయ్యాక కేవలం పదిశాతం మంది మాత్రమే చక్రస్నానానికి ఉంటారు. మిగతా వాళ్ళంతా రథోత్సవమయ్యాక అద్దెకు తీసుకొన్న ఇండ్లను ఖాళీ చేసి వెళ్ళిపోతారు. వీళ్ళు పదిరోజులైనా పాడవని రొట్టెలను మూటల్లో, తాము తెచ్చుకొన్న ట్రంకు పెట్టెల్లో ఉంచుకొని పూటపూటకు వాటినే తింటారు. కొంత మంది అద్దెకున్న ఇండ్లల్లో కూడా చేసుకొని తింటుంటారు. వీరు స్వామి వారికి బాగా కానుకలను, డబ్బులను సమర్పించు కొంటుంటారు. వీళ్ళు ఒక్కో వూరు నుంచి గుంపులు గుంపులుగా వస్తుంటారు. అందరూ తిరుమలలో కలుసుకొంటారు. బ్రహ్మోత్సవాలలో వాహన సేవలను చూసి తరిస్తూ, అందరూ కలిసిమెలిసి చాలా సంతోషంగా గడుపుతారు. ఇళ్ళూ వాకిలి వదలి పెట్టేసి ముసలి ముతక, పిల్లాజల్లతో పాటు కుటుంబాలకు కుటుంబాలే వస్తారు" అన్నాడు గోపీకృష్ణ.

"సార్! నేను మొన్న గరుడసేవకు వచ్చినప్పుడు గరుడ వాహనం ముందు జానపద కళాకారుల ప్రదర్శనతో పాటు ఇక్కడున్న తెల్లటోపీల



వాళ్ళు కూడా ప్రదర్శనల్లో పాల్గొన్నారే?" అడిగాడు పెంచల ప్రసాద్.

"అవును నాయనా! వాళ్ళల్లో కూడా కళాకారులున్నారు. వారి కోరిక మీద దేవస్థానం వారు వారి ప్రదర్శనలకు కూడా అనుమతించారు. ఈ మధ్య కాలంలో దేశంలోని కళాకారుల బృందాలకు వారి ప్రదర్శనలను బట్టి దేవస్థానం వారు అనుమతులిస్తున్నారు" అన్నాడు గోపీకృష్ణ.

"సార్! తిరుమల చరిత్రలో మరాఠా వీరుడు రఘోజీ భోంస్లే గురించి కూడా ఉంది. ఆయనను గురించి చెప్తారా?" అడిగాను.

"మాటల్లో పడి రఘోజీ భోంస్లేను మరచిపోయాను. ఆయన గొప్ప మరాఠా వీరుడు. క్రీ.శ.1740లో ఆయన సైన్యం తీసుకొని తిరుపతి ప్రాంతానికొచ్చాడు. తిరుపతికి సమీపంలోని కల్లూరు కనుమ దగ్గర విడిది చేశాడు. కల్లూరు కనుమ చాలా కీలకమైంది. ఉత్తరాది నుండి దక్షిణాదికి ఆహార పదార్థాలు, సైనిక ఆయుధాలు పోవాలన్నా ఈ కనుమ దారే ప్రధానం. ఆ సమయంలో ఆర్కాట్ నవాబు దోస్త్ అలీ, రఘోజీ భోంస్లేల మధ్య యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఆర్కాట్ నవాబు దోస్త్ అలీని, అతని కుమారుడిని ఓడించి చంపేశాడు. ఆ తర్వాత దోస్త్ అలీ మరో కొడుకు సఫ్దర్ అలీ వేలూరు కోటలో రఘోజీ భోంస్లేతో సంధి చేసుకొని కోటి రూపాయలు ఇచ్చి పంపాడు" అన్నాడు గోపీకృష్ణ.

"సార్! తిరుపతి సమీపానికి వచ్చిన రఘోజీ తిరుమలేశుని దర్శించాడా?" అని అడిగాడు విష్ణు ప్రతీక్.

"దర్శించడమేమిటి? అనేక కానుకలను కూడా శ్రీవారికి సమర్పించాడు. క్రీ.శ. 1740లో తిరుమలలోని వేంకటేశ్వరస్వామిని దర్శించి అనేక ఆభరణాలను తయారు చేయించి స్వామివారికి బహూకరించాడు. అందులో ముప్పైమూడు వేల రూపాయలతో పెద్ద పచ్చల హారాన్ని, ఇరవై ఎనిమిది వేల రూపాయలతో నీలం, పచ్చలు పొదిగిన ఒక వరుస ముత్యాలహారాన్ని, అలాగే మరో ఇరవై ఎనిమిది వేల రూపాయలతో ఒక పేటలో ఇరవై ముత్యాలుండే విధంగా పదిహేడు పేటలుండే ముత్యాల దండను చేయించి సమర్పించాడు. అలాగే శ్రీవారి కిరీటానికి పైన కొక్కిలాగా కనిపించడానికి ఎనిమిది వేల ఐదువందలతో ఒక కలికి తురాయిని, నలభై ఐదు వేల

రూపాయలతో ఒక్కో వరుసలో ఇరవై పెద్ద ముత్యాలుండే విధంగా ఒక వైపున కెంపులు, మరో వైపున వజ్రాలు పొదిగిన ఐదు పేటల ముత్యాల దండను చేయించి బహూకరించాడు. ఇక పోతే శ్రీవారి ప్రసాదాల్లో కూడా మార్పులు తెచ్చాడు. అంతకు ముందు తిరుప్పోనకం, సంధి తిరుప్పోనకం వంటి వండిన అన్నాల స్థానంలో ప్రసాదాలను ప్రవేశపెట్టాడు. అలా నిత్య ఆరాధనల కోసం ఒక శాశ్వత పద్ధతితో కైంకర్యాలను ఏర్పాటు చేశాడు. వేంకటేశ్వర స్వామికి తాను చేయించిన విలువైన ఆభరణాలను భద్రపరచడానికి ఒక అందమైన పెట్టెను తయారు చేయించాడు. దానినే రఘోజీ భోంస్లే వారి పెట్టె అని లేదా రఘోజీ వారి పెట్టె అని అంటారు. ఇప్పటికీ శ్రీవారి నగల భాండాగారంలో ఈ పెట్టె అందులోని ఆభరణాలు భద్రంగా ఉన్నాయి. అంతకు ముందు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాలు ఏమయ్యాయో? ఆ దేవుడికే ఎరుక" అన్నాడు గోపీకృష్ణ.

"సార్! ఇంకెవరైనా మరాఠా వీరులు ఏమైనా సమర్పించారా?" అడిగాడు పెంచల ప్రసాద్.

"1554, 1579, 1616 చెందిన శాసనాలలో మహారాజ్ శ్రీ సుధాజీ భానోజీ పంతులు అనే మరాఠా యోధుడు శ్రీవారికి కొన్ని రకాల ప్రసాదాలను ప్రారంభించాడని ఉంది. తర్వాత ఈ ప్రాంతానికి పాలకులుగా వచ్చిన గోల్కొండ రాజులు శ్రీ కృష్ణదేవరాయల అల్లుడైన అళియ రామరాయలు ఏర్పాటు చేసిన ప్రసాదాలను తొలగించి మరాఠా వాళ్ళు ప్రారంభించిన సుద్దాన్నాన్ని (వండిన అన్నాన్ని) కొనసాగించారు. ఇక 1740లో రాయబడిన ఉత్తరం ప్రకారం భాజీరావు, అతని అమ్మ, భార్య తిరుపతికొచ్చారు. వీళ్ళు వస్తున్నారని తెలిసి కృష్ణాజీ పంతులు ఆహ్వానం పలికాడు. మరాఠా వకీళ్ళకు ఏభై వేల రూపాయలివ్వమని ఆర్కాటు నవాబు ఇచ్చాడు. ఆ డబ్బుల్లో ఇరవై వేల రూపాయలను తిరుమల గుడికివ్వమని భాజీరావు చెప్పాడు. భాజీరావు అమ్మ, భార్య తిరుమల కొండకొచ్చినందువల్ల 18-5-1740లో ఆ డబ్బులను శ్రీవారికిచ్చారు. మంచోళ్ళలో చెడ్డోళ్ళున్నట్లు మరాఠా యోధులను తీసుకొని శాస్త్రి అనేవాడు 1759లో తిరుమల ఆలయాన్ని దోచుకోవడానికొచ్చాడు. బ్రిటీషు సేనలు అందుకు సహకరించిన పాలెగారు ఊరైన కరకంబాడికి నిప్పుపెట్టి వాళ్ళను ఓడించి పంపేశారు" అన్నాడు గోపీకృష్ణ.

"సార్! తేరు కదిలినప్పటి నుంచి చూస్తున్నాం. కొందరు మరాఠాలు తేరుకున్న మోకులోని టెంకాయ పీచును తీసుకుంటున్నారెందుకు సార్?" అడిగాడు విష్ణు ప్రతీక్.

"ఓ! అదా!! మరాఠాలకు రథోత్సవంలో పాల్గొనడానికి అదో కారణం కూడా ఉంది. వాళ్ళు స్వామి ఆశీస్సులతో పాటు తేరును లాగే మోకులోని టెంకాయ పీచును పెరుక్కొనిపోయి వాళ్ళు వ్యవసాయం చేసే మడకకున్న దారాలకు కట్టుకొంటారు. దాని వల్ల దున్నిన భూమిలో విస్తారంగా పంటలు పండుతాయని వాళ్ళ నమ్మకం. కొంతమంది చక్రస్నానం అయ్యాక కోనేట్లోని నీళ్ళను చెంబులతో తీసుకెళ్ళి వాళ్ళు సేద్యం చేసే బావుల్లో కూడా కలుపుతారు. ఆ బావి నీళ్ళు పవిత్రంగా మారి పంటలు బాగా చేతికొస్తాయని విశ్వసిస్తారు. అలా మరాఠాలకు తిరుమల వేంకటేశ్వర స్వామికి విడదీయరాని అనుబంధం ఉంది" అన్నాడు గోపీకృష్ణ.

శ్రీవారి రథం గమ్యస్థానం చేరుకొంది. భక్తులను దారిపొడవునా ఆశీర్వదించిన శ్రీవారు దేవేరులు అలసిపోయినట్లున్నారు. అర్చక స్వాములు శ్రీవారికి దిష్టి తగలకుండా చుట్టూ వస్త్రాలను కప్పి పట్టుకొని నైవేద్యం సమర్పించడం మొదలు పెట్టారు. ఆ సందర్భంగా వాయించిన ముగింపు వాద్యాలతో మేమూ స్వామివారి రథాన్ని లాగడం ముగించి గోపీకృష్ణ సారు దగ్గర సెలవు పుచ్చుకొని కొండ దిగాము.

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక

పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

# భారతీయీకరణ - 15

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత - భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

ఇక రెండవది, ముస్లింలలో సర్వధర్మ సమభావాన్ని విద్యా మాధ్యమం ద్వారా కలిగించడానికి ఒక క్రమ పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరగవలసి ఉన్నది. కేవలం ఇస్లాం మాత్రమే నిజమయిన మతమనీ, మహమ్మదు పైనా, ఖురాన్ పైనా విశ్వాసం గల వారు మాత్రమే స్వర్గానికి పోవడానికి అర్హులనీ, ఇతరులందరూ కాఫిర్ లనీ, మత విద్రోహులనీ- ఇట్లాంటి అభిప్రాయాలకు కారణం ఏమైనా సరే- ఈ ఊహలకు భారతదేశంలో స్థానం లేదు. ఇస్లాం కూడా, భారతదేశంలో సహజీవనం నెరపుతున్న అనేక ఉపాసనా మార్గాలలో ఒకటి. సిక్కు ఉపాసనా మార్గానికి, జైన ఉపాసనా మార్గానికి ఈ దేశంలో ఎంత సురక్షిత స్థానం ఉన్నదో, మహమ్మదీయ ఉపాసనా మార్గానికి కూడా అంత ఉన్నది. కానీ, భారతీయ సంస్కృతి కన్నా, జీవన విధానం కన్నా భిన్నంగా, విలక్షణంగా, భారత ముస్లింలకు వేరే సంస్కృతి, జీవన విధానం ఉన్నాయనడం శుద్ధ తప్పు. ఇతర భారతీయులకున్న సంస్కృతి, జీవన విధానమే భారత ముస్లింలది కూడ. సంస్కృతి అన్నది ఒక దేశానికి సంబంధించి ఉంటుంది కానీ, దేశంలోని ఏదో ఒక మతానికి, తెగకు సంబంధించి ఉండదు. యూరోపు మొత్తం క్రైస్తవ మతమే. కానీ, జర్మన్, ఫ్రాన్స్, ఇటాలియన్ క్రైస్తవులకు ప్రత్యేకంగా వారివారి దేశీయ సంస్కృతులున్నాయి. ఇరాన్, ఇండోనేషియా, టర్కీ, ఆఫ్ఘనిస్తాన్ దేశాల విషయంలోనూ ఇంతే. ఇవన్నీ ప్రధానంగా ముస్లిం దేశాలు. కానీ వీటన్నిటికీ ప్రత్యేకమయిన జాతీయ సంస్కృతులున్నయి. ఈ దేశాలలోని వారందరూ ఇస్లాంకు పూర్వపుస్థితినీ, వారసత్వాన్ని, పూర్వీకులనూ గురించి గర్విస్తుంటారు. అందువల్ల భారతీయ సంస్కృతికన్నా భిన్నంగా ముస్లిం సంస్కృతి ఒకటి ఉన్న ధోరణి నిరాధారమయినది.




పర్షియన్లు సోహరాబ్- రుస్తుంలనూ, ఇండోనేషియా వారు రామునీ, అర్జునునీ, భారత రామాయణాలనూ గౌరవించినట్లుగా, వాటిని చెప్పుకొని గర్వించినట్లుగా, భారత ముస్లింలు భారతీయ వారసత్వాన్నీ, జాతీయ వీరులయిన రాముడు, కృష్ణుడూ, భీముడు, అర్జునుడు మొదలయిన వారిని గూర్చి గర్వంగా చెప్పుకొని, వారిని గౌరవించగూడదనడానికి ఏ విధమయిన కారణమూ లేదు. ఈ అంశాన్ని భారత ముస్లింలలోని ఉదీయమాన యువతరం ఒకసారి గుర్తించినట్లయితే, తాము పెట్టుకునే పేర్లను గూర్చి కూడా పునరాలోచన కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి, భారత ముస్లింలు యూదుల, అరబ్బుల, తురుష్కుల పేర్లు పెట్టుకొనడానికే ఇష్టపడుతున్నారు. ఇది తర్కసమ్మతం కాదు. రామ్ గులామ్, సంత్ బక్షుసింగ్, ఇక్బాల్ చంద్ వంటి పేర్లు పెట్టుకున్న హిందువులు చాలామంది ఉన్నారు. అట్లాంటప్పుడు, ముస్లింలలో గూడా- ఇండోనేషియాలోవలె పూర్తిగా సంస్కృతం పేర్లు కాకున్నా- సూరజ్ దీన్, రామ్ దిత్తా వంటి పేర్ల నెందుకు పెట్టుకోగూడదు?

"షరియత్" పేరిట బహుభార్యత్వాన్ని, పరదా పద్ధతినీ, సమర్థించే ప్రయత్నం, ధర్మశాస్త్రాల పేరిట అస్పృశ్యతను సమర్థించడమంత తప్పు. ధర్మశాస్త్రాలాధారంగా అస్పృశ్యతను సమర్థించినారని వచ్చిన వార్తలను చూచి, జగద్గురు శంకరాచార్యుల వారిని నిరసించిన హిందువులు ఎంతోమంది ఉన్నారుగాని, బహుభార్యత్వాన్నీ, పరదాపద్ధతినీ వ్యతిరేకిస్తూ దేశం మొత్తం మీద ముందుకు వచ్చి బహిరంగంగా మాట్లాడిన ముస్లిం నాయకులు అతికష్టం మీద ఒకరో ఇద్దరో ఉంటే, అదే ఎక్కువ. కాలానుగుణంగాని ఈ పద్ధతులవల్ల, ఆచారాల వల్ల తీరని బాధననుభవించే ముస్లిం స్త్రీలు గూడా వీటిని వ్యతిరేకిస్తూ పెదవులు విప్పడానికి గూడా వీలులేనంత క్లిష్టదశలో ఉన్నారు. ముస్లింలూ, మౌలానాలూ, వారి కూటంలో చేరిన అలీఘరీయులూ, ఈ ఆత్మహనన సదృశమయిన వాతావరణాన్ని ముస్లిం సమాజంలో శాశ్వతంగా ఉండేట్లు చేస్తున్నారు. ముస్లిం ప్రజానీకంపై తమ అధికారాన్ని స్థిరం చేసుకునేందుకూ, తమ ఓట్లతో మెరిపించి మురిపించి అధికారంలో ఉన్న వారి నుండి స్వప్రయోజనాలు సాధించుకొనడానికీ, వారీపని చేస్తున్నారు. ఇది ముస్లిం మతతత్వానికీ, ఇస్లాంను ఆధునికీకరణ, జాతీయీకరణ పొందకుండా నిరోధించడానికీ ప్రధాన కారణమవుతున్నది.

ఈ విషయంలోనూ దేశంలోని రాజకీయ నాయకత్వమే మొదట ముందుకు రావాలసి ఉన్నది. ఇస్లాం యొక్క ఒంటెత్తుతనానికీ, అసహనానికీ మూలకారణాలను అర్థం చేసుకొని, వాటిని తొలగించడానికి తగిన చర్యలు తీసుకోనంత కాలం, భారతీయ సమైక్యతను గూర్చి ఉద్ఘోషించే నినాదాల వల్లా, మతతత్వ ప్రచారాల వల్లా ఏమాత్రం గూడా ప్రయోజనం లేదు. నిజంగా మతతత్వ రాహిత్యం గల మేధావులూ, ఆలోచకులూ నిజాన్ని నిజంగా చెప్పితే మతతత్వవాదులనీ, అభ్యుదయ నిరోధకులనీ ఎక్కడ నిందింపబడతామో అనే అసంగతమయిన భయాన్ని వదిలి ధైర్యంగా ముందుకు రావలసిన సమయమిది. ఆంతరికమయిన తమ భయాలనూ, ఆదుర్దాలనూ ప్రజల నుంచి దాచుకుంటూ, నిజాన్ని నిస్సంకోచంగా, నిస్సందిగ్ధంగా వారు చెప్పలేకపోయినట్లయితే అతి నికృష్టమయిన కమ్యూనిస్టు- మతత్వవాదుల కూటమికి విజయం కలగవచ్చు. తాము ఆరాధించే అన్నిరకాల విలువలూ, విశ్వాసాలూ, స్వేచ్ఛలూ, వట్టి గత గాథలుగా మారిపోవచ్చు.

అందువల్ల, సామాన్య ధోరణిలో మతతత్వాన్ని గూర్చి మాట్లాడడం వల్ల లాభం లేదు. 1947లో దేశ సమైక్యతను భగ్నంచేసి, ఈనాడు మళ్లీ దేశ శాంతిభద్రతలకూ, సమైక్యతకూ, భయంకరంగా పరిణమించింది కేవలం ముస్లింల మతతత్వం ఒక్కటి మాత్రమే. ఈ దేశంలో జరిగే అల్లర్లు కేవలం ముస్లిం- హిందువుల, ముస్లిం- క్రైస్తవుల, ముస్లిం- బౌద్ధుల, ముస్లిం- సిక్కుల మధ్య మాత్రమే. లేకపోతే ముస్లింలోని వివిధ ఆంతరిక వర్గాల మధ్య మాత్రమే. సిక్కులూ, క్రైస్తవులూ, పారసీలూ, ఆర్య సమాజీయులూ, బ్రహ్మ సమాజీయులూ, మొదలయిన ఎన్నో మతవర్గాలవారు ఈ దేశంలో ఉన్నారు. వీరి మధ్యలో గూడా విభేదాలున్నాయి. అప్పుడప్పుడు చిన్న చిన్నపోట్లాటలు గూడా జరుగుతూ ఉంటాయి. ఇట్లాంటివి స్వేచ్ఛ ఉన్న ప్రతిదేశంలోనూ సామాన్యంగా జరుగుతూనే ఉంటాయి. అయితే, ఈ పోట్లాటలు ఏనాడు ఆటవికంగా, అమాయకులపై హత్యాకాండకు దారితీయవు. అందువల్ల అల్పసంఖ్యాక వర్గాలకూ, అధిక సంఖ్యాక వర్గానికే ఈ మతతత్వం సంబంధించి ఉన్నదనడం తప్పు. ఈ అధిక సంఖ్యాకవర్గం, లేదా ఇతర అల్పసంఖ్యాక మత వర్గాలలోనూ ఉన్నదని చెప్పబడే మతతత్వం, కేవలం ముస్లిం మతతత్వానికి ప్రతిచర్యగా మాత్రమే బయట పడుతున్నది. భారతదేశ శరీరాన్ని లోలోపల తినివేస్తున్న ఈ మతతత్వం అనే దుష్టవ్రణాన్ని సమూలంగా కోసి వేసినట్లయితే, ఇక దేశ సమైక్యతకు ప్రమాదకర సమస్యగా మతతత్వానికి ఉనికే ఉండదు.

"క్రైస్తవం" కూడా ఏకాండ మతమే. అన్ని మతాలనూ, మార్గాలను సమానంగా గౌరవించవలెననే భారతీయ భావనకు అది గూడా సరిపోనిదేగదా" అన్న కొన్ని ఈ సందర్భాలలో వినిపిస్తూ ఉంటుంది. అది నిజమే. క్రైస్తవ మతం పేరిట మధ్యయుగాలలో అనేకమయిన క్రూర కృత్యాలు జరిగినయి. కానీ ఆనాటినుంచి క్రైస్తవ మతం హేతువాద కాలానికి అనుగుణంగా ఆధునికీకరణ, పునర్ వ్యాఖ్యానమూ పొందింది. ఇప్పటికీ అక్కడక్కడ కొన్ని క్రైస్తవ వర్గాలలో ఆనాటి మూర్ఖత్వ సూచనలు కొన్ని ఉండవచ్చు. కానీ ఈ స్థితి దాదాపుగా అన్ని మతాలలోని కొన్ని వర్గాలలో ఉండనే ఉన్నది. ఒక మతం, ఒక సామాజిక లేదా రాజకీయ వర్గం యొక్క మంచి చెడ్డలను నిర్ణయించేటప్పుడు వాటి వాటి సామాన్య సమగ్ర దృక్పథాన్ని ప్రవర్తన దృష్టిలో ఉంచుకొనవలసిందే తప్ప, వాటిలోని ఏ కొందరు దుర్నీతి పరులను మాత్రమే దృష్టిలో ఉంచుకొన గూడదు. ఇట్లాంటి దుర్నీతిపరులు కొందరు ప్రతి సమాజంలోనూ, వర్గంలోనూ ఉంటూనే ఉంటారు.

నిజానికి అల్పసంఖ్యాక మత వర్గాలను గూర్చి అతిగా మాట్లాడుతూ ఉండటం కేవలం ఆయా వర్గాలకే కాక దేశానికంతకూ ప్రమాదకరమే. ఎందుకంటే, ఆయా మతవర్గాలు, ఎల్లప్పుడూ అల్పసంఖ్యాక వర్గ భావనతోనే బాధపడిపోతూ ఉంటాయి. ఇది, ఆ వర్గాలు భారతీయీకరణ పొందడానికి ఆటంకమవుతుంది. మత దృష్ట్యా చూస్తే, ఈ దేశంలో అనేక మతవర్గాలు అల్పసంఖ్యాక వర్గాలే. ముస్లిం వర్గం మాత్రం క్రైస్తవ, జైన, సిక్కు, ఆర్యసమాజ, బ్రహ్మసమాజాదులకన్నా ఎంతో పెద్ద అధిక సంఖ్యాకవర్గం.

ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయంగా చూస్తే, అధిక సంఖ్యాక, అల్పసంఖ్యాక వర్గ తత్వమనేది వాటికి ఉన్న రాజకీయ బలం మీద, వాటికి లభించే సహకారం మీద, ఆధారపడి ఉంటుంది. ఎక్కడయినాసరే, కాంగ్రెసు, లేదా డి.ఎం.కె, లేదా జనసంఘం అధిక సంఖ్యాక పక్షంగా ఉన్నదంటే, ఆయా పక్షాలలోని సభ్యులందరూ –

ఏయేమత, వర్గాలకు సంబంధించినవారయినా సరే, అధిక సంఖ్యాకవర్గంగానే భావించబడుతారు. ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ లోని జనసంఘానికి చెందిన ముస్లిం సభ్యులంతా అధిక సంఖ్యాకవర్గం వారవుతారు. ఎందుకంటే, అక్కడ జనసంఘం అధిక సంఖ్యాకపక్షం.

భారతదేశంలో రాజకీయ పక్షాలు అనేకంగా ఉండడం, వాటిలో కొన్ని ప్రాంతీయ, మతతత్వ లక్షణాలు కలవి కావడం అధిక-అల్పసంఖ్యాకత్వ సమస్యను గూర్చి దేశంలో సరిఅయిన వైఖరి అభివృద్ధి కావడంలో ఆటంకమవుతున్నది. కొన్ని రాజకీయ పక్షాలు-ఉదాహరణకు ముస్లింలీగ్, ముస్లింలలో అల్పసంఖ్యాక వర్గ భావన ఉన్నంతకాలం మాత్రమే నిలవగలుగుతుంది. అందువల్ల కొన్నింటిని తొలగించడం, మరియు స్పష్టమైన దృక్పథవిభేదాన్ని అనుసరించి అన్నింటినీ రెండే రెండు వర్గాలుగా కుదించడం palarisation - ధ్రువద్వయీకరణం- వంటి విధానం ద్వారా రాజకీయ పక్షాల సంఖ్య పరిమితం చేయడం అవసరం. భారతదేశాన్ని గూర్చి ద్విజాతి, లేదా బహుజాతి సిద్ధాంతంలో నమ్మకం, లేదా విదేశీయ విధేయత, లేదా ప్రజాస్వామిక వ్యవస్థలో అవిశ్వాసం గల పక్షాలకు ఈ దేశంలో మనగలిగే హక్కు ఎంతమాత్రమూ లేదు. అన్ని కమ్యూనిస్టు పక్షాల లోనూ ప్రస్తుతం ఈ మూడంశాలూ సమానంగానే ఉన్నాయి. దేశ విభజనోద్యమం లో పదునుకత్తిగా వ్యవహరించిన ముస్లిం లీగుకు గూడా భారత దేశంలో స్థానం లేదు. కేరళలో కొద్ది సంవత్సరాల క్రితం ముస్లిం లీగ్ యొక్క పునర్నిర్మాణం, ముస్లిం మతతత్వ పునర్ జాగృతికి మొట్ట మొదటి సూచన. ఇప్పుడది తన కార్య రంగాన్ని మిగిలిన రాష్ట్రాలన్నింటికి కూడా వ్యాపింపజేయడానికి నిశ్చయించింది. కేరళ శాసనసభలోని తన బీరుధోని గట్టి సంఖ్యా బలంతో మిగిలిన వివిధ రాజకీయ పక్షాల పయి వత్తిడి వేయడంలో దానికి కలిగిన సాఫల్యం, మిగతా రాష్ట్రాలలోనూ కేంద్రంలోనూ అట్లాంటి పాత్ర నిర్వహించడానికే దాని ప్రోత్సహించుతున్నది. 1970 మే నెలలో పాల్ఘాట్ లో జరిగిన ముస్లింలీగ్ మహాసభలో ముస్లింలీగ్ నాయకులు "ముస్లిం అల్పసంఖ్యాక వర్గ ప్రయోజనాలను రక్షించడంకోసం" కేంద్రాన్ని వత్తిడి చేసేందుకు ముస్లింలీగ్ను పటిష్టం చేయడం తమ ధ్యేయమని ప్రకటించడంలో ఈ అంశం మరింత స్పష్టమవుతుంది. స్వాతంత్ర్యానికి ముందు, అంటే దేశవిభజనకు పూర్వపు రోజుల్లో ముస్లింలీగ్ పాత్రనూ, అది అనుసరించిన పద్ధతులనూ, ఏ మాత్రమైనా సరే, అర్థం చేసుకున్నవారు. ఈనాటి ముస్లింలీగ్ యొక్క ఈ పునరుజ్జీవనం భారత రాజకీయ రంగంలోనూ, మతతత్వ పరిస్థితుల లోనూ ఎట్లాంటి ఫలితాలను, పరిణామాలను తీసుకువస్తుందో బాగా అర్థం చేసుకోగలరు.

భారత జాతీయ జీవనానికి మతతత్వం అత్యంత ప్రమాదకరమైన ఊరికే గొంతెత్తి ప్రధానమంత్రితో సహా నిర్వహించే వారందరూ, ముస్లింలీగ్ ను సమర్థించి, దాన్ని పటిష్టం చేసేవారు కావడమే ప్రస్తుత భారతదేశ పరిస్థితులలో అత్యంత బాధాకరమయిన విడంబన, వారు ఒక వైపు ముస్లింలీగ్, మతతత్వం అనే కుందేలుతో పరిగెత్తుతూ, మరోవైపు జాతీయ భావన అనే వేట కుక్కలతో వేటాడుతున్నారు. ఈ మోసం, ద్వంద్వ వ్యవహారం నిర్దయగా బట్టబయలు చేయబడ వలసిందే.

ముస్లింల మనస్సులలో నుంచి ద్విజాతి సిద్ధాంతాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించివేసి, వారిని భారత జాతీయ జీవన ప్రవాహంలోకి తీసుకురావలేనంటే, ముస్లింలీగును- అది ఏ రూపంలో ఉన్నాసరే- సంపూర్ణంగా నిషేధించడం మొట్టమొదట చేయవలసినపని.

రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థను కూలద్రోసే విషయంలో తన పట్టుదలను కమ్యూనిస్టులు ఏనాడూ దాచుకోలేదు. భారత దేశాన్ని విచ్ఛిన్నం చేయడంలో వారు ముస్లింలీగుతో ఉమ్మడి ధ్యేయాన్ని పెట్టుకున్నారు. అట్లాంటి కమ్యూనిస్టు పక్షాలకు గూడా భారత రాజకీయరంగంలో ఏ మాత్రం స్థానంలేదు. భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, ఆ రాజ్యాంగాన్నే, ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే ధ్వంసం చేయ ప్రయత్నిస్తున్నవారికి, వాటిని ఉపయోగించుకోనీయడంలో ఏమాత్రం న్యాయమూ లేదు.

అయితే, ఆర్థిక సాంఘిక సమస్యలను గూర్చి తమలో తమకు ఎన్ని విభేదాలున్నా గూడా, జాతీయ ప్రజాస్వామిక పక్షాల వారి సవాలును ఎదుర్కొనడానికి ఏకమయినప్పుడు మాత్రమే, ఆ పక్షాలను, ఆ శక్తులను వ్యతిరేకించడానికిగానీ, అణిచి వేయడానికి గానీ వీలవుతుంది. జాతీయ వాదులందరూ చిన్నచిన్న పక్షాలుగా విడిపోయి ఉండడం. తన "మైనారిటీ" ప్రభుత్వాన్ని కొనసాగించుకునేందుకు శ్రీమతి ఇందిరాగాంధీ యొక్క అధికార కాంగ్రెసుపక్షం ఈ కమ్యూనిస్టుల మీద, మతతత్వశక్తుల మీద, ఆధారపడి ఉండడం ఈ విధమైన పక్షాలకూ, శక్తులకూ క్రొత్త జీవితాన్నీ, బలాన్ని ప్రసాదిస్తున్నది. అతి నిర్లక్ష్య పరులూ, హఠాత్తుగా పైకి వచ్చిన రాజకీయ నాయకులు ఏదోవిధంగా అధికారాన్ని సంపాదించడం కోసం దేశానికి లెక్కలేనన్ని నష్టాలనూ, అపకరణాలనూ కలిగించిన ఉదాహరణలు చరిత్ర నిండా బోలెడన్ని ఉన్నాయి. ఆ ఉదాహరణలు ఈనాడు మళ్లీ భారతదేశంలో పునరావృతమవుతున్నాయి. అందువల్ల ఎవరో ఒక వ్యక్తి యొక్క, లేదా ఒక ముఠా యొక్క తాత్కాలిక ప్రయోజనం కోసం దేశాన్ని ఇతరులకు అమ్మివేయడాన్ని వ్యతిరేకించడం అధికార కాంగ్రెసు పక్షంలో కూడా ఉన్న దేశభక్తి, జాతీయతగలవారి విధి.

జాతీయ, ప్రజాస్వామిక పక్షాలన్ని, శక్తులన్నీ ఏకమొత్తంగా, మత, కుల, ప్రాంతీయతత్వాల సవాళ్లను ఎదిరించడానికి ఒక ఉమ్మడి పద్ధతిని అంగీకరించకపోతే, భారత జాతీయతను పునరుత్తాపితం చేసే ఈ మహత్ కార్యానికి మిగిలిన అన్నింటికన్నా అధిక ప్రాధాన్యం ఇవ్వకపోతే, ఈ దేశానికి భవిష్యత్తు ఉండబోదు. ఇందుకోసమే రాజకీయరంగంలో జాతీయాకరణను అమలు చేయడం అత్యంత ఆవశ్యకమవుతున్నది.

భారతీయీకరణ ఈ కార్యక్రమంలో విద్యావిధానం నిర్వహించ వలసిన పాత్ర కూడా ఎంతో ఉన్నది. పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న కాలంలో పిల్లవాడు పెంపొందించుకునే విలువలూ, భావ సంపర్కాలు అతని తరువాతి జీవితంలో ఎంతో ప్రధానపాత్ర వహిస్తయి. అందువల్ల విద్యా పాఠ్య ప్రణాళికలో నైతిక, జాతీయ భావనానుకూల విషయాలు చేర్చబడటం అత్యంతావశ్యకం.

ఆంగ్లేయుల నుండి స్వతంత్ర భారతదేశానికి సంక్రమించిన విద్యా విధానంలోనూ, విషయంలోనూ, ఈ రెండంశాలు లోపించినయి. నిజానికి ఆంగ్లేయుల కాలంలోనూ, ప్రభుత్వేతర పాఠశాలలో కళాశాలలో విద్యా విషయకంగా ఈ అంశాలను గూర్చి అధికతర శ్రద్ధ వహించబడింది. మేము పాఠశాలలో, కళాశాలలో చదువుకునే కాలంలో సమకాలికులయిన లోకమాన్య తిలక్, లాలాలజపతిరాయ్, మహాపురుషులను గూర్చి తెలుసుకొనడంతోబాటు, రామాయణ మహాభారతాలను గూర్చి, హితోపదేశ, పంచ తంత్రాల గురించి, శివాజీ, రాణాప్రతాప్ లను గురించి ఎంతోకొంత మాలో చాలామంది చదువుకొన్నారు. అయితే, ఇప్పుడు లౌకిక విధానం పేర, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల పేరిట ఈ అంశాలన్నీ తొలగించబడినయి. జాతీయ సమైక్యత పేరుమీద రామాయణ మహాభారతాలకూ, వాటిలోని నాయకులకూ పాత్రలకూ సంబంధించిన ప్రస్తావనలన్నీ పాఠ్యపుస్తకాలలో నుంచి తొలగించడానికి ప్రయత్నాలు చేయబడు తున్నయి. జాతీయతా విషయానికి సంబంధించినంతవరకు గాంధీజీ నేతృత్వంలో జరిగిన స్వాతంత్రోద్యమ సంక్షిప్తచరిత్ర వరకే అది కుదింపబడింది. ఆ దృష్ట్యా మరే వ్యక్తులకయినా ప్రాధాన్యం ఇవ్వబడుతున్నదంటే, కేవలం ఇద్దరికి మాత్రమే. ఆ ఇద్దరు పండిత జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్.

దీని ఫలితంగా, విశ్వవిద్యాలయాల నుంచి బయటకి వచ్చిన పట్టభద్రులకు గూడా, శతాబ్దాలుగా విదేశీయ పాలన, మత బాధలు, సాంఘిక స్తబ్దత ఉన్న కాలంలో గూడా భారత దేశ గౌరవాన్ని తలెత్తి నిలిచే విధంగా చేసిన ఋషులు, మేధావులు, దేశభక్తులు, మహావీరులను గూర్చి దాదాపు ఏమీ తెలియకుండా పోయింది. రామాయణ మహాభారతాలులోని ఇతర గుణాల విషయం అట్లా ఉండగా, ఆ రెండు మహాగ్రంథాలూ భారతదేశంలో జాతీయ సమైక్యతకు ప్రధాన కారణాలు. కాశ్మీరం నుంచి కన్యాకుమారి దాకా, ఇంకా ఆ పైన గూడా ఆ గ్రంథాలూ, వాటిలో అభివర్ణితులయిన వ్యక్తులూ భారతీయుల మనస్సుల మీద చెరగని ముద్ర వేసినారు. రాముడూ కృష్ణుడు మొదలయినవారు ఈ దేశంలోని ఇతరులకు ఎంతగా పూర్వీకులో, ఎంతటి గౌరవనీయ మహాపురుషులలో ముస్లింలకూ, క్రైస్తవులకూ, గూడా అంతే రామకృష్ణాదులను "అవతారాలు" అని కాక, చారిత్రక వ్యక్తులుగా చిత్రించడం దేశపు నిజమైన జాతీయ సమైక్యతకు ఎంతో దోహదం చేస్తుంది. ఈ దేశం అనేక ప్రాంతాలుగా విభక్తమయి, ఆధునిక ప్రయాణ సాధనాలు ఏవీ లేని కాలంలో గూడా, దేశాన్ని యుగాల తరబడి ఏకంగా నిలబెట్టినారు. ఈనాడు అధికారంలో ఉన్నవారు జాతీయ సమైక్యతా సమస్యల విషయంలో సరి యయిన దృక్పథాన్ని పెంపొందిస్తే, వారు తప్పకుండా ఈనాడు గూడా ఇంకా ఎక్కువ శక్తివంతంగా ఆ పని నిర్వహించగలరు. (సశేషం)


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2023

గ్రంథాంతరంగం 27

# ఆంధ్ర కర్నాట సారస్వతములు – పరస్పర ప్రభావము

**శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు,** ఫోన్ : 9964082076

సంస్కృత భాషా సాహిత్యాల ప్రభావం ఇతర భారతీయ భాషల ప్రాచీన, అర్వాచీన సాహిత్యాలపై ప్రబలంగా, గాఢంగా ప్రసరించిన సంగతి అందరికీ తెలిసిందే. కాని భారతీయ భాషలపై ఇరుగు పొరుగు భాషల సాహిత్యాల ప్రభావం ఏ మాత్రం పడిందో పరిశీలించిన విమర్శా గ్రంథాలు చాలా తక్కువనే చెప్పాలి. **'పరిశోధన పరమేశ్వరులు'** గా ప్రసిద్ధి కెక్కిన నిడుదవోలు వేంకటరావు గారి **'ఆంధ్ర, కర్నాట సారస్వతములు– పరస్పర ప్రభావము'** ఈ దిశలో సాగిన విశిష్ట కృషికి చక్కని తార్కాణం.

**'ఆంధ్ర, కర్నాట సారస్వతములు– పరస్పర ప్రభావము'** ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి 1961 వ సంవత్సరపు పురస్కారాన్ని పొందిన అమూల్య రచన. ఈ గ్రంథం 1962 లో వెలుగుచూసింది.

పండితాగ్రణి నిడుదవోలు వేంకటరావు గారి 'ఆంధ్ర, కర్నాట సారస్వతములు– పరస్పర ప్రభావములు' విశిష్టతను పరిశీలిద్దాం. ఈ పుస్తకంలో 13 అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయమైన 'అవతారిక'లో గ్రంథకర్త రచనోద్దేశ్యాన్ని ఈ విధంగా వెలిబుచ్చారు – **"మన కిరుగు పొరుగున నత్యంత సన్నిహితముగా నున్న తమిళ, కర్ణాట దేశభాషా సారస్వత చరిత్రలు, వాని పరస్పర ప్రభావములు సంపూర్ణముగ పరిశీలించి తెలుగు సాహిత్య పరిణామముతో సరిపోల్చిన గాని తెలుగు భాషా సాహిత్య స్వరూపము సమగ్రముగా నెఱుగుట కనువు పడదు."** (పేజి: 2)

భారతీయ భాషా సాహిత్యాల ఆదాన ప్రదానాల్ని తులనాత్మకంగా పరిశీలిస్తే దేశంలో సహన, సామరస్యాలు పెంపొంది సుఖశాంతులు నెలకొంటాయని వేంకటరావుగారి అభిప్రాయం. గ్రంథకర్త ఈ అధ్యాయంలో తెలుగు కన్నడ భాషా ప్రాంతాలు ఇరుగు పొరుగున వున్నాయనీ, ద్రావిడ భాషా కుటుంబానికి చేరినవనీ, ఈ ప్రాంతాల్ని పాలించిన రాజులు కన్నడ, తెలుగు భాషల్ని పోషించారనీ, ఈ రెండు భాషల వాళ్లల్లో సంబంధ బాంధవ్యాలు దృఢంగా ఏర్పడ్డాయని నిడుదవోలువారి భావన.

రెండవ అధ్యాయం **'లిపి'** లో కన్నడ, తెలుగు లిపులు పంప, నన్నయల కాలంలో ఒకటిగా నుండి వేంగి చాళుక్యలిపిగా పిలువబడ్డాయి. క్రీ.శ 12వ శతాబ్దంలో ఈ లిపులు వేరయ్యాయి ఈ శతాబ్దంలోనే కేతన 'ఆంధ్రభాషాభూషణము' రచనతో తెలుగు లిపి ప్రత్యేకంగా రూపు తిద్దుకొనిందని వేంకటరావుగారి అభిమతం.

మూడవ అధ్యాయం **'భాష – వ్యాకరణము.'** తెలుగు కన్నడ భాషలు ద్రావిడ భాషాకుటుంబానికి చెందినవైనా సంస్కృత వ్యాకరణ సంప్రదాయాన్నే అనుసరించాయి. గ్రంథకర్త ఈ రెండు భాషల వ్యాకరణాల్లోని కొన్ని సామ్యవైషమ్యాల్ని ఉదాహరించి చూపారు. కేతన రాసిన 'ఆంధ్రభాషాభూషణము' పై కన్నడ కవి, వ్యాకరణ వేత్త నాగవర్మ 'కర్ణాట భాషాభూషణ' అనే సంస్కృత కృతి ప్రభావం ఎక్కువగా వుందని నిడుదవోలు వారంటారు. విభక్తి, క్రియ, కారక, సమాసాలు మొదలైన పారిభాషిక పదాలు రెండు భాషల్లోనూ సమానంగా వున్నాయి. సంధి ప్రక్రియ కూడా చాలా వరకు ఒకటిగానే వుంది. కన్నడంలో తెలుగులో వున్నట్లు కళా ద్రుత ప్రకృతి విభాగం లేదు. కన్నడంలో తెలుగులో వుండే అరసున్న ప్రయోగం లేదు. కేతన 'ఆంధ్రభాషాభూషణము' వ్యాకరణ గ్రంథాన్ని తెలుగులో రాయడం తెలుగు భాషా చరిత్రలో విశిష్టమైన విషయమని వేంకటరావుగారు ప్రశంసించారు.



ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

గ్రంథకర్త **'ఛందస్సు'** అధ్యాయంలో తెలుగు, కన్నడ భాషలు చాలా వరకు సంస్కృత ఛందస్సంప్రదాయాన్నే అనుసరించినా, కొన్ని భేదాలున్నాయని పేర్కొన్నారు. కన్నడ ఛందస్సులో యతి లేక పోవడం ఒక విశేష మన్నారు. శార్దూలం, స్రగ్ధర, మహాస్రగ్ధర, మాలిని మొదలైన వృత్తాల పేర్లు రెండు భాషల్లోనూ సమానమే. కాని మత్తకోకిల, మానిని మొదలైనవి మాత్రం క్రమంగా మల్లి కామాల, వనమంజరి పేర్లతో పిలువబడ్డాయి. మత్తేభం, చంపకమాల మొదలైన వృత్తాల్ని కన్నడ కవులు ప్రాసనియమం పాటించి రాస్తే, తెలుగు కవులైన నన్నయ, తిక్కనాదులు ప్రాసతో పాటు యతిని వాడి రాశారు. కన్నడ కవులు పిరియక్కర లేక మహాక్కర మాత్రమే వాడగా ప్రాచీన తెలుగు కవులైన నన్నయ, ఎఱ్ఱన, మడికి సింగనలు మాత్రమే అక్కరల్లోని మధ్యాక్కరను మాత్రమే వాడారు. ఆధునిక కవి పండితులైన విశ్వనాథ, కోవెల సంపత్కుమార, స్ఫూర్తిశ్రీ, రావూరి దొరస్వామి శర్మలు వివిధ మధ్యాక్కరలను ప్రయోగించారు. కన్నడంలో ఆరు రకాల షట్పద ఛందములుండి, భామినీ షట్పదికి ప్రాధాన్యం లభించిందన్నారు. కాని తెలుగులో ఈ ఛందస్సుకు స్థానం లభించలేదు. అయితే కన్నడంలోని భామినీ షట్పది ఛందో లక్షణం

తెలుగు దేశిగేయమైన 'గుమ్మడేడే గోపిదేవీ' లో కనిపిస్తుందని నిడుదవోలు చెప్పారు. (పేజి: 30) పైగా గురజాడ రాసిన ముత్యాలసరాల ఛందస్సు, రాయప్రోలు 'తమ్ముడా!' కవితలోని ఛందస్సు కన్నడ షట్పదితో పోలుతుందన్నారు. సువ్వి సువ్వి రామచంద్ర కన్నడంలోని భోగషట్పదితో చాల వరకు సరిపోలు తుందని వేంకటరావు గారి అభిమతం (పేజి: 31-32) తెలుగులో ఆరు రకాల రగడలుండగా, కన్నడంలో మూడు రకాల రగడలు (రగళెగళు) వున్నాయి. పాల్కురికి సోమన ఈ రగడలను ఉదాహరణ కావ్యాల్లో ప్రవేశపెట్టాడు ఇతను బసవ పురాణము, పండితారాధ్య చరిత్రల్ని ద్విపదలో రచిస్తే, కన్నడ కవులు తర్వాతి కాలంలో భామినీషట్పది వృత్తాల్లో పదకావ్యాలుగా రాశారని నిడుదవోలు వారభిప్రాయపడ్డారు. వేంకటరావు గారు పాలకురికి సోమన **"కన్నడ వాఙ్మయమున చంపూపద్ధతి తప్పించి, పదకావ్య రచనకు పథకము చూపిన మహాకవి"** (పేజి: 35) అని చెప్పడం సమంజసమే. పాలకురికి సోమన కవితా వైశిష్ట్యాన్ని నిడుదవోలు వారు ఈ విధంగా గణించారు-**"ద్విపద ఛ్ఛందస్సుతో కావ్యమంతయు చెప్పుపద్ధతిని తెలుగులో మొదట ప్రవేశపెట్టి దానికి పద్యకావ్యములతో సమానమగు ప్రతిపత్తి కల్పించినవాడు పాల్కురికి సోమనాథుడు."** (పేజి: పైదే) ద్విపద కవిత్వానికి కన్నడంలో స్థానం లేదనీ కాని తెలుగు ద్విపద కవితా వాఙ్మయం విస్తరిల్లిందని పరిశోధన పరమేశ్వరులు చెప్పారు (పేజి: 36)

క్రీ.శ. 1990 ప్రాంతంలో నాగవర్మ 'ఛందోంబుధి' అనే లక్షణ గ్రంథాన్ని కన్నడంలో రచించాడని మల్లియ రేచన 'కవిజనాశ్రయము' అనే తెలుగు లక్షణ గ్రంథాన్ని క్రీ.శ. 1100-1350 మధ్య ప్రాంతంలో రాశాడనీ, మల్లియ రేచన కృతి నాగవర్మ కన్నడ కృతికి ఎంతో ఋణపడి వున్నదనీ వేంకటరావు గారు సోదాహరణంగా వివరించారు.

**'సాహిత్య సంప్రదాయములు'** అనే ఐదవ అధ్యాయంలో గ్రంథకర్త అష్టాదశ వర్ణనలు, కృత్యాది, ఆశ్వాసాంత గద్యములు, చంపూ కావ్యరచన, అచ్చ తెలుగు కావ్యరచన మొదలైనవి తెలుగులో వెలువడేందుకు కన్నడం ఎంతో ప్రేరకమయిందని నిడుదవోలు వారన్నారు. కన్నడంలో శ్లేష, ద్వ్యర్థి, త్ర్యర్థికావ్యాలు రచింపబడ లేదనీ, కాని తెలుగులో ఇది ఒక సంప్రదాయంగా నెలకొనిందని గ్రంథకర్త తెలిపారు. కన్నడంలో దండక రచనలు లేకపోగా తెలుగులో ఇవి చెప్పుకో తగ్గ సంఖ్యలో వున్నాయన్నారు రచయిత. కన్నడంలో శివపరమైన వచన సాహిత్యం ఎక్కువగా రచింపబడితే, తెలుగులో విష్ణుపరంగా వచన సాహిత్యం వెలువడిందన్నారు. తెలుగులో సంకలన గ్రంథాల కూర్పుకు, కన్నడం దారి చూపిందని నిడుదవోలు వారు భావించారు.

ఆరవ అధ్యాయమైన **'తెలుగు వాఙ్మయము- నన్నయ పూర్వయుగము'** చాలా విలువైనది నన్నయకు ముందున్న తెలుగు కవులపై వెలుగు చల్లిన అమూల్య రచన ఈ అధ్యాయం కన్నడ సాహిత్యంలో 'ఆదికవి' గా ప్రఖ్యాతుడైన పంపనే పద్మకవి అని కన్నడ సాహిత్య పరిశోధకులు నిర్ణయించారు. వేటూరి ప్రభాకరశాస్త్రి గారి 'ప్రబంధ రత్నావళి' లో పద్మకవి తెలుగులో రాసిన 'జినేంద్ర పురాణము' లోని దని 'హరినిలయంబును హరినిలయంబును' అనే పద్యాన్ని ఉటంకించారు. కాని ఈ పద్యశైలి 'ప్రాచీన తర రచనముగా దోపకున్నది' అని ప్రభాకరశాస్త్రి గారి భావన. కాని నన్నెచోడుని 'కుమార సంభవము'లో ఇట్టి చిత్రబంధ రచనలున్నాయని, నృపతుంగుని 'కవిరాజమార్గము' లో ఇట్టి కన్నడ రచన లుండటం వల్ల నన్నయ యుగానికి ముందు పుట్టిన పంపని జినేంద్ర పురాణము. తెలుగు జైన కావ్యాల్లో ఒకటి అని పరిశోధన పరమేశ్వరుల అభిప్రాయం. (పేజి: 63) పంపకవి తెలుగు 'జినేంద్ర పురాణము' పూర్తిగా కాకున్నా, కొంత భాగమైనా కాని లభించినప్పుడే గట్టి నిర్ణయానికి రావచ్చును. క్రీ.శ. 1000 నాటి గజాంకుశదని కీర్తి గడించిన నారాయణుడు రాసిన తెలుగు, కన్నడ కావ్యాలు కాని, పద్యాలు కాని ఇంత వరకు లభించలేదు. ఈ విషయాన్ని తెలుపుతూ నిడుదవోలు వేంకటరావుగారు **"తెలుగున నీతడు కవి యనియు, నన్నయ కంటె నూరేండ్లు ముందున్న వాడనియు మనము నిశ్చయముగ జెప్పవచ్చును. ఈ గజాంకుని చరిత్రను బట్టి నన్నయ తెలుగున నాదికవి కాడనుట నిర్వివాదము,"** (పేజి: 67) గజాంకుని కావ్యమేదీ చిక్కకున్నా ఫరవాలేదు కాని కనీసం అతనిదిగా చెప్పబడే పద్యం ఒక్కటి కూడా దొరకకున్నా నన్నయను 'ఆదికవి' పీఠం నుంచి తొలగించాలని ఖరాఖండిగా చెప్పిన నిడుదవోలు వారి సాహసం గొప్పది. కన్నడ సాహిత్య ప్రపంచంలో రత్న త్రయంగా పేర్కొన బడుతున్న పంప, పొన్న, రన్న కవుల్లో ఒకడైన పొన్నకు సర్వదేవుడనే మరొక పేరుంది ఇతను నేటి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు వాడు. ఇతను క్రీ.శ. 939-968 కాలా వధిలో రాష్ట్రకూట రాజు కృష్ణునిచే 'ఉభయకవి చక్రవర్తి' బిరుదు పొందినవాడు. ఈ సర్వదేవుడు తెలుగులో 'ఆదిపురాణము' 'విరాటము' (భారతం లోని విరాట పర్వము) అనే గ్రంథాల్ని రచించాడని విద్వాంసుల అభిప్రాయం కాని ఈ కావ్యాలు ప్రాచీన తరాలుగా కనపడవని 'ప్రబంధ రత్నావళి' సంపాదకుల అభిప్రాయం. పంపకవి కన్నడ కావ్యం 'ఆదిపురాణము' సర్వదేవుని 'ఆదిపురాణము' తెలుగు కావ్యంలోని పదసామ్యం, భావసామ్యం కనపడుతున్నాయని తెలుగువాడైన పొన్నకవే ఈ కావ్యాన్ని రచించాడని పండితుల అభిప్రాయమని నిడుదవోలు వారి నిశ్చితాభిప్రాయం.

ఏడవ అధ్యాయమైన **'నన్నయ యుగము'**లో నిడుదవోలు వారు నన్నయ కన్నడ ఆదికవి పంపడు రచించిన భారతం నుంచి పద్యగద్య పంక్తుల్ని అనుసరించాడనీ, పైగా అతను రాసినన్ని ఛందాల్నే దాదాపుగా వాడాడనీ చెప్పారు ఉదాహరణాలు కూడా చూపించారు.

నన్నయ ఒకే పద్యంలో ఒక పదాన్ని పంపనిలా వాడిన ప్రయోగాల్ని నిడుదవోలు ఉదహరించి, ఈ విధానాన్ని 'పునఃపునరా వృత్తీకరణము' అనవచ్చుంటారు. (పేజి: 80) నన్నయభట్టు సహాధ్యాయుడైన నారాయణభట్టు సమాచారం కూడా కొంత సంగ్రహించారు గ్రంథకర్త.

ఎనిమిదవ అధ్యాయమైన **'శివకవి యుగము'** తెలుగు – కన్నడ సాహిత్యాల్ని దగ్గరకు తెచ్చే బలమైన కొలికి. నిడుదవోలు వారు ఈ అధ్యాయంలో మల్లికార్జున పండితారాధ్యుడు, నన్నెచోడుడు, పాలుకుర్కి సోమనల, కన్నడ వీరశైవ కవుల కవిత్వానికి గల పోలికల, భేదాల గురించి పరామర్శ కనపడుతుంది. మల్లికార్జున పండితారాధ్యుడు కన్నడంలో "శివశరణ సహస్రనామ" అనే కన్నడ కృతిని రచించినట్లు తెలుస్తున్నది. కన్నడంలోనే ఇతని 'శివతత్త్వసార' మనే మరొక్క రచన కూడా లభించింది. ఇతనిదే తెలుగులో 'శివతత్త్వసారము' అనే 489 కంద పద్యాల శివభక్తి ప్రతిపాదక కృతి దొరికింది. ఈ పండితారాధ్యుని కృతిలోని కందపద్యాల్లో కొన్నింటిని పాల్కురికి సోమన తన పండితారాధ్య చరిత్రలో ద్విపదలుగా కూర్చినాడు మల్లికార్జున పండితారాధ్యుని కన్నడ, తెలుగు 'శివతత్త్వసారము' లలోని సారూప్య కందాల్ని వేంకటరావు గారు ఉటంకించారు. (పేజి: 87) ఈ కవి తెలుగులో రాసిన 'శ్రీగిరి మల్లికార్జున శతకము'లోని లభించిన ఒక పద్యాన్ని మాత్రమే వేంకటరావుగారు ఉదాహరించారు. (పేజి: 88)

'కవిరాజ శిఖామణి' నన్నెచోడుడు రాసిన 'కుమార సంభవము' లోని భాషపై కన్నడ భాషారీతుల ప్రభావముందని సోదాహరణంగా వివరించి చెప్పారు నిడుదవోలువారు. (పేజి: 91–106) నన్నెచోడుడు తన కావ్యం 'కుమార సంభవము'లో మన్మథస్తుతి చే తెలుగు కావ్యజగత్తులో ఈ సంప్రదాయానికి మార్గదర్శి అయ్యాడు. కన్నడ ఆదికవి పంపని భారతం విక్రమార్జునవిజయ'లో మన్మథస్తుతి కనిపిస్తుంది. నిడుదవోలు వారు నన్నెచోడుని భాషపై కన్నడ భాషా ప్రభావాన్ని స్థాలీపులాక న్యాయంగా చవి చూపారు.

పాల్కురికి సోమన అత్యమూల్య కృతులైన 'బసవపురాణము', 'పండితారాధ్య చరిత్ర' లకు కన్నడ సాహిత్యంలోనూ పేరు పెంపు లున్నాయి. భీమకవి తెలుగు బసవపురాణాన్ని కన్నడంలోకి క్రీ.శ. 1369 లో అనువదించారు. తెలుగు బసవపురాణం ద్విపదలో వుంటే కన్నడానువాదం భామినీషట్పది వృత్తాల్లో వుంది. తెలుగు బసవపురాణ పాఠభేద నిర్ణయానికి ఈ కన్నడానువాదకృతి దోహద మవుతుందన్న నిడుదవోలు వారి మాట గమనించాల్సిన సంగతి. (పేజి: 108)

సోమన 'పండితారాధ్యచరిత్ర' ను 15వ శతాబ్దం నాటి కన్నడ కవి నీలకంఠాచార్యుడు కన్నడీకరించాడు. ఎంతోమంది కన్నడ శివకవులకు ఆరాధ్యులైన వాడు మన పాలకురికి సోమన.

తొమ్మిదవ అధ్యాయమైన **'తిక్కన యుగము'** నాలుగు పేజీల లోపే ముగిసింది. తిక్కన పంపకవిని 'ఒక పట్టున అనుసరించిన' ఒక పద్యాన్ని వేంకటరావు గారు ఉటంకించారు. (పేజి: 114)




శ్రీ:

ఆంధ్ర కర్ణాట సారస్వతములు- పరస్పర ప్రభావము

నిడుదవోలు వేంకటరావు, ఎమ్. ఏ.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి 1961 సంవత్సరపుబహుమతి నందినది.

Principal,
Andhra Oriental College,
Nallakunta Hyderabad.

81, కాళ్ళేశ్వర్ కోయిల్ వీధి,
మైలాపూరు, మదరాసు-4.

రావిపాటి త్రిపురాంతకుడి 'మదన విజయము' కన్నడ 'మదన తిలక' ముచే ప్రభావితమైనదని నిడుదవోలు వారి భావన.

పదవ అధ్యాయమైన **'శ్రీనాథ యుగము'**లో నిడుదవోలు వారు శ్రీనాథునికి ప్రధాన స్థానాన్ని ఇచ్చినా, ప్రతిపాదించిన విషయాలు ఏవీ లేవనే 'చెప్పాలి. 'నా కవిత్వంబు నిజము కర్ణాట భాష' అన్న శ్రీనాథుని సూక్తికి కందుకూరి, వేదం- ప్రభృతులు చేసిన వ్యాఖ్యానము కాని పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయం కాని సమంజసంగా తోచవు. **"శబ్దార్థములకు సమ ప్రాధాన్యమును సాంస్కృత దేశీయములకు సమప్రాధాన్యమును ఇచ్చి తన పేరి మీద నొక శైలిని సృష్టించిన కవి శ్రీనాథుడు. 'నా కవిత్వము శుద్ధ సాంస్కృతికమును గాదు- శుద్ధ దేశీయమును కాదు. ఉభయభాషా ప్రాధాన్యము కల' దని ఆయన పద్యములకు తాత్పర్యము"** (పల్నాటి వీర చరిత్ర పీఠిక. పేజి: 54. 1961) దీన్ని ఉటంకించిన నిడుదవోలుగారు (పేజి: 121-122) పింగళి లక్ష్మీకాంతం గారి తీర్పును సమర్థించనూ లేదు, ఖండింపనూ లేదు. లక్ష్మీకాంతం గారు చెప్పినట్లు శుద్ధ సంస్కృత పదాలు, శుద్ధ, దేశీయ పదాల ప్రాధాన్యం కల శైలిని 'కర్ణాటభాష' గా పరిగణించారంటే శ్రీకృష్ణ దేవరాయల 'ఆముక్తమాల్యద' ను ఇతర కవుల పెక్కు కావ్యాల్ని ఉదాహరణలుగా భావించవలసి వుంటుంది. ఈ అభిప్రాయం అంగీకరించలేం,

కన్నడ కవి కుమార వ్యాసుడు తిక్కన భారతం వల్ల ప్రభావితు డైనాడన్న మాట, ఉదాహరణ ద్వారా నిరూపించిన నిడుదవోలు లోతైన పరిశీలనకు దారి తీస్తుంది.

11 వ అధ్యాయం **'శ్రీకృష్ణ దేవరాయ యుగము'** పరిశోధన పరమేశ్వరులు ఈ యుగ కాలావధి (క్రీ. శ. 1500-1700) ని ఇంతగా విస్తరింప చేయడం వింతగా కనపడుతుంది. అల్లసాని పెద్దన చాటువు **'నిరుపహతి స్థలంబు రమణీ ప్రియ దూతికునికి కన్నడకవి మల్లికార్జునుని 'సూక్తిసుధార్ణవము' లోని 'నిరుపహతిస్థలం, మృదుత రాసన మొళ్ళుణి సింపు.....'** మూలమనీ, భావం చివరి పాదంలో కొంత మారినా ఎత్తుగడ, పదబంధం, వృత్తం పరిశీలించినప్పుడు సామ్యం నిర్వివాదమని వేంకటరావుగారి అభిమతం (పేజి: 123) కన్నడ కవితా సంకలనం 'సూక్తి సుధార్ణవము' క్రీ.శ. 1240 ప్రాంతంలో కూర్చబడింది. అల్లసాని వారికి తన కంటె పూర్వ కన్నడ కావ్యాల పరిచయం వుందని దీని వల్ల మనం గ్రహించవచ్చు.

క్రీ.శ. 1180 ప్రాంతం వాడైన రుద్రభట్టు కన్నడంలో 'జగన్నాథ విజయ' మనే శ్రీకృష్ణుని చరితాన్ని కావ్యంగా మలిచాడు. నంది తిమ్మన శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన ప్రథమాంధ్ర కవిగా తెలుగు- కన్నడ సాహిత్యాల మధ్య స్నేహ సామరస్యాలు నెలకొల్పేందుకై తన కంటే సుమారు 340 ఏళ్ల ముందటి కన్నడ కవి రుద్రభట్టు 'జగన్నాథ విజయ' కావ్యంలోని పద్యాల్ని "....ఆమూలాగ్రముగ ననువదించి మెఱుగు బెట్టిన పట్టులు గలవు" (పేజి: 125-126) అని నిడుదవోలు వేంకటరావుగారు నంది తిమ్మన రచించిన మనోహరతర తెలుగు పద్యాల్ని, కన్నడ మూలాల్ని పొందుపరిచారు. (పేజి: 126-127)

చన్నాప్రగడ తిరుపతిరావు గారు బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి 1973 పిహెచ్.డి పట్టా పొందిన **'పారిజాతాపహరణము - జగన్నాథ విజయముతో తులనాత్మకానుశీలనము'** సిద్ధాంత గ్రంథం క్రీ.శ 2000లో వెలుగు చూసింది. డా. చన్నాప్రగడ ఈ రెండు ప్రాచీన తెలుగు-కన్నడ కావ్యాల్ని లోతుగా పరిశీలించారు. డా. చన్నాప్రగడవారు **"ఇట్లు ని.వెం.రావుగారును, తన్మతాను యాయులును ఉదాహరించిన పద్యములలో ఒక్కటియు తిమ్మన రుద్రభట్టు గ్రంథమును అనుసరించినట్లు నిరూపింప లేకపోగ, అతడా గ్రంథమును చూచియైన యుండడనియు, హరివంశమునే అనుసరించినాడనియు నిరూపింప జాలినవై యున్నవి."** అని నిర్ణయించారు. (పారిజాతాపహరణము- జగన్నాథ విజయముతో తులనాత్మకాను శీలనము. పేజి: 90.2000) డా. తిరుపతిరావు గారు కథావస్తువు, పాత్రచిత్రణ, రసపోషణ, ప్రజా జీవిత ప్రతిఫలన మొదలైన అంశాల్ని లోతుగా అధ్యయనం చేసి, **"పాత్రచిత్రణలో తిమ్మన చూపిన శిల్పప్రతిభను రుద్రభట్టు దాపులకైన సమీపింప లేకపోయి నాడనుట అతిశయోక్తికాదు."** (పేజి: 384) అని ఘంటాపథంగా ఘోషించారు.

కన్నడకవి కెఱెయ పద్మరసు రచించిన వీరశైవ తత్త్వ ప్రబోధక కావ్యం 'దీక్షాబోధ' ను పిడుపర్తి బసవన తెలుగు ద్విపద కావ్యంగా మలిచాడు. ఇతని కుమారుడైన పిడుపర్తి సోమన కన్నడ శివకవి చామరసు రాసిన 'ప్రభులింగ లీలె'ను తెలుగులో 'ప్రభులింగ లీల' గా ద్విపదలో అనువదించాడు.

ప్రజాకవి వేమన, సర్వజ్ఞులపై శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 'వేమన' (1929) లో లోతుగా చర్చించారు. వ్యవసాయానికి సంబంధించిన రట్ట మతము, కన్నడం నుంచి అనూదితమయిందని నిడుదవోలు వారు సెలవిచ్చారు.

12 వ అధ్యాయమైన **'దక్షిణాంధ్ర వాఙ్మయ యుగము'** లో ఈ యుగం కన్నడ రచయితలపై పెద్దగా ప్రభావం ప్రసరింప చేసిందని గ్రంథకర్త అభిప్రాయం. నిడుదవోలు వారు ఈ అధ్యాయంలో యలహంక వాడు ప్రభువుగా ప్రఖ్యాతి గాంచిన పెద కెంపేగౌడ (1513-1569) రచించిన 'గంగా గౌరీ సంవాదము' అనే తెలుగు యక్షగానాన్ని రాశారని చెప్పారు వేంకటరావుగారు. ఇది అసంపూర్ణ అముద్రిత గ్రంథం. మైసూరు రాజు కంఠీరవ నరసరాజ ఒడయరు (1704-1714) కొన్ని తెలుగు యక్షగానాల్ని రచించినట్లు, అవి అముద్రితాలని తెలుపబడింది. మైసూరు రాజ్య సేనాపతి కళువె వీరరాజు వ్యాస భారతములోని కొన్ని పర్వాలను తెలుగు గద్యంలోకి అనువదించినట్లు తెలుస్తుంది. ఆది, సభా, భీష్మ పర్వాలు మాత్రమే సమగ్రంగా లభిస్తున్నాయి. కళువె నంజరాజు ఐదు తెలుగు వచన

గ్రంథాలు దొరికాయి. ఇవి కూడా అముద్రితాలే. ఈ విధంగా నిడుదవోలు వారు ఈ అధ్యాయంలో మైసూరు రాజ్యంలోని కొందరు ప్రాచీన తెలుగు కవుల దుర్లభ కావ్యాల్ని స్థూలంగా ప్రస్తావించారు.

రత్నాకరం శంకరనారాయణ రాజుగారు రచించిన **'కర్ణాటక ఆంధ్ర సాహిత్య చరిత్ర'** (1976) 376 పేజీల అమూల్యమైన పరిశోధన గ్రంథం. ఈ రచన నిడుదవోలువారు రాసిన **'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము', ఆంధ్ర, కర్నాట సారస్వతములు- పరస్పర ప్రభావము'** లకు పూరకంగా ఎంతగానో తోడ్పడుతుంది.

ఈ గ్రంథంలోని చివరి అధ్యాయం- **'నవీనయుగము'** (1800-1900). గ్రంథకర్త ఈ అధ్యాయంలో కొందరు కవి, పండితుల తెలుగు పద్య, గద్య కృతుల గురించి ఈషణ్మాత్రంగా ప్రస్తావించారు. ఉలచనాడు వేంకట రమణ కవి సంస్కృత వాసిష్ఠ రామాయణాన్ని ఐదుశ్వాసాల తెలుగు కావ్యంగా అనువదించారని చెప్పారు వేంకటరావుగారు. ఇది 1878లో అచ్చయింది. న్యాపతి లక్ష్మీ నరసింహకవి కన్నడంలో 'రామకథా రంజనము' రచించాడు. లభ్యమైన సుందరకాండ 1867లో ముద్రితమైంది. సాధుపల్లి చంద్రశేఖరశాస్త్రి, (క్రీ.శ. 1890) అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' ను కన్నడంలోకి, సంస్కృత 'అమరుక' కావ్యాన్ని తెలుగులోనికి అనువదించారు. అమరుక ఆంధ్రానువాదం 1875 లో ప్రచురింపబడింది. కలుగోడు అశ్వత్థరావు కన్నడానువాద రచనల్ని, రాళ్ళపల్లి కె. సుబ్బరామప్ప గార్ల తెలుగు-కన్నడ సాహిత్యసేవను గ్రంథకర్త ప్రశంసించారు.

నిడుదవోలు వేంకటరావు గారి **'ఆంధ్ర, కర్నాట, సారస్వతములు- పరస్పర ప్రభావము'** రెండు ద్రావిడ భాషల సాహిత్య ఆదాన ప్రదానాల్ని స్థూలంగా పరిశీలించే పరిశోధన కృతి. కన్నడ, తెలుగు ఇంగ్లీషు గ్రంథాలు అధ్యయనం చేసి విలువైన సామగ్రిని క్రోడీకరించారు. అక్కడక్కడ పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడాల్ని ప్రస్తావించారు శ్రీ నిడుదవోలు.

కన్నడ-తెలుగు ప్రాచీన కావ్యాల తులనాత్మక పరిశీలన చేస్తూ కొంత మంది విద్వాంసులు సిద్ధాంత గ్రంథాలు రాశారు. శ్రీ కె. వేంకటేశ్వరాచార్య Mahabharata and variation in perundevanar, Pampa and Nannaya ; A Comparative Study అన్న పరిశోధనా గ్రంథం రాసి 1979 లో కర్ణాటక విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి., పట్టా పొందారు. ఇది అచ్చయింది కూడా. యమ్ జగన్నాథా చార్యులు **'తిక్కన కుమార వ్యాస భారతాల తులనాత్మక పరిశీలన'** చేసి 1984లో శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి., డిగ్రీ పొందారు.

బులుసు వేంకట సత్యనారాయణ మూర్తి గారి **'కుమార వ్యాస-తిక్కనల భారతాల తులనాత్మక అధ్యయనం'** అనే పరిశోధనా వ్యాసానికి బెంగుళూరు విశ్వవిద్యాలయం 1988లో పిహెచ్.డి., డిగ్రీ ప్రసాదించింది.

జోస్యుల సదానందశాస్త్రి **'పంప-నన్నయ్యల తులనాత్మక పరిశీలన'** సిద్ధాంత గ్రంథానికి గాను 1991 లో బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి., డిగ్రీ సంపాదించారు. గంధం అప్పారావు గారికి కర్నాటక విశ్వవిద్యాలయం పిహెచ్.డి., డిగ్రీ ప్రదానం చేసిన **'వేమన- సర్వజ్ఞుల తులనాత్మక అధ్యయనం'** ప్రచురింపబడింది.

నిడుదవోలు వేంకటరావుగారి 'ఆంధ్ర, కర్నాట సారస్వతములు- పరస్పర ప్రభావము' తెలుగు - కన్నడ ప్రాచీన కావ్యాల తౌలనిక పరిశీలనకు ప్రేరణ కలిగించింది. లోతైన అధ్యయన, అనుశీలనకు దారి తీసింది.

తెలుగు, కన్నడ ప్రాచీన, ఆధునిక కవుల, రచయితలపై కొంతమంది విద్వాంసులు చేసిన పరిశోధన పుస్తక రూపంలో వెలువడినప్పుడే ఈ రెండు భాషా సాహిత్యాల విశిష్టత తెలుసుకొనే అవకాశం కలుగుతుంది.

**(ఈ పుస్తకాన్ని నాకు పంపి, ఈ వ్యాస రచనకు చోదకశక్తి అయిన డా. శ్రీ పెరుంబుదూరు శ్రీరంగాచార్యులకు కృతజ్ఞతా పూర్వక వందనాలు)**



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు-**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

(ప్రపంచ పదులు
- డా. సి. నారాయణ రెడ్డి)

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12 (32) హైదరాబాద్ అక్టోబర్ : 2023

# పద్యమనోహరం - 45


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448


**"ప్రజల హితంబు గోరి పరిపాలకుడిమ్మహి ధర్మబద్ధుడై**
**నిజ జవసత్వ సంపదల నెమ్మిని త్యాగమొనర్చి బ్రోచినన్**
**నిజ పరిపాలకుండనుచు నెమ్మది నమ్మి ప్రజాళి మెచ్చు నా**
**సజనుని పాలనమ్మునను శోభితమై ధర వెల్గునెప్పుడున్"**

కవియైనవాడు సమాజ చింతకుడైనప్పుడు, ప్రజాహితాకాంక్షియై నప్పుడు, మానవ విలువలపై అపార గౌరవం కలిగి ఉన్న సందర్భాలలో ఇటువంటి పద్యాలు వెలుగు చూస్తాయి. మాన్యులు కీ.శే. నల్దీగ శ్రీనివాసాచార్యులవారు **"అరిగజసింహ వీరపాండ్య కట్టబ్రహ్మన చరిత్ర"** అన్న పద్యకావ్యంలోనిది ఈ పద్యం. సుమారు 3000 పద్యాలకు పైగా ఉన్న ఈ అద్భుతమైన పద్యకావ్యంలోని ఈ పద్యంలో ఆచార్యులవారు రాజ్యపాలనను గురించి, రాజు బాధ్యతలను గురించి ప్రస్తావిస్తూ **"ప్రజాహితైషియై, ధర్మబద్ధంగా తనవైన శక్తి సామర్థ్యాలను, సిరి సంపదలను ప్రజలకొరకు త్యాగం చేయవలసి వస్తే, త్యాగం చేసి ప్రజలను రక్షిస్తే ఆ పాలకునిని, అతని యేలుబడిని ప్రజలు నమ్మి మెచ్చుకుంటారు. ఆ విధంగా పరిపాలన చేసే పాలకుని కారణాననే ఎప్పటికీ ఈ భూమి గొప్ప శోభలతో వెలుగొందుతుంది"** అని స్పష్టంగా బోధించారు.

ఈ పద్యం కావ్యాంతర్గతమైన కథకు సంబంధించిందే కావచ్చు, కాని ఇది సార్వకాలికము, సార్వజనీనమైన అంశాన్ని బోధిస్తూ ఉంది. ప్రపంచంలో పాలకులున్నంత కాలం నిలిచే పద్యం ఇది. సాధారణంగా ఏ దేశపు పాలకుడైనా సరే పాలకునికి ప్రజాసంక్షేమమే పరమావధి కావాలి. దాన్ని విస్మరిస్తే నియంతృత్వ ధోరణులకు చోటు దక్కుతుంది. ఈ విషయం దాదాపుగా అందరికీ అనుభవంలో నున్న విషయమే.

ప్రభువులకు ప్రజల కష్టసుఖాలే ముఖ్యం. అదే అతని లక్ష్యం కావాలి. దాన్నే సుపరిపాలన అంటారు. సుపరిపాలన అందించా ననుకున్న పాలకునికి త్యాగబుద్ధి కూడా ఉండాలి. మహాకవి కాళిదాసు తన రఘువంశంలో "త్యాగాయ సంభృతార్థానామ్" అంటూ సంపాదించడం త్యాగం కొరకేనన్నమాట రఘువంశ రాజులను గురించి చెప్పాడంటే ఇది అన్ని కాలాల్లోని పాలకులూ పాటించాల్సిన ధర్మం అని అర్థమవుతున్నది. అదే భావాన్ని కూడా ఆచార్యులవారు ఈ పద్యంలో పొందుపరిచి మరోసారి జ్ఞాపకం చేశారు. మనది ప్రజాస్వామ్యం కనుక త్యాగబుద్ధి కల పాలకుణ్ణే మనం ఎన్నుకోవాలన్నది కవి భావన.

మన ఆలంకారికులు కావ్య ప్రయోజనాలను చెబుతూ "శివేతరక్షతయే" అన్న మాటకు ఇదే అర్థం. మంగళేతరమైన పరిస్థితులనుండి ప్రజలను కాపాడవలసిన బాధ్యత పాలకునిదే కదా! ఆ ప్రయోజనాన్ని బోధించే ఉత్తమ కవిత్వాన్ని కవి తన సమాజానికి అందించాలి. అప్పుడే "శివేతర"మైన వాటికి రక్షణ. ప్రజలకు సుఖసంతోషాలు. ఇది తెలిసిన మహనీయులు కీ.శే. నల్దీగ వారు ప్రముఖ విద్వన్మూర్తులైన శ్రీనివాసాచార్యులవారు "రాధికా మనోహారీయము" వంటి అద్భుత కావ్యాలు నిర్మించిన కవీశ్వరులే గాక, వారు నాట్యంలోను చిత్రకళలోను గొప్ప అభినివేశం కలిగిన మహా కళాకారులు. నల్లగొండ జిల్లా ఇందిరాల గ్రామానికి చెందిన ఆచార్యులవారు రచించిన ఈ కావ్యం విస్తృత ఖ్యాతిని గడించింది. వారి ప్రతిభకు ప్రతీకగా నిలిచింది.





ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12 (33) హైదరాబాద్ అక్టోబర్ : 2023

# అనుశాసనిక పర్వం – పరిష్కరణ – పీఠికా రచనలో తుమ్మపూడి వారి దక్షత

**డా. పి.సి. వెంకటేశ్వర్లు,** అసోసియేట్ ప్రొఫెసర్, ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
**ఫోన్ : 99664 35902**

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1974లో ముద్రించిన గ్రంథం **"శ్రీమత్ ఆంధ్రమహాభారతము - అనుశాసనిక పర్వము"** (తిక్కన సోమయాజి ప్రణీతము) ఈ గ్రంథాన్ని 40 పుటల పీఠికతో ప్రచురించాలని అకాడమీ భావించినా, తుమ్మపూడి కోటేశ్వరరావు 92 పుటలలో ఈ గ్రంథానికీ పీఠిక రాయడం జరిగింది.
ఈ పీఠిక రెండు విభాగాల్లో సాగింది. అవి. 1. ఋతశిల్పి 2. రసశిల్పి. మొదటిది పరిష్కృత గ్రంథానికి పూర్వరంగం కాగా, రెండవది గ్రంథాంతర్గత విషయాలకు సంబంధించింది.

**1. ఋతశిల్పి :** ఈ విభాగంలో హరిహరనాథతత్వము, ధర్మాద్వైత్వము, ధర్మము – కావ్యము, ప్రస్తుతపర్వం ధర్మాద్వైత్వము, సహస్రనామరచన, ప్రస్తుత పర్వము – శిల్పము వంటి విషయాలు ఉన్నాయి.

**2. రసశిల్పి :** ఈ విభాగంలో మూలప్రతి, ఆశ్వాసశిల్పము, కథానువాదము, సౌపర్ణోపాఖ్యానము రచనాశిల్పము, కావ్యోచిత వర్ణనలు, ధర్మానువాదము, వాక్యఖండములు, తద్గతశిల్పము, ఛందోశిల్పము, సంబుద్ధులు, రసశిల్పి, శబ్దము, ప్రాచీన, నవీన పరాశర సూనులు, పద్యరచన వంటి విషయాలపై చర్చజరిగింది.

**1.1. హరిహరనాథతత్వము :** తెలుగు సాహిత్యంలో తిక్కన తొలిసారిగా ప్రతిపాదించిన ఈ తత్వానికి మూలాన్ని తూమ్మపూడి వారు సోపత్తికంగా వివరించాడు. విశ్వం శీతోష్ణ సమన్వయంతో ప్రకాశిస్తున్నదనీ ప్రతిజీవి రెండిటి కూడిక అనీ, వ్యక్తి – అవ్యక్తి, ప్రవృత్తి – నివృత్తి, సగుణ – నిర్గుణ, మాతా – పితరులు అనే వాటి కూడికను పరిశీలించమంటాడు. ఋగ్వేదంలోని 1–164–33, ఋక్కును ఆధారం చేసుకొని – తిక్కన హరిహరనాథతత్వానికి ఊపిరిలూదాడని తుమ్మపూడి కోటేశ్వరరావు ప్రతిపాదించాడు. అంతేకాదు ప్రాచీన కళా దృష్టికి అర్ధనారీశ్వరత్వం కన్పించినట్లు, తిక్కనకు హరిహరనాథత్వం కన్పించిందని, హరిహరనాథుని గురించి పరిశోధకులు ఉటంకించిన అభిప్రాయాల్ని ఆధారంగా చూపించారు. ఖజురహోదేవాలయ శిల్పమూర్తి హరిహరనాథుడే అని – ఊర్మిళా అగర్వాల్ చెప్పారని గుర్తు చేస్తాడు. 'ఇండియన్ ఐకనోగ్రఫీ' – Val -1, Part -1 పుట 270 లో వేంకటేశ్వరస్వామిని హరిహరుడే అని గోపీనాథరావు ప్రతిపాదించిన అంశాల్ని ఉదాహరిస్తాడు. "అనలుడు భాస్కరుడును సుధాంశుడు నధ్వర సంప్రవర్తకుల్ వినుము నరేంద్ర యీక్రతువు విష్ణుమయంబిది నిర్వహించిర ర్జునుడును గర్జుండు దగ" – కర్ణపర్వం చివరి పద్యాన్ని ఉదహరించి సూర్యచంద్రుల యజ్ఞానికి ప్రవర్తకులని, విష్ణుమయమైన యుద్ధమనీ, క్రతువును కర్ణార్జునులు పంచాగ్ని సాక్షిగా నిర్వహించారని హరిహరనాథ తత్వపు బీజాన్ని గుర్తించాలంటాడు పీఠికాకర్త. ఒకే తత్వమున రెండు ముఖాలు



హరిహరనాథతత్వమని, నీరు మేఘంలో ప్రవేశించి –వర్షించినట్లు, జీవం స్త్రీ, పురుషుల ద్వారా స్త్రీని చేరి ఒక మనుషరూపం సాకారమైనట్లు రెండు భావనలు ఒకే తత్వమని అంటాడు.

**1.2. ధర్మాద్వైతం :** ధర్మం అనగా యజ్ఞం లేదా కర్మ అంటాడు తుమ్మపూడి వారు. ఎక్కువగా ధర్మచర్చ జరిగింది ఈ ఆశ్వాసంలోనే అంటాడు. ధర్మం గురించి చేసిన నిర్వచనాలు వ్యాసమహర్షి, మనువు ద్వారా మహాభారతంలో గ్రహించాడని, ఆ శ్లోకాలను కూడా తుమ్మపూడి వారు ఉదాహరించారు. గృహస్థ ధర్మాన్ని నిరూపించుటకు వ్యాసుడు జమదగ్నికథ చెప్పి గొడుగు, చెప్పుల ప్రయోజనాన్ని తెలిపాడని, ఆనుశాసిన పర్వంలో చూపిన సంఘం కేవలం భౌతికంకాదని, ఆధ్యాత్మికమైందని అంటాడు తుమ్మపూడి.

**1.3. ఆనుశాసనిక పర్వనామౌచిత్యం :**

ఆనుశాసనిక పర్వ నామౌచిత్యం పరిశీలించే క్రమంలో ధర్మాలు బహుళాలని, అద్వైతం ఒక్కటేనని, అద్వైతంతో ముడిపడింది ప్రతిదీ ధర్మమేనని వ్యాఖ్యానిస్తాడు. స్వధర్మ మతదర్శనాలకు లక్ష్యం ఏది? వీటి స్థితికి గతి ఏది? వీటికి అద్వైత స్థానమేది?అనే విషయాలను సమగ్రంగా అనుశాసించే పర్వం కాబట్టి 'ఆనుశాసనిక పర్వం" అనే పేరు వచ్చిందని నిర్ధారిస్తాడు. శ్రీకృష్ణతత్వమే ఈ పర్వంలోని కథకు నాభి అని, ఈ సమన్వయాన్ని ప్రతి పర్వంలోను

వ్యాసుడు చూచించాడని, ఈ పర్వాన్ని దానికి శిఖరంగా సృష్టించాడని తుమ్మపూడి వారు విమర్శలో తెలిపాడు. ఈ పర్వంతో ముందు పర్వానికి సమన్వయం వుందని, దీని తర్వాత లేదని, అరణ్య పర్వంలో పాశుపతం, ద్రోణపర్వంలో శివతత్వప్రశంస, కర్ణపర్వంలో త్రిపురాసుర సంహారం, ఇలా అవ్యక్త తత్వాన్ని కథారూపంలో చెబుతూ, శాంతి అనుశాసనిక పర్వాల్లో శైవ, వైష్ణ తత్వాలను ధర్మసూత్రాలుగా కుదించి, సమన్వయించి ఆనుశాసనిక పర్వంలో శైవ, వైష్ణవ సహస్రనామాలను రచించి, కవిబ్రహ్మ తాను ప్రతిపాదించదలచిన కావ్యతత్వానికి ఫలభూమిగా చేసినట్లు అర్థమౌతుందని అంటాడు. మత సమన్వయ రూపంగా చూపించదానికే సుపర్ణుని విష్ణుస్తోత్రమున “అచ్యుత, శివ, సహస్రాక్ష, త్రినయన, గోవింద, హర” వంటివి కన్పిస్తున్నాయని, ఇలా ధర్మాలకు అద్వైత సమన్వయం, మతపరమైన రెండు వెల్లులకు సమన్వయం చేయడంలో, అర్థం చేసుకోవాలని లోతైన చర్చ చేస్తాడు పీఠికా కర్త.

**1.4. ఆనుశాసనిక పర్వము - శిల్పం :** వస్తుశిల్పమనేది అంతంలేని రత్నాకరం అంటాడు పీఠికాకర్త. ఐతిహాసకులు వస్తు శిల్పలని చెప్తూ ఈ పర్వంలో వచ్చిన పరశురామ, విశ్వామిత్ర, చ్యవన, నహుష, అష్టావక్ర, కుమార కథలు ఐతిహాసాల్లో ముందే వున్నాయని చెప్పి వివరణ ఇస్తాడు. చ్యవనుని కథ అరణ్యపర్వంలో వచ్చిందని, శాంతిపర్వం చూసినట్లయితే విశ్వామిత్ర, పరశురాములు కథలున్నాయని, అలాగే నహుషుని కథ అరణ్యపర్వంలో అజగరోపాఖ్యానంలో ఉందని, అష్టావక్రుని కథ అరణ్యపర్వంలో బ్రహ్మచర్య గార్హస్థ్య కోణాల్లో ఉందని, కూమారస్వామికథ అరణ్య, శల్యపర్వాల్లో వచ్చిందని వివరిస్తాడు. ఈ విధంగా కథలను పరిశీలిస్తే పూర్వకథాచక్రానికి నాభి ఈ పర్వమని అని తుమ్మపూడి వారి పరిశోధనలో తెలుస్తాడు. అదేవిధంగా చెప్పిందే చెప్పడంకాదు ఆ కథలకు పూర్వపరాలను చెప్పడంవల్ల పరిపూర్ణత ఏర్పడుతుందని, భిన్నపర్వాల మధ్య చిక్కదనం ఏర్పడుతుందంటాడు తుమ్మపూడి. 'రెండు పర్వాల్లోని కథ కలసినపుడు, ఆ సమన్వయం ద్వారా పాఠకుని మనసులో మెరుపులా ఆ కథ వెలుగుతుందని, అదొక అద్భుత శిల్పం' అంటాడు. భారతం సంపూర్ణమైన మానవ జీవితాన్ని వర్ణిస్తుందని అయితే అందులో ధ్వని ఏమిటో? గ్రహించమంటాడు.

**“ఓం పూర్ణమద: పూర్ణమిదం - పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణ మాదాయ - పూర్ణమే వావ శిష్యతే”**

అనే మంత్రం కథా రూపంలో ఆవిష్కృతమౌతుందని, ఎనిమిది రసాలు ఒకదానితో ఒకటి ఘర్షించుకొని - శాంతానికి ఉద్దీపనంగా మారాయని, యుద్ధపర్వాన్ని కరుణ స్థాయిగా చేయకుండా, కాలప్రభావాన్ని అంగముగా చేసి శాంతాన్ని ఉద్దీపింపజేశాదని, 'కర్ణుడు మరణించడం' కాలప్రభావమని ధ్వనిగా చెప్పాదని విశ్లేషించాడు. ఈ భారతం ఒక మహానాటకమని అందులో పంచ సంధులున్నాయని, ఆది - ముఖసంధి, స్వర్గారోహణ - నిర్వహణసంధి కాగా, మధ్యలో పర్వాలు ప్రతిముఖ తదితర సంధులంటాడు పీఠికాకర్త. శాంతమే - రసనిష్పత్తి ప్రకృతిగా నిర్ధారించాడు. ఈ దృష్టితో చూసినపుడు అనుశాసనికపర్వంలో ప్రారంభాంతాలు చక్కగా వున్నాయని భీష్మ మరణం తర్వాత గంగాదేవిని - శ్రీకృష్ణుడు ఓదార్చడాన్ని ఉదహరిస్తాడు. ఈ పర్వంలో కథను ఎక్కడ? ఏ కథతో ప్రారంభించాడో గ్రహించమంటాడు. ఎత్తుగడ, దింపుగడలు ఎంత బంధసౌందర్యం, ఎంత ప్రౌఢమధురమో చూడమంటాడు తుమ్మపూడి. ఇంకా మృత్యుకాల సంవాదంతో ( భీష్ముని) మొదలు పెట్టి, భీష్ముని స్వర్గప్రాప్తితో ముగించాడని, మనిషుని పరమేశ్వరాధీనంతో బ్రతకమని చెప్పడంగా గ్రహించమంటాడు. పర్వ ప్రారంభ -ముగింపు మాత్రమే కాకుండా ఒక్కొక్క కథ ఆద్యంతాలలో బంధం ఎంతో మధురంగా ఉంటుందని, ఉమామహేశ్వర సంవాదంలో, కృష్ణ నారద సంభాషణలు మూలంలో 15 శ్లోకాలల్లో వర్ణన ఉండగా, తెలుగున ఒక్క పద్యంలో తిక్కన వర్ణించడం వస్తుశిల్పమేనని అంటాడు. వస్తు ధర్మాన్ని చెప్పడం ఒక శిల్పం చెప్పబోయే ధర్మాన్ని ఎడాపెడా చెప్పకుండా ఒక పద్ధతిలో చెప్పడంలో సౌందర్యముందంటాడు. సుందరమైన, తార్కిక క్రమంలో ఈ ధర్మాల్ని తిక్కన పొదిగినాడని చెప్పాడు. లౌకిక ధర్మాలు భీష్ముని చేత, జీవుని సంసారయాత్ర గురించి బృహస్పతి చేత, ఆధ్యాత్మిక, దార్శనిక విద్యను సనత్కుమారుని చేత, వైష్ణవ, పాశుపత ధర్మాలను హరిహరులచేత, పతివ్రతాధర్మాలను పార్వతి చేత చెప్పించడం ఒక శిల్పమని, అన్ని ధర్మాలను ఒకరిచేత చెప్పించడం ఔచిత్యం కాదని తిక్కన ఉద్దేశమని సముచిత వ్యాఖ్య చేస్తాడు. వర్ణాశ్రమధర్మాలతో మొదలై యోగ ,సాంఖ్య, పాశుపత విషయాలతో క్రమంగా సాగడం చక్కటి క్రమమని, చివర ఉమామహేశ్వర సంవాదంతో ముగియడం శిల్ప నిర్మాణ చాతుర్యంగా మనం గమనించవచ్చునని అంటాడు పీఠికా కర్త.

**2. రసశిల్పి :** ఈ విభాగంలో ఆనుశాసనిక పర్వ ప్రతి, అందులోని అంతర్గత విశేషాలను పీఠికా కర్త వివరించాడు.

**2.1. మూలప్రతి:** మూలప్రతి ఏది అనేదాన్ని నిర్ణయించడం కష్టమని చెప్పి, తనకు దొరికిన ప్రతిని అనుసరించానని, బండార్కర్ ఆనుశాసనికపర్వ ప్రతి ప్రకారం అందులో అనుబంధాన్ని అనుసరించి రాశానని చెప్పుకున్నాడు. తిక్కన అనేక దక్షిణాది ప్రతులను పరిశీలించి ఈ ఆనుశాసనికపర్వం రాశాదని, అలాగే కొన్ని ఉత్తరాది ప్రతులను కూడా చూశాదనడానికి వజ్రనాభునికథ, నారద - మార్కండేయ సంవాదంలోని హవ్య - కవ్య విషయాలను ఉదాహరించాడు ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరావు. అంతేకాకుండా ములంలోని ప్రతి విషయాన్ని అనువదించకుండా వివిధ ఘట్టాల్లోని తాత్పర్యాన్ని భాష్యకారుడిలాగా తిక్కన రాశారని, బండార్కర్ ప్రతిలోని

కొన్ని విషయాలు అనువదింపబడలేదనే వాదాన్ని ఖండించాడు.

**2.2. ఆశ్వాస శిల్పం :** ప్రతి ఆశ్వాసాన్ని విభజించడంలో తిక్కన చూపిన నేర్పు అద్వితీయమని అనుశాసనిక పర్వంలోని ఐదు ఆశ్వాసాల్లో ఈ శిల్పం అద్భుతంగా శోభిల్లిందని అంటాడు.

ప్రథమాశ్వాసం – గౌతమీ లుబ్ధక సంవాదంతో మొదలై నారాయణుడు సుపర్ణునికి బోధ కల్గించడంతో ముగిస్తుంది. ద్వితీయాశ్వాసం – అష్టావక్రథతో ఆరంభమై –గోదాన ఫలరూపమైన గోలోక ప్రాప్తితో ముగుస్తుంది.

మూడవ ఆశ్వాసం – వేదాధ్యయన బ్రహ్మచర్యాది విషయాలతో మొదలై పంచయజ్ఞ విధానంతో ముగుస్తుంది.

నాల్గవ ఆశ్వాసం – ధూపాది మహత్వ స్తుతితో ఆరంభమై ఊమామహేశ్వర సంవాద ఆరంభంతో ముగుస్తుంది.

ఐదవ ఆశ్వాసం – ఉమామహేశ్వర సంవాదంతో మొదలై భీష్మస్వర్గారోహణతో సమాప్తమౌతుంది. ఇలా కర్మ విధానంతో మొదలై అవ్యక్త విషయంతో ముగించడం శిల్ప చాతుర్యమని చెప్పాడు.

**2.3.కథానువాదం:–** అనువాదకుడి పని మూలవిస్తృతిని కుదించడం, మూల క్లుప్తతను వర్ణనతో విశదీకరించడం

తిక్కన వీటికి అదనంగా గర్భిత సౌందర్యాన్ని విస్తరించాడని అంటాడు తుమ్మపూడి.

ఉదా : కుమారస్వామికథ, నహుషోపాఖ్యానాలు, 86,100 అధ్యాయాల్లో వున్నాయని, వీటిని ధర్మారాజు పూర్వం విన్నాడని, అందుకే తిక్కన పృచ్ఛకుని ప్రశ్నల్ని తొలగించాడని, ఇది కుప్తీకరణ విధానమని, ఇలాంటిఎన్నో విషయాలు చెప్పాడు. అలాగే గురుత్మంతుని కథలో అశ్వవర్ణన ప్రబంధాలకు సరిపోతుందని, కథాగమనానికి ఆటంకం కాబట్టి తిక్కన తగ్గించాడని, ఇంకా సౌపర్ణోపాఖ్యానాన్ని చక్కని ప్రబంధంగా తీర్చిదిద్దాడని తెలిపాడు. కానీ, దీన్ని రెండు భాగాలుగా చేస్తే 'వినతా దాస్యము' కాగా రెండవది 'అమృతకలశం' ఆగమనంగా చూడవచ్చంటాడు. గరుత్మంతుడు పుట్టిన తర్వాత మధ్యలో కథను మొదలెట్టి పూర్వాపరాలు చెప్పడం, ఇంట్లో ఉన్న సవతుల మధ్య ఈర్ష్యా, ద్వేషాలు సహజసిద్ధంగా చెప్పడం శిల్పం అంటాడు తుమ్మపూడి. అలాగే యతి, ప్రాసల్లో తూనికను ఉదహరించి కద్రువ శపించిన పర్యంలో సమాస జటిలతను వివరించి రచనా శిల్పాన్ని పాఠకులకు వివరిస్తాడు. కావ్యోచిత వర్ణనలు చేయడంలో తిక్కన నైపుణ్యాన్ని తెలియజేయడానికి సాగరవర్ణనను, కద్రువ, వినతలు సాగర విహారార్థం కాబట్టి చేశాడని, అశ్వవర్ణన ఇద్దరి స్త్రీలు ఉత్సాహంతో చూడడానికి హేతువైందని తెలుపుతాడు. తిక్కన రాసిన అమూలకమైన వాక్యాలు, వచనాలు శిల్పంలో భాగంగా తుమ్మపూడి నిరూపిస్తాడు. ఉదా॥ సౌదాముడు వశిష్టునితో ఏది పవిత్రము అని అడినపుడు 'గోవు' అని సమాధానం చెప్తూ 'అది సురలకు మనికిపట్టు' అని చెప్పి తర్వాత "అని చెప్పి మరియును" అంటూ వచనం రాసిన మరలా గోవు శ్రేష్టతను చెప్తూవెళ్ళడానికి కారణం ఇది వాక్య ఖండాల్లో దాగిన ప్రత్యేక శిల్పమని చెప్తారు.

అదేవిధంగా అంతకు ముందే చెప్పిన కథలో కొన్ని ప్రత్యేకాంశాలు చెప్పాల్సి వచ్చినపుడు పునరుక్తి దోషం కలుగకుండా "తొల్లియుం గొంతవింటి నిస్సంశయంబు గాదు" అనే వచనాలను చెప్పి – సంశయ నివారణ కోసం చెబుతాను. అనడం తిక్కనలోని 'తద్గతశిల్పం' గా వర్ణించాడు తుమ్మపూడి.


Telugu Classics – Popular Edition Series

శ్రీమత్

ఆంధ్రమహాభారతము

అనుశాసనికపర్వము

(తిక్కనసోమయాజి ప్రణీతము)

పరిష్కర్త

డా. తుమ్మపూడి కోటేశ్వరరావు

ఆంధ్రశాఖ

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము

తిరుపతి



ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

కళాభవనం – హైద్రాబాదు-4

**2.4. ఛందఃశిల్పం :**

తిక్కన ఛందోశిల్పాన్ని ముదు రకాలుగా వర్గీకరించాడు పీఠికాకర్త.

1. కథాద్యంతాలు ఏక ఛందస్సులో నిబంధిచడం

2. కథా ప్రధాన ఘట్టం ఏక ఛందస్సున నడిపించడం

3. ఆయా ఛందప్రవృత్తిలోని మార్మికత

సన్నివేశాలకోసం,. సందర్భంకోసం, రసపోషణ కోసం ఛందస్సులను ఉపయోగించడం తెలుసు. కానీ

పీఠికా కర్త భిన్నంగా ఆలోచించాడు అందుకే తిక్కనలోని ఛందోశిల్పాన్ని మూడు కోణాలలో పసిగట్టాడు.

ఉదా ॥ ఎ. సుదర్శన కథ – ఆద్యంతాలలో చంపకమాలలు

బి. అష్టావక్ర కథ –ఆద్యంతాలలో సీసపద్యాలు

సి. రుచి కథ – ఆద్యంతాలలో కందపద్యాలు తిక్కన వాడడం వలన ఏమి ప్రయోజనం సాధించాడో పీఠికాకర్త తెలియజేశాడు.

**2.5. గౌరవ వాచకాలు :**

తిక్కన ఎక్కడా ఏకవచనాలు వాడలేదని, మీరు, రండి, మీకు, వంటివాటిని మాత్రమే ఉపయోగించాడని ఉదహరించాడు. ఉదా॥ మీకు దెల్ప నెంతదాన (పార్వతి). గురు భార్యను 'అమ్మగారు అనడం తెలుగుమాట

**2.6. రసశిల్పం :** మూల భారతం వైదిక సంస్కృతి – తత్వప్రధానం – శబ్దప్రధానంగా సాగిందని, తెలుగు భారతం ఆలంకారిక సరస్వతి – రసప్రధానం – శిల్పకం అని, ఇంతటి రసధ్వని ప్రస్థానాచార్యుడు తిక్కన మాత్రమేనని కోటేశ్వరరావు ప్రతిపాదించాడు.

ఉదా॥ సుదర్శన కథలో అతిథి వచ్చి అతని భార్యను వాంఛిస్తాడు. అది విని ఆమె భర్త ఆజ్ఞ కావున సంకోచించలేదు. ఇది మూలమని, కానీ, తిక్కన "సతి దనపతి వచనంబులు – మతి జొనుపుం దెంపె మాను మాన వెఱచు నయ్యతిథి పనుపు సేయక త్రోచు తలంపల వఱచు". అని పలు విధాలుగా చింతించిందని తులనాత్మక అనుశీలన చేస్తాడు. మూలంలో డోలాయమానం లేదు, పాతివ్రత్యం లోపించును కదా! అనే బాధ లేదని, అది ధర్మమే కాని 'మానం పోవడంలేదా'? అనే ఆలోచ తిక్కన సృష్టించిన స్త్రీ చేయడం రసశిల్పం అంటారు తుమ్మపూడి.

**2.7. శబ్దం:** తిక్కన గారి శబ్దం బంతిపూవు, చిగుళ్ళతో శోభించే మామిడి మొక్క అంటాడు తుమ్మపూడి సంస్కృత శబ్దానికి, పదానికి సమానమైనదాన్ని తెలుగులో తిక్కన ఉపయోగిస్తాడని, కవిబ్రహ్మ శబ్దం తెలుగు పల్లెటూళ్ళ అందాన్ని నెగ బోయునని, తిక్కన వాడిన శబ్దాలు మూలంలో ఉండవని, ఒకవేళ ఉన్నా ఇలా ఉంటాయని ఉదాహరిస్తాడు.

| ఉదా॥ తెలుగు | సంస్కృతం |
|---|---|
| కాలుని అరచేతిది | కాలాత్మకం |
| ఎలుగు సూపు | ప్రతివచః |
| ముదురుదనంబు | జరమార్ధితాం |
| పొడపాప పుర్వు | క్షుద్రసర్పం |

తెలుగులోని జాతీయాలైన పేదమాటలు, మిడుక నీక, చుక్కుబిడి, తలవిసరి, దాపట వలపట వంటివి తిక్కన ఆనుశ్వాసనికపర్వంలో వాడారని చూపాడు. విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని ఎన్నో ఏకార్థక పదాలు ఉపయోగించాడని . ఉదా॥ ఏనుగు = కరిపతి, సామజము, దంతి, హస్తి, గజము, వారణము, కుంజరము వంటివి కవులు కూడా పదప్రయోగంలో ఉపకరిస్తాయంటాడు పీఠికా కర్త.

**2.8. పద్య రచన :**

ఊహ – భావాన్ని అనుసరించినట్లు, పదాలు – పాదాలు తెగవేసినట్లు, తూచి – కొలతలతో కత్తిరించినట్టు తిక్కన పద్యాలు ఉంటాయని తుమ్మపూడి చూపించాడు.

ఉదా॥ "గోవగ్ని మయ మమృత మయమో వసుధాధీశ! వినుము హోమవిధాన శ్రీవాహిని నిచ్చెద త్రిదశా వాసంబునకు పూజ్యమమరులకైన" వ్యాస తిక్కనలను ప్రాచీన, నవీన పరాశురులు అన్నాడు తుమ్మపూడి. ఋతశిల్పం నుండి రసశిల్పం సాధించడం తిక్కన మార్గమని, ఒకటి హరుడు రెండవది హరి – ఈ రెండింటి సమన్వయమే తిక్కన భారతంగా తుమ్మపూడి వారు కొనియాడారు.

**ముగింపు :** ఈ విధంగా ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరావు అనుశాసనిక పర్వం పీఠికా రచన తనదైన శైలిలో రచించి తెలుగు వారి హృదయాలని రజింపజేసిన గొప్ప కవి, విమర్శకులుగా చెప్పవచ్చు. పీఠికా ఎలా రాయాలో పరోక్షంగా చూపించిన తాత్వికులు, పరిశోధన, పరిష్కరణ అనే భిన్న ముఖాలను హరినాథునిలో ఉపమింప చేయడం వారికే సాధ్యమైంది.



**జగన్మాతర్మాతః తవ చరణ సేవా న రచితా**
**న వా దత్తం దేవి! ద్రవిణమపి భూయస్తవ మయా ।**
**తథాऽపి త్వం స్నేహం మయి నిరుపమం యత్ ప్రకురుషే**
**కు పుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి ॥**

ఓ జగదంబా! ఓ శ్రీమాతా! నేను నీ దివ్యమైన పాదపద్మముల సేవను చేయనైతిని. అంతేగాక, నీ పూజాదికముల కొరకై ఏ మాత్రమూ ధనమును కూడా సమర్పింపనైతిని. అయినప్పటికీ అన్యథా భావింపక సాటిలేని వాత్సల్య పూరితమగు (మాటలకు అందని) నీ ప్రేమను ఈసడింపకుండా నాపై కురిపింపుము. మాతా! పుత్రుడు దుడుకువాడై ఉండవచ్చును. కాని, కఠినాత్మురాలైన తల్లి మాత్రము ఉండదు కదా!

# నన్నయ భారతం – సామాజిక విలువలు

**ఆచార్య అయ్యగారి సీతారత్నం,** తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఫోన్ : 98851 44879

నన్నయ్య గారు వేయి సంవత్సరాల క్రితం మనకి అందించిన అనుసృజన మహాభారతం. నేటికీ కూడా ఉత్తమ సాహిత్యంగా మనుగడ సాగిస్తోంది, ప్రాసంగికత కనిపిస్తోంది. దీనికి కారణం మానవ జీవన మూలాల నుంచి రావడమే. భారతంలో చాలా సన్నివేశాలలో ఉపకథలో, సంఘటనలలో ప్రధాన స్రవంతిలో ప్రాసంగికతని గుర్తించగలం. సమాజం మారుతూనే ఉంటుంది మారిన నేపథ్యంలో ప్రతి కొత్త భావజాలం నుండి మరల ప్రాసంగికతని గుర్తించాలి. ఈ ప్రాసంగితని గుర్తించి, ఈ చిత్రీకరణ నుండి నన్నయ భారతంలో ఏ విలువల్ని ప్రతిపాదించారు అవి నేటి సమాజానికి అభివృద్ధికి ఎంతవరకు పనికి వస్తాయో అంచనా వేయడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

వస్తు ప్రాధాన్యత, అభిరుచి ప్రాధాన్యత, ధర్మ సంఘర్షణ కలిగినది మహాభారతం.

**"ఏయది హృద్య?మపూర్వం**
**బేయది?యెద్దాని వినిన నెఱుక సమగ్రం**
**బైయుండు?నఘ నిబర్హణ**
**మేయది?యక్కథయ వినగనిష్టము మాకున్!**

మనోహరంగా అపూర్వంగా ఎరుక అంటే జీవిత లక్ష్యాన్ని సాధించగలిగే సమగ్ర మానవజీవన ధర్మ పరిజ్ఞానం తెలిపేదిగా పాపాన్ని తొలగించి ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి కారణభూతమయ్యే కథ కావాలంటే మహాభారతాన్ని వినిపించారు. అంటే ఇటువంటి సార్వకాలీన లక్షణాలున్న మహాభారతంలో ప్రాసంగికతకి లోటుండదు.

అసలు భారత కథ ప్రారంభంలోనే సరమ వృత్తాంతంలోనే సార్వజనీన సార్వకాల ధర్మం ఉంది. జనమేజయుడు యజ్ఞం చేసే ప్రాంతానికి సరమ అనే దేవతలకు ఒక్క కొడుకు సారమేయుడనే కుక్క పిల్ల ఆట నిమిత్తం వస్తే జనమేజేయుడు తమ్ముళ్ళు దాన్ని కొడితే.. అది తల్లికి చెబుతుంది. తల్లి కోపంతో వచ్చి నీ తమ్ములు 'అతిబాలకుననపరాధునడచిరి పెలుచన్'... అని చెబుతుంది. ఆ పిల్ల చిన్నది, పైగా ఏ నేరము చేయలేదు.

**"తగునిది తగదని యెదలో వగవక సాధువులకు పేదవారల కెగ్గుల్**
**మొగిజేయుదుర్నీతులకగుననిమిత్తాగమంబులయినభయంబుల్'**

మంచి చెడ్డలు ఆలోచించకుండా పేదవారికి, అసక్తులైన వారికి మంచివారికి అపకారాలు చేసే నీతి రహితులకు ఆపదలు వస్తుంటాయి. అని జంతువైనా ఏదైనా మనకి అపకారం చేయక పోయినా దాన్ని బాధించడం నేరమని, దానికి శిక్ష తప్పదని హెచ్చరించి ప్రతి జీవికి భూమి మీద హాయిగా జీవించే హక్కు ఉన్నదని, జీవవైవిధ్యాన్ని స్పష్టం చేశారు.

మహాభారతం పందెములు వేయడం, అసూయ అనే రెండింటి వలన ఎన్ని అనర్థాలు వస్తాయో మానవాళికి తెలియచెప్పిన ఉత్తమ కావ్యం.



కద్రువ వినతలు ఉచ్చైశ్రవం అనే దేవేంద్రుని అశ్వమును దూరము నుండి చూసినప్పుడు కద్రువ కావాలని పందెం వేస్తుంది. ఆ గుర్రం తోక నలుపుగా ఉన్నదని కద్రువ అంటే తెల్లగానే ఉన్నదన్న వినతతో నల్లగా ఉంటే నాకు నీవు దాసిగా ఉండాలని లేకుంటే నేను నీకు దాసీగా ఉంటానని కద్రువ పందెం వేస్తుంది. సరేనంటుంది వినత. ఈ పందేలనే నేడు బెట్టింగ్ అంటున్నారు. ఈ బెట్టింగ్ మనస్తత్వం ఉన్న వాళ్ళకి ఎలాగైనా గెలవాలని దుగ్ధ ఉంటుంది. కద్రువ పుత్రుడిని పిలిచి తోకను పట్టుకొని నల్లని మచ్చలాగా కనపడాలని కోరుతుంది. అధర్మం అంటారు పుత్రులు. వారిని శపిస్తుంది. ఒక్క కొడుకు మాత్రం ఆమె మాట విని కద్రువని గెలిపించి వినతని దాసిగా అయ్యేటట్టు చేస్తాడు. అనంతరం ఇరువురి బిడ్డలు అసూయలతో శత్రువులుగా మారుతారు. వీరు దాయాదులే. అలాగే ధర్మరాజు దుర్యోధనునితో మాయా జూదములో సర్వం కోల్పోతాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదికిచ్చిన వరములతో వారి రాజ్యం వారికి వచ్చిన మరల అనుద్యూతంతో ధర్మరాజు సర్వం కోల్పోతాడు. అది జూదరి మనస్తత్వం. అసలు ఏ తప్పు లేకుండా ద్రౌపది అమానవీయ అవమానాన్ని పొంది అరణ్యవాసం చేయవలసి వచ్చింది. అందుకనే మొదట విదురుడు

**"తమలోన జూదంబు వాదునగుట కలహమూలంబ యెట్టి శాంతులకైనా.."** అని హెచ్చరించాడు. కానీ ధృతరాష్ట్రుడు ఉన్నారు కదా అలా జరగదని అతని మాటలు కొట్టి పారేశారు. కానీ ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికి జూదము వద్దని హితవు పలుకుతాడు.

**"జూదమిది యేలా? దీనను**
**భేదము మీలోన బుట్టు బెలుచన యుష్మ**
**ద్భేదమునజేసియెగ్గు**
**త్పాదిల్లు ధరిత్రిప్రజకు భయజననంబై"**

జూదం వలన మీకు తీవ్ర వైరం పుడుతుంది. మీ వైరం వలన భూమి మీద ప్రజలందరికీ భయంకరమైన కీడు కలుగుతుంది. పైగా ధర్మరాజు కన్నా ఐదు రెట్లు సంపద నీకున్నది. నీవు కూడా యజ్ఞం చేయవచ్చు.. అన్న ధృతరాష్ట్రుడికి అసూయపరుడైన దుర్యోధనుడికి ఆ మాటలు నచ్చవు. ధర్మరాజుతో జూదం ఆడడమే నాకుయజ్ఞం. కోరిన సకల సంపదలు పొందడానికి ఇదే తగిన ఉపాయంగా చెప్తాడు.

దుర్యోధనుడు స్వభావం తెలుసు. జూదము వలన నష్టమో తెలుసు. అయినా ధర్మరాజు అనుద్యూతానికి వెళ్లి ఓడిపోయాడు. ధర్మరాజులో జూద వ్యసన బలహీనతే అన్ని అనర్థాలకి ద్రౌపది ఘోర అవమానానికి కారణమనేది స్పష్టం.

నేడు కూడా బెట్టింగ్ జూదం వలన ఎన్ని అనర్థాలో కుటుంబాలు ఎంతటి వ్యథకి గురవుతున్నాయో మనకి తెలుసు.

కచ దేవయాని కథలో తొలిసారిగా మద్యపానం నిషేధించ బడింది. కచుడు మృత సంజీవిని విద్య కొరకు రాక్షస గురువైన శుక్రాచార్యుడి వద్ద మృత సంజీవిని విద్య నేర్చుకొను నిమిత్తం అతనికి శిష్యుడుగా చేరి శుశ్రూష చేసి గురువుగారి మనస్సు చూరగొనడమే గాక గురుపుత్రియైన దేవయాని చెప్పిన పనులన్నీ చేసి ఆమెకి సంతోషాన్ని కలగజేస్తాడు.

రాక్షసులు అసూయచే అతనిని చంపి అడవిలో మద్దిచెట్టుకి కట్టిపడేస్తారు. దేవయాని అతను రాకపోవడంతో మిక్కిలి బాధపడి తండ్రికి తెలిపితే తండ్రి దివ్యదృష్టితో చూసి మృత సంజీవనితో బ్రతికిస్తాడు. మరొకసారి అడవిలో పూలకోసం పోయిన కచుడిని చంపి కాల్చి ఆ బూడిదినం మద్యంతో కలిపి శుక్రునిచే త్రాగించారు.

దేవయాని దుఃఖిస్తూ కచుడు ఇంటికి రాని సంగతి తెలిపితే మొదట పట్టించుకోడు. 'వానిని జూచి గాని కుడువనొల్ల' అని ఏడుస్తుంటే శుక్రుడు తన గర్భంలో ఉన్న కచుడిని గుర్తించడమే గాక మద్యపానం వలన జరిగే అనర్థాల్ని గుర్తిస్తాడు.

**"మొదలి పెక్కు జన్మముల పుణ్య కర్మముల్**
**పెరుగు బెక్కు సేసి పడయబడిన**
**యట్టి యెఱుక జనులకాక్షణం మాత్రన**
**చెఱచుమద్యసేవ సేయనగునె?"**

పుణ్య కర్మల వల్ల లభించిన జ్ఞానం కూడా నశిస్తుందని తెలిపాడు. మద్యపాన దుష్ఫలితాన్ని తెలిపే రుచిరార్థ సూక్తిగా దీనిని గుర్తించాలి.

**"భూసురులాదిగ గల జను**
**లీ సుర సేవించి రేనియిది మొదలుగ బా**
**పాసక్తి బతితులగుదురు**
**చేసితి మర్యాద దీనిని జేకొనుడు జనుల్"**

మద్యపానం ఎవరూ సేవించకూడదని మర్యాద అంటే నియమం చేశాడు. ఆనాడే గుర్తించారు అనర్థం. మద్యపానం వల్ల జ్ఞానం పోవడం స్పృహని కోల్పోవడం జరుగుతుంది. తాగిన వారు గృహహింస, యాక్సిడెంట్స్, అవినీతి... ఒకటేమిటి అనేక నేర ప్రవృత్తులు వారిలో పెరుగుతాయనేది నేటికీ ఎంతో సత్యవంతమైన విషయమే.

దుష్యంతోపాఖ్యానంలో శకుంతలని గాంధర్వ వివాహం చేసుకున్న దుష్యంతుడు సమాజ భయంతో కణ్వాశ్రమం నుండి బిడ్డతో వచ్చినామెని తిరస్కరించాడు. వివాహము కాకుండానే బిడ్డని పొందడంతో కుంతి కసాయి తల్లిలా బిడ్డని నీటిలో విడిచిపెట్టింది. వివాహ వ్యవస్థపై సమాజానికి ఉన్న పట్టు వివాహేతర సంబంధాల లోని పునరుత్పత్తి వలన భయం, స్త్రీపురుషులు ఇరువురికి అధికార ధన బలం ఉన్నవాళ్లకి కూడా ఉందనే విషయం తేటతెల్లమవుతుంది.

శకుంతలోపాఖ్యానం నన్నయ రుచిరార్థ సూక్తినిధిత్వానికి నిదర్శనం. పుత్రగాత్ర పరిష్వంగ సుఖం, సూనృతవాక్య గొప్పతనం.. గురించి చెప్పిన ఎన్నో సూక్తులు కనబడతాయి. అంతేకాదు స్త్రీ దయనీయమైన స్థితి కూడా తెలుస్తుంది. శకుంతల ఎంత బ్రతిమలాడినా –

**"ఏనెట? నీవెట? సుతుడెట?**
**నేనెప్పుడు తొల్లిచూచి యెఱుగను నిన్నున్**
**మానిను లసత్యవచనలు**
**నానిట్టుల సత్యభాషణం బుచితంబే?"**

అయుక్తంబులైన పలుకులు నీవి. నీ ఆశ్రమానికి పొమ్మంటాడు. తీవ్రమైన దుఃఖంతో శకుంతల విచారిస్తూ వెనుతిరిగితే అశరీరవాణి ఈమె సాధ్వి అని చెప్పడంతో దుష్యంతుడు తాను పాణిగ్రహణం చేశానని చెప్తాడు.

**"అన్యులనెఱుగమిజేసి**
**లోకాపవాదభీతినెతిగియు**
**నిత్తన్విభీతితప్పియెఱుగనంటిని**
**నిందఱకిప్పుడెఱుగుజెప్పెనాకాశవాణియచ్చెరువుగాక"** అని

పుత్రుడిని, శకుంతలని గ్రహిస్తాడు.

నేటికి కూడా ఎందరో మహిళలు ఇలా మోసపోవడాలు అసహాయ స్థితిలో ఉండడం కనిపిస్తుంది. నాడు అశరీరవాణి పలికితే నేడు చట్టాలు స్త్రీల రక్షణకి వచ్చాయి. అయినా ఇబ్బందులు తప్పడంలేదు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2023

ఈ కథలో నన్నయ నిజాయితీ తెలుస్తుంది. దుష్యంతునికి సమాజం పట్ల ఉన్న భయాన్ని అబద్ధమాడిన వైనాన్ని ఉన్నది ఉన్నట్టుగా రచించి పాఠకులకి శకుంతల పాత్ర పట్ల సానుభూతి పెరిగే విధంగా రచించారు. కాళిదాసు మాత్రం ఆభాస కల్పించి అది కూడా శకుంతల మైమరపువల్లనే దూర్వాసుని శాపం పొందినట్టుగా కల్పించి కావ్య రచన చేశారు. పురుష పాత్ర ఔన్నత్యం కొరకు తాపత్రయపడ్డారు. కానీ నన్నయ మాత్రం ఎలాంటి కల్పనలు లేకుండా వాస్తవికంగా పురుషుని సమాజ భయాన్ని, మోసకారితనాన్ని బయటపెట్టారు. శకుంతల పట్లే పాఠకుడికి సానుభూతి కలిగేటట్టుగా శకుంతల వేదనని ఈ విధంగా తెలిపారు.

**“తడయక పుట్టిన నాడ తల్లి చే తండ్రిచే విడువ**
**బడితి, నేనిప్పుడు పతి చేతను విడివబడియెదనొక్కొ!**
**నుడువులు వేయునింకేల? యిప్పాటి నోములుతొల్లి**
**కడిగి నోచితినిగాకేమి’ యనుచును గందె డెందమున.”**

శకుంతల వేదనలో పాఠకుడు కూడా మమేకమై మనసు సున్నిత పడేటట్టు చిత్రించారు. సాహిత్యం ప్రధాన లక్ష్యం మన మనసులో మొరటుదనాన్ని తగ్గించి సున్నిత పరచడమే. ఆ పని చేయడంలో నన్నయ నేర్పరితనం చాలా గొప్పది.

తర్వాత గంగాశంతనుల కథలో గంగాశంతనుల సంగమం, అష్టవసువుల వృత్తాంతం తెలిపారు. ఈ రెండింటి ద్వారా సార్వజనీన సామాజిక విలువల్ని ప్రజలకు అందించారని స్పష్టంగా చెప్పవచ్చు. నేడు మనం దేనిని సామాజిక విలువగా గుర్తిస్తున్నాము అదే ప్రాచీన కాలంలో ధర్మం అని వ్యవహరించేవారు. ఈ సామాజిక విలువల పట్ల అవగాహన స్పష్టత ఆచరణే వ్యక్తిత్వ వికాసం. ధర్మం అనేది కూడా కాలాన్ని బట్టి దృక్పథం మారినప్పుడు మారుతుంది. స్త్రీ ధర్మాలు కుల ధర్మాలలో ఆధునిక యుగంలో మార్పుని మనం గుర్తించగలం. అయితే కొన్ని ధర్మాలు మన గలిగినవి కాలానికి నిలబడగలిగినవి ఉంటాయి. వీటినే సార్వజనీన సామాజిక విలువలు అంటారు. వీటిని గంగాశంతనుల కథలో గుర్తించగలం. శంతనుడు పూర్వ జన్మలో మహాభిషుడు.

మహాభిషుడు ఉత్తమ ధర్మ పరుడై వేయి అశ్వమేధ యాగాలను, నూరు రాజసూయ యాగములు చేసి, దేవతలను సంతృప్తి పరచి స్వర్గలోక ప్రాప్తిని పొందుతాడు. ఒకానొక రోజు బ్రహ్మదేవుని కొలువులో బ్రహ్మని సేవిస్తున్న సమయంలో గంగాదేవి స్త్రీ రూప ధారిణియై వస్తుంది. ఆ సందర్భంలో –

**“ఊరుమూలమేర్పడ గన యువ్విద వలవు**
**దొలగె ననిలంబు చేత విదితమగుచు**
**నమరులెల్ల బరాన్ముఖులైరి దాని**
**సాభిలాషుడై చూచె మహాభిషుండు?**

గంగాదేవి వస్త్రము తొలిగి సౌందర్యం బహిర్గతమైతే అమరు లందరూ ముఖాన్ని పక్కకి తిప్పుకున్నారు. ఇది దేవతల లక్షణం. ఇంద్రియనిగ్రహం కలిగి ఉండడం ఉత్తమ లక్షణం. స్త్రీ శరీర సౌందర్యం కనిపించినంత మాత్రాన కాముక దృష్టితో చూడకూడదు కదా! మహాభిషుడు మాత్రం నిగ్రహం కోల్పోయి అభిలాషతో ఆమెని చూస్తాడు. అది గమనించిన బ్రహ్మదేవుడు సమయాసమయములు లేని అతని కాముక దృష్టిని సహింపడు.




**“దానినెరిగి కమలయోనివానికి గరమల్గి**
**మర్త్యయోనియందు బుట్టు**
**మనుచు శాపమిచ్చి నొనరగ వాడును**
**కరము భీతియు గరయుగంబు మొగిచె”**

అని శాపానికి గురయి శతసహస్ర యాగాల వలన లభించినదంతా నిగ్రహం కోల్పోయిన క్షణంలోనే కోల్పోయాడు. స్త్రీ వస్త్రం తొలగి సౌందర్యం కనిపించినంత మాత్రాన కాముకత్వము ప్రదర్శించడం సమంజసం కాదనే సత్యం బోధపడుతుంది. నేడు అత్యాధునిక కాలంలో నిగ్రహం కోల్పోయిన పురుషుడు తప్పుగాని స్త్రీల వస్త్రధారణ పై నియంత్రణ సమంజసం కాదనే సార్వకాలీన విలువ అవగతం అవుతుంది. స్త్రీల వస్త్రం గాలి వల్లనో, పనిపాటల వల్లనో, పాలిచ్చునపుడో.. ఇలా అనేక సమయాలలో తొలగవచ్చు . అంత మాత్రాన ఆమెని లైంగికదృష్టితో చూడడం సమంజసం కాదు.

**“రెండు కళ్ళ నుంచి / చూపులు**
**సూదుల్లా వచ్చి / మాంసపుముద్దలపై**
**విచ్చలవిడిగా తిరుగుతుంటాయి”**

(నీలిమేఘాలు192పేజీ)

అని చూపుల వికృతం, ఎల్లవేళలా స్త్రీని లైంగిక పరంగా చూడటాన్ని తప్పు పడతారు. అలా చూసినవాళ్లు శిక్షార్హులే. నేడు శిక్ష నాడు శాపం.

మహభిషుడు స్వర్గ స్థానమనే ఒక ఉన్నత స్థితి నుండి భూలోక జీవనమనే కింద స్థాయి

పొందవలసి వచ్చింది. నేడు నిర్భయ అత్యాచార కేసు తర్వాత కూడా ఎంతగానో చర్చ జరిపారు. స్త్రీల వస్త్ర ధారణ వలనే అత్యాచారాలు, హింస, జరుగుతున్నాయనే వాదన చాలామంది చేశారు. వాళ్ళు గంగా శంతనుల కథ తెలుసుకుంటే, పురుషుని చూపుల్లో దోషం ఉ ండకూడదనే ఒక సామాజిక విలువ స్పష్టం అవుతుంది .

గంగాదేవి నేరుగా భూలోకమునకు వచ్చి ప్రతీపుని కుడి తొడమీద కూర్చుని ఇలా అంటుంది.

**"ఏను జహ్నుకన్య నింద్రసమాన! నీసద్గు**
**మానవులకు సంతసిల్లి**
**భాను తేజ నీకు భార్యగా వచ్చింది**
**నిష్టమున పరిగ్రహింపు నన్ను"**

నీ మంచి గుణాలకు సంతోషించి నీకు భార్యను అవుదామని వచ్చాను. ప్రీతితో స్వీకరింపు మంటుంది.

**"అనిన ప్రతీపుడిట్లననియె, నంబరుహానన అగ్నిసాక్షికం**
**బున పరిణీత అయిన సతిబొల్పుగ నొక్కత గాని యన్యలన్**
**మనము నేనియుం దలప మానిని! యిట్టి జితాత్మనన్ను ని**
**ట్టని పలుకంగ నీ కగునె? యన్యుల బలికినయట్ల బేలవై"**

అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యని కాక ఇతరులని మనసులో కూడా తలవడు. కొంతమంది శారీరకంగా వ్యభిచరించకపోయినా మానసికంగా వ్యభిచరిస్తారు. కానీ ధర్మశీలుడు అయిన ప్రతీపుడు ఆత్మ నిగ్రహం కలవాడు. కనుక్కునే బేలవే ఇలా అడుగుతున్నదని కుడి తొడ మీద కూర్చున్నది కనుక తన పుత్రుని వివాహం చేసుకోమంటాడు.

గంగ **"అదియు నట్లచేయుదునని అదృశ్యమయ్యె"**. ఇది స్వేచ్ఛ. ఇంతటి మానసిక పరిపక్వత, జితేంద్రియత్వం ఎదుటివారిని ఇష్టానిష్టాలపై గౌరవం ఉంటేనే లైంగిక స్వేచ్ఛకి వీలు పడుతుంది. గంగ తన అభీష్టం వ్యక్తం చేసింది కానీ ప్రతిగా ఇప్పుడు తన మానవ న్యాయంతో కాదనగానే ఎటువంటి అసంతృప్తి వ్యక్తం చేయకుండా వెళ్ళిపోయింది. పెళ్లి ప్రేమ అనేది ఇద్దరి ఇష్టయిష్టాలకి సంబంధించి నవి. ఏ ఒక్కరి ఇష్టం కాకపోయినా మరొకరు నిగ్రహం చూపవలసిందే. అంతేగాని యాసిడ్ దాడులు, బ్లేడు కోతలు ఏమి, ఉరితీతలు ఊరిపోసుకోవడాలు ప్రేమహింసలాంటివి చేయకూడదనే సత్యవంతమైన సామాజిక విలువ గంగ పాత్ర ద్వారా వ్యక్తమౌతుంది.

అష్టవసువు వృత్తాంతం ద్వారా కూడా పరవస్తు వ్యామోహం, సంగ్రహం ఎంతటి తప్పిదాలో స్పష్టమవుతాయి. అష్టవసువులు వశిష్ట శాపమున భూలోకమునకు వస్తుంటే దుఃఖితులైన వారిని చూసి గంగ యెంతో ప్రీతితో, కాంతివిహీనులై స్వర్గానికి వదిలి వెళ్ళుటకు కారణమడుగుతుంది. వశిష్ట మహాముని శాపం గురించి చెప్పి నీకు పుత్రులుగా పుడతాము అని, పుట్టిన వెంటనే నీళ్ళలో వేయమని అడుగగా గంగ కరుణతో అంగీకరిస్తుంది. ఒక్క కొడుకు దీర్ఘాయువు కలవాడే ఉండేవాడు. కావాలని అడిగితే అష్టమవసువు ఆ విధంగానే జన్మిస్తాడని పెద్ద కాలం భూలోకంలో ఉంటాడని పేర్కొంటారు.

గంగాదేవి ఎదుటివారి దుఃఖాన్ని పోగొట్టే దయామయి ఈ సందర్భంలో అష్టవసువులు ఇక్కడ 'శాప ప్రకారం నుంచి నెఱింగించి' అంటారు గాని పూర్తి విషయం తెలపరు. పాఠకుడికి ఉత్కంఠ కలుగజేసే కథన పద్ధతి వాడారు నన్నయ్య. ఈ శాప కారణం గంగశంతనుని వదిలి వెళ్ళే సందర్భంలో మాత్రమే చెబుతుంది వశిష్ట మహాముని శాపం వలన భూలోక మార్గం పట్టిన అష్టవసువులని గంగాదేవి చూపించి వారి దయ్యాన్ని శోకాన్ని భరింపలేక అది పోగొట్టే ప్రయత్నం సామాజిక విలువ.

వశిష్ట మహామునికి నందిని అనే హోమధేనువు కావలసిన వస్తువులు సమకూరుస్తుంది. అష్ట వసువులు భార్యలతో క్రీడార్థం వచ్చి అది గమనిస్తారు. ఈ ధేనువు వల్లనే ఈ ముని పదివేల ఏండ్లు జర, రుజ రాకుండా ఉండగలుగుతున్నారని సత్యాన్ని గ్రహిస్తారు. అష్టమ వసువు ప్రభాస్ భార్య దాన్ని తన ప్రియసఖి జితవతికి బహుమతిగా ఇస్తానంటే ప్రణయిని నీ మాటలకు లొంగి సోదరుల చేత ప్రేరేపితుడే ప్రభాసుడు వశిష్ఠుడు హోమధేనువు పట్టుకుని పోతాడు. అప్పుడు ఆ ముని –

**"మనుజ యోని పుట్టుదని వారికప్పుడు**
**కోపమడరమునియు శాపమిచ్చె**
**భయము వొంది వివసులై వచ్చి**
**వారును వినయ మొనర నిట్టు లనిరిమునికి"**

ప్రేరేపించిన వారు మాత్రమే మొదటి ఏడుగురు వసువులు ధేనువును దొంగిలించినది ప్రభాసుడు ప్రధానుడు. కనుకనే పెద్ద కాలం భూలోకంలో భీష్ముడుగా ఉండవలసి వచ్చింది . పరద్రవ్యాపేక్ష అనేది నాటికి నేటికి ఏనాటికైనా శిక్షార్హులే కదా

గంగాశంతనుల కథ ద్వారా మూడు విలువలు స్పష్టమవుతాయి. మొదట స్త్రీని సమయ సందర్భాలు లేకుండా లైంగిక దృష్టితో చూడకూడదు. రెండవది లైంగిక స్వేచ్ఛకి ఉన్న పరిమితి. మూడోది పరద్రవ్యాపేక్ష బహు ప్రమాదం అనేది.

ఇవి ప్రాచీన కాలంలోనైనా ప్రపంచీకరణ కాలంలోనైనా సార్వజనీనసామాజిక విలువలే.

**ఆధార గ్రంథాలు :**

1) నన్నయభారతం -టిటిడి ప్రచురణ 1988

2) స్త్రీ వాద కథలు–స్త్రీలజీవతచిత్రణ– అయ్యగారి సీతారత్నం వెలుగు ప్రచురణ -20006

3) ఆంధ్ర సాహిత్య శిల్ప సమీక్ష -పింగళి లక్ష్మీకాంతం- విశాలాంధ్ర పబ్లిషింగ్

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2023

# వడ్డేపల్లి గేయాల్లో కవితా సౌందర్యం

**మహీపాల్ లక్ష్మిగళ్ళ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9701 695 932

ఆధునిక తెలుగు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్ఠులైన గేయకవుల్లో వడ్డేపల్లి కృష్ణ ఒకరు. పలికిందల్లా పద్యంగా, రాసిందల్లా గేయంగా తన ప్రతిభను ప్రదర్శించుకున్న కవి ఆయన. ఆయన తన సాహిత్య ప్రస్థానంలో ఎన్నో పద్యాలు, గేయ కవితలు, వచన కవితలు, వ్యాసాలు రాసినప్పటికినీ ఆయన కలం వాడి అంతా గేయ ప్రక్రియ లోనే స్పష్టంగా తన ముద్రను ప్రతిష్ఠించుకున్నదనడంలో అతిశయోక్తి లేదు. చిన్న వయసులోనే నరనరాన సృజనాత్మక శక్తిని నింపుకొని సాహిత్య రచన చేస్తూ వచ్చాడు వడ్డేపల్లి. దానికి కారణం ఆయనలోని నిరంతర అధ్యయన శీలతయే. దానితోపాటు శ్రీశ్రీ, దాశరథి, సినారె లాంటి మహాకవుల గేయాల ప్రభావం ఆయనపై ఉండడమే.

గేయమనేది మాత్రాఛందో విశేషం. వడ్డేపల్లి గేయ రచనలో తన పటిష్ఠతను, విశిష్టతను కనబరచడమే కాదు, ఆయన రచనల్లో అధిక భాగం అనగా నూటికి 90 శాతం గేయాలే ఉండడం మరో విశేషం. తన గురువులైన కనపర్తి లక్ష్మీనరసయ్య, నందగిరి అనంతరాజ శర్మ గార్ల ప్రోత్సాహంతో గేయ ఛందస్సును ఆకళింపు చేసుకొని కవిత రచనను మొదలుపెట్టాడు. నిరంతర సాధనతో, అధ్యయనంతో నిగ్గు తేలిన వీరి ప్రథమ కవిత కూడా గేయమే కావడం విశేషం. ఆ కవితా శీర్షిక **'ఎవడెరుగును?'** స్రవంతి మాస పత్రికలో 1968 జూన్ లో ప్రచురితమైంది.

ఆ గేయం మొదలు నేటికీ ప్రణయం, ప్రబోధం, జానపదం, విషాదం మొదలగు వస్తు వైవిధ్యంతో ఎన్నెన్నో అద్భుతమైన గేయాలు రాశాడు వడ్డేపల్లి. ప్రతి గేయంలో అద్భుతమైన భాషాపటిమా, భావగరిమ తొణికిసలాడతాయి. భాష, భావం రెండూ పోటీపడి సాగుతాయి ఆయన గేయాల్లో. శిల్పం, అభివ్యక్తి రెండు కూడా అతని గేయ కవితల్లో నిండుగా భాసిస్తాయి. ఆయన గేయాల్లో పదప్రయోగా లకు కొదవే లేదు. ఆయన రాసిన గేయాలు అసంఖ్యాకంగా ఉన్నాయి కాబట్టి ఈ వ్యాసం దృష్ట్యా ఆయన రాసిన కొన్ని గేయాల్లోని కవితా సౌందర్యాన్ని పరిశీలిద్దాం.

**1) ప్రగతి గేయాలు :**

మనిషి తన జీవన ప్రయాణంలో ఎన్నో అవరోధాలు, ఆటంకా లను ఎదుర్కొంటూ నిరాశ నిస్పృహలకు లోనవుతూ ఉంటాడు. అటువంటి సమయంలో వారికి ప్రేరణ అవసరం. ఆ ప్రేరణను కలిగిస్తూ నిరాశ, నిస్పృహలను దూరం చేస్తూ వారిలో నూతన ఉత్తేజాన్ని నింపుతూ నిత్య జాగరూకతతో ప్రగతిపథం వైపు నడిచేలా చేస్తాయి వడ్డేపల్లి ప్రగతి గేయాలు.

**"అదిగదిగో ఆశించే సుదినమ్మే రానున్నది**
**అందరినీ అలరించే నందనమే కానున్నది**
**నిన్నటి కష్టాల తలచి నిరాశలో మునగబోకు**
**రేపటి భావిని మరచి రెక్కలనే ముడుచుకోకు"**

'సుదినమ్మే రానున్నది' (రాగరథం– పుట. 11)



పై గేయంలో మనిషికి ఆశా దృక్పథాన్ని కలిగిస్తున్నాడు. నిరాశలో నిండి, కృంగి, కృశించిపోతున్న మానవ జగత్తుకు రాబోయే భవిష్యత్తు ఎంత సుందరంగా ఉంటుందో భావస్ఫోరకంగా స్పష్టంగా వివరించి చెబుతున్నాడు. ప్రతి మనిషి ఆశించే ఆ మంచి రోజు రాబోతుందని చెబుతున్నాడు. సుఖాలతో సౌభాగ్యాలతో తులతూగే రోజులే కదా! ప్రతి మనిషి కోరుకునేవి. ఆ రోజుల కోసం సాగే నిరీక్షణ ఫలిస్తుందని తెలియజేస్తున్నాడు. అది అందరినీ అలరించే బృందావనంలో కళకళలాడుతూ ఉంటుందని కూడా చెబుతున్నాడు. నిన్నటి కష్టాలను తలుచుకుంటూ బాధపడడం నిరాశలో మునిగిపోవడం మనిషి లక్షణం కాదంటున్నాడు. రేపటి రోజులను మరిచి పోయి రెక్కలను ముడుచుకునే సంకుచితత్వం సరికాదని హితబోధ చేస్తున్నాడు. సంకుచిత భావంతో బతకడం అంటే ప్రగతికి ప్రతిబంధకమే కదా! ఆశావాహ దృక్పథంతో తరలినప్పుడే కదా! ప్రగతి సాధించినట్టు. ప్రగతికి సోపానాలు వేసినట్టు.

**"జాతిని జాగృతము చేయు / నీతిని యిక పాడుదాం!**
**చేతన కేతనము తోడ / చేయి కలిపి సాగుదాం!**
**సామాన్యుడు సారథిగా / సాగే సమ సమాజమును**
**ధరిత్రిలో నిలుపుదాం! / చరిత్రనే మలుపుదాం!**

**సుగతి జేర్చు, వెతల దీర్చు / సుందర స్వప్నాల కూర్చు**
**ప్రగతిని పరిపాలిద్దాం! / జగతినెల్ల వెలిగిద్దాం!"**

'జాతిని జాగృతం చేయు' (రాగరథం – పుట.13)

పై గేయ పంక్తుల్లో జాతిని జాగృతం చేయు పాటనే పాడమంటున్నాడు. తన జాతి ప్రజలను మేలుకొలిపే గీతమై నడవమన్నదే ఇక్కడ కవి సందేశం. చేతనమనే పతాకాన్ని పట్టుకొని అందరూ ఒక్కటై సాగాలని బోధిస్తున్నాడు. సామాన్య మానవుడిని సారథిగా చేసుకొని ముందుకు నడిచే సమ సమాజాన్ని నెలకొల్పాలన్న ఆశయం ఈ గేయ పంక్తుల్లో ధ్వనిస్తుంది. సామాన్యుడిని నాయకునిగా చేసే సమాజాన్ని స్థాపించాలన్న శ్రీశ్రీ లక్ష్యం ఈ కవితలో కనబడుతుంది. అంటే నవ్య సమాజాన్ని నెలకొల్పాలనే సంకల్పంతో కవి ఉన్నాడిక్కడ. ఆ సమాజానికి సామాన్యుడిని సారథిగా ఎంచుకున్న తలపులో సమానత్వం కనబడుతుంది. ధనవంతుడని, బీదవాడని తేడాలేని నూతన సమాజం కోరుకుంటున్న తీరు స్పష్టమవుతుంది. అలాంటి దివ్య సమాజం సరికొత్త ప్రపంచం ఈ ధరణిలో నిలిపి చరిత్ర గతినే మలుపు తిప్పాలి అంటున్నాడు. మంచి మార్గాన్ని చేర్చి, బాధలన్నింటిని తొలగించి, కలలు కన్న అందమైన స్వర్గాన్ని కళ్ళముందు నిలబెట్టి, ప్రగతిని పరిపాలించాలని, జగతిని వెలిగించాలని కోరుకుంటున్నాడు.

**2) ప్రణయ గేయాలు :**

లాలిత్యమైన పదబంధాలతో అందమైన ప్రణయ గేయాలు రాయడంలో వద్దేపల్లి కృష్ణ నేర్పరి. రమణీయమైన భావుకతతో ఆయన సరస సుందరమైన ప్రణయ గేయాలెన్నో రాశాడు. వాటిలో మచ్చుకు రెండు గేయాలను పరిశీలిద్దాం.

**"నవ్వకే నా దేవి! నలుగునే కెమ్మోవీ!**
**నవ్వితేనే చాలు నవరత్నాలు రాలు!**
**నడవకే నా రాణి! నడవకే అలివేణి!**
**నడకలో రాయంచ నటనలే కదిలేను!**
**పలుకకే పూబోణి! మధుర మంజులవాణి!**
**పలుకులో కోయిలల పాటలే కదిలేను"**

'నవ్వకే నా దేవి' (వద్దేపల్లి గేయవల్లి– పుట.99)

ఇక్కడ ప్రేయసిని నవ్వకు, నడవకు, పలుకకు అంటున్నాడు అది వద్దేపల్లి ప్రత్యేకత. సాధారణంగా ప్రేయసిని వర్ణించేటప్పుడు తన నవ్వును చూడాలని, నడకలను మనసారా పరికించాలని, పలుకులను పదేపదే వినాలని కోరుకుంటారు కవులు, ప్రేమికులు. కానీ ఆ ప్రేయసి నవ్వితే ఆమె మోము నలుగుతుందట. ఆ నవ్వులో నవరత్నాలు రాలుతాయట. అందుకే నవ్వొద్దని అంటున్నాడు. ఆమెను నడవవద్దంటున్నాడు. ఆమె నడకలు రాయంచ (రాజహంస) ఠీవీ కనబడుతుందట.ఆమె సొగసు, వయ్యారం నడిస్తే కందిపోతా యేమో అన్న భావనతో నడవ వద్దంటున్నాడు. ఆమె తీయని, మృదువైన మాటలు కలిగినదే అయినా మాట్లాడవద్దంటున్నాడు. ఆమె పలుకుల్లో కోయిల పాటలు కదలాడుతాయట. అందుకే గళం నొచ్చుకుంటుందేమోనన్న భావన. నడవవద్దని, మాట్లాడవద్దని అంటే ఆమె నడక, నవ్వు, మాట మృదువుగా లేవని భావన కాదు. మరీ మృదువన్న భావన. ఇదీ వద్దేపల్లి కవితలోని అంతర్నిగూఢంగా పరిమళించే సౌందర్యం.

**"అభినయించవే.. వన మయూరిలా..**
**నను వరించవే.. ప్రియవయారిలా..**
**అభినయించవే.. నను వరించవే..**
**అంతరంగమున అధివసించవే..**
**తరుణారుణ కిరణంలో తరలిరా! వడివడిగా..**
**కడలిలోని కెరటంలా కదలిరా! సవ్వడిగా.."**

'అభినయించవే' (వద్దేపల్లి గేయవల్లి – పుట. 126)

తన ప్రేయసిని నెమలిలా నాట్యం చేయమంటున్నాడు తను ఇష్టపడే సఖితో తనను వరించమని కోరుకుంటున్నాడు. వనమయూరి, ప్రియమయూరి వంటి సమతతో ధ్వనించే పదబంధాల ప్రయోగం దాశరథి, సినారెల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వారి ప్రభావం వద్దేపల్లిపై ఉందన్నదానికి ఇదొక మచ్చుతునక. తన మనసున స్థిరంగా ఆసీనమై పొమ్మంటున్నాడు. అరుణ కిరణంలా వేగంగా తరలి రమ్మంటున్నాడు. సూర్యుని కిరణం చాలా వేగంగా సూక్ష్మంగా దూసుకుపోతుంది కాబట్టి సూర్యుని కిరణాన్ని ఉపమానంగా ప్రేయసికి వాడడం ఇక్కడి ప్రత్యేకత. అంతేకాకుండా సూర్యుని కిరణం చాలా తేజోవంతమైనది. తన ప్రేయసి ముఖారవిందం కూడా తేజోవంతమైనదనే భావన ఇక్కడ స్ఫురిస్తుంది. సముద్రంలోని కెరటంలా శబ్దం చేస్తూ ఉవ్వెత్తున తనకై కదలి రమ్మంటున్నాడు ప్రవాహవేగంతో ఇది వద్దేపల్లి కమనీయ భావ విస్మృతికి మచ్చుతునక.

**3) ప్రకృతి గేయాలు :**

ప్రకృతిలో పరవశిస్తూ పాడే ఆనందమయ గేయాలివి. ఇవి లలిత గీతాల కోవకే చెందుతాయి.

**"ఈ ఉగాది శుభవేళ నవ వసంత సుమహేళ**
**పరిమళించు జగమంతా పరవశించు రసలీల**
**చేదు తీపి కలయికతో చేరవచ్చు యీ యుగాది**
**బ్రతుకులోని సుఖదుఃఖాలెరిగించే ఒక పునాది**
**మోడులన్ని మొగ్గలతో మోదము కలిగించాలి**
**బీడులన్ని పంటలతో సౌఖ్యాలందించాలి"**

'ఈ ఉగాది శుభవేళ' (వద్దేపల్లి గేయవల్లి – పుట.87)

పై గేయంలో ఉగాది పర్వం మన బతుకుల్లో, మన మనసుల్లో ఎలాంటి నూతనోత్తేజాన్ని కలిగిస్తుందో తెలియజేస్తున్నాడు. ఉగాది రాకతో ప్రకృతి అంతా పూలపండుగలా జాతర చేస్తూ సరికొత్తగా ముస్తాబవుతూ కంటికి విందు చేస్తుంది. జగమంతా ఆ పూల పరిమళాలతో పరవశించి ఆనంద డోలికల్లో తేలియాడుతుంది. చేదు,

తీపి రెండింటినీ వెంట తీసుకొచ్చే పండగ ఇది. మన బతుకుల్లో సుఖము, దుఖము రెండూ ఉంటాయని వివరిస్తూ మన జీవితానికి ఒక పునాది అవుతుందీపండుగ. మోడులన్నీ మొగ్గలు పూసి సంతోషాన్ని కలిగించాలని, బీడు భూములన్నీ పంటలతో మనకు సుఖసంతోషాలు అందించాలని కోరుకుంటున్నాడు కవి. శిశిరం పోయి వసంతాగామనంతో ఆశ మొగ్గ తొడిగినట్టు అవుతుంది. ఉగాది మనకు ఒక సందేశాన్ని ఇస్తుంది. కవి ఈ గేయంలో ప్రకృతి సాక్షిగా సందేశాన్ని ఇచ్చాడు.

**"తూరుపు భామిని చేసిందీ**
**తరుణకిరణ అరుణోదయస్నానం**
**తన్మయ హృదయం చేసిందీ**
**లలిత గీత చరణోదయగానం**
**ఇరుల కురులనే ఆరబోసుకొని**
**మంచు ముత్యముల హారమేసుకుని**
**వయ్యారముగా అడుగిడుతూ**
**ఉషారాణి నటియించింది"**

'తూరుపు భామిని చేసింది' (వద్దేపల్లి గేయవల్లి – పుట.89)

పై గేయంలో అత్యద్భుతమైన ఉత్ప్రేక్ష కనపడుతుంది. వద్దేపల్లి కల్పనా పటిమకు ఇది ఒక నిదర్శనం. తూర్పు అనే స్త్రీ సూర్య కిరణాలతో, సూర్యోదయంతో స్నానం చేసిందట. అది చూసి పులకిస్తున్న హృదయం లలిత గీత చరణాలను గానం చేసిందట. చీకట్లనే వెంట్రుకలను ఆరబోసుకొని, మంచు అనే ముత్యాలహారం వేసుకొని వయ్యారంతో నడుస్తూ ఉషారాణి అనగా ఉష అనే కన్య నాట్యం చేసిందట. ఇది ప్రకృతి కాంతను పరమ రమణీయంగా వర్ణించడం. భావ దృష్టి ఎంతో సొగసుగా ఉంది ఈ గేయంలో.

**4) ప్రస్తుతి గేయాలు :**

జాతిని, త్యాగధనులను, మాతా పితరులను, దైవాన్ని, చారిత్రక పురుషులను కీర్తిస్తూ రాసిన గేయాలివి. భక్తి పూర్వకంగా, గౌరవపూర్వకంగా కీర్తిస్తూ రాసిన గేయాలు ఎన్నో ఆకాశవాణిలో, దూరదర్శన్ లో పలుమార్లు ప్రసారమయ్యాయి.

**"తేనెలోలుకు తెలుగుపాట పాడుకొందునోయీ!**
**తెలుగుతల్లి ఒడిలోపల ఆడుకొందునోయీ!**
**ఝరులలోన గిరులలోన పుట్టిన ఈ పుడమిలోన**
**ఆడుకొందునోయీ! ఆదమరతునోయీ!"**

'తేనెలొలుకు తెలుగు పాట' (వద్దేపల్లి గేయవల్లి – పుట.147)

తేనెలొలికే తెలుగు పాటనే తాను పాడుకుంటానన్నాడు వద్దేపల్లి. తెలుగు తల్లి ఒడిలోపల ఆడుకుంటానంటున్నాడు. తెలుగుజాతి, తెలుగు భాష, తెలుగు మాట అమరం. అమరమైన తెలుగుతనాన్ని తెలియజేయడానికి తెలుగు భాషలోనే పాట రాయడం మరీ విశేషం. తెలుగు తల్లి మనకందరికీ తల్లి. కన్నతల్లులకే కన్నతల్లి. అలాంటి తెలుగు తల్లి ఒడిలో నిత్యం ఆటలాడుతూ పరవశించమంటున్నాడు. సెలయేళ్లలో, పర్వతాలలో పుట్టిన ఈ పుడమిలో ఆడుతూ ఆదమరచి విహరిస్తానంటున్నాడు. తన్మయత్వంతో ఉన్న మాతృభాషా ప్రేమికుల అంతరంగాన్ని ఈ గేయంలో పట్టి చూపించాడు.

**"భరతభూమి నాగేహం భారతజాతి నాదేశం**
**మంచిని పరిపాలించే మానవతకు దాసోహం**
**మువ్వన్నె పతాకంతో ముల్లోకాలేలుతాను**
**అహింసా ప్రభావంతో అవనిని అలరారుతాను"**

'భరతభూమి నా గేహం' (వద్దేపల్లి గేయవల్లి – పుట.148)

తెలుగు తల్లిని కీర్తించిన హృదయంతోనే భరతమాతను కీర్తిస్తున్నాడు. భరతజాతి ఖ్యాతిని గుండెతో చాటి చెబుతున్నాడు. భరతభూమియే తన ఇల్లుగా, భరతజాతియే తన దేహంగా భావిస్తున్నాడు. మాతృదేశాన్ని మనస్ఫూర్తిగా గేయ మాలికతో అర్చిస్తున్నాడు. మంచిని పరిపాలించే మానవత్వానికి సాగిలపడి నమస్కరిస్తున్నాడు. మూడు రంగుల పతాకంతో ముల్లోకాలేలుతానని ఆత్మశక్తిని ప్రదర్శిస్తున్నాడు. అహింస యొక్క శక్తి ప్రభావంతో అవని అంతట అలరారుతాననీ నిండు మనసుతో అంటున్నాడు. భారతీయుడి ఆత్మగౌరవం, దేశభక్తి ఈ గేయంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

వద్దేపల్లి కృష్ణ రాసిన గేయాలెన్నో పలు పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో ప్రసారమై మనల్ని అలరించాయి. అలరిస్తూనే ఉన్నాయి. "కనరా నీ దేశం"(1971), "యువ స్వరాలు"(1973), "రాగరథం" (1981), "కాంతి కవాటం" (2017), "వెలుగుమేడ" (1976) మొదలగు గేయ సంపుటులెన్నో ఆయనకున్న గేయ కవితా పటిమను ప్రదర్శిస్తాయి. సమకాలీన సమాజంలోని వివిధ పార్శ్వాలను కవితాంశాలుగా తీసుకొని ఆయన గేయాలు రాశాడు. అవి వస్తు వైవిధ్యంగా, భావ గాంభీర్యంగా ప్రకాశించడం మరో విశేషం.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1) వద్దేపల్లి గేయవల్లి (1995) ప్రథమ ముద్రణ, ప్రచురణ: కళహంసి ఆర్ట్స్ క్రియేషన్స్, హైదరాబాద్.

2) రాగరథం (1981) ప్రథమ ముద్రణ, ప్రచురణ: కళహంసి ఆర్ట్స్ క్రియేషన్స్, హైదరాబాద్.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12 44 హైదరాబాద్ అక్టోబర్ : 2023

## సాధన పంచకమ్

**ఏకాంతే సుఖమాస్యతాం పరతరే చేత స్సమాధీయతాం**
**పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతామ్।**
**ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలా న్నాప్యుత్తరైః శ్లిష్యతాం**
**ప్రారబ్ధం త్విహ భుజ్యతాం అథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్॥**

**తాత్పర్యం :** 1. ఏకాంతంలో సుఖంగా ఉండవలెను. 2. పరబ్రహ్మమునందు మనస్సును చక్కగా నిలుపవలెను. 3. పూర్ణాత్మను బాగుగా దర్శించవలెను. 4. బ్రహ్మానుభూతిలో ప్రపంచమును మిథ్యగా చూడవలెను. 5. సంచితకర్మలు చక్కగా విలీనం చేయబడవలెను. 6. జ్ఞానశక్తి చేత ఆగామికర్మ నుండి విడిపోవలెను. 7. ఈ లోకంలో ప్రారబ్ద కర్మను పూర్తిగా అనుభవింపవలెను. 8. అటుమీదట పరబ్రహ్మ స్వరూపంగా భాసింపవలెను.

**వివరణ**

**7. ప్రారబ్ధం త్విహ భుజ్యతామ్ –**

**“ప్రారబ్ధం బలవత్తరం ఖలువిదాం భోగేన తస్య క్షయః**
**సమ్యగ్ జ్ఞానహుతాశనేన విలయః ప్రాక్సంచితాగామినామ్**
**బ్రహ్మాత్మైకమవేక్ష్య తన్మయతయా యే సర్వదా సంస్థితా**
**స్తేషాం తత్రితయం న హి క్వచిదపి బ్రహ్మైవ తే నిర్గుణమ్”**
**(వి.చూ. 454)**

ప్రారబ్దము అవశ్యము ప్రబలమైనది. అనుభవించుట వల్లనే అది క్షయము నొందును. పూర్వసంచితములు, ఆగామి కర్మలు, తత్త్వ జ్ఞానాగ్ని చేత నశించును. కాని, బ్రహ్మమునకు ఆత్మకును సంబంధించిన ఏకత్వమును తెలిసికొని సర్వదా అట్టి భావమునందే నిలిచియుండువారి దృష్టిలో ఆగామి, సంచిత, ప్రారబ్ధములనెడు త్రివిధ కర్మలు కూడా లేనివే అగును. అటువంటివారు సాక్షాత్తూ నిర్గుణ పరబ్రహ్మములా ఏమి? అని యెన్నదగిన వారుగా అగుదురు.

**8. అథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్ –**

అటుపిమ్మట పరబ్రహ్మ భావనలో స్థిరంగా ఉండిపోవలెను. “నిత్య మవ్యయసుఖం నిరంజనం బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని” – నిత్యము, అవ్యయము, ఆనంద స్వరూపము, నిష్కళంకము ఐన బ్రహ్మమును నేనే అని హృదయములో భావించుకొనవలెను. మాటలకు అందనిది. అన్నింటికీ అతీతమైనది. నిరతిశయ సుఖ స్వరూపము ఐనట్టి పరబ్రహ్మ స్వరూప భావనలో స్థిరపడి “అహం బ్రహ్మాస్మి” – నేనే బ్రహ్మమును అనెడు భావంలో స్థిరంగా ఉండిపోవాలి సాధకుడు... (సంపూర్ణం)

## సత్సంగం





### కర్మ – అనుభవం

కర్మ అహంకారం మీద ఆధారపడుతుంది. ఇది దేహానికీ, ఆత్మకీ నడుమ వస్తుంది. అహంకారం తన మూలంలో విలీనమై పోయి, రూపాన్ని పోగొట్టుకుంటే, ఇంక కర్మ ఎట్లా నిలుస్తుంది. ‘నేను’ (అహంకారం) లేనప్పుడు కర్మ కూడా లేదు. పూర్వజన్మలలో మనిషి ఎన్నో కర్మలను చేసి యుండవచ్చు. వాటిలో కొన్నింటి ఫలితాలనే ఈ జన్మలో అనుభవించాల్సి వస్తుంది. ఇది కూడా బైస్కోపు స్లైడ్లతో చేసే ప్రదర్శన వంటిదే. మొత్తం స్లైడ్లలో కొన్నింటినే ఆపరేటర్ ప్రదర్శిస్తాడు. మిగిలిన వాటిని మరొక ప్రదర్శనకి ప్రక్కన పెడతాడు. ఆత్మజ్ఞానం సంప్రాప్తించడం వల్ల ఈ కర్మని ధ్వంసం చేసేయవచ్చు. కర్మలు పూర్వపు అనుభవాలకి ఫలితాలు, రకరకాల కర్మలన్నీ స్లైడ్లు, మనస్సు – ప్రొజక్టర్! ఈ ప్రొజక్టర్‌ను ధ్వసం చేయాలి. ఇక అప్పుడు ప్రతిబింబం సాధ్యం కాదు; జనన మరణాలూ సంభవం కావు.

కర్మలను అనుభవించాల్సింది ఆయా వ్యక్తులే అయినా, ఆ కర్మల ఫలితాలని ఎప్పుడు అనుభవించాలో నిర్ణయించేది ఈశ్వరుడే. ఇది తన ప్రయోజనం బట్టే నిర్ణయిస్తాడు. భగవంతుడు కర్మ ఫలితాలనే అటూ ఇటూ నడిపిస్తాడు. వాటికేమీ చేర్చడు. ఏమీ తీసివేయడు. మనిషి యొక్క అవ్యక్త చేతనం (సబ్ కాన్షస్) మంచి, చెడు కర్మల గిడ్డంగి. ఈ వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక వికాసానికి ఏది మంచిదో దానిని ఆ గిడ్డంగిలో నుంచి ఈశ్వరుడే ఎంచుతాడు. అది సుఖప్రదమైనా కావచ్చు, బాధాకరమైన కావచ్చు. ఇందులో నిర్హేతుకత ఏమీ లేదు.

ఈశ్వరుడు ఎవరి కార్మనుసారం వాళ్ళకి ఆ యా ఫలితాలను పంచిపెట్టేవాడు. అంటే, ఆయన బ్రహ్మానికి అభివ్యక్తరూపమనమాట. అసలైన బ్రహ్మ రూపరహితం, చలన రహితం, రూపం దాల్చిన బ్రహ్మాన్నే ఈశ్వరుడంటాం. ఎవరి కర్మ (చేష్ట) ననుసరించి వారికి ఫలితాన్నిస్తాడు. అంటే ఈశ్వరుడు ఒక ప్రతినిధి వంటి వాడు మాత్రమే – శ్రమని బట్టి బత్తెమిస్తాడనమాట. అంతే. ఈశ్వరుని ఈ శక్తే లేకపోతే, కర్మ సంభవం కాదు. తానుగా, కర్మ జడం. చలనం లేనిది.

# తెలుగు దళిత అనువాద ఆత్మకథలు – మౌలికాంశాలు

**డా. గిన్నారపు ఆదినారాయణ,** తెలుగు సహాయాచార్యులు, సికింద్రాబాద్ పి.జి. కళాశాల. ఫోన్ : 99664 35902

తెలుగు దళిత సాహిత్యంలో వివిధ భారతీయ భాషల నుండి తెలుగులోకి అనువాదం అయిన ఆత్మకథలు చాలా ఉన్నాయి. ఆయా ప్రాంతీయ భాషల్లో చాలా ప్రసిద్ధి పొందిన దళిత ఆత్మకథలు ఉన్నాయి. దళితులు సాహిత్యంలోకి రావడమే అరుదు. అలాంటిది ఆత్మకథలు రాయడం అనేది దశాబ్దికాలాని కంటే ముందు చాలా అరుదుగా ఉండేది. ఇప్పుడిప్పుడే కొందరు విద్యావంతులు వారి జీవితాలను సమాజానికి చేరవేయాలని ఆత్మకథలు రాస్తున్నారు. ఆ ఆత్మకథలు తెలుగు ప్రాంత ప్రజలపై కొంత ప్రభావం చూపించాయి. వాటిని ప్రేరణగా తీసుకొని తెలుగు దళిత ఆత్మకథలు వచ్చాయి. వేరువేరు ప్రాంతాల, కులాలకు చెందిన వారి జీవన స్థితిగతులు వారి చారిత్రక నేపథ్యం వంటి భిన్నమైన అంశాలు మనకు కన్పిస్తాయి.

ఇతర భాషల నుండి తెలుగులోకి దళిత ఆత్మకథలను అనువాదం చేసేటప్పుడు కొన్ని సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ముఖ్యంగా దళిత ఆత్మకథలకు, దళితేతర ఆత్మకథలకు తేడాలు ఉంటాయి. ముఖ్యంగా, భాష, భావం, మాండలిక పదాలు, ఆహారపు పదాల ప్రయోగం, దళిత మూలలను చెప్పేటప్పుడు అర్థం కాని కొన్ని అంశాలు ఉంటాయి. కాబట్టి ఆయా అంశాల మీద అవగాహన ఉన్నవారు చేస్తేనే ఆ ఆత్మకథలు పరిపూర్ణంగా ముందుకు వస్తాయి.

ఆత్మకథను తెలుగులో స్వీయచరిత్ర, స్వీయకథ, ఆత్మచరిత్రం, అనుభవాలు – జ్ఞాపకాలు, నా కథ, వంటి మొదలైన పేర్ల పిలవడం తెలుగు సాహిత్యంలో కన్పించే పదాలు. ఒక వ్యక్తియొక్క ఆత్మను ఆవిష్కరించడమే ఆత్మకథ. ఆత్మకథలో ఆత్మను పరిపూర్ణంగా ఆవిష్కరించడం చాల కష్టం. ఎన్నో బయటి సమాజానికి తెలియ జేయని విషయాలు ఉంటాయి. ఒకవేళ తెలిపితే ఎన్నో అనార్థాలు జరిగే అంశాలు ఉంటాయని చాలా మంది వారి వారి ఆత్మకథను రాసుకోవడానికి ముందుకురారు. కాని అలారాసుకునే ప్రయత్నం జరిగాయి. అలా రాసుకున్నప్పుడే ఆత్మకథలో నిజాయితి కన్పిస్తుంది.

దళితసాహిత్య చరిత్రలో ఆత్మకథా ప్రక్రియ ప్రత్యేకమైనది. సమాజంలో వివిధ రంగాలలో ప్రత్యేకతను సంతరించుకున్న దళితేతర వ్యక్తులు వ్రాసుకొన్న ఆత్మకథలతో పోల్చినపుడు, దళిత ఆత్మకథలు భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే వారి పెరిగిన వాతావరణం గాని, వారి చుట్టు ఉన్న పరిసరాలు గాని, వారిని ప్రభావితం చేసిన మనుష్యులు దళితులతో పోల్చుకుంటే భిన్నంగా ఉంటుంది. సమస్యలు అందరికి ఉంటాయి కాని వర్గ, వర్ణాలకు సంబంధించిన సమస్యలు మనిషిని చాలా కృంగదీస్తాయి. ఇలా వేదనతో కూడిన గ్రంథాలు దళిత ఆత్మకథలు. దళిత అనువాద ఆత్మకథలు కూడా భిన్నమైన అంశాలను ప్రస్తావిస్తాయి. ఎందుకంటే ఒక్కో ప్రాంతంలో ఒక్కోవిధమైన సంస్కృతి ఉంటుంది. కాబట్టి వాటికి అనుగుణంగా వారు జీవనం కొనసాగిస్తారు. ముఖ్యంగా ఈ వ్యాసంలో దళిత అనువాద ఆత్మకథలను కొన్నింటిని మాత్రమే పరిచయం చేస్తున్నాను.

**ఉచల్యా : లక్ష్మణ్ గైక్వాడ్ (శ్రీమతి వసంత)**

ఉచల్య ఆత్మకథ మూల రచయిత లక్ష్మణ్ గైక్వాడ్. లక్ష్మణ్ గైక్వాడ్ మరాఠి సాహిత్యంలో గొప్ప పేరున్న కవి, రచయిత. ఈ ఆత్మకథను లక్ష్మణ్ గైక్వాడ్ మొదటగా తన మాతృభాష అయిన మరాఠిలో 'ఉఠారురిగిరే' అనే పేరుతో రాసుకున్నారు. ఈ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు కూడా లభించింది. దీన్ని తెలుగులో శ్రీమతి వసంత 1994లో అనువాదం చేశారు. ఈ గ్రంథాన్ని సాహిత్య అకాడమి న్యూఢిల్లీ వారు ఇది 165 పేజిలతో మరాఠి నుండి తెలుగులోకి అనువాద ఆత్మకథగా ప్రచురించారు.

ఉచల్యా అనగా జేబు దొంగలు. చిన్న చిన్న వస్తువులను దొంగిలించే వారు అని అర్థం. వీరు మరాఠిలో ఉన్నప్పటికి వీరి మాతృభాష మాత్రం తెలుగు. వీరిని సంతు ముచ్చులు అంటారు. సంతు ముచ్చులు అంటే సంతలో దొంగతనం చేసేవారు అని అర్థం. ఉచల్య అనేది మరాఠిలో ఒక జాతి. వీరి వృత్తి దొంగతనం చేయడం. ఇతను లాతురు జిల్లా ధనేగాంవ్ అను ఊరులో జన్మించాడు. సహజంగా సమాజంలో దొంగల పరిస్థితి ఎలా ఉంటుందో గమనిస్తూనే ఉంటాం. దొంగతనం చేసినప్పుడు ఇతరులకు దొరకకుంటే ఆ సంతోషం పట్టరానిది. కాని ఒకవేళ దొరికనట్లయితే అతని పరిస్థితి దారుణంగా ఉంటుంది. పోలీసులు కేసులు, దెబ్బలు, సమాజం చేత హీనంగా చూడబడటం ఇలా రకరకాల పరిస్థితులు ఉంటాయి. ఇందులో రచయిత సంఘ బహిష్కృతులుగా ఊరి పొలిమేరల్లో, నగరాల అంచున అత్యంత హీనంగా పందులకంటే హీనంగా బతికిన తన స్వంత జీవితాన్ని లక్ష్మణ్ గైక్వాడ్ తన భాషలో చాల స్పష్టంగా తెలియచేశారు.

**జూఠాన్ : ఓం ప్రకాశ్ వాల్మీకి (జి.వి రత్నాకర్)**

ఈ పుస్తకాన్ని ప్రముఖకవి, రచయిత ఓం ప్రకాష్ వాల్మీకి తన జీవిత అనుభవాలను అనేక సంఘటనలను జుఠాన్(1997) అనే పేరుతో తన ఆత్మకథను హిందీ భాషలో రాశారు. దీన్ని డా. జి.వి రత్నాకర్ తెలుగులో 160 పేజిలతో చాలా చక్కగా అనువాదం చేసి మన ముందుంచారు. వీరు 'మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జాతీయ విశ్వవిద్యాలయం' హైదరాబాద్‌లో ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

హిందీ దళిత సాహిత్య చరిత్రలో ఓం ప్రకాశ్ వాల్మీకి కవి, రచయిత. మూడు దశాబ్దాల కాలంలో తన చేతినుండి అనేక రచనలు వెలువడినాయి. సమాజంలో జరుగుతున్న అనేక సన్నివేశాలను హిందీ సాహిత్యంలో మనకందించిన రచయిత ఓం ప్రకాశ్ వాల్మీకి. ముఖ్యంగా దళిత సాహిత్యంలో అనేకంగా కృషి చేశారు. ఇతను ఉత్తరప్రదేశ్‌లో 30 జూన్ 1950లో జన్మించిన ఈయన సాథియోంకా సంతాప్ (1989) అనే కావ్యంతో హిందీ సాహిత్యంలో ప్రవేశించి బస్స్ బహోత్ హెూ చుకా (1997) జూఠన్ (1997) సలామ్ (2000) దళిత్ సాహిత్య కా సౌందర్యశాస్త్ర (2000) ఘుస్ పైఠియె (2003) ప్రజ్ఞా సాహిత్య (1995) దళిత హస్తక్షేప్(2004) వంటి రచనలు చేయడం చేశారు.

జూఠాన్ అంటే ఎంగిలి అని అర్థం. జీవన పోరాటం, జీవితపు ప్రతి అడుగులో అవమానానికి గురయ్యే సందర్భాలని నిశ్శబ్దంగా భరిస్తూ, కోపాల్ని దిగమ్రింగుకుంటూ జీవితాన్ని గడపడం ఎంత కఠోరంగా ఉంటుందో మనకు ఈ ఆత్మకథలో కన్పిస్తుంది. ఇలా మనకు హిందిలో దళిత రచయిత అనగానే గుర్తుకు వచ్చే మొదటి రచయిత ఓం ప్రకాశ్ వాల్మీకి.

**ఎదురిత : కిశోర్ శాంతాబాయి కాళే (కలేకూరి ప్రసాద్)**

'ఎదురీత' అనే పేరుతో కలేకూరి ప్రసాద్ తెలుగులో అనువాదం చేశారు. ఇది మార్చి 2001 హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారిచే 144 పుటలతో ముద్రణ జరిగింది. ఈ ఆత్మకథ 'కోల్హాట్యాచే పోర' (కొల్హాటీల కుర్రవాడు) అనే పేరుతో మరాఠిలో రాశారు. మరాఠి నుండి ఆంగ్లంలోకి 2000 సంవత్సరంలో సంధ్యాపాండే అనువాదం చేశారు. ఈ ఆంగ్ల గ్రంథం నుండి కలేకూరి ప్రసాద్ తెలుగులోకి అనువదించారు. కిశోర్ శాంతాబాయ్ కాళే మహారాష్ట్రలో పుట్టి అనేక కష్టాలు అనుభవించి డాక్టర్ వృత్తి చదివి కవిగా, రచయితగా పేరు పొందారు. రచయిత ఇందులోని అంశాలను అంకెలుగా విభజించి అనగా ఒకటి, రెండు అంటూ పదిహేను అంకెలలో తన జీవితాన్ని తన కులస్తుల జీవన విధానాన్ని చక్కగా తెలిపాడు.

కిశోర్ శాంతాబాయి కాళే మహారాష్ట్ర రాష్ట్రంలోని ముంబాయికి దగ్గరలోని థాణే, రాయగఢ్ జిల్లా సరిహద్దు గ్రామం అయిన కూదేరాన్ లోని జన్మించాడు. ఇతనిది చాలా పెద్ద కుటుంబం. ఇతను కొల్హటి కులానికి చెందిన వాడు. కొల్హటి అనగా దళిత జాతులలో ఒక తెగ. వీరు వివిధ గ్రామాలలో పట్టణాలలో నాట్య ప్రదర్శన, గానం చేస్తూ జీనం సాగిస్తారు. వీరిని ఒక రకంగా సంచార జాతులుగా చెప్పవచ్చును. కొల్హాటీ కులం రాజస్థానీ సంచార తెగ. వాళ్ళు పశ్చిమ మహారాష్ట్రకు వలస వచ్చారు. మొదట్లో గారడీ విద్యలను ప్రదర్శించి పొట్టగడుపుకునేవారు. తర్వాత ఆకర్షణీయమైన నృత్యాన్ని వృత్తిని ఎంచుకున్నారు. ఈ కులానికి చెందిన స్త్రీలకు సంగీతంలోనో, నాట్యంలోనో శిక్షణనిచ్చి మగవాళ్ళను రంజిప జేసేందుకు బలవంతంగా నాట్యవృత్తిలోకి దించుతారు. ఈ కులంలోని మగవాళ్ళు ఆడవాళ్ళ సంపాదన మీద బతుకుతారు. వారి కుటుంబ సభ్యుల అక్కచెల్లెళ్ళనీ, కూతుళ్ళనీ నృత్యకారిణిలుగా మారుస్తారు. కానీ, భార్యల్ని మాత్రం కొల్హాటీ మగవాళ్ళు ఇల్లు కదలనివ్వరు. కొల్హాటి మగ వాళ్ళు తమ కులానికి చెందిన ఆడవాళ్ళను పెళ్ళాడటం చాలా అరుదు. సాధారణంగా ఊరూరా తిరుగుతూ వాళ్లకిష్టమైన ఆడపిల్లలని ఎత్తుకెళ్ళి 'మేలినీ' అనే సాధారణ ఉత్సవం ద్వారా ఆమెను కొల్హాటీ కులస్తురాలిని చేస్తారు. కుల పంచాయితీ ఆమోదంతో ఆమె కులంలో చేరుతుంది. మగవాళ్ళు వాళ్లకు ఒక చీరను బహుమానంగా యిచ్చి పసుపుతో నలుగు పెడితే చాలు. ఆమె గర్భవతై బిడ్డను కన్న తర్వాతనే అతడు ఆమెను పెళ్ళాడతాడు. లేదంటే ఆమె పారిపోతుందే మోనన్న భయం. ఇలా వారి జీవితాలను కళ్లకు కట్టినట్లుగా రచయిత చక్కగా అనువాదం చేశాడు.

**అడవితల్లి (సి.కె జాన్ అసంపూర్తి ఆత్మకథ) (సత్యవతి)**

మలయాళంలో వచ్చిన సి.కె. జాన్ ఆత్మకథ అడవితల్లి. సి.కె. జాన్ చదువురాని నిరక్షరాస్యురాలు. కేరళ ప్రభుత్వం అక్షరాస్యతా కార్యక్రమం ద్వారా ఏదో కొంత నేర్చుకుంది తప్పా పూర్తి స్థాయిలో రాయడం చదవడం రాదు. కాబట్టి సి.కె. జాన్ తన స్వీయ అనుభవాలను చెబుతుంటే భాస్కరన్ మలయాళం రాశారు. మలయాళం లో రాసిన దాన్ని ఆంగ్లంలో ఎన్. రవిశంకర్ అనువాదం చేశారు. ఆంగ్లం నుండి తెలుగులోకి పి. సత్యవతి 2004 లో అనువాదం చేసి మనకందించింది. ఇది చాలా చిన్న గ్రంథం. 53 పేజిలతో రాసిన గ్రంథం.

సి.కె. జాన్ కేరళలోని ఒక గిరిజన నాయకురాలుగా పేరు గాంచింది. అక్కడి ఆదివాసిల భూపోరాటం గురించి అనేక విధాలుగా పోరాడిన ధీరవనిత. పెద్దగా చదువుకోలేదు కాని మంచి తెలివిగల స్త్రీ. భారత కమ్యునిస్టు పార్టీ (మార్కిస్టు)లో క్రియాశీలకంగా పని చేసి రైతు కూలి సంఘంలో చురుకుగా పాల్గొని ఆ పార్టీలో అనేక సన్నివేశాలను చూసి 1991లో పార్టీ నుండి తప్పుకుని ఆదివాసి ప్రవర్థక సమితిని స్థాపిస్తుంది. దాంతోపాటు 1992లో దక్షిణ మేఘాల ఆదివాసి సంఘం అనే సభను ఏర్పరచి దానికి అధ్యక్షత వహిస్తుంది. ఆదివాసీ భూపోరాటం, రాజకీయ పోరాటం కాదని అది ప్రధాన స్రవంతి కేరళ సంస్కృతికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం అని అక్కడి భూమిని దక్కించుకుంటే తమ సంస్కృతిని దక్కించుకున్నట్లేనని అంటుంది.

**ఓ సంచారి అంతరంగం : కుప్పె నాగరాజు (రంగనాథ రామచంద్రరావు)**

"ఓ సంచారి అంతరంగం" పేరుతో అనువాదమైన ఈ ఆత్మకథ కన్నడంలో మొదటగా వెలిసింది. వివిధ ప్రాంతాలు తిరుగుతూ వారి

జీవనం సాగించే సంచారి కులానికి చెందిన వారి జీవిత గాథ. దీని మూల రచయిత కుప్పె నాగరాజు. దీన్ని 'అలమోరియ అంతరంగం' అనే పేరుతో కన్నడం రాశారు. ఈ గ్రంథానికి 2013లో కన్నడ సాహిత్య అకాడమి అవార్డు లభించింది. దీని అనువాదం అమ్మనుడి పత్రికలో ధారావాహికగా వెలువడింది. తెలుగులో దీని అనువాదకులు రంగనాథ రామచంద్రరావు. 2017 ఫిబ్రవరిలో 192 పేజిలతో 66 ఉపశీర్షికలుగా విభజించి తెలుగులో అనువాదం చేసి వల్లవరపు వెలువరింతలు ప్రచురణ ద్వార ఈ గ్రంథం వెలుగులోకి వచ్చింది.

ఇందులో ఒక సంచారి జాతికి చెందిన వ్యక్తి జీవిత గాథ పై రచన. దొంబిదాసర్లు అనే కులానికి చెందిన వ్యక్తి జీవితం ఇది. దొంబి దాసర్లు గొప్ప కళాకారులు. హరికతలు, బుర్రకథలు, జావళీలు, బయలాటలు ఆడుతూ పాడుతూ ఊరూరా తిరుగుతుంటారు. కొన్ని చోట్ల గంగిరెద్దుల వాళ్లలాగ ఎద్దుల్ని మరిపి ఆడిస్తుంటారు. దొంబిదాసర్ల బతుకుకు నిలువుటద్ద ఓ సంచారి అంతరంగ ఆత్మకథ.

**మా బతుకులు : బేబి కాంబ్లే (బి. అనురాధ)**

'మా బతుకులు' ఆత్మకథను మొదట మరాఠి భాషలో బేబి కాంబ్లే 1960 వ సంవత్సరంలో పుస్తకాల్లో రాసుకొని చాలా కాలాల పాటు భద్రపరిచింది. కొంత కాలానికి సామాజిక శాస్త్ర పరిశోధక విద్యార్థి మాక్సీన్ బెర్నస్టీన్ బేబీ కాంబ్లేని కలిసింది. ఆ తర్వాత తాను రాసి భద్రపరుచుకున్న అనుభవాలను జీనా అమూచ 'మా బతుకులు' పేరుతో మరాఠీలో పుస్తక రూపంలో1986లో వచ్చింది. మరాఠి సాహిత్యంలో, బహుశ భారతీయ భాషల్లోనే దళిత మహిళ రాసిన మొదటి ఆత్మకథగా దీన్ని చెప్పవచ్చు. దీన్ని 'ది ప్రిజన్స్ వియ్ బ్రోక్' (మేము బద్దలు కొట్టిన జైళ్ళు) పేరుతో 2008 లో ఆంగ్లంలో ప్రచురించారు. ఆ తర్వాత ఇది వచ్చిన 2016లో బి. అనురాధ తెలుగులోకి మా బతుకులు పేరుతో అనువాదం చేసి తెలుగు ప్రజలకు బేబి కాంబ్లేను పరిచయం చేయడం జరిగింది.

మహారాష్ట్రలో అంటరాని కులస్థులైన మహర్ల జీవితాన్ని రెండు భాగాలుగా చూపించారు. మొదటి భాగంలో మహర్ల సాంప్రదాయక సంస్కృతి, జీవితం, రెండవ భాగంలో అంబేద్కర్ ఉద్యమ వెలుగులో మహర్లు ఆధునికతవైపు అడుగులు వేయటాన్ని చూడవచ్చు. పేదరికం, అంటరానితనం, అజ్ఞానంతో బతుకుతున్న మహర్లు, అంబేద్కర్ ఉద్యమానికి, ఆలోచనలకి ఆకర్షితులై చైతన్యవంతులుగా ఎదిగి మానవ మర్యాద, ఆత్మగౌరవం సాధించుకున్న తారు మా బతుకులు సారాంశంగా చెప్పవచ్చు.

**ఓ దళిత కమ్యూనిస్టు జ్ఞాపకాలు :ఆర్.బి.మోరె (ఎస్. వినయకుమార్)**

ఈ ఆత్మకథను మరాఠిలో రామచంద్ర బాబాజీ మోరె (ఆర్.బి.మోరె) రాసుకున్నారు. ఆ తర్వాత దీన్ని ఆంగ్లంలో వందన సోనాల్కర్ రాశారు. ఆ తర్వాత తెలుగులో ఎస్. వినయకుమార్ నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ వారు మే 2023 న ముద్రణ చేశారు.

అంబేద్కర్ చేసిన అతి ప్రధాన ఉద్యమం మహద్ చెరువు ఉద్యమం. దేశవ్యాప్తంగా పెద్ద సంచనలం చేసిన ఉద్యమం. పేదప్రజలలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిన ఉద్యమం ఇది. ఈ ఉద్యమం చేయడానికి ప్రధాన కారణం ఆర్.బి. మోర్. తన ప్రాంతంలో జరిగిన సంఘటన ఇది. అక్కడి ప్రజలందరిని ఐక్యపరిచి కేవలం అంబేద్కర్ ని ఆ చెరువు దగ్గరకు తీసుకువచ్చిన ఉద్యమాన్ని వెనుకుండి నడిపించిన వ్యక్తి ఆర్.బి. మోరె. ఇలా అంబేద్కర్ వెనక ఉంటూ దేశవ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలకు ప్రాణం పోసిన వ్యక్తి ఆర్.బి. మోరె.

ఈయన మహారాష్ట్ర రాయిఘడ్ జిల్లాలోని చంభర్ కోట తర్వాత వచ్చే చిన్న పట్టణం మహద్. ఈ పట్టణం గుండా రెండు నదులు ప్రవహిస్తాయి. ఒకటి సావిత్రి నది, రెండోది గాంధారి నది. సముద్రం పొంగినప్పుడు రెండు నదుల్లోకి ఉప్పునీరు వస్తుంది. కాబట్టి రెండు నదులు మంచినీటికి పనికి రావు. అందరికి మంచి నీళ్ళు అందించాలనేది ఒక కారణం అయితే దళితులకు ఇతర కులాల వారు నీళ్ళు ఇచ్చే పరిస్థితి ఉండదు కాబట్టి చాయ్ కొట్టు పెట్టడం ద్వారా దళితులు, దళితేతరులు నీళ్ళు తాగవచ్చు అనే దృక్పథంతో చిన్న టీ కొట్టు పెట్టి దళితులకు దాహం తీర్చడం అనేది మరో కోణంగా ఉంటుంది అని తెలుపుతాడు. ఇలా దళితుల్లో అంబేద్కర్ తో కలిసి ఎన్నో ఉద్యమాలు చేసి సమాజంలో మార్పు తీసుకువచ్చారు అనడానికి పై రెండు సంఘటనలే ఉదాహరణ గా చెప్పవచ్చు.

**ముగింపు :**

ఇతర భారతీయ భాషల్లో వచ్చిన దళిత ఆత్మకథలు సంఖ్యాపరంగా తక్కువే వచ్చాయి అనడంలో సందేహం లేదు. ఆత్మకథ రాయడమే కత్తిమీద సాము లాంటిది. అలాంటిది దళితులు వారి జీవితాలను పరిచయం చేసుకోవడం ఇటివల కాలంలో వస్తున్నాయి. ముఖ్యంగా వేర్వేరు రాష్ట్రాలకు చెందిన దళితుల జీవితాలను తెలుసుకుంటుంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఉచల్య నుండి మొదలు కొని ఆర్.బి. మోరే వరకు చూస్తే వారి జీవితాల్లో విభిన్న సంస్కృతులు, ఆచారాలు, ఆహార పద్ధతులు జీవన వైవిధ్యం వంటివి ఎన్నో అంశాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. సమాజం ఇంత ముందంజలో ఉండి మార్పు చెందినా ఇంకా దళితుల జీవితాల్లో వెలుగులు లేవని తెలుస్తుంది. అలాగే మన తెలుగులో ఉన్న దళిత ఆత్మకథలకు, ఇతర భాషల్లో ఉన్న దళిత ఆత్మకథలకు గల తారతమ్యాన్ని గనుక చూసినట్లయితే వేదన ఒక్కటే అయినా వివిధ రూపాల్లో వివక్ష కొనసాగుంతని తెలుస్తుంది.

# ఆంధ్ర మేఘ సందేశము

## - వెల్లలూరు వేంకటరాఘవశర్మగారు. ఎం.ఓ.యల్.

(ఆంధ్రోపన్యాసకులు)

సేకరణ : ఆచార్య వెలుదండ నిత్యానందరావు)

(శ్రీ రాఘవశర్మగారు (3-9-1912) మద్రాసులో ఎం.ఓ.యల్ చదివి ఉస్మానియా తెలుగుశాఖలో10-8-1950న అధ్యాపకులుగా చేరారు. పట్టుమని రెండేళ్ళు కూడా కాకుండా, కారణాంతరాల వల్ల వెళ్ళిపోయినా ఉత్తమ అధ్యాపకునిగా, ఆదర్శవక్తగా నాటి శిష్యుల హృదయాల్లో నిలిచిపోయారు. ఎం.ఎ., (ద్వితీయ) బి.రామరాజు, ఇల్లిందల సుజాత, ఎం.ఎ (ప్రథమ) వెల్దుర్తి రామకృష్ణారావు ఇక డిగ్రీ విద్యార్థులు సి.నారాయణరెడ్డి, ఇరివెంటి కృష్ణమూర్తి, ఎం.కులశేఖరరావు తదితరులు శిష్యులు. ఈ శోభ జనవరి 1951 సంచికలో మేఘసందేశం పద్యాలతో పాటు వారు రెండు సమావేశాల్లో ప్రసంగించిన సమాచారముంది. నూతన తరం కోసం మరోసారి....)

చ. తన కొలువున్ బ్రమత్తతను దప్పిన యక్షుఁడొకండు, ఏడు "కాం
త నెడసి యేఁడు కుందు" మని తన్ శపియించినఁ, బెంపు గ్రుంక,నా
జనకజ మున్గ మేలగు రసంబుల నిద్దపుఁ బొన్నచెట్లఁ బా
వనమగు రామశైలమున వాసమొనర్చెఁ దదాశ్రమంబులన్. 1

మ.అల యద్రి న్నబలా వియుక్తిఁ దమిమై యక్షుండు ముంగేళ్లు హెం
గడెముల్ జాఱుడు రిత్తగాఁ, గొని నెలల్ - కాఁబుచ్చి, యాషాఢమం
దలి తొల్నాటను దాఁగనెన్ బరిణతంబై వప్రఖేలాస్థతో
నలఁరన్ వచ్చిన దంతి పోల్కి గొన బౌ నాశ్లిష్ట సానున్ ఘనున్.2

మ.కలియం గన్నుల బాష్పముల్, కుతుకముం గల్పించు నా మేఘముం
గలఁఉ బెన్ ప్రొద్దెటొ నిల్చి కుందెఁగడు యక్షస్వామి భృత్యుండు దా
జలదంబుంగనఁ జేత మొందు తెఱఁగౌ - సౌఖ్యాత్ములొవారికే,
గళ సంశ్లేషిణి కోర్కులాడి యెడఁ గల్గం జెప్ప నింకేటికిన్? 3

ఉ.శ్రావణ మంతడాయ, సతి -ప్రాణములన్ నిలుపం దలంచి, యా
జీవనదాతచేఁ దనదు - సేమపు వార్తను నందఁజేయ, సం
భావనఁ గొండమల్లియలఁ బల్కుల పేరిమిఁ బ్రీతుఁజేసి, స
ద్భావ మెలర్ప యక్షుఁడట స్వాగతముం బలికెం బయోదుతోన్. 4

చ.జల శుచి ధూమ వాయువుల సంగతియౌ మొగులేద? ఏడ ప్రా
ణులు జతురేంద్రియాత్ములు జనుల్ నడపందగు వార్త? లంచుఁజిం
తిల కల యక్షుఁ దుత్సుకత నీరదునిం బతిమాలె; నౌ; విమో
హలయులు నైజదీనమతు లౌదు రచేతన చేతనంబులన్. 5

5.మ. అయ! నిన్నెచ్చికరూపు, లోకవిదితంబౌ పుష్కలావర్త కా
న్వయ జాతున్, మఘవ ప్రధాన పురుషుంగాఁ గందు: నట్లౌట నే
నయ! చుట్టాలెదయౌట దైవగతి నిన్ - బ్రార్థించెదన్ ; యాచ్న వ
మ్మయినన్ మేల్ ఘనుపాల, హీనునియెడం బ్రాప్తించినంగాదటుల్6.

చ.శరణమవైతి తప్తులకు సారద! కాన ధనాధిప క్రుధా
భరమున దవ్వులం బ్రియను బాసిన నాదు ప్రవృత్త మామెకుం
చెర; వలకాఖ్య జక్కులను మేటుల ప్రోల్ : వెలిఁతోట నొప్పు నా
హరుతల వెన్నెలం జెలఁగు హర్మ్యము లచ్చటఁ జూడ నింపగున్7

చ. పరగి సమీర మార్గమున వచ్చుట నూఁడి, గంపెడాసతోఁ
గురు లెగఁద్రోసికొంచుఁ గనుఁ గొంద్రు తమిన్ నినుఁ బాంథకామినుల్
విరహిణి జాయ నేఁడఁట యుపేక్ష యొనర్చెడి వ్యాపృతుండ వీ
వరుగఁగ, నస్వతంత్రుఁడగు-నన్యుఁడు నాయ టెవండు గానిచోన్ 8

చ. పరగుచు నొప్పు తిన్నగను వాయువు ప్రేరణసేయు నిన్, మనో
జ్ఞ రుతము సల్పుఁ జాతకము గంధయుతంబయి వామదిక్కునన్
బరిచితి గర్భధారణము నాఁబెను పండుగ బార్లు దీరి యు
ప్పరమున నాశ్రయించుఁ గను పందువ యౌ నిను నాఁడు బెగ్గరుల్9

మ.దినముల్ లెక్కిడుకొంచుఁ దత్పరత మిత్తింజెంద; దయ్యేక ప
త్నిని ద్వద్భ్రాతృసతిన్ ఫలీకృతగతిన్ వే కాంచె; దౌ; నాశ నాఁ
జను బంధంబు సుమోపమంబు పెరిమన్ సంధిల్లుటన్ గాన వెం
టనె రాల్ నైజము గల్గు నంగనల ప్రాణాల్ నిల్పినన్ నిల్పెడిన్. 10

చ. మొలవ శిలీంధ్రముల్, నెఱయ భూమి ఫలింపఁగఁ జేయఁజాలి,వీ
నులఁ దనిపించు నీయుఱుము నూల్కొలుపున్ విని, మానసోత్కముల్
జలజపుదూండ్ల లేదునియలన్ గొని బత్తెముగాఁగఁ ద్రోవ నీ
కల రజతాద్రి దాఁకఁగల హంసలగుంపులు మింటఁ దోడగున్ 11

చ. నరవర వందనీయ రఘునాథ పదాంకిత మేఖలంబులన్
బరగు నుదగ్రుఁ బ్రేమ సఖుఁ బర్వతు నక్కునఁ జేర్చి చెప్పి పో;
పొరిఁ బ్రతి వర్షకాలమునఁ బొందుచు నీతఁడు నీ వియోగమున్
చిర విరహోష్ణ బాష్పములు నించుచుఁ దెల్లము సేయు నెయ్యమున్.

ఉ. ఆరఁగ దస్సిదస్సి, గిరులందడు గూనుచుఁ గుంది కుంది నో
రూరగఁ బెల్లులాఘవపు టోడికలందుఁ బయస్సు గ్రోలు, చేఁ
గోరఁగఁ జల్లు నీ నడకకుం దగు దారి వచింతు నిప్పు, డో
నీరద! వార్తలౌర విన నేర్తువు శ్రోత్ర రసాయనంబుగన్. 13

మ."గిరిశృంగంబు హరించు నే మనిలుఁ దుత్కంపించి?" నాన్, సిద్ధసుం
దరు లా ముగ్ధలు జళ్కి జళ్కి నినుఁగానన్ మోము లెత్తందమిన్
సరసశ్రీ నిచుళస్థలోత్పతనమున్ సాధింపుమా! తక్కి పీ
వర ద్విగ కరావలేపములఁ ద్రోవంబ్రోద గాస్యుండవై. 14

ఉ. మేలిమి రత్న దీధితుల - మిశ్రమొ నాన్ మఘవాస్త్ర ఖండ మీ
మ్రోలను నేత్రపర్వమయి పుట్ట కొనన్ జనియించె దాన నీ
నీల శరీర ముజ్జ్వలపు నిగ్గులఁ దేఱెడు; వెల్గు పింఛమున్
దాలిచి గొల్లవేసమునఁ దన్కెడి వెన్నుని మేను కైవడిన్. 15

శోభ. జనవరి 1951 పుటలు. 14,15
(ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల అర్ధ వార్షికసంచిక.)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  UGC Care List Approved Journal
హైదరాబాద్ అక్టోబర్ : 2023

# పత్రికా సంపాదకుడుగా బోయి భీమన్న

**డా. కొంకె గౌరీశ్వర రావు,** ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు, ఫోన్ : **995 145 9842**



ఆధునిక తెలుగు సాహిత్యంలో బోయిభీమన్నకు సుస్థిరమైన స్థానం ఉంది. ఆయన రచనలు సాధారణంగా సామాజిక ప్రయోజనం ఆశించి ఉంటాయి. భీమన్న పద్య గద్యాలతో పాటు నాటకం, నాటిక, గేయం, కవితలు అందించాడు. అనువాదకుడుగానూ పత్రికా సంపాదకుడుగానూ మొదలైన ప్రక్రియలలో వందల సంఖ్యలో రచనలు చేశాడు. పత్రికా సంపాదకుడుగానూ ప్రజలను చైతన్య పర్చి సేవలు అందించాడు. బోయిభీమన్న పాత్రికేయునిగా తనదైన శైలిలో శీర్షికలను నిర్వహించి ఆయన ప్రత్యేకతను చాటుకున్నాడు. భీమన్నను పాత్రికేయునిగా పరిచయం చేయడం ఈ వ్యాసం ఉద్దేశం.

భీమన్న కవిగా పాఠక లోకానికి సుపరిచితులు. భీమన్న తెలుగు పత్రికారంగంలోనూ సంపాదకునిగా పనిచేశాడు. భీమన్న పిఠాపురం రాజావారి కాజేజీలో బి.ఏ.పూర్తిచేసి రాజమహేంద్రవరంలో బి.ఇడి., పూర్తి చేశారు. రాజమండ్రి కేంద్రంగా వెలువడిన '1937 జయభేరి పత్రిక' ను కుసుమ ధర్మన్న నడుపుతున్నాడు. రాజమహేంద్రవరంలో కుసుమ ధర్మన్నతో సాన్నిహిత్యం ఏర్పడింది. ధర్మన్న హరిజన నాయుకుడు, కులనిర్మూలన పోరాట యోధుడు . భీమన్న ప్రతిభను చురుకుతనం పాండిత్యాన్ని గుర్తించి ధర్మన్న, భీమన్నకు జయభేరి సంపాదక భాద్యతలు అప్పగించాడు. భీమన్న బి.ఇడి., చదువుతూనే ఒక సంవత్సరం పాటు జయభేరికి సంపాదకత్వం నిర్వహించారు. ఉభయ, కృష్ణా గోదావరి జిల్లాలలో రెండు వేలకు పైగా సర్క్యులేషన్ చేరుకుంది. భీమన్న సంపాదకత్వంలో 'పిపాసి' అనే కలం పేరుతో జయభేరిలో కథలు రాసేవాడు.

'జయభేరి' పత్రిక పై "మాలవాడ మేలుకో కూలివాడామేలుకో" అనే నినాదం ముద్రించడం శ్లాఘనీయం. దళిత జాతుల అభ్యున్నతికి ఈ పత్రిక ప్రధాన భూమిక పోషించింది. కుసుమ ధర్మన్న నడిపిన ఆది ఆంధ్ర ఉద్యమానికి కుల పోరాటానికి 'జయభేరి'ని ఒక ఆయుధంగా వాడుకున్నాడు. అంటరాని జాతుల ఆత్మగౌరవ పోరాటా ల్లోను కుసుమ ధర్మన్న రచనలు, కవిత్వం జయభేరి పత్రిక వేదికగా నిల్చింది. దళితులను ప్రభావితులను చేసి మార్గనిర్దేశం చేసింది.

మద్రాసు కేంద్రంగా తెలుగు పత్రికను పిఠాపురం రాజా స్థాపించారు. ఆ పత్రికలో జాబులు పరిశీలించడం ప్రారంభించారు. భీమన్న ప్రతిభను గుర్తించి తాపిధర్మారావు ఆ పత్రికలో 'పల్లెటూరి లేఖలు' అనే శీర్షిక పెట్టి జానపదుని జవాబులు అనే పేరుతో అచ్చు వేశారు. ఈ పత్రికలో కొంత కాలం పనిచేశారు. బి.ఎస్.మూర్తి కాంగ్రెసు నాయుకుడు మద్రాసు ప్రెసిడెన్సీలో(ఎమ్.ఎల్.సి), హరిజన నాయుకుడు ఉంద్రు సుబ్బారావు గార్లు మద్రాసులో ఉండేవారు. ఈ ఇద్దరు భీమన్నను ప్రోత్సహించారు. అలా మద్రాసులో ఉండి పనిచేసే అవకాశం వచ్చింది.

భీమన్న మద్రాసులో బి.ఎస్.మూర్తి గారి ఇంట్లో ఉంటున్న రోజుల్లో 'మాలపల్లి' సినిమా నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం గారితో మంచి స్నేహం ఏర్పడింది. అప్పటికే వివిధ పత్రికులలో వ్యాసాలు కవితలు అచ్చుఅయ్యాయి. భీమన్న వ్యాస రచనలలో చురుకుగా ఉండడం చూసి గూడవల్లి రామబ్రహ్మం ప్రజామిత్ర పత్రిక (స్థాపితం . 1931-32) లో పనిచేయమని కోరారు. దీనితో ప్రజామిత్రకు ఉప సంపాదకులుగా పనిచేసే అవకాశం వచ్చింది.

ఆ పత్రికా సంపాదకులు ఆంధ్ర శేషగిరిరావు సూచనల మేరకు 'జానపదుని జాబులు' అనే పేరుతో నమ్మళ్వారు ఆరణాల సీరిస్ తో ప్రచురించాడు. కొంతకాలం కొనసాగిన తరువాత పత్రికా సంస్థలు సమ్మెచేస్తే కొద్ది రోజులు భీమన్న బయటికి వచ్చేశాడు. మద్రాసు కేంద్రంగా వెలువడిన జనవాణి పత్రికకు కూడా కొంతకాలం ఉప సంపాదకత్వం వహించాడు. సీనియర్ సంపాదకులు తాపీధర్మరావు భీమన్నను మరల వచ్చి చేరమని పదేపదే అడిగారు. అయినా నేను పోలేదని (భీమన్న స్రవంతి పత్రికా వ్యాసంలో) రాసుకున్నారు.

రాజమండ్రి పురపాలక సంఘ సభ్యులు క్రొవ్విడి లింగరాజు, కోనసీమలో కళాయి వెంకట్రావు, ముల్లిపూడి పళ్ళంరాజులతో వాలంటరీగా కాంగ్రెసు అభిమానిగా తిరుగుతూ ఉంటున్న సమయంలో ("ఆంధ్ర ప్రభ"-స్థాపితం 1938) కు సంపాదకునిగా మద్రాసు వెళ్ళమని లేఖ రాస్తానని చెప్పడంతో భీమన్న అంగీకరించి మద్రాసుకు వెళ్ళారు. అక్కడికి వెళ్ళేసరికి కొంచెం ఆలస్యమైంది. భీమన్నకోసం చూసి చూసి భీమన్న స్థానంలో శ్రీశ్రీ ని నియమించారు. ఆ తరువాత అదే పత్రికలో భీమన్న ఉప సంపాదకులుగా పనిచేశారు. హరిజన నాయుకులు బి.ఎస్. మూర్తి నడిపిన (నవజీవన స్థాపితం-1939-1942) లో సచిత్ర జాతీయ వారపత్రిక మళయ పెరుమాళ్ళ వీధి మద్రాసు కేంద్రంగా వెలువడేది. ఈ పత్రికకు కొంతకాలం

సంపాదకులుగా పనిచేశారు. ఈ పత్రిక సంపాదకత్వం వహించారు. శీర్షిక ప్రకటనలలో భీమన్న శైలి ప్రతిఫలిస్తుంది (గరిగమ్మ, పాలపిడత, తారజువ్వలు మొ..) ఈ పత్రికలో కష్టజీవి నాటకం వారం వారం సీరియల్స్‌గా వెలువడేది. ఈ నాటకంలో ప్రధాన నేపథ్యం జమీందారి వ్యవస్థపై కూలిజననం పోరాటాలు, కూలి సమ్మెలు, కూలి రేట్లు సాధించడం కనిపిస్తుంది. ఈ పత్రిక ప్రజాదరణ పొందింది. తరువాత కాలంలో ఆగిపోయింది.

బి.ఎస్.మూర్తి 1952 సం. నెహ్రూ మంత్రివర్గంలో కేంద్రం సహమంత్రిగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్ర దళిత వర్గాల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. మహాత్మగాంధీ 'నవజీవన్' పత్రికను ఆంగ్లంలో నడిపారు. అదే స్ఫూర్తితో రచయిత, సాహిత్య అభిమాని అయిన బి.యస్.మూర్తి అమలాపురం(ఎమ్.పి) పని చేశారు. దళితుల అభ్యున్నతి కోసం తెలుగులో నవజీవన పత్రికను నడిపారు. అంటరానిజాతుల అభ్యున్నతిని కాంక్షించిన పత్రిక. కేవలం దళితులను ఉద్దేశించి నడిపిన పత్రిక కాదు. తెలుగు పాఠకులను ఆకట్టుకుంది.

ఈ పత్రికకు భీమన్న కొంత కాలం సంపాదకత్వం వహించారు "మాలలు రాజులౌదురు సుమా" అనే శీర్షికతో కొన్ని పద్యాలు అచ్చువేశారు. బి.ఎస్.మూర్తి తమ్ముడు బి.సుబ్బారావు ఆయన మేనల్లుడు కృష్ణమూర్తి భీమన్న నవజీవన నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు. భీమన్న ఈ పత్రిక విస్తరణకు కృషి చేశారు. హరిజనోద్యమంలో భాగంగా హరిజనులను చైతన్యపరచడానికి సొంత ప్రెస్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ పత్రిక నిర్వహణకు సమర్థులైన పనివాళ్ళను తయారుచేయడంలోను పేజీల రూపకల్పనలోను భీమన్న సహాయం ఉండేది. ఈ సచిత్ర వారపత్రికకు మంచి ఆదరణ లభించింది.

హరిజనాయకుడు గాంధీగారి అనుగుశిష్యుడు వేముల కూర్మయ్య (1946-49) మధ్య కాలంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో హరిజన సంక్షేమ మంత్రిగా ఉన్న రోజులలోదళితుల అభ్యున్నతికి పాటుపడాలనే ఉద్దేశంతో "వ్యవసాయకూలి" పత్రికను స్థాపించారు. ఆంధ్రశాసన సభ్యులు కమతం షణ్ముఖం గౌరవ సంపాదకులుగా వ్యవహరిస్తారని ప్రకటిచారు. ఈ పత్రిక నిర్మాణం సంపాదకత్వ బాధ్యత యావత్తు భీమన్న స్వీకరించి పని చేశారు. వ్యవసాయ కూలి పత్రికలో వార్తా సమాచారంతో పాటు జానపదులకు సంబందించిన పల్లెపాటలు జానపద శ్రామిక గేయాలు (కూలీ పాటలు) ప్రచురించింది. వ్యవసాయ కూలీ పాటలు జనాదరణ పొందాయి. భీమన్న దళిత సభలు సమావేశాల్లో పత్రికకు ఉప సంపాదకులుగా వడ్డి శివరావు సహాయ సంపాదకులుగా పని చేశారు. తూర్పుగోదావరి రాజోలు తాలుకా పొన్నమండ కేంద్రంగా వెలువడిన 'హరిజన' (1935) పత్రిక ఉండ్రు సుబ్బారావు సీనియర్ కాంగ్రెసు నాయకులు (ఏఐసిసి) సభ్యులు ఉండ్రు సుబ్బారావు హరిజన పత్రిక ను నడిపారు. హరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా నడిపిన పత్రిక. భీమన్న హరిజన పత్రికకు గౌరవ సలహాదారునిగా ఉన్నారు.

సాహిత్యంలో మహాకవిగా ప్రజాదరణ పొందిన భీమన్న పత్రికా రంగంలో విశిష్ట సేవలు అందించారు. పరిశోధకరాలు యస్. హెచ్. సౌభాగ్యమ్మ "మనం-మనపాత్రికేయులు" అనే గ్రంథంలో భోయ భీమన్నను పత్రికా పాత్రికేయులుగా గుర్తించకపోవడం శోచనీయం. తాపీ ధర్మారావు, ఆంధ్ర శేషగిరిరావు, శ్రీశ్రీ, ఖాసా సుబ్బారావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి పత్రికా సంపాదకులతో సాన్నిహిత్యం ఉన్నవాడు.

కాశీనాథుని నాగేశ్వరరావు, గోరా, రఘుపతి వేంకటరత్నం నాయుడు, కళాయి వెంకటరావు కాంగ్రెస్ నాయకులతోనూ ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండేవాడు. ఈ నేపథ్యంలో రాజకీయ, సాంఘిక, ఆర్థిక అంశాలలోనూ సాహిత్యం పట్ల సామాజిక అవగాహన కలిగిన వాడు. భీమన్న వార్తాలు ఒక సమగ్రమైన అర్థవంతమైన ప్యాకేజీలో పాఠకులకు అందించడంలోనూ వార్తాలకు శీర్షికలను పెట్టడంలోనూ వార్తాలను ప్రచురించడంలోనూ రాజీపడేవాడు కాదు. భీమన్న సంపాదకత్వాలు చదివితే ఆయన రచనా నిబద్ధత అవగతమౌతుంది. భీమన్న ఆధునిక సాహిత్యంలో ప్రజా సాహిత్యాన్ని సృష్టించాడు. పత్రికా సంపాదకుడుగా తనదైన ముద్రవేసుకున్నాడు.

భీమన్న 1911 సెప్టెంబరు 15వ తేదిన తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురులో ఒక నిరుపేద హరిజన కుటుంబంలో జన్మించాడు. పన్నెండవ ఏట నుండి కవిత్వం వ్రాయటం మొదలుపెట్టాడు. భీమన్న పట్టుదలతో తెలుగు సాహితీ శిఖరాలకు చేరుకున్నాడు.

భీమన్న సేవలకు భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదులను ఇచ్చి గౌరవించింది. ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు నుంచి కళాప్రపూర్ణ, నాగార్జున, కాశీ విశ్వవిద్యాలయాలనుంచి గౌరవ డాక్టరేట్లను అందుకున్నారు. గుడిసెలు కాలిపోతున్నాయి కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు అందుకున్నారు. ప్రతిష్టాత్మక సంస్థలు 'గండపెండెరం' తొడిగి 'కనకాభిషేకం' సత్కరించాయి. సామాన్య ఉపాధ్యాయుడు జీవితాన్ని ప్రారంభించి కవిగా విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యుడుగా మరియు పాత్రికేయుడుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యుడిగా సేవలందించారు. భీమన్న గారు తెలుగు సాహిత్యంలో దాదాపుగా అన్నిప్రక్రియలలోను రచనలు చేశారు. ఆయన రచనలు సుమారు 70కి పైగా ప్రచురించబడ్డాయి. భీమన్న 'పాలేరు' నాటకం తెలుగు సాహిత్యంలో ఒక సాంఘిక విప్లవాన్ని సృష్టించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 21.1.2007తేదీన భీమన్న సాహిత్య పీఠం ఏర్పాటుచేసి ఆయన రచనలను అచ్చువేసింది. భీమన్న తెలుగు పత్రికా రంగానికి పాత్రికేయునిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. 2005 సెంప్టెబరు 16 న వారు పరమపదించారు.

# 'బండి' అర్ధనారి నవల – ఇష్టంగా మగశరీరం కప్పకు తిరుగుతున్న కిన్నెరలు

**బుక్కే ధనక నాయక్,** పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. ఫోన్ : 8187056010

అర్ధనారి నవలపై చాలామంది రచయితలు, కవులు, పరిశోధకులు సమీక్షలు చేసినప్పటికీ పి. విజయ్ కుమార్ గారు చేసిన బండి నారాయణస్వామి అర్ధనారి నవల సమీక్ష అనే వస్తువు నా మనసును ఎందుకో మానసికంగా ఇబ్బంది పెట్టింది... కారణం అర్ధనారులతో నేను రెండు మూడు సార్లు మాట్లాడడం వారి హావభావాలు బాధలను నాతో పంచుకోవడం వలన బండి నారాయణస్వామి అర్ధనారి నవల నన్ను ఒక్కసారి ఆ సందర్భాలకు పట్టుకెళ్ళిపోయాయి... పి విజయ్ కుమార్ గారి సమీక్ష ప్రకారం ఇలా అంటాను నేను...

**"...మగ శరీరాలలో దాక్కున్న ఆడతనాలు గోడలు పగుల గొడుతున్నాయి. గీతలు చెరిపేస్తున్నాయి. ప్రవాహపు ఒడ్డుల్ని తెగ్గొడుతున్నాయి. వారు గలాటా చేస్తున్నట్టు లేదు. దేనినో అపహసిస్తూ ఉన్నట్టున్నారు. దేనిని? లోకాన్ని! సమాజాన్ని! పితృస్వామ్యంలో మగ కేంద్రాన్ని!**

**జీవిత యుద్ధంలో ఓడిపోయిన వాళ్ళు, కుటుంబానికి, ఊరికి వెలి అయిన వాళ్లు, సమాజం గేలి చేసిన వాళ్ళు, శరీరమే పరిహాసాస్పదమైనవాళ్లు! మగ దుస్తులు కప్పుకున్నా, నడకలలో ఆడతనం ఒలికి పోయేవాళ్ళు! ఆడతనాన్ని దాచుకునీ దాచుకునీ అలసిపోయిన వాళ్లు!..."**

"తల్లిదండ్రుల దగ్గర ఒంటరితనం, తోబుట్టువుల మధ్య ఒంటరితనం, కుటుంబంలో ఒంటరితనం, సమాజంలో ఒంటరితనం. రాజ్యంలో ఒంటరితనం. రాత్రి కప్పుకున్న దుప్పటిలో కూడా ఒంటరితనపు భయం! అది గంధర్వలోకమా? కాదు కాదు, కిన్నెర లోకం!"

ప్రకృతెందుకో చిన్న చూపు చూసింది! బొమ్మని చేసి ప్రాణం పోసిన సృష్టి స్థితి లయకారుడెవడో పగ చూపేడు! అవమానాలు, చీదరింపులు, ఛీత్కారాలు, చిత్ర వధలు, ఛిద్ర వ్యధలు, భగ్న హృదయాలు! అమ్మ పొమ్మంటుంది, తండ్రి "బృహన్నల నా కొడకా!" అని తిడతాడు, ఊరు కాకై పొడుస్తుంది, సమాజం చూపుల శూలాలు






విడుస్తుంది! కళ్ళ ముందు నుంచి వెళ్ళిపొమంటుంది!

అనాకారితనాన్ని ముసిముసి నవ్వులతోనైనా మూస్తుంది, అజ్ఞానాన్నీ సహిస్తుంది, అన్ని రకాల ఆంగిక లోపాల్నీ భరిస్తుంది, అర్ధనారి మొహాన్న మాత్రం తుపుక్కున ఊ(మూ)స్తుంది! ఒక జలదరింపు, ఒక జుగుప్స, ఒక వెరపు, ఒక భయం, ఒక భీతి, పక్కకు త్వరగా తప్పుకెళ్ళాలనుకుంటుంది! యేంపాపం చేశామని ఈ బతుకు? ఏం నేరం చేసినందుకు ఈ నరకం? ఈ రూపం ఎవరి శాపం? ఈ వైరుధ్యం అభ్యంతరకరం! ఒక లాఫింగ్ స్టాక్! "లోకానికి అన్నీకావాల. అన్నీ తెలియాల. ప్రతిదీ దాని కొలతలకు లొంగి పడివుండాల. అటు అయినా వుండు, ఇటయినా వుండు. అటూ ఇటూగాక గాడి తప్పితే సహించదు... సృష్టిలో ఆడ అంటే ఆడ, మగ అంటే మగ...అదే గాడిలో నడవాల"

సృష్టి గాడితప్పితే ఫర్వాలేదా లోకమా? సృష్టి గాడి తప్పినా విలువలు గాడి తప్ప కూడదు. అంతేనా సమాజమా?? "స్వీయ అస్తిత్వమే ప్రశ్నార్థకమైన వారికి సామాజిక ధర్మాలు వర్తిస్తాయా?" ఎంత ఆవేదన చూడక పోతే నారాయణ స్వామి నిలేస్తారిలా!

అర్ధనారి! ఆడా మగే సృష్టి ధర్మం అని నమ్మేవాడి కోసం కాదిది! అధోజగత్ తృతీయ ప్రవృత్తి సహోదరుల నిషిద్ధ అంతఃపురంలోకి తొంగిచూసిన వెలుగు దారి! సభ్యత ముసుగు మీద సారించిన వింటి నారి! తన ఇష్టా ఇష్టాలతో ప్రమేయం లేకుండా, ఒక లోపంతో జన్మించిన మనుషుల వెలివేతల్ని నిలవరిస్తున్న ప్రశ్నార్థకమిది.

లోకం వద్దనుకున్న రోడ్ మస్ట్ నాట్ టేకెన్ లోకి నారాయణ స్వామి నిబ్బరంగా అడుగేశారు, అక్కర్లేని, ఎవరికీ పట్టని హమామ్ వెలివాడల్లోకి తొంగి చూశారు. అనుభవమైన పురుష ప్రవృత్తిలోకో, నిరంతర సాన్నిహిత్యంతోవుండే స్త్రీ హృదయంలోకో వెళ్ళడం సహజమే కానీ ఏనాటికీ అనుభవంలోకి రాలేని, సృష్టి విరుద్ధమనిపించే హృదయ సీమల్లోకి వెళ్ళిపోయి రాగద్వేషాల్ని పట్టుకున్నాడీ తాత్వికుడు. వినబడని

వేదనల్ని ఆవాహన చేశాడు! నిషిద్ధమని తీర్మానించేసుకున్న సామాజిక నీతుల్ని ప్రశ్నించాడు. లోకం కావాలనే పరిహరిస్తున్న, పరిహసిస్తున్న అధోజగత్ సహోదరుల హృదయార్ణవమైన అనుభూతుల్ని సానుభూతితో అర్థం చేసుకున్నాడు. చంద్రన్న వురఫ్ రమణి నే కాదు, ఆధునిక సమాజంలో టాబూ గా చీదరించుకునే, రవీంద్రనాథ్ రెడ్డి నరసప్పల మధ్య హోమో సెక్సువల్ సంబంధాల్ని "వాన్ని పైకి ఎక్కించుకుంటే తప్ప పనిచేయదు నాకు. పిలుచు వాన్ని. ఎక్కు దుండాడో..." అని భార్య రెడ్డమ్మతో గుసగుసగా అరవడంలోని జుగుప్సనికూడా భరించమంటూ సవాలు చేసేరు.

అర్ధనారి ఒక ఆధునిక ఎపిక్, నిషిద్ధ మానవుల ఎలిజీ, ఒక విషాద కావ్యం, ఎవరికీ అక్కర్లేని తృతీయ ప్రవృత్తి మూర్ఛన. మర్యాదస్తుల సమకాలీన లైంగిక నీతులకూ, కట్టుబాట్లకూ ఎదురెళ్లి, తమని ఛీ కొడుతున్న సమాజాన్ని వెలివేసి బతికే నిషిద్ధ మానవలోకాన్ని పరిచయం చేయడమే దాని ఉద్దేశం!

నాటు సారా వాసనా, వూసిన కిళ్లీ తుంపర్లు, కుమ్మరించి వెళ్లిపోయిన స్పెరమ్ మరకలు తప్ప మరేమీ వుండని అపవిత్ర రంగస్థలం. సినిమా టాకీస్ సందుల్లోనో, కొట్టాల కిందనో, బజారు దాపునో శరీరం వొంచి బేరాలు చూసుకొనే వెరపు పుట్టించే లోకమిది! తాగుడూ, నోరు పట్టని బూతులూ, నోరంతా తెరుచు కొని తుపుక్కున వుమిసే తాంబూలాలూ, చేలాలూ, తాలీలూ, పురుషుడికీ పురుషుడికీ మధ్య సాగే అనైతిక, అశుద్ధ, ప్రకృతి విరుద్ధ కామ కేళి... అంతేనా!

నాన్సీ ఫ్రైడే ఫ్లవర్స్ ఆఫ్ గార్డెన్ లోనో హెరాల్డ్ రాబిన్స్ నవల్లో శృంగార కేళి పేజీల్లోనో, సిడ్నీ షెల్డన్ పెవిడ్ పెవిలియనో, వాలెస్, గోల్డెన్ రూమో వెతుక్కునే వారికి ఇది ఆశాభంగమే! స్త్రీ పురుష ప్రవృత్తి కోరుకునే రొమాంటిక్ అనుభూతులకు చంద్రన్న వురఫ్ రమణి అందించే శృంగారం ఒక ఆశాభంగం!

వారి జీవితానందం కూవగం కూతాండవర్ కోవెల ముందు ఆరావన్ తో ఒక్కనాటి వైవాహిక వైభోగం! పెళ్లినాటి వారి నృత్య హేలలా, కమలాదాస్ వర్ణించినట్టు wailed and writhed in vacant ecstasy... అదొక బుద్బుద ప్రాయపు మెరుపు... మర్నాడే వైధవ్యం పొందే క్షణ భంగుర శాపగ్రస్త జీవితం!

కానీ ఈ అమర్యాదకర, అశుద్ధ జీవితం వెనుక, నేపథ్యంలో వినిపించే అనితర సాధ్యమైన మానవ సంగీతం వుంది! జీవిక వుంది! అది విషాద గీతికే అయినా ఈ నవల అంతఃస్సారం అదే! ఎవరైతేనేం, బడుగు జీవులు, పతితులు, భ్రష్టులు, బతుకుకాలి పనికిమాలి రథచక్రపు టిరుసులలో పడి నలిగిన హీనులు దీనులు అసమంజస వికృత వ్యవస్థ దాష్టీకాలకు నిరంతరం బలయ్యే నిరుపేదలు.

ఈ విశృంఖల రంగభూమి అట్టడుగు బతుకుల జీవన గుండె ఘోషల్ని తడుముతుంది. అద్దాలో కనబడే మేస్త్రీ, వెంటాడే పది మంది పురుషుల నుండి భద్రత కోసం మళ్లీ ఒక పురుషుడికి వళ్ళప్పగించి మోసపోవడానికి సిద్ధపడే రామలక్ష్మి లాంటి వాళ్ళు, ఆ రామలక్ష్మిని "అంగడి పెట్టినావంటనే!" అని మగ భాషలో అడిగే పోలీసు రాజ్యపు అనైతిక హెడ్డు కానిస్టేబుల్, ఎర్రి స్వామి లాంటి జర్రి పోతును భరిస్తూ, ఫ్రిజ్జు చల్లదనాల కోసం, రాయంచలా కదిలి వెళ్లే కార్ల సుఖాల కోసం, బిడ్డని డాక్టరీ చదివించడం కోసం, మధ్య తరగతి లక్ష్మణ రేఖల్ని వెర్రి భర్త ఎర్రి స్వామితోనే చెరిపించి, రంగారెడ్డి పంచన జేరి, బతకనేర్చిన మణిమాలలు, ఇరుగు పొరుగున అతిశయం చూపి బతుకు బండిని భద్రంగా లాక్కెళ్లి పోయే గడుసు పుల్లమ్మలు కూడా తారసిల్లుతారిక్కడ.

దక్షిణం వైపు ఏడవగదిలో దయ్యం ఉందని అనుకుంటే ఆ దయ్యం అదేగదిలో జీవితాంతం ఉన్నట్టు భయపెడుతుంది. ఒకసారి ఆ గదిలోకి పోయి కిటికీలు తెరిచి అటు ఇటూ నాలుగు అడుగులు నడిచి వస్తే దయ్యమూ లేదు గియ్యమూ లేదు అని తెలిసొస్తుంది. సామాజిక భయము అంతే... మనిషి పుట్టడమే ఒక దారి తెన్నులేని ప్రపంచంలోకి విసిరివేయబడతాడు. ఇంక దారి తప్పడం ఏముంది.

మనసు నుంచి తప్పొప్పుల చిట్టా తప్పిపోయింది వర్తమానంలో వైనంగా బతకడమే వివేకం... భర్త వదిలేసి పోయిన ముగ్గురు బిడ్డల తల్లి రామలక్ష్మి, పడుపు వృత్తిలోకి భద్రంగా చేయి పట్టి నడిపించిన అదే సమాజంలో గత్యంతరం లేక ఎంచుకున్న జీవన మార్గం ఇది! "కడుపులో నుంచి కల్మషాలు దింపుకొని, మళ్లీ పొట్ట నింపుకొని, డబ్బుతో వ్యవహారాలు చేసి, ఏవో ఒక దంపుడు మాటలు మాట్లాడి, ఆత్మ నుంచి వేర్లు తెగిన నవ్వులు నవ్వి, వివర్ణమైన జీవితంలో రంగులు వెతుక్కుంటూ, పడుతూ లేస్తూ, గసపోసుకుంటూ, క్షణ క్షణమూ వ్యర్థమై, గంటలు గంటలు నిరర్థకమై, బతికే ఒక తాపమై, శాపమై బరువు బరువై గుదిబండగా మారి జీవితంలో బరువు మోయడం కూడా ఒక అలవాటుగా మారినప్పుడు" జీవితాలు ఇలానే మిడుకుతాయి.

మొత్తంగా ఇక్కడ అర్ధనారులే కాదు, సామాజికంగా పరిపూర్ణతకు నోచని అబలా స్త్రీ లోకమూ వుంది! పురుషుడు పురుషుడిలానే ఉన్నాడు! "తను" గాని దేన్నైనా కామపు "సరుకు" గా మార్చేసుకొని కొత్త నీతుల తోవల్లో దారి వెతుక్కో వడం అలవాటు పడినవాడు! వీడిని కదా మనం పరిహరించాల్సింది!

పోనీలే పాపం ఈ మగవాడిని క్షమించేద్దాం అనుకున్నా ఇతనికి ఆడా మగా అర్ధనారి అనే తేడా లేకుండా పోతుంది.. ఇలాంటి అప్పుడు తప్పు ఎవరిది. కడుపు నింపుకోవడానికి చప్పట్లు కొడుతూ రోడ్డునపడ్డ అర్ధనారిదా? అర్థంపర్థం లేకుండా వాయీ వరసలు లేకుండా తింటూ తాగుతూ పడుకుంటూ లేచి నిలబడుతూ కొడుతూ హత్యలు చేస్తూ ఆత్మహత్యలు చేస్తూ తిరుగుతున్న ఆడవాళ్లదా? మగవాళ్లదా?. ఈ ప్రశ్న అందరూ ఆడవాళ్ళకి మగవాళ్ళకి కాదు కొందరికే...

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2023

# పిలకా గణపతి శాస్త్రి 'అస్తితా వాదము' – సమీక్ష

**పి. రమాదేవి,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 789351 9174

కొత్త వాఙ్మయోద్యమాలు, తాత్విక సిద్ధాంతాలు బయలుదేర దీయటంతో అగ్రతాంబూలం అందుకున్న ఫ్రాన్సు దేశంలో పెద్దగా గాలిదుమారం లేవదీసిన అస్తితావాదం (Existentialism) కు సంబంధించిన వ్యాసమిది.

ఈ వ్యాసంలో గణపతి శాస్త్రిగారు అస్తితావాదానికి పూర్వం ఉన్న తాత్విక సిద్ధాంతాలను, అస్తితావాదం చరిత్రను, నిరీశ్వరాస్తితా వాదం మరియు క్రైస్తవాస్తితా వాదాలలోని భేదాలను గురించి, అస్తితావాద రచనలు, అస్తితావాద ప్రతిపాదులలో ప్రముఖుల గురించి భారతీయ తాత్విక సిద్ధాంతాలు – సత్తావాదము మధ్యగల పోలికలు మొదలగు వాటిని కూలంకషంగా చర్చించారు.

Existentialism లేక అస్తితావాదం అంటే మానవుని ఉనికికి సంబంధించిన వాదం. అస్తితావాదంలో ఉన్నంత మానవ వ్యక్తి ప్రాముఖ్యం, అంతకు పూర్వం అమలులో ఉన్న పాశ్చాత్య తత్వ శాస్త్రాదులలో లేదని అస్తితావాదుల అభిప్రాయం.

అస్తితావాదం పూర్వం ఉన్న ఆదర్శవాదాన్ని బట్టి చూసినా, భౌతిక వాదాన్ని బట్టి చూసినా లేక మత దృష్ట్యా చూసినా సామాన్య వ్యక్తి జీవితం అస్వతంత్రమై, ఆయా దృక్పథాల ఆదర్శ ప్రాప్తికి అనుకూలమైన ఆచరణ ద్వారానే పూర్ణత్వం కలుగుతున్నది.

అస్తితావాదం ఈ క్రమాన్ని తల్లకిందులు చేసి మానవాస్తితకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నది. అస్తితావాదులలో ప్రముఖుడైన జాన్‌పాల్ సార్త్రే తన గ్రంథం "Existentialism and Humanism" లో Man is nothing but that which he makes of himself అనే వాక్యం ప్రధాన సూత్రమని నిర్వచించాడు. మానవ ఇచ్ఛానుసారం మానవజీవితం పరిణమిస్తుందని పై ఆంగ్ల వాక్యాభిప్రాయం. అస్తితావాదం ప్రకారం మానవునికి స్వీయ సత్తా మాత్రమే స్పష్టంగా తెలిసిన విషయం. మానవుని మేధస్సు నుండి ఉద్భవించిన సిద్ధాంతాలన్నీ పారమార్థిక సత్యాలు కాజాలవు. ఆదర్శ వాదమైనా, భౌతికవాదమైనా లేక మత విశ్వాసమైనా శాస్త్రీయమైన సంభావ్యతా సిద్ధాంతాలే గాని అంతకంటే అధికమైనదేదీ లేదు. అందువల్ల మానవునికి తన జీవితం ఏ విధంగా మలచుకోవాలంటే ఆ విధంగా మలచుకోగలిగే స్వాతంత్ర్యం ఉంది. ఈ నిరంతర స్వాతంత్రానుసరణమే మానవ జీవిత లక్ష్యం. ఇదే అస్తిత్వవాద సిద్ధాంతం. అయితే ఏ వ్యక్తి తన ఇష్టం వచ్చినట్టు సంచరించవచ్చు అని భావించకూడదు. తాను మానవజాతిలో నివసిస్తున్నానని భావించి సర్వమానవ సంఘానికి శ్రేయస్కర మార్గంలో ప్రవర్తించాలి. అయితే ఈ శ్రేయోమార్గం మాత్రం ఏమిటో అస్తితావాదం నిర్వచించదు అంటారు గణపతి శాస్త్రి గారు.



అస్తితావాదం వ్యక్తి ప్రాధాన్యమైనదైనా, ఇది ప్రత్యేక వ్యక్తి ప్రాధాన్యం గల వాదమని భావించరాదు. అస్తిత్వవాదం మానవ వ్యక్తిలో, మానవజాతి అంతర్భూతమై వుంటుందని అంటారు. కమ్యూనిజంలో సమాజానికి ప్రాధాన్యత ఎక్కువ అని, వ్యక్తి ప్రాధాన్యత సమాజాంతర్భూతంగా వుంటుందని అంటారు.

అస్తితావాదానికి పూర్వం బయలుదేరిన మానవతావాదం (Humanism) కూడా మానవ వ్యక్తికి ప్రాధాన్యం ఇచ్చినా హేతుప్రధానమైన వ్యక్తి (Rational being) అని నిర్వచిస్తుంది. అయితే అస్తితావాదం ఇటువంటి నిర్వచనం ఏమీ ఇవ్వదు. పైగా హేతు దృక్పథాన్ని అంగీకరించదు.

అస్తితావాదానికి సోక్రటిస్ కాలంలో బీజాలు పడగా, సోరెన్ కీర్క్ గార్డ్ అనే డెన్మార్క్ తత్త్వవేత్త తన రచనలలో దీనికి ఒక సిద్ధాంతంగా పునాదులు వేశాడు. మార్టిన్ పే డిగ్గర్, కారల్ జీస్పర్స్ అనే జర్మనీ తత్వ శాస్త్రజ్ఞుడు మొదట ప్రపంచ యుద్ధానంతరం దీనిని జర్మనీ దేశంలో ప్రచారం చేశారు. 1908లో జన్మించిన ఫ్రెంచి రచయిత Jean Paul Sarfre, ఈ సిద్ధాంతం ప్రచారం చేసిన వారిలో ప్రముఖుడు.

ఈ సిద్ధాంతానికి ఆధారభూతుడుగా నిలిచిన ఎడ్మండ్ హుస్సారల్ అంటే ఇంద్రియ గోచన వస్తు తత్వశాస్త్రం అనే నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఆదర్శవాదులు ప్రధానమని ప్రతిపాదించిన మనస్సు (Mind) లేక భౌతికవాదులు ప్రధానమని ప్రతిపాదించిన (Matter) పదార్థం అనేవాటి జోలికి పోకుండా, చైతన్యాన్ని (Consciousness) గురించి పరిశోధన చేశాడు. ఈ విధంగా పరిశోధన ద్వారా (Objective reality) లేక వాస్తవిక సత్యస్వరూపం అంటూ ఏమీ లేదనీ, అది ద్రష్ట యొక్క దృక్పథాన్ని



బట్టి ఏర్పడిందనీ, దానిని బట్టే వేర్వేరు సిద్ధాంతాలు ఏర్పడుతున్నాయని వివరించారు.

ఈ మార్గంలోనే కృషి చేసిన, మాక్‌షెల్లర్ మానవునికి సహజం గానే నైతిక మూలాలు (Ethical Values) అవగాహన చేసుకునే శక్తి వున్నదని, అది ఈశ్వరుని వల్ల లభిస్తుందని అభిప్రాయపడ్డాడు. నికొలాయ్ హుర్‌మాన్ మానవునిలో సహజంగా నైతికమూలాలు తెలుసుకునే శక్తి వున్నదని దానికి ఈశ్వరుడిని కారణంగా నిరూపించవలసిన అవసరం లేదని ప్రతిపాదించాడు.

ఈ విధంగా వివిధ అస్తితావాదులలో అనేక తాత్విక చర్చల వల్ల నైతేనేమి, తమ పరిశోధనల వల్ల నైతే నేమి, మనస్తత్వ శాస్త్రంలో కొత్తగా జరిగిన పరిశోధన వల్లనైతేనేమి, వాస్తవికత (Objectivity) అనేది లేదని, ఉన్నా అది వ్యక్తిగతమైన ప్రయోజనపరత్వం (purposiveness) మీదనే ఆధారపడిందనీ విశ్వసిస్తారు.

అస్తిత్వ వాదనలలో అనేక శాఖలున్నా ముఖ్యమైనవి నిరీశ్వరాస్తిత వాదము, క్రైస్తవాస్తిత్వ వాదం ముఖ్యమైనవి అని చెప్తూ, వాటిని చక్కగా వివరించారు గణపతి శాస్త్రిగారు. జాన్‌పాల్ సార్త్రే 'లేత్ ఏనియా' (భావము – అభావము) అనే గ్రంథంలో నిరీశ్వరాస్తిత్వ వాదం యొక్క దృక్పథం సమగ్రంగా వివరించాడు. అయితే అస్తిత్వవాద నిర్వచనం గురించి ప్రశ్నలు వేసినపుడు దానికి వచ్చే సమాధానం అసంబద్ధంగానే వుంటుంది అని అంటారు గణపతి శాస్త్రి గారు. అస్తిత్వవాదన నిర్వచనంలో మానవ వ్యక్తి చైతన్య స్వస్వరూపం అభావమే (Nothingness) అయినప్పుడు, ఆ అభావ స్వభావ మేమిటనే ప్రశ్న కూడా అసంబద్ధం అవుతుంది అంటారు.

క్రైస్తవాస్తిత్వవాదులు, వ్యక్తి అస్తితతో పాటు ఈశ్వరాస్తిత్వం కూడా ప్రతిపాదిస్తారు. ఈ ఒక్కటీ తప్ప మిగతా అన్ని విషయాలలో నిరీశ్వరాస్తితావాదులు, క్రైస్తవాస్తిత్వ వాదులలో పెద్ద తేడా ఉండదు. అయితే క్రైస్తవాస్తిత్వవాదులలోని ఈశ్వర సత్తకు, ప్రాచీన తాత్విక దృక్పథాలు నిర్వచించే ఈశ్వరుని సత్తకు చాలా తేడా ఉంటుంది.

అస్తిత్వవాద రచనలను గురించి చెప్తూ, వీరి వాదంలో సహజ జ్ఞానం (intution) ప్రధానంగా వుండడం చేత హేతువాద నిర్మితమైన సిద్ధాంతాలకు తావు లేనందున, ఈ వాదం ఒక క్రమపద్ధతిలో ప్రతిపాదింపబడలేదు. అందుచేత ఎవరైనా ఈ సిద్ధాంతాన్ని దిఙ్మాత్రం గానే సూచించవచ్చునీ అంటారు.

Jean Paul Sartre రచించిన 'ఏజ్ ఆఫ్ రీజన్' (Age of Reason) ఈ విషయంలో కొంత ఉపయోగిస్తుంది అంటారు.. ఈ నవల రచనా పద్ధతి, శిల్పం ప్రశస్తంగా కనబడినా, కథ విచిత్రంగా ఉంటుంది. అస్తితావాదం అవగాహన చేసుకున్నవారు మాత్రమే దీనిని అర్థం చేసుకోగలుగుతారు.

ఇక భారతీయ తాత్విక సిద్ధాంతాలలో కొన్నింటికి అస్తిత్వవాదంతో పోలిక ఉన్నట్టు కనబడుతుంది అంటారు శాస్త్రిగారు. నాగార్జునుడు అమలులో ఉన్న బౌద్ధ సిద్ధాంతాలను పూర్వపక్షం చేసి ప్రతిపాదించినది శూన్యతావాదం. దీని ప్రకారం పరిదృశ్యమానమైన జగత్తులో ఉన్నది అభావమే అంటారు. అయితే నాగార్జునుడికీ, అస్తితా వాదులకు ప్రధాన సిద్ధాంతాలలో విభేదం ఉండవచ్చు అంటారు. అద్వైత వేదాంతులు కూడా జగత్తు – జీవుడు పారమార్థిక సత్యాలు కావనీ, ఈ రెండింటికీ అతీతమైన పారమార్థిక సత్యం ఉన్నదనీ ప్రతిపాదించారు. జగత్తు – జీవుడు వీరి దృష్టిలో మాయా, అస్తిత్వ వాదుల అసంబద్ధం ఒకటే అని చెప్పడానికి వీలు లేదు. కాని ఈ రెండిటికీ కొంత సాజాత్యం ఉన్నదని చెప్పవచ్చునంటారు.

ఏది ఏమైనా కేవలం భౌతికవాదాలు బాగా పాతుకుపోయిన పాశ్చాత్య తత్వశాస్త్రంలో అస్తితావాదం ఒక విప్లవం లేవదీసిందని అన్నారు గణపతి శాస్త్రి గారు. 'సార్త్రే' ప్రతిపాదించిన నిరీశ్వరాస్తితా వాదంలో స్వాతంత్ర్యం ఒక్కటే నిరంతర లక్ష్యంగా కనిపిస్తుందంటారు. ఏ విలువలు లేని చోట స్వాతంత్ర్యం అనే విలువకు ప్రయోజనం ఏమిటి? అనే దీనికి అసంబద్ధత (Absurdity) అనే సార్త్రే ఇచ్చే జవాబు సామాన్య దృష్టికి హాస్యాస్పదంగా కనిపిస్తుంది. అందుచేత ఈశ్వరాస్తితావాదం మానవాళిని ప్రేరేపించగల ఒక వినూత్నమైన సమున్నతాదర్శాన్ని ప్రతిపాదిస్తున్నదని గణపతి శాస్త్రిగారు అభిప్రాయపడ్డారు.

ఈ విధంగా అస్తితావాదం గాలికి, ధూళికి తేలిపోయే మాటల గారడీ కాదనీ, ప్రపంచ తాత్విక పంథాలో సంచలనం కలిగించ గలదనీ గణపతి శాస్త్రి గారు అభిప్రాయపడినారు.

**ఆధారం : పిలకా గణపతి శాస్త్రిగారి 'అస్తితా వాదం' వ్యాసం. ఆంధ్ర పత్రిక, ఉగాది సంచిక. 1952.**

# ప్రజల నాల్కలయందు జీవిస్తున్న సుకవి – జాషువా

**డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి**, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు, కరీంనగర్. ఫోన్ : 915 469 0580



విశ్వనరుడనునేను భరతఖండంబు నా పాఠశాల అంటూ సామాజిక శ్రేయస్సుకై కలం పట్టిన మానవతావాది జాషువ. అంటరాని తనాన్ని రూపుమాపడానికి నడుం కట్టిన నవయుగ కవి చక్రవర్తి ఆయన. తరతరాలుగా అస్పృశ్యతకు గురై కులమతాల పేరిట సాంస్కృతికంగా హీనంగా చూడబడుతూ, విద్యా సౌకర్యాలు లేక సమాజంలో ప్రధాన జీవన స్రవంతికి దూరమైన అరుంధతీ సుతుని గాథకు కావ్యగౌరవం కలిగించిన మహనీయుడు. సాంఘికంగా దోపిడికి గురి అవుతూ, నీచ వృత్తులు చేసుకుంటూ శారీరక శ్రమపై ఆధారపడి బతుకీడుస్తున్న కన్నీటి కథలు జాషువకు ప్రాధాన ఇతివృత్తాల్కెనాయి.

**నాదు కన్నీటి కథ సమన్వయము సేయ**
**నార్ద్ర హృదయంబు కూడ కొంతవసరంబు**

అంటూ **నా పలుకు పల్కులు భాష్పకణాభిరామముల్** వాటిని సానుభూతితో అర్థం చేసుకోవాలంటే సహృదయలకే ఉండాలన్నాడు.

మనిషికి మనిషికి మధ్య పూడ్చలేనంతగా ఏర్పడిన సాంస్కృతిక ఆగాధాన్ని పూడ్చాలన్న ఆయన తపన అక్షరాక్షరంలో ప్రతిధ్వనిస్తుంది. జాషువా ఒకవైపు అంతర్జాతీయ దృక్కోణాన్ని ఆవిష్కరిస్తూనే తనజాతివారి దోషాలు ఎండగట్టాడు. తన కవితా వధూటి వదనంబు నెగాదిగ చూసి, రూపురేఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళియన్న వారే కులం పేరు చెప్పగానే చివాలున లేచిపోయారు. అజరామరమైన ఆయన కవితా ప్రతిభను హరిజనుడన్న కారణంగా తిరస్కరించారు. ఆయన పొందిన అవమానాలే ఆయనను మహాకవిని చేసాయి. కులమతాలతో గీచుకున్న గీతల జొచ్చి పంజరానకట్టువడను నేను నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తిరుగులేదు. విద్యాధరుడను నేను, నాకు ఎదురు లేదు విశ్వనరుడనేనన్నాడు. జాషువా మనోసంద్రంలో బడబాగ్నిలా దాగున్న భావావేశం కన్నీటి లావా ప్రవాహాల్ని వెల్లగక్కింది. ఆ లావాప్రవాహ భావావేశమే గబ్బిలము, ఫిరదౌసి , ముంతాజ్‌మహల్ కావాల్లో కన్నీటి గాథలుగా వెలువడిరది. తన స్వీయ చరిత్ర నాకథ లో ఈ విషయాన్ని స్పష్టంజేస్తూ మానస గ్లాని గూర్చు పరాభవాల పాలయినప్పుడు మర్మచ్ఛేదకంబైన దుఃఖానన్ దలుచుచు బ్రొద్దు బుచ్చితిని ముక్తాహార వారుండనై అంటాడు.

జాషువ తనచుట్టు సమాజంలోగల విషాన్ని మింగి అమృతాన్ని అందరికి పంచిన సుకవి. ఆయన రచనల్లో అడుగడుగునా సంఘ సంస్కరణ భావాలు సాక్షాత్కరిస్తాయి. రచనల్లో భావచైతన్యమే కాని ఆచరణలో మాత్రం అహింసను పాటించి గాంధీ మార్గాన పయణించాడు. సమాజం తనను బాధించినప్పుడు అన్న పానీయాలు మానేసి **'నేను సహింపజాల నొక యాంధ్రప్రాణి శుష్కించినన్'** అన్నాడే కాని ప్రతిహింసను ప్రోత్సహించలేదు. ముసలివాడ్కెన బ్రహ్మకు పుట్టినారు నలుగురు కుమారులని విన్నాము కాని పసరముకన్న హీనుడు, అభాగ్యుడైన ఐదవ కులస్థుడెవరమ్మా అంటూ హైందవ సనాతన ధర్మాలను ప్రశ్నించాడు. జాషువ వస్తువులో కరుణరసం నింపి పఠితలో సానుభూతి కలిగించి కెథార్సిస్ లాంటి అనుభవాలు కలిగించగల కవితా శిల్పి. **"ఈయన కవిత్వంలో ఆత్మాశ్రయ కవిత్వం కంటె విలక్షణంగా ఆత్మీయమైన శ్కెలి, భావోద్వేగావస్థలను కవితలో ఆవిష్కరించడానికి బదులు వర్ణ్యాంశం మీద భావశబలతతో కూడిన పారవశ్యతను ప్రదర్శిస్తారన్న"** ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం మాటలు అక్షర సత్యాలు. విషాద గంభీర స్వభావం ఖండకావ్యాల్లో రేఖామాత్రంగా భాసించి పఠతను ఆలోచనలో ముంచుతుంది.

భువనంబొక రణరంగమని చెప్పుతూ కోటానుకోట్ల నరులొక మేటి జగన్మాతృసుతులు, మిత్రులని మదిని పాటిస్తే జీవితం సార్థకమవుతుందన్నాడు. జాషువా కుల, మతాచారాల్లోని అంధ విశ్వాసాలను నిర్ద్వంద్వంగా ఖండిరచాడు. ఆయనకు పేదరకం సహనాన్ని, హిందూకులతత్వం ఎదిరించే లక్షణాన్ని నేర్పించాయి. సుఖదుఃఖ మిశ్రమ మహీవలయమనే ఈ సత్రశాలలో ఈ తనువుండునంతవరకింత నెమ్మది లేదు. కష్టసుఖములు చెలికత్తెల్కె భజించ మృత్యుదేవతా ద్యూత వినోదరంగమిది. క్ష్మావాస కథా విశేషములు స్వాప్నికములు, ఈ చెలిమి స్థిరంగాదు. మహాచక్రవర్తి అయినా ఆత్మకు అధికారి కాదు. అయినా మనుషుల్లో ఈ తారతమ్యాలెందుకున్నాయోనని వాపోయాడు. ద్కెవము ఈ దేహాన్ని



ఏ పుష్పంజేసి వా(అ)డుకుంటాడో, సమస్త జీవులన్ని విశ్వవ్యాప్తి గర్భంబు లోపల చేరవలసినదేననే తత్వాన్ని బోధిస్తూ అక్కడ అందరూ సమానులేనంటాడు.

జాషువ కన్నీటికథను, అభ్యుదయ భావాలను స్పష్టంగా ప్రస్ఫుటింపజేసిన కావ్యం గబ్బిలం. సామాజిక దురన్యాయాలకు, సవర్ణ హిందువుల అస్పృశ్యతకి గురైన పంచముడికి ప్రతీక గబ్బిలం. గబ్బిలం లాగే వీడుకూడా శిథిలమై పాడుపడిన కొంపలోనే నివసిస్తాడు. అందుకే జాషువ అనాథుడైన, పరమదరిద్ర జీవనం సాగిస్తున్న పంచమునికి ప్రతీకగా అతి సామీప్య లక్షణాలు గల గబ్బిలాన్ని కావ్యవస్తువుగా ఎంచుకున్నాడు. మేఘ సందేశానికి ప్రతిగా గబ్బిలం ద్వారా సందేశాన్ని పంపటంలో జాషువ అభ్యుదయ భావాలను వ్యక్తంచేసాడు. ఈ సమాజంలో పంచముడు భరతమాతకు కడగొడ్డు బిడ్డడు, వాడు నీతిమంతుడైనా అగర్భదరిద్రుడు. రెక్కల కష్టంతో చెమటోడ్చి పంటలు పండించినా వానికి భుక్తి లేదు, వాడి వంట అంటువడిన నాడు దేవుడి నైవేద్యం గూడా దొరకదు. ధర్మ దేవతకు కూడా వీడంటే భయమే.

**ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి**
**యినుప గజ్జెల తల్లి జీవనము సేయు**
**కసరి బుసకొట్టు నాతని గాలి సోక**
**నాల్గు పడగల హైందవ నాగరాజు**

అంటూ కర్మ సిద్ధాంతంపై ధ్వజమెత్తుతూ ధర్మసత్రాలలో తల దాచుకోవడానికి పురుగూ పుట్రలకైనా స్థానముందికాని పుట్టు బానిసైన పంచముడికి అందుక్కూడా చోటు లేదని వాపోతాడు.

**ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయింతురు గాని .....ముప్పదిమూడు కోట్ల దేవతలెగబడ్డ ఈ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారునే**

అంటూ తెలుగు కవితా సరస్వతికి కొత్త అందాలద్దిన కవికోకిల జాషువ. తనది ప్రత్యేక అభివ్యక్త శైలి. పర్వతాల గుండెలు కరిగి సెలయేళ్ళుగా మారి ఉరకలెత్తి నన్నోదార్చడానికి వస్తున్నాయి. కాని నాసోదర ప్రజలు మాత్రం ఒక్క కన్నీటి చుక్క కూడా విదల్చ లేదంటాడు. కఠినమైన రాతి గుండెలైనా కరగుతున్నాయిగాని మనుషుల గుండెలు మాత్రం శిలలుగా మారుతున్నాయంటాడు. పాముకు పాలు, చీమకు పంచదార మేపుకొనుచున్న ఈ కర్మభూమిలో పంచముడి దగ్గరికి వెళ్ళడానికే ధర్మదేవత జంకుతుందని ఆవేదన వ్యక్తంజేస్తాడు.

గబ్బిలం కావ్యంలోని వస్తువు, ఆలోచనా, శైలి వంటి వాటి దృష్ట్యా చూసినప్పుడు ఇది ఆధునిక అభ్యుదయ కవిత్వ మార్గానికి చెందినది. సంప్రదాయ కావ్యాల్లో ఆధునిక కావ్యంగా ఆధునిక కావ్యాల్లో సంప్రదాయ కావ్యంగా నిలిచే లక్షణాల వల్ల ఈ కావ్యాన్ని నవ్య సాంప్రదాయ కావ్యంగా కూడా పేర్కొనవచ్చు. కాళిదాసు మేఘసందేశంలోని నాయకుని శిక్షాకాలపరిమితి ఒక్క సంవత్సరం మాత్రమే కాని ఇందులోని నాయకుని శిక్షాకాల పరిమితి ఆజన్మాంతం. అతడు మన్మధాగ్నితప్తుడైతే, ఇతడు క్షుధాగ్ని పీడితుడు. **"కులీనులగు రాజులకు వలె హంసలు, చిలుకలు మున్నగు ఉత్తమ పక్షీ దూతలితనికి జిక్కుట అసంభవం. కావున నిట్టిడుల జీర్ణకుటీరంలలో నిరంతరము దర్శనమిచ్చు గబ్బిలము నితనికి సమదేశహారిగా బరిగ్రహించితినని"** కవి ముందు మాటలో చెప్పుకొన్నాడు. పూర్వపు సందేశ కావ్యాల్లో లేని ప్రతీకాత్మక శిల్పం గబ్బిలం కావ్యంలో కనబడుతుంది. నాదు కన్నీటికథ స్థూలంగా కావ్య నాయకుడి కథ అనే అర్థమున్నా, సూక్ష్మంగా పరిశీలిస్తే కవి ఆత్మసంవేదన అనే అర్థం కూడా స్ఫురిస్తుంది. ఈవిధంగా కావ్యగత కథానాయకుడు కవికి ప్రతినిధి, ప్రతీక అవుతున్నాడు. జాషువ తనకు ముందున్న కవిత్వ పటుత్వాన్ని పరిచయం చేస్తూ చేమకూర వేంకటకవి తెలుగు తల్లికి శ్లేషోక్తులలవాటు చేసాడని, ముద్దు పళని తన ముద్దుల కవిత్వంతో శృంగార రసాన్ని పండిరచిందని, క్షేత్రయ్య పదాలద్వారా మువ్వగోపాలున్ని ఆరాధించాడంటూ నాయకరాజులు నిర్మించిన సరస్వతీ మహలు సారస్వత వైభవాన్ని జాషువ మరిచి పోలేకపోవడం ఆయన సారస్వతానుప్రాణిక వ్యక్తిత్వానికి నిదర్శనం. ఈ కావ్యంలో సందర్భోచిత ప్రకృతి వర్ణనలు, జాతీయోద్యమ స్ఫూర్తులు కావ్యత్వాన్ని ఇనుమడిరపజేస్తున్నాయి. జాషువ తన కాలం నాటి హరిజనోద్ధరణ ఉద్యమ పరిధి దాటి నేటి దళితవాద ఉద్యమ పరిధిలోకి ఆనాడే ప్రవేశించారనడానికి ఈ కావ్యమే నిదర్శనం.

(28.9.2023 జాషువా జయంతి సందర్భంగా...)



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2023

# గంగెద్దు కథలు – రచనా విధానం

డా. తండు కృష్ణ కౌండిన్య ఫోన్ :7704731346

కవిత్వంలోనే కాదు కథల్లో కూడా ధ్వని ఉంటుందని నిరూపించిన కథలు శీలం భద్రయ్య రాసిన గంగెద్దు కథలు. ప్రతి కథలో వాక్య విన్యాసంతో పాటు ఆకట్టుకునే కథనం పాఠకుని ఆకర్షిస్తుంది. 'గంగెద్దు' కథా సంపుటిలోని కథలు ఊహించని విధంగా మలుపులు తిరిగి పెద్ద సస్పెన్స్ తో కొనసాగి చివరికి ఎక్కడో ముగిసిపోతాయి. ఇందులోని చాలా కథలు చక్కని కథనం, శిల్పం, భాష,పాత్ర పోషణ, సన్నివేశ కల్పన కలిగి ఉన్నాయి. **"గుండె కొట్టుకున్నంతసేపు అలజడికి గురవుతూనే ఉంటాం, గాయపడుతూనే ఉంటాం, వాటికి వెంట వెంటనే కథారూపం ఇవ్వడం శీలం భద్రయ్య లాంటి మెర్క్యురీ రైటర్స్ కే సాధ్యమవుతుంది"** అని ప్రముఖ కథా రచయిత డాక్టర్ వెల్దండి శ్రీధర్ అన్న మాటలు అక్షర సత్యం. ఈ కథల్లో ఉప యోగించిన భాష, సందర్భోచితంగా వాడే సామెతలు, పాత్రలు వాటి స్వభావాలు, పాత్రల పేర్లు ఇలా ఎన్నో అంశాలు రచయితను గొప్ప రచయితగా నిలబెడుతాయి. మానవతా స్పర్శ, చదివించే గుణం రెండూ భద్రయ్య కథలో పుష్కలంగా ఉన్నాయి. మొదట రాసిన 'లొట్టపీసు పూలు' కథలు అస్పృశ్యతకు, అణచివేతకు ప్రతీకగా నిలిస్తే, 'గంగెద్దు' కథలు ధిక్కారానికి, మేలుకొలుపునకు ప్రతీకగా నిలుస్తాయి.

**వస్తు వైవిధ్యం :** ఈ కథా సంపుటిలో వస్తువైవిధ్యభరితమైన 14 కథలు ఉన్నాయి. ఒక్కో కథను సంక్షిప్తంగా పరిశీలిద్దాం– గ్రామాలకు పాకిన పారిశ్రామికీకరణ 'గంట' కథలో కనబడుతుంది. ఓగోడు గ్రామ వాసియైన నాగరాజు భీవండి వెళ్లి సాంచండ్ల పనిచేసి, 15 సంవత్సరాల తర్వాత తన గ్రామానికి వచ్చినప్పుడు ఆ గ్రామం తానే గుర్తుపట్టనంతగా మారిపోవడాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. ఇందులో అట్టడుగువర్గాల వారి పక్షాన వకాల్తా పుచ్చుకొని **"గుడి మీద బతుకుతున్న అయ్యోరుకు ఆదెరువు లేదు కానీ మగ్గం మీద బతుకుతున్న కక్కయ్య పని మూలకు పడ్డది"** అను అభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తాడు. **"గిప్పుడు ఊర్ల పనిగంట, బడిగంట సప్పుల్లే ఇనబడుతున్నై"** అన్న ముగింపులో చదువుకోవడానికి బడి, పనిచేయడానికి పరిశ్రమలు స్థాపించబడ్డాయని తెలియజేశాడు. కుటుంబ సభ్యులు తమ పెద్దలకు తోడును వెతికిపెట్టే ఆధునిక తరం కథ 'సిగ్గు'. మనీషా, ప్రసాద్ లు కలిసి అమ్మమ్మ, మురళీ కృష్ణలను కలపడం ఇందులోని కథాంశం. 'గంగెద్దు' కథలో సమాజంపై అధికారంతో కొట్లాడి వారికి రావలసిన వాటా భూమిని సాధించుకోవడం ఇందులో ప్రధాన అంశం. రంగయ్య పంతులు ఆడించినట్టు జనం ఆడారు.ఎదురు చెప్పలేదు కానీ చివరికి గంగెద్దు ఆధిపత్యాన్ని ధిక్కరించడమే కాక దొర అహంకారాన్ని నిర్మూలించింది. శివుడు నాయకత్వంలో సంచార జాతుల వారు దొర భూమిని ఆక్రమించి సేద్యం చేసుకోవడం తిరుగుబాటుకు పరాకాష్టగా నిలుస్తుంది. అనుబంధాల కంటే పరువు ముఖ్యం అని తెలిపే కథ 'పరువు'. కొన్ని పరిస్థితుల ప్రభావం వల్ల చెడు మార్గంలో పయనిస్తారు తప్ప కావాలని వెళ్లరు అను ఒక సందేశం ఈ కథ ద్వారా అందుతుంది.

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా నేటికీ పారిశుద్ధ్య కార్మికులు ఆ వృత్తి నుండి బయటపడలేక పోవడానికి గల కారణాలను 'పాకీజ' కథలో ప్రస్తావించాడు. అభివృద్ధి వెనక వ్యక్తుల జీవన విధ్వంసం, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల జీవితాలు నాయకుల స్వార్థానికి ఏ విధంగా ఛిద్రమవుతున్నాయో తెలియ జేయడమే కాకుండా చదువుకోవడం వల్ల మనుషుల్లో చైతన్యం కలిగి అన్యాయాన్ని ఎలా ఎదిరించడం జరుగుతుందో 'తావు' కథ ద్వారా తెలియజేశాడు. అధికార పీఠాన్ని దక్కించుకోవడానికి, దానిని కాపాడుకొని వారసత్వంగా ఇవ్వడానికి చేసే ప్రయత్నాన్ని చిత్రీకరించిన కథ 'కుర్చీ'. **"తండ్రి శవాన్ని పక్కన పెట్టుకొని అధికారం కోసం రాజకీయం చేసే నాయకులు ఉన్న రోజులు ఇవి"** అని సుందర్రావుతో వ్యంగ్యంగా చెప్పించడం అధికారం కోసం ఎంతటి స్థాయికైనా నాయకులు దిగజారుతారన్న విషయాన్ని తెలియజేశాడు. ఉత్తమ పురుషలో రాయబడిన కథ 'అద్దం'. అధికారానికి, న్యాయానికి మధ్య మానసిక సంఘర్షణను అనుభవించే పోలీస్ ఆఫీసర్ కథ ఇందులోనిది. కళ్ళతో చూసేవి అన్నీ నిజం కావని చెప్పే కథ 'యాక్సిడెంట్'. భయం మనిషిని నవ్వుల పాలు చేస్తుంది, ఒక్కోసారి విజయాన్ని అందిస్తుందని హాస్యభరితంగా చెప్పిన కథ 'భయం'.

తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో నాటి చారిత్రక అంశాలను చర్చిస్తూ రజాకార్ల దురంతాలు తెలంగాణ పల్లెల్లో ఏ విధంగా ఉండేవో 'కాగడా' కథలో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. కాపాడాల్సిన కన్న తల్లే కనికరం లేకుండా కసాయి దగ్గర పసిపిల్లల జీవితాలను బలిపెట్టే కథ 'బ్యాడ్ టచ్'. ఉత్తమ పురుషలో రాయబడిన మరొక కథ 'ఆశ'. ఆశతో ముడిపడిన సంఘటనను ఒకే చోట కూర్చిన కథ ఇది. జీవన సంఘర్షణలో మతిభ్రమించిన కథ 'సంఘర్షణ'. సంఘర్షణ లేకుండా పుట్టుక లేదు, చావు లేదు, బతుకు లేదు. చావడానికి ముందు బతుకును ప్రేమించాలనే సందేశం ఈ కథ ద్వారా అందుతుంది.

**రచనా విధానం :** శీలం భద్రయ్య కథల్లో కథకు ఉండాల్సిన లక్షణాలన్నీ ఉన్నాయి. పాఠకునికి అవరోధం లేకుండా సాఫీగా చదివించేటట్లు చేసే శైలి భద్రయ్య సొంతం. సన్నివేశాలకు అనుగుణమైన చిత్రణ, సందర్భోచితంగా అద్భుతమైన శిల్పం, అడుగడుగునా సామెతలు, సూక్తులు ప్రయోగించబడి నిరాటంకంగా పాఠకుని వేగంగా చదివించేటట్లు చేస్తాయి.

**కొన్ని సామెతలు :** నెత్తిన పిడుగు పడ్డట్టు ఉలికిపడ్డడు నాగరాజు. (పుట సంఖ్య -1)

అరటిపండులో సూదిగుచ్చినట్లు అల్కగా అమ్మ గుండెల్లో బరువు దించిపోయిందు. (పుట సంఖ్య -2)

ఇంగువ కట్టిన గుడ్డ వాసన పోనట్లు. (పుట సంఖ్య- 5)

కన్ను నొప్పి ఇంకో కన్నుకే తెలుస్తుందన్నట్లు.(పుట సంఖ్య-5)

ఎద్దు పుండు కాకికి ముద్దా? (పుట సంఖ్య- 5)

నోరు నెత్తినుంటే పెత్తనం ఎంటనే ఉంటదన్నట్లు. (పుటసంఖ్య8)

సత్రం దానానికి సర్కారు అనుమతి అన్నట్లు. (పుట సంఖ్య 9)

ఆకలి ఎదురు తిరిగితే అవమానం తోక ముడుస్తది.(పుట సంఖ్య 9)

ఆకలంతా అయిపోయాక అన్నమెందుకు? వయసంతా అయిపోయాక మొగుడెందుకు? (పుట సంఖ్య- 12)

కరణంతో కంటు కాటికి పోయినా తప్పదు. (పుట సంఖ్య16)

పేదోని కోపము పేనానికి సేటు. (పుట సంఖ్య- 23)

తుపాకి కడుపున ఫిరంగి పుట్టినట్లు గట్టయ్య కడుపున శివుడు పుట్టిందు. (పుట సంఖ్య- 23)

అతని ఆకలి ఆకాశమంత, నోరు సూది బెజ్జమంత.(పుట సంఖ్య -24)

మాట వెండి మౌనం బంగారం అన్నట్లు .(పుట సంఖ్య- 24)

సాని నీతి, సన్యాసి జాతి తెలియదు.(పుట సంఖ్య- 28)

సొప్పవాములో నిప్పుదాసుకున్నట్టు.(పుట సంఖ్య- 35)

ఉన్నప్పుడు ఉట్ల పండుగ లేనప్పుడు లొట్ల పండుగ అన్నట్టు.(పుట సంఖ్య- 35)

చెవిటోని ముందు శంఖం ఊదినట్లు.(పుట సంఖ్య- 45)

కాయ చిన్నదైనంత మాత్రాన కారం తక్కువవుతుందా? (పుట సంఖ్య- 50)

నమిలే వాడికంటే మింగేవాడు ఘనుడు. (పుట సంఖ్య- 53)

నాలుకతో నారాయణ, చంకలో చురకత్తి .(పుట సంఖ్య- 54)

చెప్పేవి నీతులు, తీసేవి గోతులు. (పుట సంఖ్య- 55)

ముఖం బాగా లేక అద్దం పగలగొట్టినట్లు. (పుట సంఖ్య- 58)

దున్నపోతు మీద ఆన పడ్డట్టు .(పుట సంఖ్య- 81)

ఆశకు అంతులేదు, ఊపిరి పోతే చింత లేదు. (పుట సంఖ్య96)

పై సామెతలు కొన్ని తనకు తానుగా సందర్భాన్ని బట్టి ప్రయోగించిన సామెతలుగానే కనబడుతాయి తప్ప గతంలో ఎక్కడా ప్రయోగించలేదు. కథా సందర్భానుసారంగా కొత్త సామెతలను సృష్టించి ప్రయోగించి కథనానికి మరింత బలాన్ని చేకూర్చే విధంగా చేయడంలో భద్రయ్య సిద్ధహస్తుడు. ఉదాహరణకు "తుపాకి కడుపున ఫిరంగి పుట్టినట్లు" అను సామెత సందర్భాన్ని బట్టి ప్రయోగించడం వల్ల కథనానికి మరింత బలం చేకూర్చినట్లయ్యింది.

**అలంకార ప్రయోగం :** కథానుగుణంగా సందర్భోచితమైన అలంకార ప్రయోగాలు చేసి రచనా శైలికి మరింత అందాన్ని తెచ్చి పెట్టిన విధానం బాగుంది. ఆయా సందర్భాల్లో పలు అలంకారాలను ప్రయోగించిన విధానం పరిశీలిద్దాం -

అరటిపండులో సూదిగుచ్చినట్లు అలుకగా అమ్మ గుండెల్లో బరువు దించిపోయిందు. (పుట సంఖ్య-2)

నాగరాజు మది లెక్కనే డాంబర్ రోడ్డు కూడా బాగా దెబ్బతిని ఉంది. (పుట సంఖ్య -4)

వారి మధ్య స్నేహం సాయంకాలం నీడలా పెరుగుతూ వచ్చింది .(పుట సంఖ్య -26)

బస్సుతో పోటీ పడలేక సూర్యుడు అలసిపోయినట్లుంది. అవమానంతో మొహం ఎర్రబడి సిగ్గుతో పక్కకు వంగిపోయాడు. (పుట సంఖ్య -27)

భయపడుతున్న చలికి చీకటి నల్ల దుప్పటి కప్పింది. (పుట సంఖ్య- 27)

ఆకలి ఆమెపై కత్తులు నూరింది. (పుట సంఖ్య -29)

విచిత్ర కోరికలకు తనువు ఆట బొమ్మైంది. (పుట సంఖ్య- 33)

నబి పాషా కండ్లల్ల వానలేని మెరుపు మెరిసింది. మదారి కళ్ళల్లో ఉరుములేని వాన కురిసింది. (పుట సంఖ్య- 37)

బాయిలో నీళ్లు వాళ్ళ బతుకుల్లో ఆశల లెక్క లోతులో కనబడుతున్నై. (పుట సంఖ్య- 47)

బాయిల చందమామ పెంక మీద కాలిన జొన్న రొట్టె తీరుగ. (పుట సంఖ్య- 47)

భూమి, కాలం తిరుగుబోతులు. (పుట సంఖ్య- 49)

సుందర్రావు లో నమ్మకం పెట్రోలు ధరలా బాగా పెరిగింది. (పుట సంఖ్య -52)

వాళ్లలో ఆవేశం వరదలా పొంగింది. (పుట సంఖ్య- 53)

అమ్మ ధైర్యం కన్నీరవుతుంది.(పుట సంఖ్య- 62)

వంటి మీద బట్టలు కుదించుకుపోయినట్టే కుటుంబాల బంధుత్వాలు చిన్నవైపోయినై .(పుట సంఖ్య- 103)

తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్ అన్నట్లు "తీసుకున్న వస్తువును కథలుగా మలచడంలో మంచి నైపుణ్యం ఉంది. అన్నింటికీ మించి మంచి పఠనీయత గుణం భద్రయ్య కథల్లో కనిపిస్తుంది".ఏమి రాసినా ఎలా రాసినా ఆసక్తిగా పాఠకుని చదివించేటట్లు చేయగల రచనా సామర్థ్యం ఉంది. సందేశాత్మక, ప్రయోగాత్మక కథలు రాసి పాఠకుల్ని మెప్పించడంలో సఫలీకృతుడైన శీలం భద్రయ్య అభినందనీయుడు.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2023

# అమృతభారతం

కె. పి. అశోక్ కుమార్, ఫోన్ : 9700000948




"అమృత భారతి"( తెలుగు సాహిత్య సామాజిక పరిణామాలపై వ్యాస సంకలనం)
యువభారతి., హైదరాబాద్. వెల 200
పేజీలు 214 ప్రతులకు : తెలంగాణ సాహిత్య పరిషత్ హైదరాబాద్
మరియు 93 913 73 684.

పాతికేళ్ల స్వాతంత్ర్య అనంతరం తెలుగు సాహిత్య ప్రస్థానంపై సుమారు వందమంది లబ్ధ ప్రతిష్ట కవి పండిత విమర్శక పరిశోధకుల చేత వ్యాసాలను రాయించి, యువభారతి వారు 1972లో "మహతి" అనే ప్రతిష్టాత్మక గ్రంధాన్ని వెలువరించారు. ఇందులో దేశ స్వాతంత్ర యుగోదయ కాలంలో వచ్చిన దేశభక్తి కవిత్వం, ప్రజాస్వామ్యంలోని ఆదర్శాలు, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి, తెలుగువారి సంస్కృతిలో జరుగుతున్న పరిణామాలు, మన వారి తాత్విక చింతనం, మన తెలుగు భాషా సాహిత్యాల తీరుతెన్నులు, చివరకు మన సమాజంపై సినిమా ప్రభావం దాకా అనేక విషయాలు రేఖా మాత్రంగానైనా దర్శింపబడ్డాయి. అలాగే తెలుగు కవిత్వంలో నానాటికి కనబడుతున్న వివిధ కోణాలు ప్రదర్శింపబడ్డాయి. కేవలం కవిత్వ ప్రక్రియే కాదు .తెలుగు నవల రచన విధానంలోని తీరుయతెన్నులు, కథానిక స్వరూప స్వభావాలు, నాటి తెలుగు నాటకాల స్థితిగతులు, విశ్వవిద్యాలయాల్లో సాగుతున్న పరిశోధన విమర్శ రీతులు, వివిధ వాదాలు- కలలు -సాహిత్యం మొదలైన అంశాల మీద రాసిన విమర్శ వ్యాసాలతో ఈ గ్రంథం వెలువడింది.

దేశ స్వాతంత్ర అమృత్యోత్సవాల సందర్భంగా ఆ "మహతి"కి కొనసాగింపుగా, తర్వాతి 50 ఏళ్ల కాలంలో అనగా 1972 నుండి 2022 వరకు దేశంలోని సామాజిక రాజకీయ పరిణామాలతో పాటు, తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు ఇతర నవీన అంశాలతో వచ్చిన మార్పులు చేర్పులతో కూడిన ప్రస్థానంపై ,ఈనాటి ప్రసిద్ధ కవి పండిత విమర్శక పరిశోధకుల చేత వ్యాసాలు వ్రాయించి," అమృత భారతి" పేరిట యువభారతి వారు ఈ పుస్తకాన్ని వెలువరించడం అభినందనీయం.

ఇందులో మొదటగా సుప్రసిద్ధ సామాజికవేత్త, లోక్ సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ గారు, గత 50 ఏళ్ల దేశ సామాజిక రాజకీయ ఆర్థిక పరిణామాలను విశ్లేషిస్తూ రాసిన వ్యాసంలో అనేకానేక అంశాలను చర్చకు పెట్టారు. పద్యం ఆగిపోయిందని కొందరు, పుంజుకుంటుందని మరికొందరి వాద వివాదాల మధ్య, ఈ 50 ఏళ్లుగా పద్యం నిత్య నూతనత్వంగా వెలువడుతూనే ఉందని బులుసు వెంకటేశ్వర్లు గారు వ్రాసిన, "పద్య కవితా ప్రస్థానం" వ్యాసంలో ఘంటాపరంగా తేల్చివేశారు. డాక్టర్ వద్దేపల్లి కృష్ణ గారు "గేయ కవిత ప్రస్థానం" అనే వ్యాసంలో తనతో ప్రారంభించి, అనేకమంది గేయకవులను వారి గేయ కవితలను ఉదహరిస్తూ, గజల్లు రూబాయీలను పరామర్శించి, చివరగా అనేకమంది గేయకర్తల పేర్లను పేర్కొన్నారు. డాక్టర్ ఎస్.రఘు గారి "వచన కవితా ప్రస్థానం" అనే వ్యాసంలో వచన కవిత వివిధ ఉద్యమాలకు, వాదాలకు , ధోరణులకు ఎలా ఆలవాలమైందో విశ్లేషించారు. తెలుగులో వచ్చిన కథలను సాంఘిక ,రాజకీయ, ప్రేమ, ఉద్యమ, హాస్య, వైజ్ఞానిక మాండలిక, బాల కథా సాహిత్యంగా విభజించి, విశ్లేషించడం డాక్టర్ ముక్తేవి భారతి గారి "కథా సాహిత్య ప్రస్థానం"లో చూడవచ్చు. కస్తూరి మురళీకృష్ణ రాసిన "నవలా సాహిత్య ప్రస్థానం"లో, గత 50 ఏళ్లలో తెలుగు నవలల పరిణామ క్రమం, తెలుగు నవలలు పోయిన పోకడలను విశ్లేషించిన విధానం బాగుంది. ముఖ్యంగా ఇజాలు, వాదాలలో ఇమడకుండా పాఠకులను అలరిస్తున్న ముఖ్య నవలల గురించి మాత్రమే ప్రస్తావించడం గమనించాల్సిన విషయం. డాక్టర్ ఎస్వీ రామారావు గారి "తెలుగు సాహిత్య విమర్శ ప్రస్థానం"లో ముందుగా తమ సిద్ధాంత గ్రంథం గురించి పేర్కొని తర్వాత కోవెల సంపత్ కుమారాచార్య, జీవి సుబ్రహ్మణ్యం, వడలి మందేశ్వర రావు గార్లతో ప్రారంభించి, విమర్శ గ్రంధాలు వ్రాసిన వారి కృషిని పేర్కొన్నారు. తర్వాత విమర్శను విభాగాల కింద విభజించి వాటిని విశ్లేషించడం కనిపిస్తుంది.

"తెలుగు సినీ గీత ప్రస్థానం" అనే వ్యాసంలో డాక్టర్ వి.వి. రామారావు గారు, ఈ 50 సంవత్సరాల లో 5476 చిత్రాలు విడుదల అయ్యాయనీ, సినిమాకు ఆరు పాటలనుకున్నా మొత్తం 32వేల పై చిలుకు పాటలు ఉంటాయనీ చెబుతూ, ఈ అర్ధ శతాబ్దిలోని సినారె పాటలను విశ్లేషించారు. పత్తిపాక మోహన్ గారి "బాల సాహిత్య ప్రస్థానం" వ్యాసంలో దశాబ్దాల వారీగా కృషిచేసిన బాల సాహిత్య కారులను పేర్కొని, తన పేరును ప్రస్తావించి వీరంతా బాలల వికాసం కోసం సృజన సాగించిన వారిని విశ్లేషణాత్మకంగా వివరించారు. సబ్బని లక్ష్మీనారాయణ గారి "తెలుగు సాహిత్యంలో మినీ కవిత రూపాల"లో -హైకూలు, నానీలు, నానోలు ,రెక్కలు, ఏకవాక్య కవితల గురించి, వాటిని రచించిన కొందరు కవుల కవితలను సోదాహరణంగా విశ్లేషించి చూపారు. డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి గారి "తెలుగు కవిత్వం -జాతీయ దృక్పథం" ను జాతీయ భావ వికాసం, జాతీయ వాద వికాసం అని శీర్షికల కింద విభజించి, అందులోకి వచ్చే కవుల నందరిని పేర్కొని వారి కవిత్వం గురించి తెలియజేశారు. వివిధ సాహిత్య ప్రక్రియలతో వెలువడిన ఈ వ్యాస సంపుటి, మన సమాజంలో తెలుగు సాహిత్యంలో ఈ 50 సంవత్సరాలలో జరిగిన పరిణామ క్రమాన్ని స్థూలంగానైనా మన కళ్ళకు కట్టినట్లు తెలియజేస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# అవమానానికి సన్మానమా!

ఒళ్ళంతా కళ్ళున్న
ఇసుమంతైనా మనసులేని ఈ లోకం
ఆ పూట గుడ్డిది.....

అనామకుడి పట్ల ప్రవర్తించిన
అధికారపు వంకరబుద్ధి
అందరిలో నిప్పుల కొలిమిని రగిల్చింది
అదిప్పుడు అగ్నిపర్వతంలా బద్దలవ్వడానికి
మెల్లిమెల్లిగా సిద్ధమవుతోంది...

ఇక్కడ మలమూత్ర విసర్జన చేయడం నేరం
అందుకుగాను 500 రూపాయల జరిమానా
గోడలపై పెద్ద పెద్ద అక్షరాలతో రాసి
చేతులు దులిపేసుకోవడమే ప్రభుత్వాల విధి

మనుషులు కాని మనుషులకు మొలిసే
కొన్ని విషపూరిత కోరల్ని
ఏ బండల సందునవెట్టి విరగొట్టాలి.

అంతుపట్టని వ్యధను మిగిల్చి
నీళ్ళతో మొకం కడిగినంత సింపులా
ఒంటేలు జేసిందు...

వాని మర్మాంగాలని
మ్యాకలకు ఆకు గుంజేసినట్ల అడికి మట్టంగా
నరకాలనుంది కానీ
రాజకీయం ఇప్పటికీ వాడి పక్షానే నిలబడి వుంది!

నేనేమో యిలా ఒంటరిగా! మరేం పర్వాలేదు
మనిషిని మనిషిగా చూడని ఈ మాయలోకంలో
మానవత్వపు విలువల్ని మొగ్గల్లా తుంచే
రాకసి మూకల్ని సంపి బొందవెట్ట
నేనెన్ని సార్లైనా మాలగా పుట్టడానికి సిద్ధం

పెద్దలు మనిషికో మాట
గొడ్డుకో దెబ్బ అన్నారు
మరి ఇలాంటి సన్నాసులని ఏమనాలి?

భారతదేశపు ప్రజలందరి కన్నీటిని
దోసిట్లపట్టి కడిగిన తుడుచుకపోని
ఆ అవమానపు రొచ్చు మరకలు
ఇంకా గదురు గదురు కొడుతూనే ఉన్నాయి

చేసిన ఈ తప్పుల్ని సరిదిద్దడానికి
యిప్పుడు మనం ఏ సెంటు బాటిల్ని కొనాలి?
ఎంత పెట్టి కొనాలి?

జరగాల్సిందంతా జరిగిపోయాక
చేయాల్సింది....
అవమానానికి సన్మానం కాదు!

నెత్తినెక్కించుకొని ఊరుగుతున్న
అహంకారపు మత్తుని దించడానికి
ఒక్కొక్కడి పుర్రెల్ని ఒక్కో గుమ్మడికాయలా
పగులగొట్టి దిష్టి తీయాలి.

తలారి సతీష్ కుమార్

# నిత్య సత్యాలు ...!

చెడు తలంపులెపుడు చెంతకు రానీకు
మంచి భావములును మలిన పడును
మనసు చెడిన మనిషి మాన్యుడుగాలేడు
దుష్టచేష్టలున్న దుర్మతుండు!

కల్మషంబులున్న ఖలుడౌను నరుడిల
దానవత్వపనులు దయనులేక
చేయుచున్నవాడి చెలిమినిచేయకు
పరగసంఘమందు పాపియంద్రు!

మేలు చేయువారు మేదినిలోపల
స్వార్థబుద్ధి నొదలి సాగుచుంద్రు
పరుల బాధలన్ని పదిలంగ దీర్చగ
మాననీయుడౌను మహిన జూడ!

బొంకుమాటలన్ని పొందుగ మాట్లాడ
ఉన్న మంచి పేరు వూడిపోవు
ఆచితూచి పలుకు లానంద మిచ్చును
మంచిమాట లోని మర్మమిదియె!

హింస జేసి మనిషి హీనాతిహీనుడై
మనసు బాధబెట్టు మార్మికుండు
పరుల సంతసంబు పరగగోరు మనిషి
హీనగుణము లేని హితుడు జూడ!

భ్రూణ హత్యలన్న భూరిగాజేయుచు
నాడ శిశువు లనిల హనన పరచె
తల్లి దండ్రులార దానవులు కావద్దు
సుతలు లేని జాతి శూన్యమగును!

తరతరాలు జేయు తప్పులన్నియొదలి
మమత సమత లన్ని మదిన నించి
పాశవికపు పనులు పరగ జేయక యున్న
సంఘమందు యశము సఫలమగును!!



డా. గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్ నగర్,
ఫోన్ : 8555 899 493

## స్వ'కృతి'




**శ్రీ శివాజీ వీర చరిత్ర**
కోటంరాజు చంద్రశేఖర రావ్
వెల : 600 /-
**ప్రతులకు :** రచయిత,
ఫోన్ : 917 754 6236



**ఘూంఘ్ట (కవిత్వం)**
సైదులు ఖేతావత్
వెల : 50 /-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 9-43/బి/40, మారుతి ఎన్‌క్లేవ్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా, నాదర్ గూల్, హైదరాబాద్.
ఫోన్ : 94929 56438




**భాషా తపస్వి గిడుగు**
ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
వెల : 200 /-
**ప్రతులకు :** గిడుగు వేంకట నాగేశ్వర రావు
ఇం.నెం. 3-14-18, ఎస్‌టి. నెం. 2,
శ్రీనివాసపురం, రామంతాపూర్, హైదరాబాద్.
ఫోన్ : 9581888989




**కనిపించని శత్రువు (నవల)**
మెట్టు మురళీధర్
వెల : 180 /-
**ప్రతులకు :** రచయిత,
2-8-400, రాఘవేంద్ర నగర్, వడ్డేపల్లి-506370
హనుమకొండ.
ఫోన్ : 99499 38833




**'వేణు' నాదం**
శ్రీ మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక
వెల : కట్టలేనంత
**ప్రతులకు :** టి. రమణయ్య, 24-2-365, నీలగిరి సంఘం, మూలపేట,
నెల్లూరు - 524 003, ఫోన్ : 94912 39884.

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# రైలు మిత్రులు



నా పదో యేట
నేను మొదటిసారి రైలెక్కాను
ఒక్కణ్నే పంపించిన
మా నాయన ధైర్యాన్ని మెచ్చుకోవాలి.
భోనగిరి నుంచి
సికింద్రాబాద్‌కు టికెట్ ధర తొంభై పైసలు.

రైల్వేస్టేషన్‌లోని
సిమెంట్ బెంచి మీద కూర్చొని
దాని వొంపుల్ని కాసేపు నిమిరాను.
రైలు గంట మోగే తీరే వేరు
అలలు అలలుగా వ్యాపించేది.
దూరంగా రైలు వస్తున్న దృశ్యం
మలుపులోంచి తల బయట పెట్టిన కొండచిలువలాగ.

రైలు ముందు కెళ్తుంటే
ప్లాట్‌ఫారం వెనక్కి పరిగెత్తుతున్నట్టు ఒక థ్రిల్.
ఆనాటి ఇంజన్‌ను చూస్తే
ఒక భయద సౌందర్య అనుభూతి.

బిక్కుబిక్కుమంటూ రైలెక్కాను
తొలిసారి కదా
ఎవరైనా పట్టుకొని కొడతారేమో అని భయం.

ఎక్కడి దాకా పోతుండ్రని
పక్క వాళ్ళ నడిగాను.
ఘట్కేసర్ అన్నాడు పక్కాయన,
ఎదుట వ్యక్తి సికింద్రాబాద్ అన్నాడు.

రైలు కదిలింది
చెట్లూ గుట్టలూ పొలాలూ
వెనక్కి పరిగెడుతున్నాయి
నా కవిత్వానికి అప్పుడే బీజాలు పడ్డట్టున్నాయి.

పక్కాయన బ్యాగులోంచి
సకినాలు బయటకు తీశాడు
నాకు ఒకటి ఇచ్చాడు
థాంక్యూ థాంక్యూ అన్నాను.

రైలు గేటు దగ్గర
ఒకాయన పచ్చ జెండా ఊపుతుంటే
అడవిలో అతడొక్కడే
ఎలా ఉంటాడో అనిపించింది.
టి.సి. వస్తే
దర్జాగా టికెట్ చూపించాను.

వయసుల్లో భేదమున్నా
ఇద్దరితో స్నేహం కలిసింది
ఒక్కనివే పోతున్నవా అని అడిగాడొకాయన
నా స్టేషన్ వస్తే చెప్పున్నా అన్న
ఎదుటాయన నాకో బిస్కెట్ ఇచ్చాడు
మధ్యలో ఆయన
ఘట్‌కేసర్‌లో దిగిపోతుంటే ఏడుపొచ్చింది
అడ్రస్ రాసుకున్నాను
ఆ ముఖం చాలా కాలం జ్ఞాపకంలో ఉండిపోయింది.

రైలు ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగింది
పట్టాలు జ్యామెట్రీ గీతాల్లా
చిక్కు చిక్కుగా వ్యాపించి వున్నాయి.

సికింద్రాబాద్‌లో దిగాను
కండ్లు తిరిగి పోయినై
అంతులేని బృహదారణ్యమది.

అతణ్ని విడిపోతుంటే
మళ్లీ ఏడు పొచ్చింది
అతని చేతిని ముద్దు పెట్టుకున్నాను.

అప్పటి నుంచి జీవితంలో
ఎందరో మిత్రులు తారసపడ్డారు
ఇప్పుడు వాళ్లంతా ఎక్కడున్నారో!

ఇవాళటి ఆకాశ శూన్యంలోని
విమాన ప్రయాణాల కన్న
కనులకూ మనసుకూ
విందు చేసే నాటి రైలుయాత్రే మిన్న.

డా. ఎన్. గోపి

ఫోన్ : 939 102 8496

# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



## దేవీ శరన్నవరాత్రి మహోత్సవములు

తేది 15-10-2023 నుండి 23-10-2023 వరకు

ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.
State Bank of India, Nallakunta Branch,
A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083

రండి . . . ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177
Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com

Scanned with OKEN Scanner